ఈనాడు

విజయవాడ 18-2-2018 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 189

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-00 పేజీలు 18+20+32 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



17,600 కోట్ల మోసం

- నీరవ్ మోదీ వ్యవహారంలో ఐ.టి.శాఖ అంచనా
- ముగ్గుర్ని అరెస్టు చేసిన సీబీఐ
- మరిన్ని చోట్ల కొనసాగిన ఈడీ సోదాలు
- రూ.25 కోట్ల ఆభరణాలు జప్తు
- పంజాబ్ నేషనల్ బ్యాంకుకు సీవీసీ సమన్లు

ముంబయి

పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో వెలుగుచూసిన కుంభకోణం నేపథ్యంలో ఆదాయపు పన్ను (ఐ.టి.) శాఖ రూపొందించిన ఒక నివేదిక మరింత సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు ఈ బ్యాంకుకు జరిగిన మోసం విలువ రూ.11,400 కోట్లుగా భావిస్తుండగా ఐ.టి. శాఖ మాత్రం ఇది రూ.17,600 కోట్లకు చేరవచ్చని అంచనా వేస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆభరణాల వ్యాపారి నీరవ్ మోదీకి, అతని మేనమామ మెహుల్ ఛోక్సీకి కలిపి గత ఏడాది మార్చి వరకు బ్యాంకులు ఇంత మొత్తాన్ని రుణాలు, హామీలుగా జారీ చేశాయని ఐ.టి. వర్గాలు శనివారం వెల్లడించాయి. అందువల్ల వాస్తవ మొత్తం ఎక్కువే ఉండవచ్చని ఆ నివేదికలో ఉన్నట్లు రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ ఉదంతంలో పన్ను ఎగవేత కోణంలో ఐ.టి. శాఖ దర్యాప్తు చేస్తోంది. నీరవ్ మోదీకి గ్రూపునకు చెందిన 29 ఆస్తులు, 105 బ్యాంకు ఖాతాలను ఇప్పటి వరకు స్తంభింపజేసినట్లు ఆ శాఖ అధికార ప్రతినిధి తెలిపారు. ఈ ఖాతాల్లో రూ.80 లక్షల నిల్వలున్నాయి. ముంబయిలోని ప్రత్యేక న్యాయస్థానంలో ఐ.టి. శాఖ అభియోగపత్రం నమోదు చేసింది. దీనిపై ఈ నెల 27న విచారణ జరగనుంది. మరోపక్క ఈ వ్యవహారంలో పీఎన్‌బీ యాజమాన్యం, ఆర్థిక మంత్రిత్వశాఖ అధికారుల్ని తమ ఎదుట హాజరుకావాలని కేంద్ర నిఘా కమిషన్ (మిగతా 13లో)

ఏ త్యాగానికైనా సిద్ధం

రాష్ట్రానికి న్యాయం జరిగేవరకూ పోరాటం

- ఏమిచ్చామో చర్చిద్దాం రండి..
- కేంద్రం పెద్దలకు పిలుపు
- రాజకీయాల కోసం వ్యక్తిగత అజెండాలను అమలు చేయొద్దు
- ముఖ్యమంత్రి వ్యాఖ్యలు
- గుంటూరు జిల్లాలో పర్యటన



కోటప్పకొండపై రోప్‌వే శంకుస్థాపన శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. పక్కన సభాపతి కోడెల, మంత్రులు మాణిక్యాలరావు, పుల్లారావు, ఆనందబాబు, రాఘవరావు తదితరులు

‘పోరాటంలో వెనుకాడను. ఆ రోజు కాంగ్రెస్ అన్యాయం చేసింది. ఈ రోజు కేంద్రంలో ఉన్న పార్టీ పూర్తి సహకారం అందించడం లేదు. మనకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే బాధ్యత కేంద్రంపై ఉంది.

రాష్ట్రంలో క్లిష్టమైన పరిస్థితులు ఉన్న సమయంలో కొందరు రాజకీయాల కోసం, వ్యక్తిగత అజెండాలను అమలు చేయడం మంచిది కాదు. రాష్ట్ర ప్రయోజనాలు సమష్టి అంశమైనందున అందరం ఏకతాటిపై నడిచి కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. రాష్ట్ర ప్రజలందరూ విభజన జరిగినప్పుడు ఎలా బాధపడ్డారో ఈ రోజు అన్యాయం జరిగిందని ఆవేదన, ఆవేశంలో ఉన్నారు.’ - చంద్రబాబు

ఈనాడు - గుంటూరు

రాష్ట్ర విభజన జరిగినప్పుడు పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాల్సిందేనని కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిమాండు చేశారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రధాని, కేంద్ర మంత్రులు సరిదిద్దాల్సిందేనని స్పష్టం చేశారు. ‘రాష్ట్రానికి సంబంధించిన హక్కుల విషయంలో ఎక్కడా రాజీపడే సమస్యే లేదు. మూడున్నరేళ్లయినా కేంద్రం నుంచి పూర్తి సహకారం అందలేదు. ఈ సమయంలో సంఘటితంగా ప్రజానీకం మొత్తం ప్రభుత్వం వెంట ఉంటే గట్టిగా పోరాడతాం. ఇది కేంద్రానికి, 5 కోట్ల జనాభాకు సంబంధించిన అంశం. అందరి సహకారంతో న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం. తెలుగు వారికి అన్యాయం జరిగితే ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం’ అని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా నరసరావుపేట మండలం కాకాని సమీపాన శనివారం జేఎన్‌టీయూ (కాకినాడ) ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి, వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అంతకుముందు కోటప్పకొండలో పలు శంకుస్థాపనలు చేసి త్రికోటేశ్వరున్ని దర్శించుకున్నారు. అనంతరం శాసన సభాపతి కోడెల శివప్రసాదరావు అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. కేంద్రం పెద్దలు చాలా ఇచ్చామని చెబుతున్నారని, దీనిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కావాలని కొందరు తమ ప్రభుత్వాన్ని లెక్కలు అడుగుతున్నారని, విమర్శిస్తున్నారని వ్యాఖ్యానించారు. ‘లోక్‌సభలో విభజన చట్టం తీసుకొచ్చి నామమాత్రంగా కొన్ని అంశాలే పెట్టగా రాజ్యసభలో గట్టిగా వ్యతిరేకిస్తే ప్రత్యేక హోదా, ఇంకా కొన్ని అదనంగా ఇస్తామని చెప్పారు. మూడున్నరేళ్లయినా పూర్తి సహకారం అందలేదు. ఆంధ్రులు చేయని తప్పునకు శిక్ష అనుభవిస్తున్నారు. ఆ రోజు భాజపాతో తెదేపా పొత్తు పెట్టుకుందంటే రాష్ట్రానికి న్యాయం చేయడం కోసమే. నేను 29సార్లు (మిగతా 2లో)

చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై అవిశ్వాసం పెట్టొచ్చు



- ఎంపీలు రాజీనామాలు చేయొచ్చు
- ప్రత్యేక హోదాపై తెదేపా, వైకాపాలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ సూచన

2లో

హోదాతో సమానమంటేనే ప్యాకేజీకి అంగీకరించాం

- జనసేన నిజనిర్ధారణ కమిటీకి 118 పేజీల నివేదిక పంపిన రాష్ట్ర ప్రభుత్వం
- 19 పెండింగ్ అంశాలపై వివరణాత్మక సమాచారం

2లో

రాష్ట్రంలో కొత్తగా 150 పురపాలికలు!

- మేజర్ పంచాయతీల స్థాయి పెంచేందుకు ప్రభుత్వం సిద్ధం
- వచ్చే నెలాఖరుకు రాజధాని ఆకృతులు ఖరారు
- మంత్రి నారాయణ వెల్లడి

18లో

నరరూప రాక్షసుడికి మరణదండన

- పాకిస్థాన్‌లో ఏడేళ్ల బాలికపై అత్యాచారం, హత్య
- విచారణలో వెల్లడైన మరో 8 ఘాతుకాలు
- నాలుగు రోజుల్లోనే తీర్పు వెలువరించిన ఉగ్రవాద వ్యతిరేక న్యాయస్థానం

16లో



శనివారం కర్ణాటకలోని హసన్ జిల్లా శ్రవణబెళగొళలో 58.8 అడుగుల ఎత్తైన ఏకశిలామూర్తి గోమటేశ్వరుని మహామస్తకాభిషేక కార్యక్రమంలో పాల్గొన్న భక్తజనం

5లో

వైరాగ్యమూర్తికి మహామస్తకాభిషేకం

‘విద్యార్థి సైన్యం’ వస్తోంది..



- విద్యార్థి పోలీసు క్యాడెట్ కార్యక్రమానికి శ్రీకారం
- రాష్ట్ర వ్యాప్తంగా 180 పాఠశాలల్లో అమలుకు చర్యలు
- 8, 9 తరగతి విద్యార్థులకు 12 అంశాలపై శిక్షణ
- రెండేళ్లలో 18వేల మంది సిద్ధం

ఈనాడు, అమరావతి: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం, వారిలో సామాజిక బాధ్యతను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర హోం మంత్రిత్వశాఖ సరికొత్తగా ‘విద్యార్థి పోలీసు క్యాడెట్’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆసక్తి కలిగిన 8, 9 తరగతి విద్యార్థులకు రెండేళ్లపాటు ప్రత్యేకంగా శిక్షణ అందించడమే దీని లక్ష్యం. కేరళలో ఇప్పటికే విజయవంతమైన ఈ విధానం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైంది. రాష్ట్రంలోని మొత్తం 18 పోలీసు యూనిట్లకుగానూ ఒక్కో యూనిట్ పరిధిలో 10 పాఠశాలలను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఒక్కో పాఠశాల నుంచి 100 మంది చొప్పున మొత్తం 18వేల మందిని ‘విద్యార్థి పోలీసు క్యాడెట్‌లుగా (ఎస్‌పీసీ)’ తీర్చిదిద్దాలనేది లక్ష్యం. ఏపీ పోలీసు శిక్షణ విభాగం ఐజీ ఎన్.సంజయ్ ఈ (మిగతా 2లో)

ఇలా అయితే బీమాతో ధీమా ఎలా?

- ఖరీఫ్‌లో వేసిన పంటల బీమాకు సొమ్ము చెల్లించని రాష్ట్రం
- పంటనష్టం అంచనాలలో జాప్యం చేస్తున్న బీమా సంస్థలు
- చెల్లింపులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం
- పరిహారం కోసం ఎదురు చూస్తున్న రైతులు



ఈనాడు - అమరావతి

ఖరీఫ్ ముగిసింది. రబీ కూడా చివరి దశకు చేరింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమాకు తన వాటా నిధులు రూ.270 కోట్లు ఇంకా విడుదల చేయలేదు. దీంతో బీమా సంస్థలు పంటనష్టం అంచనాల తయారీలో జాప్యం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చెల్లింపు కూడా ఆలస్యం కానుంది. 2017 ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 17.21లక్షల మంది రైతులు 48.30 లక్షల ఎకరాల్లోని పంటలకు బీమా చెల్లించారు. పంటల వారీగా 2 నుంచి 5 శాతం వరకు రైతులు చెల్లిస్తున్నారు. అధికశాతం రైతులు బ్యాంకు రుణాల నుంచి చెల్లించగా..రుణాలు తీసుకోని వారు పొదుపు సంఘాలు, మీ-సేవ కేంద్రాల ద్వారా చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం చెల్లిస్తాయి.

- ఖరీఫ్ బీమాకు సంబంధించి రైతులు రూ.222 కోట్లు ప్రీమియంగా చెల్లించారు. ఇందులో వాతావరణ ఆధారిత బీమా కింద వేరుశనగ, మిర్చి తదితర పంటలకు 7.48లక్షల మంది రైతులు రూ.114కోట్లు ప్రీమియంగా చెల్లించారు. ఇందులో ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద 9.73లక్షల మంది రైతులు రూ.108కోట్లు చెల్లించారు.
- దీనికి కేంద్రం రూ.270కోట్లు, రాష్ట్రం రూ.270కోట్లు తమ వాటాలుగా విడుదల చేయాల్సి ఉంది. ఖరీఫ్ ముగిసి నాలుగు నెలలైనా ఇంకా ఇవ్వకపోవడంతో బీమా సంస్థలు కూడా అంతే స్థాయిలో జాప్యం చేస్తున్నాయి.

ఇలాగైతే మళ్లీ ఖరీఫ్‌కే చెల్లింపులు

ఖరీఫ్ బీమా పరిహారాన్ని వెంటనే లెక్కించి రబీ ప్రారంభమయ్యేనాటికి చెల్లింపులు చేయాలని ప్రభుత్వం గతంలో ఆదేశించింది. అయినా రాష్ట్రమే తన వాటా సొమ్ము ఇవ్వలేదు. రాష్ట్రం ఇచ్చాకే కేంద్రం దీనికి జత చేస్తుంది. అప్పుడు బీమా సంస్థలు పరిహారం ప్రకటిస్తాయి. ప్రస్తుత పరిస్థితి చూస్తే.. ఇప్పటికీ పంటకోత ప్రయోగాల లెక్కలపైనే కుస్తీ పడుతున్నారు. ఏ పంటలకు పరిహారం ఇవ్వాలి.. ఏ ప్రాంతాల్లో నష్టం జరిగింది.. అనే వివరాలపైనా (మిగతా 2లో)

ఇదీ సంగతి!



ఏమో తెలియదు! స్టీరింగ్ కమిటీ సభ్యులందరికీ కారు స్టీరింగులు ఇచ్చాడు.

ఉద్యోగం ఊసేదీ?

- వయోపరిమితి పెంచి 2 నెలలు దాటినా రాని ప్రకటనలు
- 27వేల ఖాళీల వివరాల సేకరణ
- భర్తీ చేసే పోస్టులెన్నో!



ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ ఊసే కనిపించడం లేదు. ఉద్యోగ ప్రకటనల జారీలో రాష్ట్ర ప్రభుత్వం నాన్చుడి ధోరణి అవలంభిస్తోంది. ప్రకటనల జారీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వంలో కదలిక రావడం లేదు. దీంతో లక్షలాది నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంది. వివిధ శాఖల నుంచి ఉద్యోగ ఖాళీల వివరాలపై ప్రాథమిక సమాచారం సాధారణ పరిపాలన, ఆర్థికశాఖ వద్ద సిద్ధంగా ఉన్నా.. తదుపరి చర్యలు మందకొడిగా సాగుతున్నాయి. ఆయా శాఖల నుంచి అందిన సమాచారం ప్రకారం... ఆగస్టు 2017 నాటికి ప్రత్యక్ష నియామకాల కింద 6,250, కార్పొరేషన్ల పరిధిలో 2,717, పోలీసు ఎగ్జిక్యూటివ్ కేడరులో 9,844, వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 6,250, ఇతర చోట్ల కలిపి 27వేల ఖాళీల సమాచారం ప్రభుత్వంవద్ద ఉన్నట్లు తెలిసింది. వీటిలో ఎన్ని భర్తీ చేయాలి? నిధుల లభ్యత, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని అధికారిక నిర్ణయాలు తీసుకోవడంలో ప్రస్తుతం జాప్యం జరుగుతోంది. గతేడాది డిసెంబరు 4వ తేదీ 34 సంవత్సరాల వయోపరిమితిని 42 సంవత్సరాలకు పెంచుతూ సాధారణ పరిపాలనశాఖ ఉత్తర్వుల్ని (మిగతా 2లో)

పనితీరు ఆధారంగా పంచాయతీలకు నిధులు

- ఆర్థికసంఘ సాయంపై కొత్త మార్గదర్శకాలు
- అభివృద్ధి పనులపై నాలుగు కేటగిరిల్లో మదింపు
- అత్యధిక పాయింట్లు సాధిస్తేనే నిధుల భాగ్యం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని 12,918 గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘ కేటాయింపు నిధులు (పనితీరు ఆధారిత నిధులు) అందనున్నాయి. 4 కేటగిరిల్లో పనితీరును మదించి నిధులు కేటాయించనున్నారు. పల్లెల అభివృద్ధికి 2015-16లో మొదలైన 14వ ఆర్థికసంఘ నిధుల కేటాయింపు 2019-20తో ముగియనున్నది. ఈ ఐదేళ్లలో గ్రామ పంచాయతీలకు రూ.8654.09 కోట్ల సాయం అందించనున్నారు. ఇందులో ప్రాథమిక నిధి (బేసిక్ గ్రాంట్) రూ.7788.68 కోట్లు, పెరఫార్మెన్స్ (పనితీరు ఆధారిత) నిధులు మరో రూ.865.41 కోట్లు ఉన్నాయి. గ్రామాల్లో వివిధ పనుల కోసం బేసిక్ నిధులను గత మూడేళ్లుగా పంచాయతీలు వినియోగించుకుంటున్నాయి. పనితీరు ఆధారిత నిధులు మొదటి ఏడాది (2015-16) విడుదల కాలేదు. గత ఏడాది (2016-17) పంచాయతీ జనాభా ఆధారంగా రూ.169.70 కోట్లు కేటాయించారు. ఈ ఏడాది (2017-18) రూ.192.04 కోట్ల నిధుల విడుదలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీల పనితీరుకు ముడిపెట్టాయి. చాలా రాష్ట్రాల్లో దుర్వినియోగమవుతున్నట్లు కేంద్రానికి ఫిర్యాదులు వెళ్లడంతో 2017-18 పనితీరు ఆధారిత నిధుల విడుదలకు ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించారు.

ఇలా చేస్తేనే నిధులు

- గ్రామ పంచాయతీల్లో ఆదాయ, వ్యయాలపై 2015-16 వరకు ఆడిట్ పూర్తి చేసి ఉండాలి. ప్రభుత్వ నిధులతో కాకుండా స్థానికంగా పంచాయతీలు సమకూర్చుకున్న వనరులేమిటో స్పష్టంగా పేర్కొనాలి. పన్నులు, పన్నులేతర కింద వచ్చే ఆదాయం, దీన్ని ఏవిధంగా పెంచుకున్నారు అంశాలపై కచ్చిత సమాచారం ఉండాలి.
- ప్రతి పంచాయతీ విధిగా 'గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక' (జీపీడీపీ) కలిగి ఉండాలి. ఆర్థిక సంఘ, సాధారణ నిధులతో గత మూడేళ్లలో ప్రజలకు కల్పించే మౌలిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను పంచాయతీ డ్యాష్‌బోర్డులో పెట్టాలి.
- 4 కోణాల్లో పంచాయతీల పనితీరును మదించి పాయింట్లు కేటాయించి వీటికి మాత్రమే పనితీరు ఆధారంగా నిధులు అందజేయనున్నారు.

పంచాయతీల అభ్యంతరం

పనితీరు ఆధారంగా నిధులు కేటాయింపు నిర్ణయంపై అత్యధిక పంచాయతీల్లో అభ్యంతరం వ్యక్తమవుతోంది. ఈ విధానంతో కొన్ని పంచాయతీలే ఎక్కువగా ప్రయోజనం పొంది మిగతావి నష్టపోయే అవకాశాలున్నాయని సర్పంచులు చెబుతున్నారు. నగరాల, పట్టణాల, జిల్లా కేంద్రాలకు సమీపంలోని పంచాయతీల్లో ఎక్కువగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో అత్యధిక పంచాయతీలు అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్నాయి. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో చాలా పంచాయతీలు నిధుల ఖర్చు, ఇతర కార్యక్రమాల నిర్వహణలో వెనుకబడ్డాయి.

కేంద్రంపై అవిశ్వాసం పెట్టొచ్చు

- తెదేపా, వైకాపాలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ సూచన
- ముగిసిన జేఎఫ్‌సీ రెండ్రోజుల సమావేశం

హైదరాబాద్, న్యూస్‌టుడే: నేతల వైఫల్యం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, అంతిమంగా ప్రజలు నష్టపోతున్నారని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో తెదేపా, వైకాపాలకు చిత్తశుద్ధి ఉంటే రాజీనామాలు చేయవచ్చన్నారు. కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టవచ్చని అభిప్రాయపడ్డారు. సంయుక్త నిజ నిర్ధారణ కమిటీ (జేఎఫ్‌సీ) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని ఓ హోటల్‌లో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న సమావేశాలు శనివారం ముగిశాయి. అనంతరం విలేకరుల సమావేశంలో పవన్ మాట్లాడారు. "ఆనాడు ఆంధ్రా, తెలంగాణను కలిపిన సమయంలో తెలంగాణకు అండగా నిలబడతామని నాటి నేతలు చెప్పారు. ఆ వాగ్దానాలు పాటించకపోవడం వల్లే దశాబ్దాలపాటు పేరుకుపోయిన సమస్యలు జటిలమయ్యాయి. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి 10 లక్షల మంది ప్రజలు బయటకు వచ్చి 'మా రాష్ట్రం మాకు కావాలి, మీరంతా వెళ్లిపోండి' అనే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు కూడా ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని మభ్యపెట్టి కాలం గడిపితే ప్రజల్లో విసుగు పెరిగిపోతుంది" అన్నారు. యూపీఏ హయాంలోనూ ఎంపీలు స్పందించలేదని, కేంద్రం దృష్టికి సమస్యను సరిగ్గా తీసుకెళ్లలేదని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలోనూ అదే జరుగుతోందన్నారు. ఇలాంటి సమస్యలపై భవిష్యత్తులో ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమించకుండా ఉండాలంటే ఏం చేయాలనే కచ్చితమైన ఆలోచనా విధానంతో ముందుకు వెళ్తున్నామన్నారు. జేఎఫ్‌సీ సమావేశంలో తెలంగాణపైనా చర్చ జరిగిందని ఇంకా విస్తృతంగా చర్చించాల్సి ఉందన్నారు.

నివేదిక వచ్చిన తర్వాత ముందుకు..

మూడు నాలుగు రోజుల్లో జేఎఫ్‌సీ నివేదిక వస్తుందని. అనంతరం ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ జేఎఫ్‌సీ సమావేశాల్లో వాస్తవాల ఆధారంగా సమాచారం సేకరించి విశ్లేషించిందన్నారు. హోదా పొందిన కొన్ని ఉత్తరాది రాష్ట్రాలు పెద్దగా అభివృద్ధి కాలేదనే సాకుతో ఇక్కడ ఇవ్వమంటే ఎలా అని ప్రశ్నించారు. కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి చర్చించిన తరువాత ఎంపీలు రాజీనామా చేస్తే దేశమంతా గుర్తించే వీలుందని సూచించారు. సమావేశంలో కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య, మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్, వివిధ రంగాలకు చెందిన అరుణ, మహేశ్వర్ పేరి, డా.అమీర్ ఖాన్, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.



జేఎఫ్‌సీ సమావేశంలో పవన్ కల్యాణ్, ప్రతినిధులు

రౌండ్‌టేబుల్ సమావేశానికి మద్దతు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో జరగనున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి జనసేన పూర్తి మద్దతు ప్రకటిస్తోందని పవన్‌కల్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. జనసేన ప్రతినిధి కూడా పాల్గొంటారని వివరించారు.

హోదాతో సమానమంటేనే ప్రత్యేక సాయానికి అంగీకరించాం

జనసేన నిజనిర్ధారణ కమిటీకి 118 పేజీల నివేదిక పంపించిన రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు అమరావతి: ప్రత్యేక హోదాతో సమానమైన అన్ని ప్రయోజనాలు కల్పిస్తామని కేంద్రం చెప్పినందునే ప్రత్యేక సాయానికి అంగీకరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం జనసేన నిజనిర్ధారణ కమిటీకి తెలియజేసింది. నివేదికలో మొత్తం 118 పేజీలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక సెక్షన్ ఆఫీసర్ మూడు సెట్‌లు తీసుకెళ్లి అందజేశారు. ఆయన వెళ్లేసరికే నిజ నిర్ధారణ కమిటీ రెండో రోజు సమావేశం ముగియడంతో, జనసేన కార్యాలయ ప్రతినిధి ఒకరికి ఆ ప్రతుల్ని అందజేశారు. విభజన చట్టంలోని హామీలు, రాష్ట్రానికి సంబంధించి కేంద్రం నెరవేర్చాల్సిన 19 అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీకి అందజేసిన నివేదికలో... స్వల్ప మార్పులు చేసి, నిజనిర్ధారణ కమిటీకి అందజేశారు. 2016 సెప్టెంబరు 8న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటన, దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు విలేఖరుల సమావేశంలో పేర్కొన్న అంశాలను పొందుపరిచారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ పూర్తిస్థాయిలో, నిర్దిష్ట కాలావధిలోగా అమలు చేయాలని ముఖ్యమంత్రి కోరిన విషయాన్ని ప్రస్తావించారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలేవీ ఇంత వరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని పేర్కొన్నారు. రెవెన్యూ లోటు భర్తీ తదితర అంశాలపై ఒక స్పష్టతకు వచ్చేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సమావేశం గురించి ప్రస్తావించారు. పరిశ్రమలకు మూలధన పెట్టుబడుల రాయితీలు, ఎక్సైజ్ సుంకాల్లో రాయితీలు వంటి అంశాల్ని తక్షణం అమలు చేయాలని కోరుతూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రికి ముఖ్యమంత్రి ఒక లేఖ కూడా రాశారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత మొదటి సంవత్సరం రెవెన్యూ లోటు భర్తీకి కేంద్ర ప్రభుత్వం రూ.16,078.76 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, ఇంత వరకు రూ.3,979.50 కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. రెవెన్యూ లోటు భర్తీకి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వాదనల్ని వివరించారు. పోలవరం ప్రాజెక్టు, రైల్వే జోను, ఆయిల్ రిఫైనరీ, అమరావతికి ఆర్థిక సాయం, దుగరాజపట్నం పోర్టు, కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్, జాతీయ స్థాయి విద్యా సంస్థల ఏర్పాటు వంటి పెండింగ్ అంశాలన్నీ ప్రస్తావించారు. 11 జాతీయ ప్రాధాన్యంగల విద్యా సంస్థలు ఏర్పాటు చేస్తామని చెప్పారని, కానీ ఇంత వరకు తొమ్మిది సంస్థలే మంజూరు చేశారని, వాటికీ అరకొరగానే నిధులు సమకూర్చారని తెలిపారు.

మార్చిలో జనసేన బహిరంగ సభ..!

జనసేన పార్టీ వచ్చే నెలలో గుంటూరు జిల్లాలో బహిరంగ సభ నిర్వహించే అవకాశమున్నట్టు సమాచారం. తేదీ ఇంకా ఖరారు కాలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జనసేన ఆవిర్భావ దినోత్సవం రోజున ఈ సభను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.



ఇంజినీరింగ్ కళాశాలకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, పక్కన సభాపతి కోడెల, మంత్రులు గంటా శ్రీనివాసరావు, పుల్లారావు, ఆనందబాబు, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాజకుమారి తదితరులు

ఏ త్యాగానికైనా సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ వెళ్లి అందరినీ కలిసి జరిగిన అన్యాయాన్ని గుర్తు చేస్తూనే ఉన్నాను. ఇప్పటికీ సరైన న్యాయం జరగలేదు. చివరి బడ్జెట్లోనూ అన్యాయం జరిగినప్పుడు గట్టిగా నిలదీస్తున్నాం. విభజన చట్టంలో పెట్టినవి, రాజ్యసభలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. దక్షిణ భారత రాష్ట్రాలతో సమానంగా ఎదిగే వరకూ చేయూతనివ్వాలి' అని స్పష్టం చేశారు.

ఆవిష్కరణల కేంద్రంగా అమరావతి

యువతను ముందుకు నడిపించి ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. ప్రపంచం మొత్తంలో తెలుగు యువత పనిచేసే విధంగా అవకాశాలు కల్పిస్తామని, దీనిని అందిపుచ్చుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో నాలెడ్జ్ ఎకానమీ ద్వారా సంపద సృష్టి జరుగుతుందని, అందుకు అనుగుణంగా విద్యార్థులు కోర్సులను ఎంచుకుని అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అమరావతిని ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లి ప్రాజెక్టులో పరిశీలించిన అంశాలతో పుస్తకం తీసుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, గంటా శ్రీనివాసరావు, నక్కా ఆనంద బాబు, శిద్దా రాఘవరావు, మాణిక్యాలరావు, ఎంపీ రాయపాటి సాంబశివరావు, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు..



ఇంటిని శుభ్రంచేసే స్ప్రేలతో ఊపిరితిత్తులకు దెబ్బ!

లండన్: మహిళలూ జాగ్రత్త..! ఇంటిని శుభ్రంచేసే స్ప్రేలతో ఊపిరితిత్తుల పనితీరు దెబ్బతినే ముప్పుందని తాజా అధ్యయనంలో తేలింది. నార్వేలోని బెర్గెన్ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. 6235 మంది సమాచారాన్ని వారు విశ్లేషించారు. దీంతో స్ప్రేలను ఇంటిలో ఉపయోగించే వారిలో 12.3 శాతం, కార్యాలయాల్లో ఉపయోగించేవారిలో 13.7 శాతం ఆస్తమా ముప్పు ఎక్కువగా ఉంటున్నట్లు బయటపడింది. అంతేకాదు స్ప్రేలతో నిత్యంపనిచేసే పారిశుద్ధ్య కార్మికుల ఊపిరితిత్తులు.. పొగతాగే వారిలానే దెబ్బతింటాయని వెలుగులోకి వచ్చింది. ఊపిరితిత్తుల పనితీరు మందగించడానికి స్ప్రేల్లోని రసాయనాలే కారణమని పరిశోధకులు భావిస్తున్నారు. ఇవి శ్వాసకోశ సమస్యలకు దారితీస్తాయని, ఫలితంగా శ్వాస మార్గాలు దెబ్బతింటాయని పరిశోధకులు సిసైల్ స్వాన్స్ తెలిపారు. ఈ పరిణామాల వల్లే ఊపిరితిత్తుల పనితీరు మందగిస్తోందని చెప్పారు. ధూమపానం అలవాటు, బరువు ఎత్తుల నిష్పత్తి (బీఎంఐ), విద్య తదితర అంశాలనూ అధ్యయనంలో పరిగణలోకి తీసుకున్నట్లు వివరించారు. స

నానో ఫ్లూ టీకా

బీజింగ్: నానో పరిజ్ఞానం సాయంతో కొత్త ఫ్లూ టీకాను పరిశోధకులు అభివృద్ధిచేశారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు ఇది తోడ్పడే అవకాశముంది. ఎలాంటి సూదులూ అక్కర్లేకుండా నాసికా రంధ్రాల నుంచి నేరుగా దీన్ని తీసుకోవచ్చు. ఎలుక పిల్లలపై చైనాలోని వ్యూహన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ నిపుణులు దీన్ని ప్రయోగించారు. దీంతో హెచ్1ఎన్1, హెచ్9ఎన్2 లాంటి వైరస్‌లతో ఇది సమర్థంగా పోరాడుతోందని వెలుగులోకి వచ్చింది. ఈ టీకాలోని 3ఎం2ఈ-ఆర్‌హెచ్‌ఎఫ్ నానోకణాలు భిన్నరకాల వైరస్‌లను హతమార్చగలవని పరిశోధకులు క్యూ జాంగ్‌కియాంగ్ తెలిపారు.

రక్తపోటు ఔషధంతో మధుమేహానికి కళ్లెం

వాషింగ్టన్: రక్తపోటు నియంత్రణ ఔషధమొకటి టైప్-1 మధుమేహం రాకుండా అడ్డుకోగలదని తాజా అధ్యయనంలో తేలింది. గత 50ఏళ్లుగా గర్భిణులు, చిన్నారుల్లో రక్తపోటు నియంత్రణకు "మిథైల్‌డోపా" ఔషధాన్ని వైద్యులు సిఫార్సుచేస్తున్నారు. ప్రస్తుతం దీనిలోని ఔషధ సమ్మేళనాలపై అమెరికాలోని కొలరాడో వర్సిటీ నిపుణులు దృష్టిసారించారు. "దాదాపు 60 శాతం మందికి డీక్యూ8 యాంటీజెన్ల వల్లే టైప్-1 మధుమేహం చుట్టుముడుతుంది. వీటిని మిథైల్‌డోపా చక్కగా అడ్డుకుంటోంది. ఫలితంగా మధుమేహ ముప్పు దూరం అవుతోంది'అని పరిశోధకులు ఆరన్ మైఖెల్స్ తెలిపారు. శరీరంలోని ఇతర ఆరోగ్యకర కణాలపై ఈ ఔషధం ఎలాంటి దుష్ప్రభావాలనూ చూపడంలేదని వివరించారు. ఎలుకలపై ఈ విషయాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించామని చెప్పారు.

'విద్యార్థి సైన్యం' వస్తోంది..

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం అమలుకు రాష్ట్ర స్థాయి నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా ఎన్‌సీసీలో రక్షణ రంగానికి ఉపయోగపడే స్థాయి క్రమశిక్షణను విద్యార్థులకు నేర్పిస్తారు. ఎన్ఎస్ఎస్‌లో సేవాభావం పెంపొందించేలా తీర్చిదిద్దుతారు. విద్యార్థి పోలీసు క్యాడెట్లు ఆ రెండింటి మేళవింపుగా ఉంటారు.

- రాష్ట్ర స్థాయి ప్రధాన శిక్షకులుగా ఐదుగురిని ఎంపిక చేశారు. దిల్లీలో ఇటీవల వారు ప్రత్యేక శిక్షణ పొందారు. రాష్ట్ర స్థాయి స్వచ్ఛంద శిక్షకులుగా ఎంపికైన 193 మందికి వీరు శిక్షణనిస్తారు.
- స్వచ్ఛంద శిక్షకులు తమ జిల్లా పరిధిలో కేటాయించిన పాఠశాలకు వెళ్లి వారానికి ఒకసారి గంటపాటు తరగతులు చెబుతారు. రెండేళ్లలో ఇలా 200 గంటల పాటు శిక్షణ ఇవ్వాలనేది లక్ష్యం.
- పాఠశాలల్లో తరగతుల బోధనకు అవసరమైన పరికరాల కొనుగోలు, ఇతర అవసరాల కోసం ఒక్కో పోలీసు యూనిట్‌కు రూ.11.50 లక్షల చొప్పున కేంద్ర హోం మంత్రిత్వశాఖ నిధులు కేటాయించింది.

12 అంశాలపై శిక్షణ

రహదారి భద్రత, ట్రాఫిక్‌పై అవగాహన, పోలీసు-నేర నియంత్రణ, సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం, సానుభూతి- జాలి- దయ, సామాజికాభివృద్ధి, పరిశుభ్రత, బృంద స్ఫూర్తి, మహిళలు, బాలల రక్షణ, క్రమశిక్షణ, నీతి- విలువలు, అవినీతిపై వ్యతిరేకంగా పోరాటం, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఉంటుంది. వీటితో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక సామరస్యం, వృద్ధులను గౌరవించడం, క్రీడలకు ప్రోత్సాహం తదితర అంశాలపై క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహిస్తారు.

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు

రెండేళ్లపాటు ఈ తరగతులకు పూర్తిగా హాజరై శిక్షణను పూర్తి చేసుకున్న వారిని విద్యార్థి పోలీసు క్యాడెట్లుగా (ఎస్‌పీసీ) గుర్తిస్తారు. ప్రత్యేక ధ్రువపత్రాలను అందజేస్తారు.

ఇలా అయితే బీమాతో ధీమా ఎలా..?

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టత లేదు. దీంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

సాంకేతికత పెరిగినా అంతేనా?

గతంలో రైతులు బ్యాంకుల ద్వారా ప్రీమియం చెల్లించాక వాటిని క్రోడీకరించి లెక్కలు తేల్చేవారు. ఇప్పుడంతా ఆన్‌లైన్ కావడంతో ఏ రోజు ఎంతమంది రైతులు బీమా చేశారనే వివరాలు నిమిషాల్లో తెలుసుకోవచ్చు. పంట కోత ప్రయోగాలు కూడా ఆన్‌లైన్‌లోనే నమోదు చేస్తున్నారు. అయినా ఇప్పటికీ జిల్లాల వారీ లెక్కలు సిద్ధం కాలేదు. ఏ పంటకు పరిహారం ఇస్తారని రైతులు అడుగుతుంటే వ్యవసాయశాఖ తమకు తెలియదంటోంది. బీమా సంస్థలు సమాధానం చెప్పడం లేదు. పరిహారం అందిస్తే రైతులకు బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలపై వడ్డీ అయినా తగ్గుతుంది. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చెత్త నిల్వ కేంద్రంలో సిరుల సాగు

కనువిందు చేస్తున్న బంతి మొక్కలు



తాళ్వాయిపాడు పంచాయతీ కేంద్రం పరిధిలో సాగు అవుతున్న కూరగాయలు, పూల మొక్కలు



వివిధ రకాల పచ్చని మొక్కలతో కనువిందు చేస్తున్న ఈ ఉద్యానవనం మనస్సుకు ఆహ్లాదం పంచుతోంది కదూ..! ఇది ఎక్కడ అనుకుంటున్నారా.. నెల్లూరు జిల్లా పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు పంచాయతీ కేంద్రం పరిధిలో ఉంది. కొన్నేళ్ల క్రితం వరకు ఇదో చెత్తనిల్వ కేంద్రం.. ప్రస్తుతం దీన్ని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంగా స్థానికులు పిలుచుకుంటున్నారు. మిగతా కేంద్రాల్లో మాదిరిగా ఇక్కడ చెత్తను పారబోసి చేతులు దులుపుకోరు. తొలుత వివిధ గ్రామాల నుంచి ఇక్కడకు తరలించిన చెత్తను తడి, పొడిగా వర్గీకరించి.. సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నారు. వాటినుపయోగించి సంబంధిత అధికారులు ప్రాంగణంలో కూరగాయలు, పూల సాగు సహా వరి పంట పండిస్తున్నారు. స్థానిక రైతులకూ ఈ సేంద్రియ ఎరువులను నామమాత్రపు ధరకే విక్రయిస్తారు. ఈ కేంద్రంలో తవ్విన భారీ నీటికుంటలో చేపలను పెంచుతూ.. తద్వారా లభించే ఆదాయాన్ని పంచాయతీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. **–ఈనాడు, నెల్లూరు**

గ్రహం అనుగ్రహం

18–2–2018 ఆదివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; శుక్ల పక్షం
తదియ: తె. 4-01 తదుపరి చవితి
పూర్వాభాద్ర నక్షత్రం: మ. 12-04 తదుపరి ఉత్తరాభాద్ర
అమృత ఘడియలు: లేవు
వర్జ్యం: రా. 9-53 నుంచి 11-31 వరకు
దుర్ముహూర్తం: సా. 4-25 నుంచి 5-11 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6-29; సూర్యాస్తమయం: సా.5-57

ఉద్యోగం ఊసేదీ?

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. ఇవి వెలువడి 2 నెలలు దాటినా... ఉద్యోగ ప్రకటనలు రానందున కొందరు దరఖాస్తు చేసేందుకూ అర్హత కోల్పోతున్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీపీఎస్సీ నుంచి సుమారు 4,500 ఉద్యోగ ఖాళీల భర్తీకి 2016లో 32, 2017లో 3 నోటిఫికేషన్లు వచ్చాయి. వీటిలో చాలా పోస్టుల భర్తీ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. గ్రూప్-1 (2011) ఉద్యోగాల భర్తీకి సంబంధించిన మౌఖిక పరీక్షలు వచ్చే వారంలో ముగియనున్నాయి. వెంటనే ఎంపిక జాబితాను ప్రకటించనున్నారు. జారీ చేసిన ఉద్యోగ ప్రకటనలను అనుసరించి తీసుకోవాల్సిన చర్యలు ముగింపునకు చేరుకోవడంతో ఏపీపీఎస్సీకి పని క్రమేణా తగ్గుతోంది.

వివిధ శాఖల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం ముఖ్యమైన ఉద్యోగ ఖాళీల వివరాలివే...

వ్యవసాయశాఖ (వ్యవసాయాధికారి): **125**

పశు సంవర్ధకశాఖ (పశువైద్య సహాయకుడు): **357**

రవాణశాఖ (రవాణా కానిస్టేబుల్): **169**

సాంకేతిక విద్యాశాఖ (అధ్యాపకులు): **272**, (వ్యాయామ సంచాలకుడు): **50**, (గ్రంథ పాలకులు): **35**

పట్టణ ప్రణాళిక, నిర్మాణ విభాగం: **361**

గ్రామీణాభివృద్ధిశాఖ (ఏఈ/ఏఈఈ, విభాగాధికారి): **250**

డబ్ల్యూడీ అండ్ సీడబ్ల్యూ విభాగం (విస్తరణాధికారి, పర్యవేక్షకుడు): **171**

రెవెన్యూ (ఈఎన్‌డీటీ) విభాగం (కార్యనిర్వాహక అధికారి గ్రేడ్-1): **178**

గిరిజనశాఖ (ప్రత్యేక కమిషనరు): **94**

భూగర్భ జల విభాగం (సహాయ హైడ్రోజియాలజిస్ట్): **12**

జైళ్లశాఖ వార్డర్ (మహిళలు): **239**

డీజీపీ కార్యాలయం (జూనియర్ స్టెనో): **79**

సమాచారశాఖ (సహాయ సమాచార ఇంజినీరు): **30**

సహాయ పౌర సంబంధాల అధికారి: **12**

డైరెక్టరు ఆఫ్ వర్క్స్ అండ్ అకౌంట్స్: **35**

పురపాలకశాఖ (జూనియర్ అసిస్టెంట్ (యుఎల్‌బీ): **133**

బిల్ కలెక్టరు: **165**; ఆరోగ్య సహాయకుడు: **29**

ఇంగ్లీష్ రిపోర్టర్లు: **10**; టైప్-కం-అసిస్టెంట్: **16**

స్టేషన్ ఫైర్ ఆఫీసర్: **24**; డ్రైవర్ ఆపరేటర్: **91**

ఫైర్‌మెన్: **746**.

ఇవేకాకుండా ఇతర రకాల పోస్టులు ఆయాశాఖల్లో ఖాళీగా ఉన్నాయి.

వైద్య ఆరోగ్య శాఖలో.. ప్రజారోగ్యశాఖ (ఫార్మసిస్ట్): **329**, స్టాఫ్ నర్సు: **1497**, పారా మెడికల్ ఆప్తమాలిక్ ఆఫీసర్: **10**, ఎంపీహెచ్ఏ (ఎఫ్): **364**, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2: **364**, రేడియోగ్రాఫర్: **71**, ఎంపీహెచ్ఏ (ఎం): **2055**. ఏపీ జెన్‌కో (అసిస్టెంట్ ఇంజినీరు): **127**, అసిస్టెంట్ ఇంజినీరు (సివిల్): **10**, సబ్ ఇంజినీరు: 151, జూనియర్ ప్లాంట్ అసిస్టెంట్: **1264**. ఏపీఎస్ఆర్టీసీ డిప్యూటీ సూపరింటెండెంట్ ట్రాఫిక్: **188**, మెకానికల్: **174**, జూనియర్ అసిస్టెంట్ పర్సనల్: **182**, జూనియర్ అసిస్టెంట్ ఫైనాన్స్: **175**. పోలీసుశాఖలో- కానిస్టేబుల్ (సివిల్) **4,140**, పీసీ (ఏఆర్): **1869**, ఎస్ఐ (సివిల్): **40**, ఆర్ఎస్ఐ (ఎఆర్): **15**, ఆర్ఎస్ఐ: **(92)**.

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	16.4	33.8
శ్రీకాకుళం	17.0	35.0
అనంతపురం	17.7	33.1
విశాఖపట్నం	18.6	31.0
తిరుపతి	18.8	33.3
విజయవాడ	19.8	32.9
తాడేపల్లిగూడెం	20.0	35.0
కడప	20.0	35.0
నరసాపురం	20.8	29.9
గుంటూరు	20.8	33.5
రాజమహేంద్రవరం	21.0	36.0
ఖమ్మం	22.0	32.0
నెల్లూరు	22.0	32.0
కర్నూలు	22.0	35.7
ఒంగోలు	22.3	32.9
సూర్యాపేట	24.0	34.5



'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో శనివారం రాత్రి వెలగపూడి సచివాలయం ప్రాంగణంలో 'అమరావతి సాకారం ఎలా..?' అనే అంశంపై ఈనాడు సీనియర్ అసోసియేట్ ఎడిటర్ డి.ఎన్.ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన చర్చా వేదికలో పాల్గొన్న.. ఆర్థిక, మౌలికరంగ విశ్లేషకులు ఎస్.అనంత్, రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతు ఎం.కృష్ణారావు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్ రమేశ్ శ్రీకొండ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, భాజపా సీనియర్ నేత గోపాలకృష్ణ, ఏపీ మేధావుల ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్, రాజధాని ఆకృతుల కమిటీ సభ్యుడు ఈమని శివనాగిరెడ్డి, రాజధాని రైతు సమాఖ్య నాయకుడు ధనేకుల రామారావు

కేంద్రం సహకరిస్తేనే ప్రపంచస్థాయి రాజధాని

- **విభజన హామీలను నెరవేర్చాలి**
- **'ఈటీవీ' చర్చా కార్యక్రమంలో వక్తలు**

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం కేవలం కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే నెరవేరుతుందని వివిధ వర్గాల ప్రముఖులు పేర్కొన్నారు. విభజన చట్టంలోని హామీలన్నీ కేంద్రం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరకొరగా నిధులిచ్చి భారీగా సాయం చేశామనడం సరికాదన్నారు. గతంలో ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఇచ్చిన హామీలను మర్చిపోవద్దని సూచించారు. రాష్ట్రానికి ఇప్పటి వరకూ విడుదలైన నిధులపై కేంద్ర, రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వెలగపూడి సచివాలయం వేదికగా 'అమరావతి సాకారం ఎలా..?' అనే అంశంపై 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్' శనివారం ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహించింది. ఈనాడు సీనియర్ అసోసియేట్ ఎడిటర్ డీఎన్ ప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించారు. తెదేపా, భాజపా నాయకులు సహా ఆర్థిక నిపుణులు, రాజధాని ప్రాంత రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలు గమనిస్తున్నారు...

రాజధానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు, హైకోర్టు, శాసనసభ, సచివాలయ భవనాలకు ఆర్థిక సహాయం అందిస్తామని విభజన చట్టంలో చెప్పారు. దిల్లీని తలదన్నే రీతిలో రాజధాని నిర్మాణానికి సహకరిస్తామని తిరుపతి సభలో ప్రధాని చెప్పారు. ఇప్పటి పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలి. నిధులు ఖర్చు పెట్టారా లేదా అనేందుకు ఏటా యూసీలు సమర్పించడంలో మొదటి మూడు స్థానాల్లో ఏపీ ఉంది.

– కుటుంబరావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు

నామమాత్రపు నిధులివ్వడం సరికాదు

రాజధానికి రూ.1500 కోట్లు ఇచ్చి చాలనడం సరికాదు. చివరి బడ్జెట్ కూడా రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా లేదనే ఎంపీలంతా పోరాటం చేస్తున్నారు. ప్రత్యేక హోదా కాదు ప్యాకేజీ అన్నారు. ఏ స్థానంలో ఉన్నా తెదేపా రాజీలేని పోరాటం చేస్తూనే ఉంది. విభజన చట్టంలోని హామీలపై ఎన్నో సార్లు సాయం చేయాలని సీఎం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

– ధూళిపాళ్ల నరేంద్ర, పొన్నూరు ఎమ్మెల్యే

ప్రధాని ఇంటి ముందు ధర్నా చేయాలి

భాజపా నాయకులు అవమానకరంగా మాట్లాడుతున్నారు. పోరాటానికి అఖిల పక్షం ఏర్పాటు చేయాలి. ప్రధాని ఇంటి ముందు ధర్నా చేయాలి. కేంద్ర సాయంపై రాష్ట్రం ఆలస్యంగా స్పందించింది. కేంద్ర విద్యాసంస్థలకు ఇవ్వాల్సిన రూ.11 వేల కోట్లకు ఇప్పటి వరకూ రూ.700 కోట్లు ఇచ్చారు. నాలుగేళ్లుగా ఏం చేశారన్నది ప్రజలకు చెప్పాలి.

– చలసాని శ్రీనివాస్, ఏపీ మేధావుల సంఘం సమన్వయ కర్త

భవనాలు ఉంటే సరిపోదు...

రాజధానిలో ఆర్థిక కార్యకలాపాలు ప్రారంభిస్తేనే పెట్టుబడులు వస్తాయి. కేంద్రం పూర్తి స్థాయిలో సహకరించాలి. భవనాలు ఉంటే సరిపోదు. రాజధానికి కావాల్సిన ముఖ్యమైన మౌలిక సదుపాయాల్లో ఆరోగ్య రంగం మొదటిది. ఎయిమ్స్ మంజూరు చేసినా నిధులు విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

– డాక్టర్ అనంత్, ఆర్థిక నిపుణులు

ప్రాధాన్యాలు గుర్తెరగాలి...

అత్యంత అద్భుతంగా రాజధాని నిర్మించాలనుకోవడంలో తప్పులేదు. ప్రాధాన్యాన్ని బట్టి దశలవారీగా నిర్మాణం చేపట్టాలి. రాజధాని కోసం భూమి ఇచ్చిన స్థానికుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ఉంది. మొదట ఇది జరిగాక పెద్ద ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సిద్ధం చేసుకుంటే బావుంటుంది.

– గోపాల కృష్ణ, భాజపా నాయకుడు

భాజపాకీ అదే గతి

"రైతులు పెద్ద ఎత్తున భూమి ఇచ్చారంటే ఇక్కడి ప్రజల్లో ఏ స్థాయిలో అంచనాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా రాజధాని తయారుకావాలి. తీరు మారకపోతే కాంగ్రెస్‌కు పట్టిన గతే భాజపాకీ పడుతుంది'' అన్నారు రాజధాని రైతు **ఎం.కృష్ణారావు**. "అన్ని గ్రామాల్లో తిరిగి భూసేకరణకు సహకరించాం. ప్రభుత్వంపై రైతులందరికీ విశ్వాసం ఉంది. కేంద్రం నుంచి నిధులు రాబట్టుకుంటారని ఆశిస్తున్నాం'' అన్నారు రాజధాని రైతు సమాఖ్య నాయకుడు డి.రామారావు. శతాబ్దాల ఆంధ్రుల చరిత్ర భవనాల ఆకృతుల్లో ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమన్నారు స్థపతి ఈమని శివనాగిరెడ్డి. అన్ని ప్రాంతాల వారి చరిత్రకు సంబంధించి కళారూపాలు భవనాల్లో కనిపిస్తే ప్రజల్లో ఇది మా రాజధాని అనే భావం ఉంటుందన్నారు.


టెట్ పరీక్షా కేంద్రాల్లో మార్పులు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 4,46,833 దరఖాస్తులు రాగా.. 4,15,576మంది హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని టెట్ కన్వీనర్ సుబ్బారెడ్డి తెలిపారు. పేపర్-1, పేపర్-2లకు 8సెషన్లు, పేపర్-3కి మూడుసెషన్లు, అన్ని పేపర్లకు కలిపి ఒక సెషన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు శనివారం ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థుల అనుమతి లేకుండా ఇతర రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు కేటాయించిన 15,605మందిలో 12,596మంది తమ ఐచ్ఛికాలను మార్చుకున్నారని, వీరిలో 11,196మంది హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. పాఠశాల విద్యాశాఖ ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ కేంద్రాలకు 1345 ఫిర్యాదులు రాగా..గర్భిణులు, వికలాంగులకు సొంత జిల్లాల్లోనే కేంద్రాలను కేటాయించామన్నారు. రెండు పరీక్షలకు దరఖాస్తు చేసినవారిలో 151మందికి మార్పు చేసిన హాల్‌టిక్కెట్లు ఇస్తున్నామని, వీరికి ప్రత్యేక సెషన్స్‌లో పరీక్ష నిర్వహించనున్నామన్నారు. కృష్ణ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రం వచ్చిన 3,190మందిలో 2,500మందికి పొన్నూరు సమీప జీవీఆర్‌ఎస్, చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాలల్లో కేంద్రాన్ని కేటాయించామని, మిగతా నెల్లూరు, కృష్ణా జిల్లాలకు చెందిన 690మందికి ప్రకాశం జిల్లాలోని కృష్ణచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్రాన్ని ఇచ్చామన్నారు. టెట్ అభ్యర్థులు వినతులను ఈనెల 18వ తేదీ 12 గంటలకు వరకు ఇవ్వాలని, 21 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని వివరించారు.

ఒకే సమయం..రెండు పరీక్షలెలా?

- **అది కూడా వేర్వేరు నగరాల్లోనా!**
- **టెట్ దరఖాస్తుదారుడు గగ్గోలు**

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఏర్పాట్లలో లోపాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న మురళికి చేదు అనుభవం ఎదురైంది. ఈయన బీఈడీ, డీఈడీ ఉత్తీర్ణుడయినందున టెట్‌లో పేపర్-1, పేపర్-2 పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకుని చూడగా మూర్ఛపోయేంత పనైంది. మార్చి 2న మధ్యాహ్నం రెండున్నర గంటలకు పేపర్- 1 కర్నూలులోను, అదే తేదీ, అదే సమయంలో గుంటూరులో పేపర్-2 పరీక్ష రాయాలని హాల్‌టిక్కెట్లలో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఒకే రోజు ఒకే సమయంలో పరీక్ష ఎలా రాయగలనంటూ అభ్యర్థి ఆందోళన చెందుతున్నారు. పరీక్షల నిర్వాహకులు రెండు పరీక్షలకు రాసేలా సమయం మార్పు చేయాలని ఆయన కోరుతున్నారు.



రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఒకే సమయంలో పరీక్ష రాయాలంటూ వచ్చిన హాల్‌టిక్కెట్లు ★ మురళి, టెట్ దరఖాస్తుదారుడు

దళితులను విస్మరించిన కాంగ్రెస్, భాజపా: మాయావతి

బెంగళూరు, న్యూస్‌టుడే: దేశంలో ఆర్.ఎస్.ఎస్. నేతృత్వంలో హిందూతత్వం పెచ్చుమీరి దళితులపై దాడులు తీవ్రమైనట్లు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వమే దీనికి ఊతమిస్తోందని ఆరోపించారు. బెంగళూరు శివారు యలహంకలో జనతాదళ్ ఏర్పాటుచేసిన 'వికాస పర్వ' సమావేశంలో ఆమె ప్రసంగించారు. కర్ణాటకలో రానున్న ఎన్నికల్లో దళ్- బీఎస్పీ ఎన్నికల పొత్తు కుదిరిన నేపథ్యంలో శనివారం ఈ సభ నిర్వహించారు. దళితుల విషయంలో కాంగ్రెస్, భాజపా నాటకం ఆడుతున్నాయని మాయావతి మండిపడ్డారు. భాజపా అధికారంలోకి వచ్చాక గుజరాత్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లో దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయని ఆందోళన చెందారు. ఈ విషయంలో కాంగ్రెస్ మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. జీఎస్టీ అమలు, పెద్దనోట్ల రద్దు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.


వీజీఎన్ సంస్థ స్థిరాస్తులు జప్తుచేసిన ఈడీ

విలువ రూ.115 కోట్లు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: వీజీఎన్ సంస్థకు చెందిన రూ.115కోట్ల విలువైన స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జప్తుచేసింది. ఈ మేరకు ఈడీ జాయింట్ డైరెక్టరు కేఎస్‌వీవీ ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. అందులోని వివరాల ప్రకారం.. ప్రభుత్వ రంగ సంస్థ అయిన హిందుస్థాన్ టెలీప్రింటర్స్ లిమిటెడ్(హెచ్‌టీఎల్) చెల్లించాల్సిన సొమ్మును రాబట్టుకోవడానికి భారతీయ స్టేట్‌బ్యాంకు(ఎస్బీఐ) ఆ సంస్థకు చెందిన గిండీలోని 10.46ఎకరాల స్థలాన్ని 2013లో వేలానికి పెట్టింది. దాన్ని అప్పుడు వీజీఎన్ సంస్థ కొనుగోలు చేసింది. కానీ, హెచ్‌టీఎల్ ప్రతినిధులతో వీజీఎన్ డెవెలపర్స్ రహస్య ఒప్పందం కుదుర్చుకొని రూ.387కోట్ల విలువైన స్థలాన్ని రూ.272 కోట్లకే చేజిక్కించుకుంది. ఫలితంగా ప్రభుత్వానికి రూ.115కోట్ల నష్టం వచ్చింది. అభియోగంపై గతంలో సీబీఐ, ఏసీబీలు కేసులు నమోదు చేశాయి. ఈ క్రమంలో వీజీఎన్ సంస్థ స్థిరాస్తులను ఈడీ జప్తు చేసింది.

సినిమా పరిశ్రమను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు: అంబికా కృష్ణ

తెనాలి, న్యూస్‌టుడే: తెలుగు సినిమా పరిశ్రమను అమరావతికి తరలించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నామని రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ అంబికా కృష్ణ తెలిపారు. శనివారం నంది నాటకోత్సవాలను తిలకించేందుకు తెనాలి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. సినిమా పరిశ్రమను రాష్ట్రానికి తీసుకు రావాలనే కోరిక బలంగా ఉన్నప్పటికీ పరిస్థితులు అనుకూలించక ఆలస్యం అవుతోందన్నారు. ముందుగా చిన్న సినిమాల చిత్రీకరణలన్నా జరిపే విధంగా చర్చలు జరుపుతున్నామన్నారు. విశాఖ, అమరావతి, తడ ప్రాంతాల్లో స్టూడియోల నిర్మాణాలకు చర్యలు చేపట్టామన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఎన్.టి.ఆర్ టీవీ, సినిమా నట శిక్షణాలయాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాబోయే సంవత్సరం నుంచి లఘు చిత్రాలను నంది పోటీల్లో చేర్చుతామన్న ఆయన ఈ ఏడాదికి మార్చిలో విజయవాడలో అమరావతి లఘుచిత్రోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. నాటక అకాడమీ అధ్యక్షుడు గుమ్మడి గోపాలకృష్ణ, ఎఫ్.డి.సి. జీఎం శేషసాయి, తెనాలి పురపాలక సంఘం ఛైర్మన్ పెండేల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శనివారం చెన్నై కొరట్టూరులోని భక్తవత్సలం విద్యాశ్రమం పాఠశాల విద్యార్థులు ఇలా 'ఓం' ఆకారంలో నిల్చొని అలరించారు

ఈనాడు

ముక్కెరపై మక్కువ

దేహాన్ని దేవాలయంగా భావించడం భారతీయ సంప్రదాయం. పరిశుభ్రంగా ఉంచుకోవడం మన ఆచారం. రకరకాల ఆభరణాలతో, లేపనాలతో ముస్తాబు చేయడం మన సంస్కృతి. ఈ సంస్కృతీ సంప్రదాయాల వెనక సౌందర్య దృష్టితోపాటు విలువైన ఆరోగ్య సూత్రాలు, ఆధ్యాత్మిక సమన్వయాలు వంటివెన్నో ఉన్నాయి. 'శరీర మాద్యం ఖలు ధర్మసాధనం...' ధర్మ నిర్వహణ నిమిత్తం లభించిన అమూల్య సాధనం మన 'దేహం' అని చాలామంది విశ్వాసం. ఆ నమ్మకంతో శరీరాన్ని విశేషంగా అలంకరించడం జనానికి పరిపాటి. 'భూషలు కావు మర్త్యులకు భూరి మయాంగద తారహారముల్, భూషిత కేశపాశ మృదుపుష్ప సుగంధ జలాభిషేకముల్' అని భర్తృహరి చెప్పినా- రకరకాల ఆభరణాలు, మైపూతల పట్ల ఆసక్తి గణనీయంగా పెరుగుతూనే వస్తోంది. 'సర్వాభరణ భూషితే' అని అమ్మవారికి పేరు. ఆ నగల సంఖ్య 44 అని శాక్తేయం చెప్పింది. అవన్నీ 'సౌభాగ్య విభూతులు' అంది. అంతేకాదు, 'శ్రీచక్రంలో ప్రముఖంగా కనిపించే 44 కోణాలకు అవి ప్రతీకలు' అన్నారు ఆధ్యాత్మికవేత్తలు. అందుకే అలంకారాలు స్త్రీలకే పరిమితం కాలేదు. 'శిరమున పసిడి కిరీటము కరయుగమున శంఖచక్ర మన భూషణముల్ ఉరమున వజ్రపు పతకము' లేని శ్రీవేంకటపతిని ఊహించుకోవడమే కష్టంగా ఉంటుంది. ఆరు మాసాలపాటు యోగనిద్రలోకి జారుకునేటప్పుడూ సిరినాథుడు మెళ్లోని కౌస్తుభమణి హారాన్ని అలాగే అట్టిపెట్టుకున్నాడని శ్రీనాథ మహాకవి సాక్ష్యం చెప్పాడు. 'అభినవ ఉన్మేషజంబ్రైజిత్తి తొలుచూపు...' నిద్ర వదులుతూ వదులుతూ ఉండగా సన్నగా విప్పుతున్న తొలిచూపు 'కౌస్తుభాలోక రేఖలకు నలిగె...' కౌస్తుభ మణికాంతులకు 'నలిగిపోయింది' అంటూ మనోజ్ఞమైన వర్ణన చేశాడు. కాబట్టి ఈ అభిరుచులు, అభిలాషలు మనిషికి దేవతలనుంచి సంక్రమించాయనుకోవాలి.

వీరభద్రారెడ్డి పాలనలో విప్రులెంతో సంపన్నులయ్యారని చెప్పడం కోసం శ్రీనాథుడు 'ధరియింప నేర్చిరి దర్భవెట్టెడి వ్రేళ్ల లీల మాణిక్యాంగుళీయకములు' అన్నాడు. సువర్ణం అంటే మంచి రంగు అని అర్థం. సువర్ణం మించిన రంగు లేదన్న భావంతో బంగారానికి సువర్ణమని పేరు స్థిరపడింది. వేదకాలం నాటికే ఈ గుర్తింపు ఉందనడానికి 'హిరణ్య వర్ణాం హరిణీం సువర్ణ రజత స్రజామ్' అంటూ మొదలయ్యే శ్రీసూక్తం గట్టి ఆధారం. శరీరం బంగారం రంగులో ఉండటం స్త్రీ పురుషులకు ఇద్దరికీ ఇష్టమే! నన్నయభట్టు కర్ణుణ్ని 'సాల ప్రాంశువు సువర్ణ వర్ణున్ మనున్' అని, అర్జునుణ్ని 'హరి విచిత్ర హేమ కవచావృత దేహుని'గా వర్ణించడంలో రహస్యం అదే! వేదం శ్రీమహావిష్ణువును 'హిరణ్యగర్భుడు' అంది. ఆదిత్య హృదయం సూర్యుణ్ని 'స్వర్ణమూర్తి'గా వర్ణించింది. చేత వెన్న ముద్ద చెంగల్వ పూదండలో సరిపెడితే చాలదు బాలకృష్ణుడికి- బొజ్జను కరిచి పట్టున్న 'బంగారు మొలతాడు'తోనే ప్రత్యేక ఆకర్షణ. ఇప్పుడంటే వజ్రాలపై మోజు పెరిగి సువర్ణం కాస్త వన్నె తగ్గింది కాని, పది తులాల పగ్గం లాంటి బంగారు గొలుసు మెళ్లో ఉంటే ఎంత ధీమాగా, దర్జాగా ఉండేది! రోజూ ఎనిమిది బారువుల బంగారాన్ని ప్రసాదించే శ్యమంతకమణి తన ఇంట కొలువు తీరిందన్న మహా అభిజాత్యంతోనే కదూ- 'సౌవర్ణ కంకణ ఝణఝణ నినదంబు శింజినీ(వింటినారి) రవముతో చెలిమి సేయ' కదనరంగానికి సైతం కదిలే నగల దుకాణంలా, పేరంటానికన్నట్లు సత్య పోగలిగింది! ఒంటినిండా సొమ్ములు దిగేసుకొనే అలవాటు ఉండబట్టే కదా- గోగ్రహణంలో ఓడిన సుయోధనుణ్ని 'మణిమయంబైన భూషణ జాలముల నొప్పి ఒడ్డోలగంబున (సభలోనే పడి) ఉండగలదె' అంటూ అర్జునుడు ఎగతాళి చేయగలిగింది!

రాగి, వెండి, బంగారం వంటి లోహాలు నాడీమండలాన్ని ఉత్తేజితం చేస్తాయని అటు శాస్త్ర విజ్ఞానమూ నిరూపించింది. పండుగపూట చిట్టితల్లులు పట్టు పరికిణీలు కట్టి వాటి అంచులకు మట్టి అంటకుండా పైకి ఎత్తిపట్టి ఘల్లుమంటూ వెండి పట్టీలు సవ్వడి చేస్తుండగా నట్టింట ఆరిందాల్లా తిరుగుతూంటే కళ్లకూ చెవులకూ విందు. 'మంజీర మణిరాజ పుంజాగత స్వచ్ఛ శింజాన మాధుర్య మంజిమములు' అంటూ బేతవోలు కవి ఆ అందెల రవళిని మన చెవులకు చేర్చారు. ముక్కెరకు, చెవి పోగులకు మాత్రం బంగారమే ఆనవాయితీ. ముక్కెర మంగళసూత్రంకన్నా చాలా ముందుకాలం నాటిది. ముక్కుపుడక అడ్డకమ్మ నత్తు బాసర ముంగర బులాకీ బేసరి ముక్కెర... అంటూ పిలుచుకొనే నాసికాభరణం ఆడవారి అయిదోతనానికి గుర్తు. ఉత్తర దేశంలో పాపిట సిందూరం లాగే దక్షిణాదిన ముక్కెర, కాలిమెట్టెలు ఇల్లాలితనాన్ని సూచిస్తాయి. అందుకే తన తమ్ముడు నిగమశర్మ తన ముంగరను దొంగిలిస్తే 'క్రొత్తగా చేయించుకొన్న ముక్కెరకునై అడలు దుర్వారయై ఆడబిడ్డ' భోరున విలపించిందని పాండురంగ మాహాత్మ్యంలో తెనాలి రామకృష్ణుడు వర్ణించాడు. విని నేర్చుకొనే చదువులు(వేద విద్యలు) చెవికెక్కడానికి దోహదం చేసే చెవిపోగులూ(బావగారివి) నిగమశర్మ ఎత్తుకెళ్లాడు. 'జామాత వెతబొందు వ్యామోహియై నవగ్రహ కర్ణవేష్టన(నవరత్నాలు పొదిగిన) భ్రంశమునకు' కారణమయ్యాడు. స్త్రీలకు ముక్కెరలు, పురుషులకు చెవిపోగులు అలంకారాలు కావు, అవసరాలు! పాశ్చాత్యులు ఈ విషయం బాగా గ్రహించారు. అమెరికాకు చెందిన యోగశిక్షకురాలు ఆండ్రస్ వోర్‌మెల్ నేతృత్వంలో భారతదేశ పర్యాటకులుగా వచ్చిన అక్కడి మహిళా న్యాయమూర్తులు ముచ్చటగా ముక్కులు కుట్టించుకొని పసిడి ముక్కెరలు ధరించి 'ముక్కు చూడు ముక్కు అందం చూడు ముక్కున ఉన్న ముక్కెర చూడు' అని తెగ మురిసిపోవడం అందుకు తాజా ఉదాహరణ. వారి చర్యతో 'అలనాటి వెలలేని ఆచారముల పట్ల ఆదర భావములంకురించె' అంటున్నారు సంప్రదాయవాదులు.









వృథా అరికడితేనే అందరికీ ఆహారం

ఉద్యమ స్ఫూర్తితో కదలాల్సిన తరుణం

పేదరికం, ఆకలి, పోషకాహార లోపాలను అరికట్టడంలో ప్రపంచం నిస్సందేహంగా పురోగతి సాధిస్తోంది. ఐక్యరాజ్య సమితి సహస్రాబ్ది లక్ష్యాలను (ఎండీజీ) విజయవంతంగా అందుకోవడం వల్ల 1990-2014 మధ్య ప్రపంచంలో పోషణ లేక కృశించినవారి శాతం 23 నుంచి 13 శాతానికి తగ్గిపోయింది. కానీ, ఈ విజయాన్ని అందుకోవడం అన్ని దేశాలకూ సాధ్యపడలేదు. సహారా ఎడారి దిగువనున్న ఆఫ్రికా దేశాల్లో, దక్షిణాసియాలో ఇంకా 80 కోట్ల మంది పేదలు సరైన ఆహారం దొరక్క అల్లల్లాడుతున్నారు. భారతదేశంలో అయిదేళ్లలోపు వయసు పిల్లల్లో 4.8 కోట్ల మంది ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారంటే కారణం- పౌష్టికాహార లోపమే. ఈ దుస్థితిని అధిగమించడానికి ఐక్యరాజ్య సమితి ఎండీజీల తరవాత 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనపై దృష్టి కేంద్రీకరించింది. వీటిలో మొదటి రెండు ఎస్‌డీజీలు 2030 కల్లా పేదరికం, ఆకలి, పోషకాహార లోపాలను పూర్తిగా నిర్మూలించాలని లక్షిస్తున్నాయి. ప్రస్తుతం ఏయే ప్రాంతాల్లోనైతే ఆకలి తాండవిస్తోందో సరిగ్గా అవే ప్రాంతాల్లో జనాభా పెరిగిపోతున్న దృష్ట్యా పై ఎస్‌డీజీలను సాధించడం అంత తేలిక కాదు. 2017 మొదట్లో 750 కోట్లుగా ఉన్న ప్రపంచ జనాభా 2050 కల్లా 950 కోట్లకు పెరగనుంది. అదనంగా 200 కోట్ల మందికి సరిపడా ఆహారాన్ని ఉత్పత్తి చేయడం ఒక ఎత్తయితే, ఇప్పటికే ఆకలితో అలమటిస్తున్న 80 కోట్ల మంది పేదల కడుపు నింపడం మరొకెత్తు. నిజానికి ఇప్పుడు ఉత్పత్తి అవుతున్న ఆహారంతోనే ప్రపంచ జనాభా అవసరాలను తీర్చవచ్చు. మున్ముందు జన్యుమార్పిడి పంటలు, సునిశిత (ప్రెసిషన్) వ్యవసాయం వంటి అధునాతన పద్ధతులతో ఆహారోత్పత్తిని ఇబ్బడి ముబ్బడిగా పెంచవచ్చు కానీ, భూతాపం వల్ల వాతావరణంలో వస్తున్న విపరీత మార్పులు వ్యవసాయానికి పెను సవాళ్లు విసరనున్నాయి.

పొంచి ఉన్న సవాళ్లు

భవిష్యత్తులో ఆహారోత్పత్తిని పెంచేలోపు ఆహార వృథాను అరికడితే కోట్లాది ప్రజల ఆకలి బాధ తీర్చవచ్చు. ఐక్యరాజ్య సమితి ఆహార, వ్యవసాయ విభాగం (ఎఫ్ఏఓ) అంచనా ప్రకారం నేడు ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న ఆహారంలో ఏటా మూడో వంతు (130 కోట్ల టన్నులు) వృథా అయిపోతోంది. ఒక కిలో బియ్యం లేక గోధుమల ఉత్పత్తికి 1,500 నుంచి 3,500 లీటర్ల నీరు అవసరమని గుర్తుంచుకోవాలి. ఒక కిలో మాంసం ఉత్పత్తికి 5,000 నుంచి 20,000 లీటర్ల నీరు అవసరపడుతుంది. ఈ లెక్కన 2050 కల్లా 170 కోట్లకు చేరనున్న భారత జనాభా ఆహార అవసరాలు తీర్చడానికి ఎంత భారీ పరిమాణంలో నీరు కావాలో తలచుకుంటే కలవరం కలుగుతుంది. ప్రపంచంలో ప్రస్తుతం మానవులు ఏటా వినియోగిస్తున్న 3.8 లక్షల కోట్ల ఘనపు మీటర్ల నీటిలో 70 శాతం వ్యవసాయానికే మళ్లుతోంది. 2050 కల్లా ప్రపంచ జనాభా అవసరాలను తీర్చాలంటే ఇంతకు మూడు రెట్లు ఎక్కువ నీరు అవసరపడుతోంది. మనం వాడకుండా పారవేసే ఆహారం వెనక అమూల్యమైన భూ, నీటి వనరుల దుబారా దాగి ఉంది. ఉదాహరణకు నేడు వ్యర్థమవుతున్న 130 కోట్ల టన్నుల ఆహారం వెనక 140 కోట్ల హెక్టార్ల భూమి ఉంది.

ఇప్పటికే ఆహారోత్పత్తి కోసం అటవీ భూములను పంట పొలాలుగా మార్చేయడం, భూగర్భ జలాలను తోడేయడం, అశాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించడం వల్ల భారత్‌లో 45 శాతం భూములు సారం కోల్పోయాయి. పెరుగుతున్న జనాభాకు ఆహారం సమకూర్చాలంటే మరింత పెద్దయెత్తున భూమి, నీటి వనరులు అవసరమవుతాయి. ఇప్పటికే భారత్‌లో సాగు, తాగు నీటికి కటకట ఏర్పడి అంతర్రాష్ట్ర వివాదాలు ముదురుతున్న దృష్ట్యా వ్యవసాయానికి భారీయెత్తున నీటి సరఫరా చేయగలమా అంటే సందేహమే. ఈ విషయంలో ప్రజలను అప్రమత్తం చేయడం కోసమే గత ఏడాది అక్టోబరు 16న 'వాతావరణం మారుతోంది. ఆహారం, వ్యవసాయమూ మారాలి' అనే ఇతివృత్తంతో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని జరుపుకొన్నాం. ఈ మార్పుల్లో అన్నింటికన్నా ముందు రావలసినది- ఆహార వృథాను అరికట్టడం. మన దేశంలో ఏటా రూ.58,000 కోట్ల విలువైన ఆహారం వృథా అవుతోంది. ఇది బ్రిటన్ ప్రజలు ఒక్క ఏడాదిలో తినే ఆహారానికి సమానం. ప్రపంచ ఆహారోత్పత్తిలో 50 శాతం వృథా అవుతుంటే, భారత్‌లో 40శాతం చెత్త కుండీల్లోకి చేరుతోందని 2015లోనే ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) లెక్కగట్టింది. 2014 ప్రపంచ ఆకలి సూచీలో 55వ స్థానంలో ఉన్న భారతదేశం 2017లో 100వ స్థానానికి పడిపోయిందంటే, ఆహార వృథా ఎంత క్షంతవ్యం కాని నేరమో అవగతమవుతుంది. పంట పొలం నుంచి భోజనాల బల్ల వరకు జరుగుతున్న నష్టమిది. ఉద్దేశపూర్వకంగానో, కాకతాళీయంగానో జరిగే ఈ తరహా నష్టాలను అందరూ కలిసికట్టుగా అరికట్టాల్సిన అవసరం ఉరుముతోంది. పంట నూర్పిళ్లు మొదలుకొని, నిల్వ, ప్యాకింగ్, రవాణా, మార్కెటింగ్ వరకు అన్ని అంచెల్లో ఆహారం వృథా అవుతోంది.

గోతుల్లో, కుండీల్లోకి చేరిన ఆహార వ్యర్థాలు కుళ్లిపోయేటప్పుడు భూతాప కారక వాయువులను వెలువరిస్తాయి. ప్రపంచంలో భూతాప ఉద్గారాలను వెదజల్లడంలో అమెరికా, చైనాల తరవాతి స్థానాన్ని వ్యర్థాహారమే ఆక్రమిస్తోంది. ఆహార వృథాను అరికట్టడానికి ప్రపంచంలో మొదటిసారిగా ప్రత్యేక చట్టం తీసుకొచ్చిన దేశం ఫ్రాన్స్. అక్కడ ఏటా 1.8 శాతం ఆహారం మాత్రమే వృథా అవుతుండగా, 2025 కల్లా దాన్ని కూడా సగానికి సగం తగ్గించాలని ఫ్రెంచి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఆహార వృథాను నిర్మూలించడంతోపాటు పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులు పాటించడంలో ప్రజలకు పోషకాహారాన్ని అందించడంలో ఫ్రాన్స్ తరవాతి స్థానాలను జపాన్, జర్మనీ, స్పెయిన్, స్వీడన్‌లు ఆక్రమిస్తున్నాయి. ఆహారాన్ని విరాళంగా ఇచ్చేవారికి పన్ను మినహాయింపునిస్తూ 2015లో అమెరికా ఒక చట్టం తెచ్చింది. ఆహారాన్ని పునర్వినియోగించే వ్యాపారాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తోంది. ఇటలీలోనూ ఆహార విరాళిచ్చే వ్యాపార సంస్థలకు ప్రోత్సాహకాలు లభిస్తాయి. అక్కడ ఏటా పది లక్షల టన్నుల ఆహార వృథాను అరికట్టడానికి కోటి డాలర్లను కేటాయిస్తున్నారు. వాల్‌మార్ట్, నెస్లే, కెలోగ్స్, యూనీలీవర్, టెస్కో, క్యాంప్‌బెల్ సూప్ వంటి భారీ ఆహార విక్రయసంస్థలు ఇకపై తాము విక్రయించే ఆహారం గడువు తేదీలను ప్రజలకు స్పష్టంగా కనిపించేట్లు ముద్రించాలని నిశ్చయించాయి. ఈ తేదీల ముద్రణకు అందరూ ప్రామాణిక పద్ధతిని అనుసరించాలని అంగీకారం కుదిరింది. ఆహార వృథాను అరికట్టాలనే సంకల్పం దృఢంగా ఉంటే అది అసాధ్యం కాదని ఆహార విక్రయ గొలుసు సంస్థలు ఇప్పటికే నిరూపించాయి కూడా. ఉదాహరణకు వినియోగదారులు వంకర టింకరగా ఉండే క్యారట్లను తినకుండా అవతల పారేస్తున్నారని గమనించిన సంస్థలు బేబీక్యారట్‌ల సాగును ప్రోత్సహించి వృథాను విజయవంతంగా అరికట్టగలిగాయి. ఇలాంటి నవీకరణలు మరిన్ని రావడానికి ప్రభుత్వం, వ్యాపార సంస్థలు తమ కృషిని ముమ్మరం చేయాలి.

> ### ఫ్రాన్స్ ఆదర్శం
>
> ఫ్రాన్స్‌లో సూపర్ మార్కెట్లు, రెస్టారెంట్లు ఆహార పదార్థాలను బయట పారేయడం చట్టరీత్యా నిషిద్ధం. తినగా మిగిలిపోయిన ఆహారాన్ని ఖాతాదారులు ఇంటికి తీసుకెళ్లడానికి ఫ్రెంచి రెస్టారెంట్లు కాగితం సంచులను అందించాలని చట్టం నిర్దేశిస్తోంది. సూపర్ మార్కెట్లయితే గడువు తీరిన ఆహారాన్ని సేంద్రియ ఎరువుగా మార్చడం కోసం రైతులకు పంపాలి. తినదగిన ఆహారాన్ని పారవేయదలచుకుంటే వితరణ సంస్థలకు అందించాలి. కెనడాలో సూపర్ మార్కెట్లు, రెస్టారెంట్లతోపాటు చిల్లర వర్తకులు, ఉత్పత్తిదారులు, క్యాటరింగ్ సంస్థలు కూడా తమ వద్ద మిగిలిపోయిన ఆహారాన్ని వితరణ సంస్థలకు ఇస్తున్నాయి. ఈ పద్ధతిలో రోజుకు 22,000 మందికి అన్నపానాలు సమకూర్చగలుగుతున్నారు. ఆహారాన్ని సక్రమంగా శుద్ధిచేసి, పునర్వినియోగార్హంగా మారిస్తే ప్రపంచంలో 11 శాతం జనాభా కడుపు నింపవచ్చు.
>
> 

సామాజిక బాధ్యత

భారత ప్రభుత్వం కూడా రెస్టారెంట్లు, స్టార్ హోటళ్లలో ఆహార వడ్డన పరిమాణాలను నిర్దేశించాలని ప్రతిపాదిస్తోంది. ఆహారాన్ని పారేయడమంటే పేదలకు అన్యాయం చేయడమేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో వివరించిన తరవాత ఈ ప్రతిపాదన ముందుకొచ్చింది. మరోవైపు కొన్ని స్వచ్ఛంద సంస్థలూ రంగంలోకి దిగాయి. 2014లో దిల్లీలో ఆరుగురు మిత్రులు ఏర్పరచిన రాబిన్ హుడ్ ఆర్మీ అనే సంస్థ గురించి ఇక్కడ చెప్పాలి. దీని తరఫున స్వచ్ఛంద కార్యకర్తలు దిల్లీలో ఒక రాత్రి రెస్టారెంట్లకు వెళ్లి సేకరించిన నిరుపయోగ ఆహారంతో 100 మంది పేదల కడుపు నింపారు. సామాజిక మాధ్యమాల్లో చేసిన ప్రచారం వల్ల నేడు ఈ సంస్థ 500 మంది స్వచ్ఛంద సేవకులతో 13 భారతీయ నగరాలకు వ్యాపించడమే కాదు, పాకిస్థాన్‌కూ పాకింది. కేరళలోని కొచ్చిలో మినూ పాలైన్ అనే మహిళ తన రెస్టారెంట్ ముంగిట 420 లీటర్ల రిఫ్రిజిరేటర్‌ను నెలకొల్పారు. పేదలకు ఆహార విరాళం ఇవ్వదలచినవారు దాన్ని ఈ ఫ్రిజ్‌లో భద్రపరచవచ్చు. బెంగళూరులోనూ ఒక రెస్టారెంట్ ఇలాంటి ఏర్పాటుచేసింది. వ్యక్తులు కూడా తమ తమ స్థాయిలో ఆహార వృథాను అరికట్టడానికి కృషిచేయాల్సిన సమయం వచ్చేసింది. మన పట్టణాలు, నగరాల్లో 20 శాతం ఆహారాన్ని పారేస్తున్నట్లు అంచనా. ఇకనుంచి తమకు కావలసిన మేరకే కొనుగోళ్లు జరపడం అలవాటుచేసుకోవాలి. చెడిపోయిన ఆహారాన్ని సేంద్రియ ఎరువుగా మార్చి పెరటి మొక్కలకు వేయాలి. ప్రభుత్వం దేశమంతటా నెలకొల్పుతున్న 42 మెగా ఆహార పార్కుల్లో తేలిగ్గా చెడిపోయే ఆహారాన్ని నిల్వచేయడానికి ప్రత్యేక కృషి జరగనుంది. మన పెళ్లిళ్లు, ఇతర విందుల్లో వడ్డిస్తున్న ఆహారంలో 20 శాతం వృథా అయిపోతోంది. దీన్ని నివారించడం మీద కొన్ని స్వచ్ఛంద సంస్థలు దృష్టి పెడుతున్నాయి. విందుల్లో మిగిలిపోయిన ఆహారాన్ని మురికివాడ వాసులకు అందజేస్తున్నాయి. ఈ విధంగా వ్యక్తుల నుంచి సంస్థల వరకు ఉద్యమ స్ఫూర్తితో కృషిచేసి తలసరి ఆహార వృథాను తగ్గిస్తే ఆకలిపై పోరులో కచ్చితంగా విజయం సాధించగలుగుతాం!

– కైజర్ అడపా



పీవీ రావు

పౌరధర్మం నిర్వర్తించలేమా?

'నాగరిక ప్రవర్తనలో మన భారతీయులు మరీ ఇంత దిగనాసిగా ఉంటారేం?' అని మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఒక సందర్భంలో ప్రశ్నించారు. స్వదేశంలో తమ కుక్కతో కాలిబాటపై మూత్ర విసర్జన చేయించడానికి సందేహించని భారతీయులు, సింగపూర్ వెళితే మాత్రం ఎంతోబుద్ధిగా మసలుకొంటారు. అక్కడ బస్సు టికెట్‌ను కూడా రోడ్డుమీద పారేయకుండా అతి జాగ్రత్త పాటిస్తారు. దీన్నిచూసే కలాం ఆ ప్రశ్న వేశారు.

ఆచరణ అవసరం

మన నాగరికత ఎంతో ప్రాచీనం, మహోన్నతమని గర్విస్తాం. కానీ నగరాలు పట్టణాల్లో కుప్పలుతెప్పలుగా చెత్త పేరుకున్నా మనం పట్టించుకోం. కాలుష్యం, అవినీతి కట్టలు తెంచుకుంటూ ఉంటే నిస్సహాయంగా చూస్తూ ఉంటాం. ఈ వైరుధ్యం విదేశీ పర్యాటకులపై చెరగని ముద్రవేస్తోంది. భారత్ నేడు ప్రపంచంలో అతివేగంగా అభివృద్ధి చెందుతున్న దేశమైనప్పటికీ మన పౌరులు ఇంకా పూర్తిస్థాయిలో నాగరిక ప్రవర్తన అలవరచుకోకపోవడం చింతించాల్సిన విషయం. మానవులు సంఘజీవులు. సమాజంలో ఎలా మెలగాలో తెలుసుకోవడం నాగరికతకు తొలి మెట్టు. సభ్యత, సంస్కారం అలవరచుకోవడం, స్త్రీలు వృద్ధులపట్ల గౌరవంగా మెలగడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, రోడ్లమీద అదేపనిగా హారన్ మోగించి ఇతరులను చికాకు పెట్టకపోవడం, నిర్దేశిత స్థలాలు లేదా డబ్బాల్లోనే చెత్త పారేయడం, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయకపోవడం, రహదారులు, బహిరంగస్థలాలు, కార్యాలయాలను శుభ్రంగా ఉంచడం, నీరు, విద్యుత్‌లను పొదుపుగా వాడటం, పన్నులు సక్రమంగా చెల్లించడం... ఇవన్నీ నాగరిక ప్రవర్తనలో, సామాజిక స్పృహలో అంతర్భాగాలే. కానీ, మన పట్టణాలు, నగరాల్లో ఎక్కడ చూసినా చెత్తతో పొంగిపొర్లే కుండీలు, నాలాలు, రోడ్డు పక్కన మలమూత్ర విసర్జన, చెత్తకుప్పలు, జర్దా నమిలి ఊసిన మరకలు, రోడ్ల మీద రవాణారద్దీ, ప్రధాన రహదారుల పక్కన కానరాని ఫుట్‌పాత్‌లు, గోడలమీద అసభ్య రాతలు, జనానికి ఒద్దికగా బారులు కట్టే అలవాటు లేకపోవడం వంటి సంస్కారహీన చర్యలే కనిపిస్తాయి. పేదలైనా, ధనికులైనా తమ ఇల్లు శుభ్రంగాఉంటే చాలనుకుని, చెత్తను రోడ్లమీద పారేస్తారు. క్రమశిక్షణ లేని స్వేచ్ఛ అరాచకానికి దారితీస్తుంది. మన రహదారులు మురికి తేలాయంటే ప్రధాన కారణం, వాటిని





పురపాలక సంఘం శుభ్రం చేయకపోవడం కాదు- దానికన్నా ముందు మనం రోడ్లను కంగాళీ చేయడమే!

వందల ఏళ్ల క్రితం భారత ఉపఖండంలో హరప్పా, మొహంజొదారో వంటి పురాతన నగరాలు ఎంతో శుభ్రంగా, ప్రణాళికాబద్ధంగా ఉండేవి. ఆధునిక యుగానికి వచ్చేసరికి వీధుల్లో చెత్త, నాలాల్లో ప్లాస్టిక్ సంచులు పేరుకుపోయి ముంబయి, చెన్నై, హైదరాబాద్ తదితర నగరాలు చినుకు పడితే చాలు- వరదనీటిలో మునకలేస్తున్నాయి. మన నగరాల్లో మురికికాల్వల పక్కన బోలెడన్ని తినుబండారాల బండ్లు, ఐస్‌క్రీమ్ బండ్లు కనిపిస్తాయి. వినియోగదారులు వదలిన ఖాళీపళ్లాలు, మిగిలిపోయిన ఆహార పదార్థాలు నేరుగా నాలాల్లోకి చేరుతున్నాయి. వాటిలో పుట్టే ఈకోలీ వంటి రోగకారక బ్యాక్టీరియా మళ్ళీ తినుబండారాల్లోకి చేరిపోతున్నాయి. ముంబయి సబర్బన్ రైళ్ల మార్గంలో ఏటా వేలమంది మరణిస్తున్నా, చీమకుట్టినట్లైనా లేని సమాజానికి నాగరిక స్పృహ ఉందని ఎలా అనుకోగలం? వీరిలో చాలామంది తలుపుల్లేని సబర్బన్ రైళ్లలో తోపులాట వల్ల, తోటి ప్రయాణికుల దురుసు ప్రవర్తనవల్ల మరణించినవారే. చట్టసభల్లో ప్రజాప్రతినిధుల తోపులాటలే కాదు, పిడిగుద్దులకు దిగిన ఉదంతాలూ అనేకం. కాబట్టి మనదేశం నైతికంగా సమున్నతమైనదని గొప్పలు చెప్పుకోవడం తగ్గించి, మొదట మన వ్యక్తిగత ప్రవర్తనను సంస్కరించుకోవాలి.

రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య ప్రపంచంలోకెల్లా భారత్‌లోనే ఎక్కువని అధ్యయనాలు చాటుతున్నాయి. రోడ్డు ప్రమాదాలవల్ల దేశంలో ప్రతి 3.6 నిమిషాలకు ఒక ప్రాణం పోతోంది. వీటివల్ల జరుగుతున్న ఆర్థికనష్టం మన జీడీపీలో మూడు శాతానికి సమానం. ఇతర దేశాల్లో రోడ్డు ప్రమాదాలైతే ఆదుకోవడానికి బాటసారులు స్వయంగా ముందుకొస్తారు లేదా సహాయ సంస్థకు సమాచారం అందిస్తారు. అదే భారతదేశంలో ఏదైనా ప్రమాదం జరిగితే బాటసారులు, వాహన చోదకులు చోద్యం చూసినట్లు చూసి, తమ దారిన తాము పోతారే తప్ప సాయపడటానికి ముందుకు రారు. మనలో నాగరిక ప్రవర్తన ఏ తీరున ఉందో చెప్పడానికి ఇంతకన్నా వేరే ఉదాహరణ అక్కర్లేదు. ప్రాథమిక విధుల గురించి టీవీ ఛానళ్లు, వార్తా పత్రికల ద్వారా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించే విషయం పరిశీలించాలని న్యాయస్థానాలు ప్రభుత్వాలను కోరుతున్నాయి. దీనికితోడు ఏటా ప్రాథమిక విధుల దినోత్సవం జరిపే విషయమూ ఆలోచించాలి. విద్యార్థులు ఈ విధులను పాటించేలా చిన్ననాటి నుంచే ఉపాధ్యాయులు నూరిపోయాలి.

అపరాధానికి శిక్షలు

అధునాతన టెక్నాలజీ సాయంతో విస్తరించిన ప్రపంచీకరణ మన ఆర్థిక, సామాజిక జీవితాలను సమూలంగా మార్చేస్తోంది. పౌర బాధ్యతలంటే ఎన్నికల్లో ఓట్లు వేయడం, ప్రభుత్వ పాత్ర గురించి తెలుసుకోవడం మాత్రమే కాదు- స్థానిక, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకొంటూ తగు కార్యాచరణ రూపొందించుకోవడం కూడా! పలు అంశాలపై సామాన్య ప్రజల దృక్పథాలను మార్చడానికి యువత చొరవ తీసుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో ఈ విధిని బాధ్యతాయుతంగా నిర్వహించాలి. నాయకులు తామూ బాధ్యతగా మెలగడం ద్వారా ప్రజలకు బాధ్యత నేర్పాలి. లండన్, టొరంటో, శాన్‌ఫ్రాన్సిస్కో వంటి నగరాల్లోని కాలనీల్లో ఏదైనా ప్రైవేటు స్థలంలో చెత్త, శిథిలాలు కనిపిస్తే, స్థానికులు వాటి గురించి నగరపాలికకు వెంటనే తెలియజేస్తారు. సంబంధిత వ్యక్తి తక్షణం ఆ చెత్త తొలగించాలి. లేదంటే నగరపాలిక ఒక కాంట్రాక్టర్‌తో చెత్త ఎత్తించి అందుకైన వ్యయాన్ని సంబంధిత పౌరుడి నుంచి వసూలు చేస్తుంది. తన విధులను విస్మరించిన పౌరులు అందుకు మూల్యం చెల్లించేలా భారతదేశమూ చర్యలు చేపట్టాలి.

పౌరులు నాగరికంగా నడచుకొన్నప్పుడు కలిగే ప్రయోజనాలు కేవలం ధనరూపమైనవే కావు- అవి బహుముఖం. మనమంతా ఒక్కటే, అందరి శ్రేయస్సుతోనే వ్యక్తిగత శ్రేయం ముడిపడి ఉందన్న గ్రహింపు నుంచి నాగరిక ప్రవర్తన అలవడుతుంది. చట్టాలు, శిక్షలు మనం నాగరికంగా నడచుకునేలా ఒత్తిడి తెచ్చే మాట నిజమే అయినా, నాగరిక ప్రవర్తన అనేది మనలో నుంచే రావాలి. ప్రతి వ్యక్తీ తాను సక్రమంగా ప్రవర్తిస్తూ ఇతరులు అక్రమ నడతకు పాల్పడకుండా చూడాలి. ఉన్నత జీవనానికి నిలువెత్తు ఉదాహరణగా నిలవాలి!

భక్తి పరిమళం

'పూజ ఓ భక్తి ప్రక్రియ' అని పలువురు భ్రమపడుతుంటారు. లోకంలో పూజ, భక్తి వేర్వేరుగా ఉంటాయి. భక్తిలో పూజ ఉంటుంది కానీ, పూజలో భక్తి ఉండకపోవచ్చు. పూజ అనగానే, దానికి సంబంధించిన వాటిని సిద్ధం చేసుకుంటారు. ఎంత జాగ్రత్తగా ఉన్నా, ఆ సమయంలో ఏదో ఒకటి మరచిపోతుంటారు. ఆ వస్తువు కోసం పూజ మధ్యలో వెతుకుతారు. అందువల్ల వారి ఏకాగ్రత దెబ్బతింటుంది.

అవతల చేయాల్సిన పనుల కోసం పూజను కొందరు హడావుడిగా ముగిస్తుంటారు. అన్నింటికంటే వ్రత కథ వినడం కీలకమని పురాణ గాథలు చెబుతాయి. వ్రత ఫలం గురించి తెలియాలంటే, ఆ కథ వినాలి. ఆ వ్రతం లేదా పూజ ఎందుకు చేస్తున్నదీ గ్రహించాలి. దాన్ని పూర్వం ఎవరెవరు చేసి సత్ఫలితాలు సాధించారో అవగతం చేసుకోవాలి. అప్పుడే ఆ ప్రక్రియపై భక్తిశ్రద్ధలు కలుగుతాయి. అది సార్థక వ్రతమవుతుంది. లేకుంటే, యాంత్రికంగా మారుతుంది.

భక్తుల పూజలు నిగ్రహశక్తి కలిగిస్తాయి. ఇహలోక కర్మానుభవాల్ని భగవంతుడూ ఇష్టంగా స్వీకరిస్తాడు. ఆయనకే తప్పనిది సామాన్యులకు తప్పుతుందా? పూజల వల్ల కర్మఫలాలు తొలగకున్నా- దైవం పట్ల విశ్వాసం, ఏకాగ్ర చిత్తం కలుగుతాయి. 'భక్తితో ఏది సమర్పించినా అనుగ్రహిస్తాను'అనే గీతాబోధను భక్తులు ఎన్నడూ మరువకూడదు.

గుబాళించే పుష్పాల్ని పూజకు వినియోగిస్తారు. దేవతలకు చందన, అగరు ధూపాల పరిమళాల్ని సమర్పిస్తారు. వాటికి ప్రసన్నత కలిగించే సహజ లక్షణం ఉంటుంది. భగవంతుడు పూలు సుగంధద్రవ్యాలతోనే ప్రసన్నుడవుతాడా, వాటిని అర్పించలేని పేద భక్తుల పూజల్ని ఆయన స్వీకరించడా అంటే- అదేమీ కాదు.

సృష్టి అంటే, పరమాత్మ విశ్వరూపమే! ఈ సృష్టికి మనిషి తెలిసీ తెలియక అపచారం చేస్తున్నాడు. పరమాత్మ ప్రసన్నతకు ప్రయత్నిస్తూ, మరో వంక ఆయనకు



అంతర్యామి

ఆగ్రహం కలిగిస్తున్నాడు. భగవంతుడు ఆశించేది భక్తి పరిమళం. అది కేవలం పూలు, సుగంధద్రవ్యాల్లో ఉండదు. భక్తుడు తన మనసునే పరిమళింపజేసుకోవాలి. మనోస్నానం చేయాలి. మనసును శుద్ధం చేసుకోవడమే మనోస్నానం. శరీర కాలుష్యాల్ని నీటితో తొలగించుకోవచ్చు. మనోకాలుష్యాలు అలా కావు. వాటికి ప్రత్యేక ప్రయత్నాలు అవసరమవుతాయి.

మనోకాలుష్యానికి కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే దుర్గుణాలే కారణాలు. ఇవన్నీ ఒకే సర్ప కుటుంబంలా మనోవల్మీకంలో స్థిరనివాసం ఉండి, విషాన్ని వెళ్లగక్కుతుంటాయి. అది హాలాహలం, కాలకూటం కన్నా ప్రమాదకరం. ప్రక్షాళన ఎంత ఆలస్యమైతే, అంత ఎక్కువగా నష్టం కలుగుతుంది. మనసును మనిషి శీఘ్రంగా కాలుష్యరహితం చేసుకోవాలి. అందుకు భారతీయ ఆధ్యాత్మికత అనేక మార్గాలు సూచించింది.

మానవుడి నిత్య దుష్కర్మలు ప్రధానంగా మూడు రకాలు. మనసు, వాక్కు, కర్మలతో అవి అతడికి తెలియకుండానే జరిగిపోతుంటాయి. చెడు ఆలోచించడం పాపానికి మొదటి మెట్టు. చెడు మాట్లాడటం, చేయడం తదుపరి మెట్లు. మనిషి తొలి మెట్టు వద్దనే ఆగిపోవాలి. కనీసం రెండో మెట్టు దగ్గరైనా నిగ్రహం కనబరచాలి. అది దాటాక, కర్మఫలం అనివార్యం.

అపాయం నుంచి తప్పించేదే ఉపాయం. ధ్యాన తత్పరత, సత్సంగం, సేవాధర్మం, ఆర్తుల్ని ఆదుకోవడం వంటివి నవ విధ భక్తులుగా చెబుతారు. వాటిలో అనుకూలమైన పద్ధతి ఎంచుకోవాలి. శుద్ధి చెందిన మనసు ఎంతో తేలికపడుతుంది. అప్పుడు దానికి భక్తి పరిమళాల్ని అద్దాలి. భగవంతుడు ప్రసన్నుడవుతాడు.

ఎన్ని పూజలు చేసినా, క్షణమైనా వీడని దైవచింతనే నిజ భక్తి. దానికి భక్తులు తమ జీవితాల్ని అంకితం చేసినప్పుడే, అంతర్యామి అనుగ్రహం లభిస్తుంది!

– కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

రాంగోపాల్‌వర్మ ల్యాప్‌టాప్ స్వాధీనం

- సైబర్‌క్రైమ్ పోలీసుల విచారణకు హాజరైన వర్మ
- 'జీఎస్టీ' వెబ్ చిత్రంపై ప్రశ్నించిన అధికారులు


హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసుల విచారణకు హాజరైన రాంగోపాల్ వర్మ

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ల్యాప్‌టాప్‌ను హైదరాబాద్ సైబర్ నేరాల విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 'గాడ్, సెక్స్ అండ్ ట్రూత్(జీఎస్టీ)' వెబ్ సిరీస్ చిత్రంలో అసభ్యత, అశ్లీల దృశ్యాలున్నాయన్న ఫిర్యాదుతో ఆయనపై కొద్దిరోజుల క్రితం పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు హాజరవ్వాలంటూ సైబర్‌క్రైమ్ అధికారులు తాఖీదులు పంపడంతో శనివారం వర్మ సైబర్ క్రైమ్ ఠాణాకు వచ్చారు. అదనపు డీసీపీ రఘువీర్ సమక్షంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 3.30 గంటల వరకూ పోలీసు అధికారులు ఆయనను విచారించారు. 25 నుంచి 30 ప్రశ్నలు సంధించారు. కొన్ని ప్రశ్నలు సాంకేతికంగా ఉండటంతో తనకు అంతగా పరిజ్ఞానం లేదని వర్మ చెప్పడంతో సీఆర్‌పీసీ 41 సెక్షన్ ప్రకారం ఆయనకు తాఖీదులు జారీ చేసి వచ్చే శుక్రవారం రావాలంటూ సూచించారు.

పోలాండ్‌లో చిత్రీకరణ

జీఎస్టీ చిత్రం భారతీయ సంప్రదాయాలను కించపరిచేలా ఉందంటూ పోలీసులు వర్మను ప్రశ్నించగా.. ఆ సినిమా చిత్రీకరణ పోలాండ్, ఐరోపాలో జరిగిందని, భారతీయ చట్టాలు వర్తించవని బదులిచ్చారు. ఫిర్యాదుదారు దేవి తమకు సమర్పించిన ఆధారాల్లో అసభ్యత, అశ్లీలత అంశాలున్నాయని, దీంతోపాటు సామాజిక మాధ్యమాల్లో ప్రచార చిత్రాలు అశ్లీలంగా ఉన్నాయంటూ పోలీసులు వర్మకు తెలిపారు. తాము విచారించాకే ఐటీచట్టం కింద కేసులు నమోదు చేశామన్నారు.

'స్కైప్'తో దర్శకత్వం.. పారితోషికం ఇవ్వలేదు

వెబ్ సిరీస్ చిత్రం రూపకల్పనపై వర్మను పోలీసులు ప్రశ్నించగా.. తాను సినిమాను 'స్కైప్' (అంతర్జాలం ద్వారా ఒకరినొకరు మాట్లాడుకోవడం, చిత్రాలు, వీడియోలు తీయడం) పరిజ్ఞానం ద్వారా దర్శకత్వం వహించానే తప్ప అక్కడికి వెళ్లలేదంటూ ఆయన సమాధానమిచ్చారు. ప్రచార చిత్రాల్లో మీరున్నారనగా.. చిత్రంలో నటించాలని కోరేందుకు పోలాండ్ వెళ్లానని, ఆ సందర్భంగా తీసిన ఫోటో అంటూ వివరించారు. తనకు పారితోషికం ఇవ్వలేదని వర్మ చెప్పారు. దర్శకుడిగా రాంగోపాల్‌వర్మ పేరు ఉన్నందున ఇందులో అసభ్యత, అశ్లీలతకు బాధ్యత వహించాలని చెప్పారు. ఈ చిత్రాన్ని పోలాండ్‌లో తీసినప్పుడు వర్మ అక్కడున్నారా? భారత్‌లోనే ఉన్నారా అనేది తెలుసుకునేందుకు పాస్‌పోర్టును పరిశీలించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ చాంద్‌బాషా తెలిపారు.

సత్య'మియ'జయతే తప్పని తెలీదు..

అశోకచక్రం కింద ఉండే 'సత్యమేవ జయతే' పదాన్ని రాంగోపాల్‌వర్మ తన ట్విటర్ ఖాతాలో సత్య'మియ'జయతే అంటూ పోస్టు చేశారు. 'మియ' అంటే జీఎస్టీ చిత్రంలో నటించిన మియా మాల్కోవా. సత్యమేవ జయతేను ఇష్టానుసారంగా వినియోగించడాన్ని ఈ కేసులో అనుబంధంగా చేర్చారు. ఈ విషయాన్ని వర్మ దృష్టికి తీసుకెళ్లగా.. అలా చేయడం తప్పని తనకు తెలియదన్నారు. టీవీ ఛానెళ్లలో చర్చ జరుగుతున్నప్పుడు 'నువ్వు బాగున్నావ్... నీతో నగ్న చిత్రం తీస్తాను' అని ఉద్దేశంతో మాట్లాడానని వర్మ పోలీసులకు వివరించారు. ఆయన ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు అందులో అంశాలను తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించారు. వర్మపై మహిళా సంఘాలు దాడులు చేస్తాయన్న అనుమానంతో పోలీసులు భారీగా బందోబస్తును ఏర్పాటు చేశారు.


శ్రీవారి ఆలయం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ దంపతులు. చిత్రంలో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు తదితరులు

శ్రీవారి సేవలో జస్టిస్ రంజన్ గొగోయ్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. స్వామి నైవేద్య విరామం అనంతరం స్వామివారిని కుటుంబసమేతంగా కలిసి దర్శించుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. న్యాయమూర్తికి తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి దుర్గారావు స్వాగతం పలికారు. జస్టిస్ రంజన్ గొగోయ్ దంపతులు ఆదివారం మరోమారు శ్రీవారిని దర్శించుకుంటారు.

విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచుతాం: యనమల

ఈనాడు, అమరావతి: 'విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచుతాం..పురపాలక పాఠశాలల తరహాలోనే గ్రామీణ పాఠశాలలను కూడా అభివృద్ధి చేస్తామ'ని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ యువకులను పారిశ్రామిక రంగంలోకి తీసుకురావడంపై ప్రధానంగా దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. సామాజిక, ఆర్థిక సర్వే తయారీపై శనివారం విజయవాడలోని తన నివాసంలో ప్రణాళికాశాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వృద్ధిరేటు బాగున్నా పరిశ్రమల రంగంలో మందగించిందన్నారు. సేవారంగంలో వృద్ధిరేటు ఆశాజనకంగా ఉన్నా పట్టణీకరణ పెరిగితేనే మరింత పురోగతి సాధ్యమవుతుందన్నారు. ఎన్టీఆర్ గృహనిర్మాణంలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లనిర్మాణం వల్ల నిర్మాణ రంగంలో పరిశ్రమలు ఏర్పాటు చేయొచ్చని వివరించారు. తయారీ రంగంలో వృద్ధి పెరగాలంటే మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భారీ, మధ్యతరహా పరిశ్రమలు రాష్ట్రానికి తెచ్చేలా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఆరోగ్య రంగంపై భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నా ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోలేకపోతున్నామన్నారు. వీటిని మరింత మెరుగు పరచి ఆరోగ్య వ్యయాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.


కైలాసగిరి ప్రదక్షిణానికి బయలుదేరిన సోమస్కంధమూర్తి, జ్ఞానాంబిక ఉత్సవమూర్తులు

శాస్త్రోక్తంగా.. కైలాసగిరి ప్రదక్షిణోత్సవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వర స్వామి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం కైలాసగిరి ప్రదక్షిణోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని సోమస్కంధమూర్తి, జ్ఞానాంబిక ఉత్సవమూర్తులకు విశేష అలంకరణలు చేపట్టారు. కైలాసగిరుల చుట్టూ దాదాపు 21 కిలోమీటర్ల పొడవునా సాగిన ప్రదక్షిణోత్సవాన్ని ఆద్యంతం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలి

వీఆర్‌పీఎస్ డిమాండ్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వాల్మీకులను ఎస్టీల్లో చేర్చే బిల్లు బడ్జెట్ సమావేశాల్లోనే పార్లమెంటులో ప్రవేశపెట్టాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్‌పీఎస్) డిమాండు చేసింది. శనివారమిక్కడ సమితి అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్ మీడియాతో మాట్లాడుతూ.. వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చాలన్న డిమాండుతో మార్చి 12న పార్లమెంటు స్ట్రీట్‌లో న్యాయ విజ్ఞాపన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని జిల్లాల్లో ఎస్టీలుగా కొన్ని జిల్లాల్లో బీసీలుగా గుర్తిస్తున్నారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వాల్మీకుల న్యాయబద్ధమైన డిమాండ్‌ను నెరవేర్చాలని బోస్ కోరారు.

రాజమహేంద్రవరంలో ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం

మంత్రి శిద్దా రాఘవరావు వెల్లడి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో రూ.15.20 కోట్ల వ్యయంతో ప్రాంతీయ విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించనున్నట్లు అటవీ శాఖా మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. ఆదివారం ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మొత్తం వ్యయంలో కేంద్రం రూ.6.55 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.8.65 కోట్ల వ్యయం భరిస్తుందని వివరించారు. రాజమహేంద్రవరంలోని బొమ్మూరు మహిళా ప్రాంగణంలోని 5 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

వైరాగ్యమూర్తికి మహామస్తకాభిషేకం

- భక్తజన సంద్రంగా శ్రవణబెళగొళ
- సోమవారం ప్రధానమంత్రి మోదీ రాక

ఈనాడు, శ్రవణబెళగొళ: అహింస, త్యాగాలను లోకానికి చాటి, మానవతకు పట్టం కట్టిన బాహుబలి మహామస్తకాభిషేక మహోత్సవం శనివారం అంగరంగవైభవంగా ప్రారంభమైంది. కర్ణాటకలోని హాసన్ జిల్లా శ్రవణబెళగొళ శివారు వింధ్యగిరిపై వెలసిన 58.8 అడుగుల ఎత్తైన ఏకశిలామూర్తి గోమటేశ్వరుని మస్తకాభిషేక ఘట్టానికి జైనముని అరుణ సాగర స్వామిజి సమక్షంలో శ్రీకారం చుట్టారు. జైన మునులు, ఆచార్యులు, రాజకీయ నాయకులు, దేశ విదేశాల నుంచి వచ్చిన లక్షలాది భక్తులు మహామస్తకాభిషేకాన్ని వీక్షించి పులకించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం బాహుబలిని దర్శించుకుంటారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వామిని నీటితో అభిషేకించారు. దాదాపు ఏడు వందల మెట్లు ఎక్కి ఆయన బాహుబలిని దర్శించుకున్నారు. ఈ నెల 26 వరకూ అభిషేకోత్సవాలు కొనసాగుతాయి. తొలి రోజైన శనివారం 108 కలశాలతో స్వామివారిని అభిషేకించారు. ఆదివారం నుంచి కలశాల సంఖ్య 1008కు పెరగనుంది. సాయంత్రం ఐదు గంటల తర్వాత సర్వదర్శనం ఆరంభమైంది. తొలుత నీటితో అభిషేకించిన తర్వాత కొబ్బరి నీళ్లు, చెరకు రసం, కుంకుమ పువ్వు, చందనం, బియ్యం పిండితో అభిషేకించారు. చివరగా పుష్పవర్షం కురిపించారు.


బాహుబలి విగ్రహం వద్ద భక్తులు

మహామస్తకాభిషేక ప్రథమ కలశాన్ని రాజస్థాన్‌కు చెందిన పారిశ్రామిక వేత్త ఆర్.కె.మార్బుల్ గ్రూప్ యజమాని అశోక్.జి.పాట్ని సొంతం చేసుకున్నారు. ఇందుకు ఆయన రూ.11.61 కోట్లు చెల్లించారు. గత మహామస్తకాభిషేకంలోనూ ఆయన కుటుంబానికి చెందిన వారికే తొలి కలశం దక్కింది. అప్పుడు రూ.1.6 కోట్లు చెల్లించారు. పాట్ని కుటుంబానికి చెందిన 11 మందికి బాహుబలికి అభిషేకం చేసే అవకాశం కల్పించారు. ధర్మస్థల మంజునాథస్వామి ఆలయ ధర్మకర్త వీరేంద్ర హెగ్గడే కూడా అభిషేకించారు. తొలి కలశం ద్వారా వచ్చిన రూ.11.6 కోట్లను శ్రావణబెలగొలలో 200 పడకల ఆసుపత్రి నిర్మించేందుకు ఉపయోగిస్తామని స్థానిక జైన మఠం తెలిపింది. కోల్‌కతాకు చెందిన పంకజ్ జైన్, పరాస్ జైన్‌లు రెండో కలశాన్ని కొనుగోలు చేశారు.

హైకోర్టు సాధనకు మార్చి 9 వరకు ఆందోళనలు

- రాయలసీమ న్యాయవాదుల తీర్మానం

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్న డిమాండు సాధన దిశగా కర్నూలులో శనివారం కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల న్యాయవాదుల సమావేశం జరిగింది. ఐకాస కో-కన్వీనర్ నాగలక్ష్మీ, కన్వీనర్ మస్తాన్ వలీ ఆధ్వర్యంలో 700 మందిపైగా న్యాయవాదులు హాజరై పలు నిర్ణయాలు తీసుకున్నారు. మార్చి 9 వరకు రాయలసీమలోని న్యాయవాదులందరూ విధులు బహిష్కరించి ఆందోళనలు కొనసాగించాలని తీర్మానించారు. ఈనెల 22న ముఖ్యమంత్రి పెనుగొండ పర్యటనలో ఘెరావ్ చేయాలని నిర్ణయించారు. 26న సీమలోని కలెక్టరేట్‌లు, ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల ఎదుట ఆందోళనలు, మార్చి 1న అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నా చేయాలని తీర్మానించారు. మార్చి 2న జాతీయ రహదారుల దిగ్బంధనం, మార్చి 6న చలో శాసనసభ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

గిట్టుబాటు ధర కోసం స్థిరీకరణ నిధి

- ప్రజాసంకల్పయాత్రలో జగన్ హామీ

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు రూ.మూడు వేల కోట్లతో స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా శనివారం ఆయన ప్రకాశం జిల్లా వలేటివారి మండలంలోని బంగారక్కపాలెం నుంచి పోకూరు వరకు నడిచారు. పొగాకు రైతులు జగన్‌ను కలిసి తమ సమస్యలు చెప్పారు. పెట్టుబడులు పెరిగి, కనీస మద్దతు ధర అందక నష్టపోతున్నామని వివరించారు. ఇదే సందర్భంలో మినుములు, సెనగ తదితర పంటలను జగన్ ప్రస్తావిస్తూ రాష్ట్రప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయ్యిందన్నారు. పొగాకు సమస్యలపై లోక్‌సభలో మాట్లాడాలని ఎంపీ వైవీ సుబ్బారెడ్డికి సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు నుంచి 50 మంది న్యాయవాదులు వచ్చి జగన్‌ను కలిశారు. ప్రత్యేకహోదాపై పోరాడాలని కోరారు. 14 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ప్రత్యేకహోదా సాధించే వరకు తమ పోరాటం ఆగదని, కేంద్రం స్పందించకుంటే తమ ఎంపీలు రాజీనామాకు సిద్ధంగా ఉన్నారన్నారు.


జగన్‌కు తమ సమస్యలు చెబుతున్న పొగాకు రైతులు

మత్స్యకార సంఘాల ప్రతినిధులు తమను ఎస్సీల్లో కలపాలని జగన్‌ను కోరారు. ఎస్సీ వర్గీకరణపై మాట్లాడాలంటూ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు జగన్‌ను కలిసే ప్రయత్నం చేయగా, భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో వారు రహదారిపై బైఠాయించి తమ నిరసన తెలిపారు. పోలీసులు వారికి నచ్చచెప్పి పంపించేశారు.

అధికారికంగా అమరజీవి జయంతి, వర్ధంతి నిర్వహించేలా ఆదేశించండి

హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు

ఈనాడు, హైదరాబాద్: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించేలా ఏపీ సర్కారును ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. 'అమరజీవి శ్రీపొట్టిశ్రీరాములు పవిత్రస్మృతి పరిరక్షణ సమితి' వ్యవస్థాపక అధ్యక్షులు జి.వేణుగోపాల్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పర్యటక, సాంస్కృతికశాఖ ముఖ్య కార్యదర్శులను ప్రతివాదులుగా చేర్చారు. మార్చి 16న శ్రీరాములు జయంతిని అధికారికంగా నిర్వహించేలా ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలనీ అభ్యర్థించారు. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణజరిపే అవకాశం ఉంది.

ప్రపంచస్థాయి నైపుణ్య పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: ఈ ఏడాది ఆగస్టులో రష్యాలోని కజాన్ నగరంలో జరగనున్న ప్రపంచస్థాయి నైపుణ్య పోటీల్లో పాల్గొనే అభ్యర్థులను ఎంపిక చేసేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కసరత్తును ప్రారంభించింది. దేశం తరపున పాల్గొనే వారిని ఎంపిక చేస్తున్న జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఏపీఎస్ఎస్‌డీసీ రాష్ట్రంలోని నైపుణ్యం గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఇందులో భాగంగా 28 విభాగాల్లో 6 కేటగిరిలుగా విభజించి పోటీలు నిర్వహిస్తుంది. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం కేంద్రాలలో పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తిగత అభ్యర్థులు ఈ నెల 20లోపు http://engineering.apssdc.in/worldskillsap వెబ్‌పేజీలో రిజిస్టర్ చేసుకోవాలని ఏపీఎస్ఎస్‌డీసీ ఇంజినీరింగ్ విభాగం అధిపతి(హెడ్) డా.టి.లక్ష్మి తెలిపారు.

ఏపీలో డీఈడీ విద్య లోపభూయిష్ఠం

- హైకోర్టు సీజేకు లేఖ రాసిన

కర్నూలు జిల్లా ఎస్వీఎన్ డీఈడీ విద్యార్థులు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో డీఈడీ ఉపాధ్యాయ విద్య అత్యంత లోపభూయిష్ఠంగా ఉందని కర్నూలు జిల్లాకు చెందిన ఎస్వీఎన్ డీఈడీ కళాశాల రెండో సంవత్సరం విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. పాఠశాల విద్యాశాఖ, డీఈడీ కళాశాల యాజమాన్యం, ఎన్సీఈఆర్టీ అధికారుల ధనదాహం, నిర్లక్ష్యమే ఇందుకు కారణమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి(సీజే) లేఖరాశారు. డీఈడీ కళాశాలల్లో సీట్లు నిండలేదనే కారణంతో కళాశాల యాజమాన్యాల ఒత్తిడికి, ప్రలోభాలకు గురైన ఏపీ పాఠశాల విద్యాశాఖ అధికారులు పరీక్షలను వాయిదా వేశారన్నారు. దీంతో తాము డీఎస్సీ, టెట్ పరీక్షలు రాసే అర్హత లేక ఉద్యోగావకాశాన్ని కోల్పోయామన్నారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని తమ భవిష్యత్తులోపాటు, విద్యా వ్యవస్థను కాపాడాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖలో కోరారు. ఈ లేఖను హైకోర్టు న్యాయమూర్తిలతో కూడిన పిల్ కమిటీ పరిశీలించి ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించాల్సిన అంశమని అభిప్రాయం వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఈ లేఖను పిల్‌గా పరిగణించింది. ఏపీ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, పాఠశాల విద్య కమిషనర్, డైరెక్టర్, దిల్లీలోని ఎన్సీఈఆర్‌టీ, కర్నూలు జిల్లాకు చెందిన ఎస్వీఎన్ డిగ్రీ కళాశాల యాజమాన్యాన్ని వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిపే అవకాశం ఉంది.

గామన్ వంతెనపై రాకపోకల నియంత్రణ..!

- ముఖ్యమంత్రితో చర్చించాకే ప్రకటిస్తాం: ఎంపీ మురళీమోహన్

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: గోదావరిపై ఉభయగోదావరి జిల్లాల నడుమ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 'గామన్ వంతెన'పై భారీ వాహనాల రాకపోకలను నియంత్రించే యోచనలో యంత్రాంగం ఉంది. పశ్చిమగోదావరి జిల్లా పరిధి కొవ్వూరు నుంచి గుండుకొలను వరకూ జాతీయ రహదారి నాలుగు లేన్లతో నిర్మితమవుతోంది. గడిచిన మూడేళ్లలో ఈ దారిలో జరిగిన ప్రమాదాల్లో 203 మంది మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించాలని భావిస్తున్నారు. దీంతోపాటు తూర్పుగోదావరి జిల్లా పరిధి రాజమహేంద్రవరం జాతీయ రహదారిని ఆనుకుని దివాన్‌చెరువు, మోరంపూడి, వేమగిరి, జొన్నాడ వద్ద నాలుగు పైవంతెనలు నిర్మించనున్నారు. దాంతో రాకపోకలకు ప్రత్యమ్నాయంపై రాజమహేంద్రవరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఎంపీ మురళీమోహన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో ఉభయగోదావరి జిల్లాల కలెక్టర్లు కార్తికేయ మిశ్రా, భాస్కర్‌లతోపాటు గోపాలపురం ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, జాతీయ రహదారుల నిపుణులు, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉదయం 8 నుంచి 11 గంటలు వరకూ, తిరిగి మధ్యాహ్నం 4 నుంచి రాత్రి 8 గంటలు వరకూ మాత్రమే..అంటే రోజుకు 7గంటలు మాత్రమే గామన్ వంతెనపై భారీ వాహనాలను అనుమతించేందుకు నిర్ణయించారు. నెలరోజుల్లో ఈవిధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించాకే ప్రకటిస్తామని ఎంపీ మురళీమోహన్ తెలిపారు.


మాట్లాడుతున్న ఎంపీ మురళీమోహన్

బొమ్మరిల్లు సంస్థ డైరెక్టర్ రాజారావు అరెస్టు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: అధిక వడ్డీలు, రియల్ ఎస్టేట్ పేరుతో మోసానికి సంబంధించి ఫిర్యాదుపై బొమ్మరిల్లు ఫామ్స్, విల్లాస్ ఇండియా లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ రాజారావును సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంస్థ పేరుతో తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య పట్టణాల్లో శాఖలు ఏర్పాటుచేసిన రాజారావు కృష్ణా జిల్లా మచిలీపట్నంలోనూ 2013లో శాఖను ఏర్పాటు చేశాడు. అధిక వడ్డీ పేరుతో రోజు, వారం, నెలవారీ వసూళ్లతో పాటు నెలవారీ వాయిదాల పద్ధతిపై ప్లాట్‌లు ఇచ్చేలా స్థిరాస్తి వ్యాపారం ప్రారంభించాడు. దాదాపు 7,500 మంది ఖాతాదారుల నుంచి రూ.2కోట్ల మేర వసూలు చేసి 2014లో బోర్డు తిప్పేయడంతో పలువురు ఖాతాదారులు స్థానిక చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. బాధితుల ఆందోళన నేపథ్యంలో కేసును సీఐడీకి బదిలీ చేశారు. ఇతర జిల్లాల్లోనూ కేసులు నమోదయ్యాయి. విశాఖపట్నంలో నమోదైన ఆరింటిలో నిందితునిగా ఉన్న రాజారావు బెయిల్‌పై బయటకు వచ్చాడు. సీఐడీ మంగళగిరి ఏరియా ఇన్‌స్పెక్టర్ నాగప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది శనివారం హైదరాబాద్ నివాసంలో ఉన్న అతణ్ని అదుపులోకి తీసుకుని మచిలీపట్నం జిల్లా కోర్టుకు తీసుకువచ్చారు. జిల్లా న్యాయమూర్తి అందుబాటులో లేకపోవడంతో స్థానిక తహసీల్దార్ నారదముని వద్ద హాజరుపర్చగా ఆయన నిందితునికి 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో సబ్‌జైలుకు తరలించారు.


రాజారావు(పాతచిత్రం)

మోదీ చెప్పడం వల్లే కలిశాం

పార్టీ వర్గాల విలీనంపై పన్నీర్ సెల్వం వెల్లడి

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు మంత్రివర్గంలో ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనకు చెప్పారని, అందుకే ముఖ్యమంత్రి పళనిస్వామితో కలిసినట్లు ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం పేర్కొన్నారు. తేనిలో శుక్రవారం సాయంత్రం జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్నాడీఎంకే వర్గాల విలీనానికి ముందు ప్రధానమంత్రి మోదీని తాను కలిశానని పేర్కొన్నారు. అప్పటి పరిస్థితులలో అన్నాడీఎంకే వర్గాలు విలీనం అవ్వాలని మోదీ సూచించారని స్పష్టంచేశారు. తనకు ఎలాంటి పదవి వద్దని చెప్పానని... రాష్ట్ర మంత్రివర్గంలో మాత్రం ఉండాలని ప్రధాని పేర్కొన్నట్లు వివరించారు. ఆ కారణంగానే ఇప్పుడు మంత్రివర్గంలో ఉన్నానని పన్నీర్‌సెల్వం తెలిపారు.





వధువు కావలెను

KAPU 29 5'9" BE (NIT) MBA (IIM) MNC 24 LPA ★ 28 5'11" BE (BITS) MS 170K ★ 27 5'11" MBBS MS (GS) 20 Cr ★ 30 5'9" BE (NIT) MNC 24 PA ★ 26 5'9" MS ★ 8790017711

Brahmin V.V. 33Y, 5'8", B.Tech, MBA, Central Govt New Delhi. Seeks Graduate, Good Family with Traditional Values ✆ 9701555058 / 9000565614 Email: rgsarmabv@yahoo.com (A)

Kamma/ B.Tech, MBA, IIM/ 6'/ 27/ 18L PA/ 20 Cr. ★ B.Tech, IIT, MBA, IIM/ 6'/ 29/ 25L PA/ 30 Cr. ★ B.Tech, IIT/ 6'/ 26/ 36L PA/ 1 Cr. తుమ్మల సుజాత, ✆ 81217 95786. (B)

Kamma/ B.Tech, IIT, MS/ 5'.11"/ 25/ 120K/ 10 Cr. ★ M.Tech, IIT/ 5'.11"/ 26/ 140K/ 20 Cr. ★ BEMS/ 5'.10"/ 26/ 110K/ 50 Cr. తుమ్మల సుజాత, ✆ 99632 32758, 0866-2431721. (B)

Kamma/ M.Tech/ 5'.9"/ 29/ AEE, Govt./ 60 Cr. ★ Group-I/ 5'.9"/ 28/ 10 Cr. ★ B.Tech/ 26/ AE, Govt./ 5 Cr. ★ B.Tech/ 5'.9"/ 26/ Busin./ 100 Cr. తుమ్మల సుజాత, ✆ 81217 95786. (B)

Kamma/ MD, Genl/ 6'/ 26/ 20 Cr. ★ MD Radio/ 6'/ 27/ 250 Cr. ★ DM/ 5'.11"/ 28/ 5 Cr. ★ DM/ 6'/ 28/ 20 Cr. ★ MD, Peadia/ 6'/ 27/ 50 Cr. తుమ్మల సుజాత, ✆ 98482 17771. (B)

వధువు కావలెను. BCA కన్వర్ట్ క్రిస్టియన్ B.Tech, చామనఛాయ, ఎత్తు 5.8, వయస్సు 30 సం॥ బిజినెస్ హైదరాబాద్‌లో ఉంటున్న వరునికి వధువు కావలెను. ✆ 97048 87631 (J).

వధువు కావలెను. కుల పట్టింపు లేదు, వయస్సు : పట్టింపు లేదు, ప్రైవేటు జాబ్ చేస్తున్న వరుడికి వధువు కావలెను. ఈ క్రింది వాట్సాప్ నెంబర్‌కి సంప్ర॥ 99632 87740 (J).

ముదిరాజ్ 28Y 5.8H M.A.,B.Ed. Govt Teacher 50,000/-PM వెల్‌సెటిల్డ్ అయిన వరుడికి వధువు కావలెను. ✆ 8142220475 (A)

తెలగ, కాపు వరుడు/ వయస్సు 44/ డైవోర్సీ, పిల్లలు లేరు/ అసిస్టెంట్ ప్రొఫెసర్/ నెలకు 60,000 జీతం/ మొదటి లేదా రెండోపెళ్లి (పిల్లలులేని) హిందుకులం వధువు కావాలి. ✆ 9110326833. (C)

డైవర్స్, కమ్మ, 33, 6"F ఎరుపు MNC, 25L, 25 ఎకరాలు L. మొదటిది (or) రెండవ సంబంధం వధువు కావలెను. (D) 98491 99943. (M)

Reddy/ Business/ B.Th/ MBA/ 29/ 5'11"/ 50 Cr ★ 27/6'/ 50 Cr ★ 31/ 5'9"/ 50 Cr ★ 30/ 5'8"/ 50 Cr ★28/ 5'8"/ 50 Cr ★ 28/ 5'9"/ 50 Cr ★ Cont K.C.Reddy- Hyd- Ph: 9849321309/ 9347807015 (A)

Reddy/ B.Th/ IIT/ BITS/ USA ★ 32/ 6'/ 300K 10 Cr ★ 32/ 6'/ 150K/ 30 Cr ★ 30/ 5'11"/ 200K ★ 30/ 5'7"/ 150K/ 50 Cr ★ 29/ 5'10"/ 105K ★ Cont. K.C.Reddy/ Hyd - Ph: 9347807015 (A)

Reddy/ B.Th/ MS/ H1/ USA/ Rich ★ 27/ 5'9"/ 50 Cr ★ 25/ 6'/ 50 Cr ★ 28/ 5'11"/ 50 Cr ★ 25/ 6'/ 50 Cr ★ 30/ 5'7"/ 50 Cr ★ 28/ 5'8"/ 30 Cr ★ 28/ 5'9"/ 40 Cr ★ Cont K.C.Reddy- Hyd/ Ph: 9849321309 (A)

గంగపుత్రబెస్త: B.Tech/ Govt Asst. ఇంజనీర్/ R&B/ 60,000/- P.M, 5'11" ఎత్తు 28సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007823. (A)

కుమ్మరి CA/ చార్టెర్డ్ అకౌంటెంట్/ 50,000/- P.M, 5'10" ఎత్తు 28సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

రజక: B.Tech/ Govt, Asst ఎగ్జి॥ ఇంజనీర్/ ఇరిగేషన్ Dept/ 50,000/- PM, 5'10" ఎత్తు, 28సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618008271. (A)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతి స్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కన్వర్టెడ్, రజక కుల పట్టింపులేదు, 30, B.Tech(CSE), 5.11" వెల్ సెటిల్డ్ వరునికి వధువు కావలెను. డైరెక్ట్ Whatsapp: 9573388332 (N).

Reddy, 29, 5'9", Fair, Doctor in Dubai, 40 Lacs PA, Seeks suitable Bride. Ph: 00971525779985, Mail: drnaveen.balupalli@gmail.com (A)

ని బ్రాహ్మణ్ 1984, 5'8", PG సీనియర్ కంటెంట్ రైటర్, Pvt జాబ్, Hyd. స్వంత Flat & స్థిరాస్తి కల్గిన స్మార్ట్ వరుడుకు తగిన వధువు కావలెను. శాఖ పట్టింపులేదు. Cont: 9963547285. మ్యారేజ్ బ్యూరో/ బ్రోకర్స్ Excuse. (A)

క్రిస్టియన్‌మాల/ 29/ 5'8"/ B.Tech, MBA/ C.Govt జాబ్ (ESI)/ చాలా అందమైన వరునికి తగిన వధువు కావలెను. ✆ 9948136776. (A)

పద్మశాలి / కట్నప్రసక్తిలేదు/ B.Tech, IIT, MBA/ C.Govt సైంటిస్ట్ (DRDO)/ 80,000/- PM 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886957298 (A)

రెడ్డి/ M.Tech/ C.Govt. Asst. Exq ఇంజనీర్ (NTPC)/ 10Lakhs PA/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9985395014 (A)

మాల/ కట్నప్రసక్తిలేదు / B.Tech/ Bits, MBA/ C.Govt Asst. Exq. ట్రైనింగ్ ఆఫీసర్ (BHEL) 12 Lakhs PA/ 5'11" ఎత్తు/ 28 సం॥ల వరుడికి వధువు కావలెను. ✆ 9703794175 (A)

కుమ్మరి/ M.Tech/ C.Govt JTO, (BSNL)/ 9 Lakhs PA/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885299854. (A)

రజక / B.Tech/ Govt A.E (జెన్‌కో) 65000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9581317506 (A)

కాపు/ M.Tech/C.Govt సైంటిస్ట్ (DRDL)/ 70,000/-PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886512010 (A)

పద్మశాలి/ B.Tech/ C.Govt J.E (రైల్వే) / 55,000/- PM / 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 7288048678. (A)

మాదిగ/ B.Tech/ MBA/ C.Govt Asst ఇంజనీర్ (BHEL)/ 70,000/-PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9642459724 (A)

రెడ్డి, 1986, 6", B.Tech/MS/ US, 90K ★ 1988, 5'7", B.Tech, MS, SWE, 150K, 30 Cr నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో ✆ 9848221166/ 8885559579 (A).

రెడ్డి (Now India), 1989/ 5'8" B.Tech, MS/ SWE, Canada, 48 L PA, Rich ★ 1991, 5'6" B.Tech, MS, SWE, 90K, Hi, 9848221166/ 8885559579 (A).

రెడ్డి, 1988, 5'9", MBBS, MD, Pediatrics ★ 1989, 5'9", MBBS, MD/ DM, Neurology, Ph: 9848221166, 8885559579 (A).

కాపు, 34 సం॥, 5'9", B.Tech, C.P.L Holder దుబాయ్‌లో జాబ్ చేస్తున్న వరునికి, చదువుకున్న అందమైన వధువు కావలెను. డైరెక్ట్, సంప్ర॥ 9440005055, 9542805190 (Q)

కాపు– రెండోపెళ్లి: 38/6'/ బి.టెక్ (IIT), MBA (IIM), US సిటిజెన్ ★ 35/5'8"/ MBBS, MS (ENT) ★ 42/5'7"/ M.టెక్/1L PM ★ డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

కమ్మ– రెండోపెళ్లి: 41/6'/ బి.టెక్, MS/ US సిటిజెన్/ 20 కోట్లు ★ 38/5'10"/ MBBS, MS (ఆర్థో) / 15 కోట్లు ★ 36/6'/ బి.టెక్ 2L PM/ 5 కోట్లు ★ డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి. ✆ 9393276969 (A)

కాపు/ 28/5'10"/ MBBS, MS ఆర్థో ★ 27/6'/ బి.టెక్, MS/ H1 వీసా ★ 28/5'9"/ బి.టెక్, MBA/ SBI ఆఫీసర్. సంప్ర: డా॥ బొమ్మదేవర నాగకుమారి. ✆ 9393276969 (A)

CNB, గౌడ, 43yrs, 5'11" Fair, 2nd USA గ్రీన్‌కార్డు SWE గల అబ్బాయికి USA వీసా ఉన్న వారు మాత్రమే బయోడేటా పంపగలరు. ✆ 9440085923, ramaprasad_59@yahoo.co.in . (A).

కాపు/ బలిజ: 27Y/ 5'10"/ B.Tech (IT) S/W in HP/ 10 Lakhs P/A/ 3 Cr. property ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 93909 14215 (D)

కమ్మ: 25Y, 5'.9", V.Fair, B.Tech (DIS) ఓన్ బిజినెస్, 25L P/A, 35 Cr. పైన, Only Son కి తగిన కమ్మ వధువు కావలెను. ✆ 73863 38574. (B)

బ్రాహ్మణ 24, 5'10", BE (BITS) SWE 10L ★ 28, B.Tech, MBA (IIM) 18L ★ 31, CA, 20L ★ 26, 5'11", B.Tech, MS (US) $ 120K ★ 27, MD ✆ 9494096081 (A).

రెడ్డి: 28 Yrs/ MBBS, MD న్యూరాలజి చేస్తున్న సెటిల్డ్ వరునికి తగిన MBBS (or) ఇంజనీర్ చదివిన వధువు కావలెను. No Dowry. 98665 36343 (D)

ఈడిగ/ శెట్టి బలిజ: 27/ M.Tech (NIT), S/W "ORACLE" 16 Lak P/A, వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. No Dowry. 96762 94499 (D)

ప్రశాంతత మన నుంచే మొదలు కావాలి



కుటుంబానికి భర్త యజమాని అయితే భార్య యజమానురాలు. ఇందులో ఒకరు ఎక్కువ వేరొకరు తక్కువ అనే భావన ఏ ఒక్కరిలో రావడానికి వీల్లేదు. చాలామంది మగవాళ్ల దృష్టిలో భార్య అంటే తన సొత్తు. ఏది చెబితే అది చేసేవ్యక్తి. పాటించడమే తప్ప స్వతంత్రంగా వ్యవహరించడానికి వీల్లేదు. సొంతంగా ఆలోచించాల్సిన అవసరంలేని మనిషి. ఇదే కోవలో కొందరు ఆడవాళ్ల దృష్టిలో మగవాడు.. సంపాదనకు మాత్రమే పరిమితం కావాల్సినవాడు. అంతవరకే అతని బాధ్యత. మరి ఇంకేవిషయంలోనూ జోక్యం చేసుకోవడానికి వీల్లేదు. ఈ రెండు భావనలూ తప్పే. జీవిత భాగస్వామి అంటే ఇటు బానిసా కాదు.. అటు ధనార్జన చేసే యంత్రం అంతకన్నా కాదు. కుటుంబానికి సంబంధించి భార్యాభర్తలిద్దరికీ బాధ్యత సమంగా ఉంటుంది. ఉండాలి కూడా!

సాధారణంగా కొన్ని కుటుంబాల్లో భర్తలు చురుకుగా ఉంటారు. ఆలోచనాపరులై ఉంటారు. కొన్ని కుటుంబాల్లో భార్యలు ఆ పాత్ర పోషిస్తారు. అలాంటి వారి నిర్ణయాలే ఇంట్లో కీలకమవుతాయి. ఎవరు ఏ పాత్ర పోషించినా ఇద్దరూ చూడాల్సింది కుటుంబ సంక్షేమం. ఇంటి నిర్వహణ, పిల్లపాపల చదువూ సంధ్య, వంటావార్పూ వగైరాలన్నీ ఇంటిపట్టున ఉంటూ ఒకప్పుడు మహిళలే నిభాయించేవారు. మారిన కాలాన్ని అనుసరించి ఇప్పుడు వాళ్లు కూడా ఉద్యోగాలు వ్యాపారాలలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ అవసరాల్ని బట్టి భర్తలు ఇంటిపనీ వంటపనిలో పాలుపంచుకుంటున్నారు. పంచుకోవాలి కూడా. అర్థంచేసుకోవాల్సింది ఏమంటే భార్యాభర్తలిద్దరూ సమాన భాగస్వాములు. ఆ ఎరిక ఉన్న కుటుంబాలలో శాంతి సౌభాగ్యాలు వర్ధిల్లుతాయి. సుఖసంతోషాలు ఉప్పొంగుతాయి.

సమస్య ఎక్కడ వస్తోందంటే- నువ్వూ నేనూ సమానమే. మరి నువ్వు చెప్పినట్టు నేనెందుకు వినాలి? నే చెప్పినట్టు నువ్వు చేస్తావా చస్తావా? అంటూ ఇద్దరూ సిగపట్లకు దిగడం వల్లనే చాలా కుటుంబాలలో అశాంతి తాండవిస్తోంది. దీనివల్ల కుటుంబసభ్యులెవరూ ప్రశాంతంగా ఉండలేకపోతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. అది వారి జీవితాలపైనా, ఆరోగ్యంపైనా తీవ్రప్రభావం చూపుతోంది. భార్యాభర్తలు తమ హక్కుల కోసం, అహాన్ని తృప్తిపరుచుకోవడం కోసం జీవిత భాగస్వామితో పోరాడేముందు ఈ పర్యవసానాలపైన కూడా దృష్టి నిలపడం అవశ్యం. నలుగురిలో తమ కుటుంబ పరువు ప్రతిష్ఠలేమవుతాయన్నది కూడా ఆలోచించడం అత్యావశ్యకం. లేని పక్షంలో భర్తకావచ్చు, భార్యకావచ్చు, పిల్లలు కావచ్చు పెద్దలు కావచ్చు ఆ తర్వాత సమాజంలో ఎంతటి న్యూనతకు లోను కావాల్సివస్తుందో ఆలోచించుకోవాలి. నిప్పున్న కర్రకే హాని జరుగుతుందన్నట్టు మనకోపమో, మన అహమో, లేక మరోలోపమో ఉండడం వల్ల తొలుత మనకే హాని. మనకు అంటే కొంచెం విశాలార్థంలో చూడాలి. అది తను కావచ్చు. జీవితభాగస్వామి కావచ్చు, కుటుంబసభ్యులు కావచ్చు. వారిలో ఎవరికి ఏ హాని జరిగినా కుటుంబ పెద్దగా మనం కూడా దాన్ని అనుభవించాల్సిందే కదా? 'నీ కుటుంబం నవ్వుల పాలవుతోంది అంటే అందులో నువ్వూ ఉంటావని మరచిపోరాదు'. ఈ సూత్రం జీర్ణం చేసుకోగలిగితే కొన్ని సమస్యలు దూరమైనట్టే. ప్రతి కుటుంబానికి ఉంటానికి ఇల్లు, తింటానికి తిండి కట్టడానికి బట్ట అవసరమైనట్టే జీవించడానికి ప్రశాంతత కూడా అవసరం. అది ఉంటే ఏవి లేకున్నా అన్నీ ఉన్నట్టే. అది లేకుంటే అన్నీ ఉన్నా లేనట్టే. ప్రశాంతంగా ఉండడం మన నుంచే మొదలు కావాలని గుర్తుంచుకుంటే చాలా మంచిది.

- చంద్రప్రతాప్

మీకు తెలుసా?

సామాజిక మాధ్యమాలలో చురుకుగా పాల్గొంటూ తక్కినవేవీ పట్టించుకోని తరం మన కళ్లముందు తిరుగాడుతోంది. దీనివల్ల చదువులు అటకెక్కుతున్నాయి. బాధ్యతలు పక్కదారి పడుతున్నాయి. దేనిపైనా లక్ష్యం ఉండడంలేదు. బంధాలు బలహీనమవుతున్నాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని పశ్చిమ బంగలోని వివాహప్రకటనలు ప్రత్యేకంగా తయారు చేస్తున్నారట. '26 ఏళ్ల ప్రభుత్వోద్యోగికి వధువు కావలెను. డిగ్రీ చదివి ఉండాలి. ఫేస్‌బుక్, వాట్సాప్‌ల వంటి సామాజిక మాధ్యమాలకు బానిసై ఉండరాదు.' అనే పద్ధతిలో. ఇలాంటివి మన వద్ద మొదలైనా ఆశ్చర్యంలేదు. యువతలో ఆందోళన, కుంగుబాటు, నిద్రలేమి, తదితర సమస్యలకు కూడా ఇవే కారణమని అనేకమంది సామాజిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

వెలమ: 28 Yrs/ B.Tech, MBA/ S/W, MNC, 15 Lak P/A, 5 Cr. property గల వరునికి వధువు కావలెను. No Dowry. 96767 88428 (D)

SC-హిందూమాల: 27 Yrs/ 5'8"/ B.Tech/ S/W "Accenture" 10 Lak P/A/ 2 Cr. property వరునికి తగిన వధువు కావలెను. No Dowry. 98664 27407 (D)

బ్రాహ్మణ: 38 Yrs/ M.Sc (Maths), TTD Employee, 1 Cr. ఆస్తిగల వరునికి ఏదైనా 10th (or) PG చదివిన వధువు కావలెను. No Dowry. 98665 36343 (D)

గౌడ/ MBA, NITIE, Sr. మేనేజర్, Yes Bank, ముంబాయి, Rs. 1,58,000 PM, ఎత్తు: 5'.9", 29 సం., అందమైన వరుడుకు MBA/ CA చేసి, మంచి జాబ్ చేస్తున్న, అందమైన వధువు కావలెను. ✆ 98483 90457, 096198 09446. (B)

విశ్వబ్రాహ్మణ (స్వర్ణకార్లు) 28 సం॥ 5'6" B.Com చదివి వ్యాపారాము చేసే అబ్బాయికి అమ్మాయి కావాలి సొంత ఇల్లు అద్దెలు కూడా వస్తాయి. Ph: 9963372923/ 8919193728 (A)

కమ్మ (ఓన్లీసన్) 27 5'9" B.Tech MBA SWE HCL 11Lakhs P.A. వరుడికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను. ✆ 9618483383 (A)

విశ్వబ్రాహ్మణ 27 5'10" B.Tech SWE Accenture 70,000/- PM వరుడికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను. ✆ 9959265078 (A)

కాపు /రెండోపెళ్లి / కుల, కట్నప్రసక్తిలేదు/ 55/ 5'5"/ బిజినెస్/ చాలా వెల్‌సెటిల్డ్ వరునికి విజయవాడ పరిసర ప్రాంతాల్లోని సాంప్రదాయమైన వధువు ఫోటో & బయోడేటా వాట్సప్ చేయండి. 9676453353 (A)

యాదవ (కట్నప్రసక్తిలేదు) 28/ 5'10" B.Tech, M.S., USA/ SWE/ IBM 5Lakhs P.M. అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246333320 (A)

SC మాదిగ కట్నప్రసక్తిలేదు 28/5'10" B.Tech MBA ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ 80 వేలు P/M వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన వధువు కావలెను. 9666148352 అర్జెంటు (A)

కాపు 30y/ 5'6"'/ డిగ్రీ/ ప్రైవేట్‌జాబ్/ సెటిల్డ్ గల అందమైన వరుడికి ఏదైనా OC/BC 1వ/2వ వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు (డైరెక్ట్) ✆ 88868-95098 (A)

కమ్మ ప్రత్యేకం. 30 Cr, 28, B.Tech, MS, MBA, USA, Engg/డాక్టర్స్/ Ind/USA/ సెటిల్డ్ వరులకు వధువు కావలెను. సంప్ర: శారద: 9849413031 (A)

యాదవ: 28, 5'10", MBBS, MS, సూపర్ స్పెషాలిటీ చేస్తున్న వరునికి తగిన వధువు కావలెను. 8125210356 (A)

ST ఎరుకల 27, 5'9", MBBS, MS, జనరల్ సర్జన్ చేస్తున్న సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. 9494038701 (A)

CNB: 29, 5'11", MBBS, MD, సూపర్‌స్పెషాలిటీ చేస్తున్న సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. 8125210344 (A)

కమ్మ, Ag:32, H.5'11', BA, ప్రైవేట్ జాబ్ చేస్తున్న వరుడుకి (కట్నప్రసక్తి లేదు) వధువు కావలెను. నో బ్రోకర్స్. ✆ 80746 76294.

కాపు CNB 39 "5.1" తెలుపు M.Tech లేట్ మ్యాచ్ 3.50 కోట్ల ప్రాపర్టీ 1వ & 2వ లేట్ మ్యాచెస్ అర్జంటు: 98493 24378, 97035 51199 (I).

★ ★ ★

వధువు కావలెను. బ్రాహ్మణ 5'7 ఎత్తు నెలకు 30,000/- ఆదాయం 50 లక్షల ఆస్తిగల వరునికి వధువు కావలెను. Cell: 96768 23115.(I)

★ ★ ★

కమ్మ 30y 5-11, M.Sc (BIO.Tech, PGDBI), 3 కోట్ల ఆస్తి, MNC లో QA-Exe. జీ: 35 వేలు. ప్రిఫర్ Govt జాబ్. వధువు కావలెను. ✆ 97044 09313.(I)

కమ్మ/25 సం॥/ITI/Fair/3 ఎకరములు పొలము కల్గిన వరుడికి కమ్మ వధువు కావలెను. (కట్న కానుకలు అవసరం లేదు). ✆ 80198 03894(GNT). Mail:chandramarriagebUreau7@gmail.com.(I)



వరుడు కావలెను

KAPU 25 5'4" CA MNC 15 LPA 10 Cr ★ 24 5'6" MBBS MD (Ped) 20 Cr ★ 27 5'4" MS 140 K PA 10Cr ★ 26 5'5" MBA (IIM) MNC 15 Cr ★ 24 5'4" BE MNC 19LPA ★ 9989019945 (A)

ST ఎరుకల: MBBS, PG/ 5'.7"/ 24Y/ V.Fair/ 20 Cr. ఆస్తి కల్గిన అందమైన వధువు కొరకు మెడిసిన్ (or) Class-I ఆఫీసర్స్ వరులు (అర్జెంట్)గా సంప్ర: ✆ 90320 94810 ★ 96661 13494. (B)

మాల: MBBS, MD (Gen. Medicine)/ 5'.4"/ 28Y/ V.Fair/ 1 Cr./ 70 వేల జీతంతో డాక్టర్‌గా చేస్తున్న వధువు కొరకు (అర్జెంట్)గా సంప్రదించండి. ✆ 92484 94810 ★ 81065 01199. (B)

Kamma/ BEMS/ 5'.4"/ 25/ 100K/ 40 Cr. ★ BEMS/ 5'.5"/ 23/ 100 Cr. ★ B.Tech, IIT, Ph.D/ 5'.4"/ 24/ 10 Cr. ★ Residency/ 5'.7"/ 26/ 30 Cr. తుమ్మల సుజాత, ✆ 98482 17771. (B)

Kamma/ M.Tech, IIT/ 5'.5"/ 23/ 22L PA/ 5 Cr. ★ B.Tech, IIT, MBA, IIM/ 5'.7"/ 25/ 14L PA/ 20 Cr. ★ B.Tech/ 5'.7"/ 24/ Oracle/ 5 Cr. తుమ్మల సుజాత, ✆ 99632 32758. (B)

Kamma/ MD, Genl/ 5'.4"/ 25/ 10 Cr. ★ MD, Genl/ 5'.5"/ 26/ 25 Cr. ★ MD, Gynec/ 5'.7"/ 25/ 25 Cr. ★ MD, Peadia/ 5'.5"/ 26/ 10 Cr. ★ BDS/ 5'.5"/ 23/ 20 Cr. తుమ్మల సుజాత, ✆ 98482 17771. (B)

కుల పట్టింపు లేదు. రెండవ సంబంధం 26Y 5.4H MBA Own Business (5Cr ప్రాపర్టీ, ఇల్లరికం) వెల్‌సెటిల్డ్ అయిన వధువుకు వరుడు కావలెను. ✆ 8142220817 (A)

CNB KAPU Glkg Mediam CLR 5'1" Ed. Late (M) Rich Cultured Bride Vizag. Req. 45-49 Ed. Emp. Groom Prf. Lecturer. 70134 74129. (M)

Reddy/ B.Th/ Rich/ 28/ 5'5"/ 40 Cr ★ 30/ 5'2 1/2/ 50 Cr★ 28/ 5'7"/ 50 Cr ★ 27/ 5'6"/ 50 Cr ★ 31/ 5'4"/ 50 Cr ★ 28/ 5'3"/ 50 Cr ★ 25/ 5'4"/ 50 Cr ★ Cont. K.C.Reddy- Hyd- Ph: 9849321309/ 9347807015 (A)

Reddy/ B.Th (IIT) BITS/ USA ★ 30/ 5'5"/ 200K/ 15 Cr ★ 26/ 5'7"/ 30 Cr ★ 29/ 5'4"/ 200K ★ 28/ 5'4"/ ★ 27/ 5'2"/ 110K/ 5 Cr ★ 26/ 5'3"/ 50 Cr ★ Cont. K.C.Reddy- Hyd- Ph: 9347807015 (A)

Reddy/ MBBS/ PG ★ 22/ 5'5"/ 30 Cr ★ 27/ 5'6"/ 10 Cr ★ 29/ 5'7"/ 25 Cr ★ 28/ 5'7"/ 50 Cr ★ 29/ 5'5"/ 50 Cr ★ USA ★ 26/ 5'5"/ 50 Cr ★ USA 26/ 5'7"/ 50 Cr ★ BDS/ 30/ 5'3"/ 50 Cr ★ Cotn. K.C.Reddy/ 9849321309 (A)

రజక: B.Tech/C.Govt క్యాషియర్ & క్లర్క్/ SBI బ్యాంక్/ 25,000/- P.M, 5'5" ఎత్తు, 25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618008271 (A)

వాల్మీకిబోయ: B.Tech/SWE/ 40,000/- P.M, 5'4" ఎత్తు 24సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

వడ్డెర: MSc/ Agr/ Govt ఆఫీసర్/ అగ్రికల్చర్ Dept/ 45,000/- P.M, 5'4" ఎత్తు, 24సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

బ్రాహ్మణ/ రెండోపెళ్లి/ 31/ 5'3"/ ఇంటర్/ Pvt జాబ్/ 10,000/- PM/ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9030056547/ 9676812525 (A)

కాపు/ 25/ 5'3"/ డిగ్రీ/ కట్నం ఇచ్చుకోలేరు. ★ కమ్మ/ 30/ 5'2"/ 10th / డైవర్సీ ★ కాపు/ 40/ 5'2"/ డిగ్రీ / విడో వధువులకు వరులు కావలెను. ✆ 8187005155 (A)

బ్రాహ్మణ/ 21/ 5'3"/ 8th ★ 23/ 5'4"/ 10th ★ 25/ 5'/ 5th వధువులకు వరులు కావలెను. పూజారి అయినా O.K. ✆ 7674078296/ 8106446865 (A)

బెస్త/ B.Tech/ C.Govt బ్యాంక్ క్యాషియర్ (SBI)/ 25000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 7288048678 (A)

గౌడ/ B.Tech/ Govt. Jr. Asst (పంచాయతిరాజ్ Dept)/ 28000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9052296834 (A)

కమ్మ/ ఏకైక కుమార్తె/ B.Tech/ Govt బ్యాంక్ P.O (ఆంధ్రాబ్యాంక్)/ 35000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506 (A)

మాదిగ/ ఏకైక కుమార్తె/ B.Tech/ C.Govt స్టెనోగ్రాఫర్ (రైల్వే)/ 28000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8886512010 (A)

రెడ్డి/ B.Tech/ Govt A.E (జెన్‌కో)/ 32000/-PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9985395014 (A)

గౌడ/ B.Tech, EEE/ C.Govt. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (BHEL)/ 35000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885299854 (A)

SC మాదిగ హిందూ 26/ 5'5" B.Tech/ IT/ SWE/ Hydలో 40,000/- PM V.V.ఫెయిర్, వెల్‌సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 8712865419 (A)

రెడ్డి, డైవర్సీ/ Govt Job/ 28సం॥/ 5'4" ఎత్తు/ B.Tech/ Fair/ వెల్‌సెటిల్డ్ "వధువుకు" తగిన "వరుడు" (Govt/ Pvt/ బిజినెస్) కావలెను. (అర్జెంట్) ✆ 9949877734 (A)

రెడ్డి, 1992, 5'5" B.Tech, MS, SWE, US, 140K, 5cr. ★ 1992, 5'4", B.Tech, MS, US, 50K, 25Cr. Ph: 9848221166, 8885559579 (A).

రెడ్డి, 1990, 5'5", B.Tech, SWE, Banglore, 16L, Fair, 25 Cr ★ 1994, 5'5", B.Tech, MBA, 40Cr. Ph: 9848221166, 8885559579 (A).

రెడ్డి, 1991, 5'6", MBBS, MD (Gynic) ★ 1991, 5'3", MBBS, Radiology IInd year. నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో 9848221166, 8885559579 (A).

కమ్మ డైవర్సీ, 27, 5'.8", M.Tech, 1 Cr/ A 150 Cr. ఆస్తిగల వధువుకి BE, MBA, IIT, M.Tech, Well Educated, Well Settled, ఇండస్ట్రీస్ కలిగిన కమ్మ వరుడు మాత్రమే కావలెను. (నో బ్రోకర్స్). డైరెక్ట్: lakshmilingam1970@gmail.com ✆ 91339 94567. (B)

విశ్వబ్రాహ్మణ: 25/5'4"/ B.టెక్, MS/ H1 వీసా ★ 27/5'5"/ MBBS, MS (గై) ★ 24/5'3"/ B.టెక్/ ఇన్ఫోసిస్/ 50K. సంప్ర: డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి. ✆ 9393276969 (A)

SC మాల: 25/5'4"/B.టెక్, MS/ H1 వీసా ★ 28/5'4"/ MBBS, MD(P) ★ 25/5'3"/ B.టెక్/ SBI ఆఫీసర్. సంప్ర: డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి. ✆ 9393276969 (A)

SC మాదిగ/ 25/5'5"/ B.టెక్, MS/ H1 వీసా ★ 27/5'4"/ MBBS, MS (ENT) ★ 25/5'5"/ B.టెక్/ TCS/ 30K. సంప్ర: డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి. ✆ 9393276969 (A)

బ్రాహ్మణ 25, 5'5", వైట్, బి.టెక్, Designing. 7 L.P.A వధువుకి వరుడు కావలెను. ✆ 0877 2230289, 86862 85991 (D)

కాపు/బలిజ: 25Y/ 5'5"/ Fair/ B.Tech (Mech) S/W in TCS/ 5 Lakhs P/A/ 2 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 94419 90408 (D)

పద్మశాలి: 25 Y/ 5'3"/ B.Tech (CSE)/ S/W in Bangalore/ 4 Lakhs P/A/ 2 Cr. property ఉన్న వధువుకు తగిన వరుడు కావలెను. 93938 63645 (D)

క్షత్రియ/ రాజులు: 25 Y/ 5'5"/ B.Tech (EEE)/ S/W/ HCL, Chennai. 4 Lakhs P/A/ 3 Cr. property ఉన్న వధువుకు తగిన వరుడు కావలెను. 97042 77499 (D)

రెడ్డి: 24 Y/ 5'5"/ B.Tech (ECE)/ S/W in Bangalur/ 5 Lakhs P/A/ Well settled వున్న వధువుకు తగిన వరుడు కావలెను. 97041 88499 (D)

కమ్మ: 25Y/ 5'4"/ B.Tech (ECE)/ S/W in Hyd. 4 Lakhs P/A/ 5 Cr. property ఉన్న వధువుకు తగిన వరుడు కావలెను. 93461 24845 (D)

కమ్మ/ డైవర్సీ, 27Y, 5'.4", Red కలర్, B.Tech (ECE), జాబ్ బెంగుళూర్, 1 Cr. తగిన కమ్మ వరుడు కావలెను. ✆ 73863 38574. (B)

బ్రాహ్మణ 20, B.Sc ★ 23, B.Tech, 2.4L ★ 27, B.Tech, MBA, SWE ★ 22, 5' MBA ★ 25, B.Tech, MS (US), Wkg ★ 24, MBBS ✆ 8555024711 (A).

క్షత్రియ/ రాజులు: 26 Yrs/ MBBS, MD (GM) చేస్తున్న మంచి ఆస్తిగల వధువుకు క్షత్రియ (or) OC Caste Doctor వరుడు కావలెను. 99636 06222 (D)

ఆర్యవైశ్య 51సం॥ 5.3 HT విడో పిల్లలులేరు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ సీనియర్ మేనేజర్ 17 ఎకరాల పొలం కల్గిన మహిళకు వరుడు కావలెను. 7287968361 (E)

BHATTRAJU: MBA, IT ★ ఫైనాన్స్ 24 5'3" Fair వధువుకి Any P.G డిగ్రీ Job వరుడు కావలెను. Only తెలంగాణా 9247330475 (నో బ్రోకర్స్) (A)

బ్రాహ్మణ ఆరువేల నియోగులు 45 సం॥ 5.3 HT గవర్నమెంట్ హెడ్‌మాస్టర్ (గెజిటెడ్) పిల్లలు లేరు. సొంత ఇల్లు 18 ఎకరాలు పొలం కలిగి యాక్సిడెంట్‌లో భర్తను కోల్పోయిన మహిళకు వరుడు కావలెను. 7287968361 (E)

బలిజకాపు, 45, విడో, 5'5" క్యాష్ వినట్స్ & స్ట్రాబెరీ ఎస్టేట్స్ & బిజినెస్, మసాల దినుసులు & జీడిపప్పు ఎస్టేట్స్, 25Cr ప్రాపర్టీ గల వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. ✆ 9951479981 (A).

పద్మశాలి (కులపట్టింపులేదు) 2వ పెళ్లి 55/ 5'4" ఓన్ మేకల బిజినెస్ 50,000/- PM ఆంధ్రాలో వ్యవసాయ భూములు గల వధువుకు వరుడు కావలెను. ✆ 9948576536 (A)

రెడ్డి /డైవర్సీ / కుల ధన ప్రసక్తి లేదు/ 14 కోట్ల ఆస్తి/ వయస్సు: 33y/ 5'6"/ Qly: PG, వెరిఫెయిర్/ నెలకు 7లక్షల సంపాదన గల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9515528286 (A)

ముదిరాజ్ 24/5'5" B.Tech/ SWE/ HCL 40,000/- PM V.FAIR అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246555529 (A)

కాపు 23 5'3" Fr B.Tech SWE Infosys 35,000/-PM సాంప్రదాయ కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9866158793 (A)

నాయిబ్రాహ్మణ 24/5'5" B.Tech/ SWE/ HCL 35,000/-PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246964555 (A)

రెండోపెళ్ళి/ కుల పట్టింపులేదు/ ఆస్తి ప్రసక్తిలేదు/ 36/ 5'1"/ చాలా అందమైన సాంప్రదాయమైన వధువుకు 1వ లేదా 2వ వరుడు ఫోటో & బయోడేటా వాట్సాప్ చెయ్యండి: 9949595523 (డోన్ట్ కాల్ వాట్సాప్ ఓన్లీ) (A)

యాదవ 24/ 5'5" B.Tech/ SWE/ CTS 35,000/-PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246171703 (A)

SC మాల 23 5'5" B.Tech NIT SWE WIPRO 30,000/-PM అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు అందమైన వరుడు కావలెను. ✆ 8019705648 (A)

వైశ్య/ 23 5'6" ఫెయిర్ B.Tech SWE TCS 30,000/-P/M వెల్‌సెటిల్డ్ వధువుకు అందమైన వరుడు కావలెను. 9666567123 అర్జెంట్. (A)

పద్మశాలి 24/5'5" B.Tech/ SWE/ Infosys 35,000/-PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246151501 (A)

కులపట్టింపులేదు కమ్మ/ 24Y/ 5'4"/ 1st మ్యాచ్ MBA/ Pvt జాబ్/ 40K (PM) ఫెయిర్ అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. సంప్ర: ✆ 7893688483 (A)

కులపట్టింపులేదు రెడ్డి/ 48Y/ 5'5"/ MA, BEd/ ఫెయిర్/ Govt టీచర్ 75K (PM) అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. (ఇల్లరికం OK) ✆ 8897587959 (A)

రజక 24/ 5'5" B.Tech/ SWE/ TCS 40,000/- PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246333320 (A)

SC మాల హిందు 29/ MSc/ 5'4"/ PhD Govt జాబ్ 70,000/- PM 28 B.Tech 5'5" SWE 8L P.A. అందమైన వధువులకి తగిన వరులు కావలెను. ✆ 8106658089 (A)

పద్మశాలి/ విడో/ 30Y/ 5'5"/ RTO Office జాబ్ 12 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కులపట్టింపులేని అందమైన వరుడు కావలెను. ✆ 8978377133 (A)

రాజులు, అమ్మాయిలు, B.Tech, M.Tech, MBBS, MD, MS. వశిష్ఠ, ధనుంజయ, కౌండిన్యస, కాశి. 22 to 37. వెల్‌సెటిల్డ్, 1వ, 2వ. సంప్ర: M.ధనలక్ష్మి: 8374514056 (A)

రెడ్డి, విడో, 35, 5'5", ఫెయిర్, సొంత బిజినెస్, 40K, రెంట్స్ 30K, 2 Cr ఆస్తి, ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి పట్టింపులేదు. 9505437430, 9951619273 (A)

కాపు, 26Y, 5'5", B.Com, అందమైన వధువుకి వరుడు కావలెను. (బిజినెస్ or జాబ్ OK) కులప్రసక్తిలేదు. 8978691424, 040-48529711 (A)

కుల, ఆస్తిపట్టింపులేదు. పద్మశాలి, డైవర్సీ 32, 5'4", Govt జాబ్, 45K, రెంట్స్ 40K, 3 Cr ఆస్తిగల వధువుకు వరుడు కావలెను. 8522011967, 8522000858 (A)

కాపు/విడో/ 25సం॥లు/ మంచి ఆస్తిగల్గిన ప్రమాదంలో భర్తను కోల్పోయిన అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. (ఆస్తి, కుల ప్రసక్తిలేదు) మీ ఫొటో Details Whatsappలో Send చేయండి. Ph: 9121451851. (C)

రెడ్డి/విడో/ 29Years/ B.Tech/ మంచి ఆస్తి కల్గి పిల్లలు లేని అందమైన ఒంటరి వధువుకి వరుడు కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తిలేదు) మీ ఫొటో Details Whatsappలో Send చేయండి. Ph: 7207214624. (C)

33y, ఎరుపు, 5'5" ప్రైవేట్ ప్రాక్టీసు (P.G) అయిన డాక్టర్ వెల్‌సెటిల్డ్ డైవర్సీ, వధువుకు తగిన వరుడు కావలెను. సంప్ర॥ 93948 26810, 99490 02120.(I)

రెడ్డి వరుడు కావలెను. వధువు 33 సం॥ హైట్ 5'.4" పోస్టుగ్రాడ్యుయేట్, వర్కింగ్ ఇన్ కార్పొరేట్ కంపెనీ. ✆ 9502641856/ 9618823916. (C)

Hindu Girl/ Dec'82 Born, Fair, SC Mala, MBA/ Working in TechM. Seeks Suitable Groom. Ct:9110230085 (A)

★ ★ ★

రెండవ పెళ్ళి, CNB, 35, 5'4" సాఫ్ట్‌వేర్ వర్క్ ఇన్ MNCకి తగిన వరుడు కావలెను. సంప్ర॥ 9177391463, 9293947197. (A)

CNB, 36, 5'5", B.Com, Pvt. Employeeకి వరుడు కావలెను. లేట్ మ్యారేజ్ సంప్ర: 9177391463, 9293947197. (A)

హిందూ మాల, 23y, B.Tech, SWE, Infosys(Hyd) జాబ్‌గల వధువుకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్/డాక్టర్ జాబ్/ఇతర స్టేట్స్‌లో జాబ్ చేస్తున్న వరుడు కావలెను. డైరెక్ట్: 96761 55194.(I)

కాపు/లేట్ మ్యారేజ్ 30/5'.5" డిగ్రీ 10 కోట్లు ఆస్తిగల అందమైన వధువుకు కుల, ధన ప్రసక్తిలేని వరుడు కావలెను. ✆ 8340864267. (C)

★ ★ ★

రజక తెలగ 23 5'4 డిగ్రీ, రంగు, ఫెయిర్ సంప్రదాయ కుటుంబం గల వధువుకు గవర్నమెంట్ జాబ్ గల వరుడు కావలెను. ✆ 70135 67568 (నో బ్రోకర్స్) (M)

గౌడ, 38 సం॥, Govt. Job; గౌడ, 40 సం॥, Govt. Job వధువులకు తగిన గౌడ వరులు కావలెను. సెల్: 85007 91320. ఇల్లరికమైనా ఒకే, (నో బ్రోకర్స్). (G)

ఆర్యవైశ్య, 37సం॥లు గోత్రం: యినకాల నాభిళ్ళ డైవర్సీ 10సం॥లు బాబు కల్గిన వధువుకు ఒంగోలు వచ్చి ఉండే విధంగా డిగ్రీ చదివిన 37to43 వయస్సు గల వరుడు కావలెను. Cell: 8977759650

28 సం॥లు, ద్వితీయ వివాహ వధువుకు ప్రైవేట్/ ప్రభుత్వ జాబ్ వరుడు కావలెను & 42 సం॥ల మహిళకు రిటైర్డ్ ఎంప్లాయ్ కావలెను. సంప్ర: 90103 22474. (G)



వివాహ వేదిక

విశ్వబ్రాహ్మణ పెళ్ళి సంబంధాల ప్రత్యేక సంస్థ బ్రహ్మముడి, గుంటూరు, కమీషన్ డిమాండ్ లేదు. 0863-2261898, 94911 25725. (I)

కమ్మ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్, డాక్టర్స్, NRI's హైలెవెల్ బిజినెస్ పీపుల్స్ & మిడిల్‌క్లాస్ వధూవరులకు పెళ్ళి సంబంధములు కుదర్చబడును. సంప్ర: VJA, ✆ 73962 73498. (B)

కాపు ఇంజనీర్స్, డాక్టర్స్, ఎంప్లాయీస్, బిజినెస్, USA, ఇండియా పెళ్ళి సంబంధాలకు సంప్ర॥ P.V.K. రావు, TP గూడెం, Whatsapp. 94407 79840, 91826 43397 (M)

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్ (ఆల్ క్యాస్ట్స్) MBBS/MD/ MS/MCH/DM/ BDS & బిజినెస్ మ్యాచ్‌స్‌కి 1వ/2వ/ విడో దేశ/విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదర్చబడును. ✆ 99668 08059 (A)

ఓన్లీ కన్వర్టెడ్ క్రిస్టియన్స్: OC & BC లు మాత్రమే. డాక్టర్స్/ సాఫ్ట్‌వేర్స్/ బిజినెస్ & All 1వ/2వ/విడో దేశ/విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదర్చబడును. ✆ 99593 05599 (A)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

ఓన్లీ కమ్మచౌదరి: కమ్మ కన్వర్టెడ్, డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, MBA, Govts, హైరిచర్స్, బిజినెస్‌మెన్స్ & All 1వ, 2వ, విడో, దేశ, విదేశ సంబంధాలు ఫాస్ట్‌గా కుదర్చబడును. ✆ 91210 10959 (A)

P. Supriyareddy, Rich Reddy Boys & Girls India&Abroad Matches, All emp/ Govt/ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees From All Regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762. Email: palletisupriyareddy@gmail.com (A)

నేడు JIO వివాహ పరిచయ వేదిక 30వేలు Profilesతో 300 మంది Associatesతో అన్ని కులాలవారికి ✆ 8885410555/ 8555800692 (A)

రజక కులానికి చెందిన (Any Qualification) వధువరులకు పెళ్ళి సంబంధాలు కుదర్చబడును గాయత్రి మ్యారేజ్ బ్యూరో Hyd. 9704123842/ 9989950009 (A)

కుల పట్టింపులేని వారికి 2వ, లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2pm-5pm పరిచయవేదిక జరుగును 1000 మంది వధువరుల లిస్ట్ ఇవ్వబడును, కుదర్చబడును. Hyd. 9440937900 (A)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com HYD: 9440831748, GUNT: 9440759945, VSP: 9441735157 (A)

WhatsApp your Photo & Biodata to 9347262769. We Will Send the Suitable Matches. www. pellisandadi.com ESTD: 1991 (A)

రెండవ పెళ్లి సంబంధాలు మాత్రమే. వయస్సుతో నిమిత్తం లేకుండా అన్ని కులాల వారికి, మంచి పేరు/ సంప్రదాయం/ పద్ధతి/ సంపన్న & ఇల్లరికం సంబంధాలు కలవు. ✆ 9581731331 (A)

సుజిత మ్యారేజ్‌బ్యూరో, అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్ చేస్తూ 1 నెలలో సంబంధం కుదర్చబడును. స్త్రీలకు ఫ్రీ, పు॥ సర్వీస్‌చార్జి ✆ 7893688248 (A)

అన్నికులస్తుల వారికి 30 రోజులలో తగిన పెళ్ళి సంబంధములు చూడబడును. అధిక వివరాలకు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు. ✆ 91334 91337, 9133 77 78 79. (G)

కేవలం మాల, మాదిగ, హిందు క్రిస్టియన్ TS & AP రాష్ట్రాలలో అన్ని జిల్లాల్లో 15 yrs Exp. తో Govt, IT, Pvt, బిజినెస్, జాబ్స్, 1వ, 2వ, లేటు డైవర్సీ, దేశవిదేశ సంబంధాలకై ✆ 7075217461 (A)

విశ్వబ్రాహ్మణ, వివాహ సేవాసమితి, దేశ/ విదేశీ డాక్టర్లు, ఇంజనీర్లు, గ్రూప్-1, 2, Govt, MNC సంబంధాలు కొరకు సంప్ర॥ 37 సం॥ల అనుభవం. www. brahmamudi.com బొడ్డపల్లి శ్రీహరి ✆ 8297111166 (A)

ఓన్లీ Govt. ఎంప్లాయిస్ ★ పెన్షనర్స్ కొరకు అన్ని మతాల, కులాల 1వ, 2వ, లేట్, విడో/ డైవర్స్‌లకై వివాహాలు & Govt. ఎంప్లాయిస్ సంబంధాలు కొరకు వెరిఫైడ్ సెటిల్‌కై ✆ 9000185415 (A)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N. శర్మ. Hyd. ✆ 9248600342, 8019207503 brahmininformationmatri@gmail.com

SINCE 1989 శ్రీకన్య వివాహవేదిక, Hyd. అన్ని కులాల & కులాంతర 1వ, 2వ, లేట్ మ్యారేజెస్. ఇండియా/ అబ్రాడ్. వేల్పుల బిక్షపతి ✆ 27619998/ 9849027778. వాట్సప్ - 9347009998 (A)

Specially Doct (3000 ప్రొఫైల్స్) MBBS MD, MS, DM, BDS, MDS & డా॥కి మాత్రమే 1వ/2వ/ లేటు దేశ/ విదేశీ సంబంధాలు అన్ని కులములకు కుదర్చబడును. ✆ 9963632698 (A)

శ్రీగణేష్ మ్యారేజి బ్యూరో అన్ని కులాల, మతాల వారికి 1వ, 2వ సంబంధాలు వెంటనే కుదర్చబడును. ఫీజు: మగవారికి 1000/- ఆడవారికి ఫ్రీ ✆ 7660971900 (A)

దూదేకుల, ముస్లిమ్స్ (నూర్‌బాషా) SWE, B.Tech, M.Tech, MBA, MCA, MS, MBBS, డాక్టర్స్, MD, దేశ విదేశాల జాబ్ చేయు వధూవరులకు సంప్ర: 9948820402 (A)

క్రిస్టియన్ వధువు వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Shyam ✆ 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

ఉచిత వివాహ సంబంధాల సమాచార వెబ్‌సైట్ jeelakarrabellam.com లో ఫ్రీగా రిజిస్టర్ చేసుకొని మీకు నచ్చిన సంబంధాల ఫోన్ నెంబర్లను ఫ్రీగా చూసుకోండి. ✆ 97016 59125.(I)

★ ★ ★

Kalyani Matrimony కమ్మ, రెడ్డి, కాపు, గౌడ్ వారి ఉన్నతమైన సాంప్రదాయబద్ధమైన వివాహ సంబంధముల కొరకు సంప్ర॥ Hyd: 8500747535, విజయవాడ: 9533133969. (A)

కమ్మవారి వివాహసంబంధముల కొరకు సంప్రదించండి. SVS కన్సల్టెన్సీ, నూజివీడు. ✆ 95050 42422. స్త్రీలకు రిజిస్ట్రేషన్ ఫ్రీ. డైరెక్ట్: somasekharsiripurapu@gmail.com (B)



ఫిదా సినిమాలో..
'అలా ఊర్లోకి వెళ్దాం వస్తావా?'
అని భానుమతి నవ్వుతూ పిలిస్తే...!
ఒక్క నిమిషం అని చెప్పి ఇంట్లోకి వెళ్లి, షార్ట్ టీ షర్ట్‌తో బయటకి వస్తాడు వరుణ్... క్యాజువల్‌గా!

ఇంటర్వ్యూకీ అంతే క్యాజువల్‌గా వచ్చాడు. సింపుల్‌గా, నవ్వుతూ పలకరించాడు. నిరాడంబరంగా ఉన్న ఇంట్లో... అంతకంటే నిరాడంబరంగా ఉన్న వరుణ్ తన మనసులోని ఎన్నో భావాలను పంచుకున్నాడు. తొలిప్రేమ వంటి మంచి హిట్ అందుకొని సంతోషంగా ఉన్నానని చెప్పుకొచ్చాడు. అప్పటికే చిరంజీవి అభినందనలు అందుకొని ఉండటంతో మరింత ఉత్సాహంగా మాటలు కలిపాడు. నాన్న తనని కొట్టిన సంగతులు, స్కూల్లో వన్‌సైడ్ ప్రేమ, స్నేహితులతో తుంటరి వేషాలు... ఎన్నో విశేషాలు వివరించాడు.

అమ్మ అర్థం చేసుకుంటుంది

నన్ను అమ్మ బాగా అర్థం చేసుకుంటుంది. నాకేం కావాలో చెప్పకుండానే తెలుసుకుంటుంది. అమ్మంటే అంతే కదా! నేనే హీరో కావాలని బలంగా కోరుకుంది. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. నా సినిమాలన్నీ చూస్తుంది. మెచ్చుకుంటుంది.

నాలో హీరోను గుర్తించింది చిరంజీవే

ఒకసారి 'మగధీర' షూటింగ్ సమయంలో నేను పెదనాన్న(చిరంజీవి)తో కలిసి రాజస్థాన్ వెళ్లాను. ఆయనకు ఫొటోగ్రఫీ అంటే ఇష్టం ఎక్కువగా ఫొటోలు తీస్తుంటారు. అలా అక్కడా నా ఫొటోలు కొన్ని తీశారు. తర్వాత ఇంటికొచ్చాక వాటిని చూస్తూ... 'రే నీలో మంచి ఫీచర్లున్నాయి. సినిమాల్లో ట్రై చేయొచ్చ'ని చెప్పారు. అప్పటికే సినిమాల్లోకి రావాలని నా మనసులో ఉండేది. ఇక ఆలస్యం చేయకుండా ఇంట్లోకి వెళ్లి విషయం చెప్పేశాను.

అయిదారుసార్లు కాళ్లు విరిగాయి...

'మిస్టర్' సమయంలోనే కాదండి నాకు చిన్నప్పటి నుంచి ఐదారుసార్లు కాళ్లు, చేతులు విరిగాయి. ఎప్పుడూ నా కుటుంబం నాతో ఉండి నన్ను నడిపించింది. ఇటీవల నేను దాదాపు 60 రోజులు బెడ్‌పైనే ఉండాల్సి వచ్చింది. స్నేహితులు అన్ని సమయాల్లో నాతో ఉంటూ ప్రోత్సహించారు.

సాయిధరమ్ తేజ్ మంచోడు

మా కుటుంబంలో ఏదైనా చేయాలనుకుంటే తేజ్ ముందుంటాడు. నా విషయానికి వస్తే వెనుకా ముందు చూడడు. మేం ఫ్రెండ్స్‌లా ఉంటాం. నాన్న ఎప్పుడూ అంటుంటారు... మీ అందరికంటే తేజ్ మంచోడు. అమాయకుడురా అని. ఇద్దరం దాదాపు ఒకే సారి కెరీర్ ప్రారంభించాం. సక్సెస్‌లు, ఫెయిల్యూర్లు చూశాం. ఎప్పుడూ ఒకరికొకరం ప్రోత్సహించుకుంటూ ఉంటాం. నేను తేజ్ కలిసి ఒక సినిమా చేస్తే బాగుంటుందని నాకు అన్పిస్తుంటుంది. మంచి కథ వస్తే తప్పకుండా చేస్తాం

నాది వన్‌సైడ్ లవ్‌స్టోరీ

రీల్‌లైఫ్‌లో తొలిప్రేమతో మంచి హిట్ అందుకున్నారు... మరి మీ రియల్ లైఫ్‌లో తొలిప్రేమ గురించి చెబుతారా?

ప్రేమ అని అనలేం కానీ... ఇష్టం. సినిమాల ప్రభావంతో స్కూల్‌లో చదివేటప్పుడు ఒక అమ్మాయి నచ్చింది. ఇష్టపడ్డాను. వన్‌సైడ్ లవ్ స్టోరీ. ఆ అమ్మాయికి నా మనసులో మాట చెప్పలేదు. నా ఫ్రెండ్స్‌తో అన్నాను అంతే. తర్వాత ఆ అమ్మాయి ఫోన్ నంబరు తెలుసుకోవడానికి స్లామ్‌బుక్‌ను ఉపయోగించాను. ఒకటి రెండు సార్లు ఫోన్ చేసి ఫ్రెండ్లీగా మాట్లాడా. ఒకసారి సినిమాకు వెళ్లాం. తను చదువులో టాపర్. విదేశాలకు వెళ్లిపోయింది. నేను ఇలా సినిమాల్లోకి వచ్చేశాను. అంతే తర్వాత తన గురించి ఆలోచించలేదు.

ప్రేమిస్తే మీ నాన్న(నాగబాబు)కు చెబుతారా?

తప్పకుండా. నాన్న చాలా బోల్డ్ మనిషి. ఆయన ఇలాంటి వాటికి అభ్యంతరం చెప్పరన్న నమ్మకం నాది. మా ఇంట్లో కులాలు, మతాల గొడవ అసలు లేదు. కాబట్టి నాకు ఎవరైనా నచ్చితే తప్పకుండా ఆ ఫీలింగ్‌ని నాన్నతో పంచుకుంటా.

చెల్లి(నిహారిక) పెళ్లి గురించి..?

మా చెల్లి పెళ్లి గురించి ఇప్పటికే చాలా గాసిప్స్ వచ్చాయి. తనకు ఎప్పుడు చేసుకోవాలనిపిస్తే అప్పుడు చేసుకుంటుంది. తను నాకంటే తెలివైనది. నాన్నగారూ దీనిపై బలవంతం చేయరు.

మీకేదైనా కావాలనిపిస్తే ఎవరిని అడుగుతారు?

కొన్ని అమ్మను, కొన్ని నాన్నను అడుగుతాను. లేట్‌నైట్ బయటికి వెళ్లాలనుకుంటే అమ్మకు చెబుతాను. ఖర్చుతో కూడుకున్నవి అయితే నాన్నతో మాట్లాడతాను.

మీ నాన్నతో మరుపురాని అనుభూతి?

అది ఇటీవలే జరిగింది. తొలిప్రేమ షూటింగ్‌కు లండన్ వచ్చారు. అప్పుడు నాన్నతో చాలా సమయం గడిపే అవకాశం వచ్చింది. ఎంతో సంతోషంగా సమయం గడిచిపోయింది. ఇదే నాకు మధురానుభూతి. ఎప్పటి నుంచో ఈ అవకాశం కోసం వేచి చూశాను.

నాన్న ఎప్పుడైనా కోప్పడ్డారా?

ఒకే ఒక్కసారి నన్ను కొట్టారు. స్కూల్ ఏజ్‌లోనే లెండి. ఏదో తింగరిపని చేశాను. కొట్టారు. తర్వాత ఎప్పుడూ అలాంటి సంఘటన జరగలేదు. నేను ఆ సంగతే మరిచిపోయాను. నాన్నే దాన్ని ఇప్పటికీ 10 సార్లు గుర్తుచేసి ఉంటారు. 'అరే నిన్ను అప్పుడు కొట్టాను రా!' అని బాధపడుతుంటారు.

నాన్న మీద మీకు కోపమొచ్చిన సందర్భం?

కోపం అంటే కోపం కాదు... ఒక్కసారి ఇంటర్ మీడియట్‌లో ఉన్నప్పుడు రాత్రి చాలా సేపు నేను కన్పించలేదు. నా మొబైల్ పనిచేయలేదు. అప్పుడు నేను ఎక్కువగా ఉండే చోటుకి వచ్చి నా ఫ్రెండ్స్ ముందే నాపై కోప్పడ్డారు. అప్పుడు బాధేసింది. అయితే నాన్నతో ఏమీ అనలేదు. ఇంటికొచ్చి అమ్మతో చెప్పాను. 'ఏంటమ్మా నాన్న ఇలా' అన్నాను. అమ్మ అప్పుడు అసలు విషయం చెప్పింది. నాన్న నీ కోసం 3 గంటల నుంచి తెలిసిన ప్రదేశాలన్నీ వెదికారు. రాత్రవుతోంది. నువ్వు కన్పించకపోయే సరికి అలా అని అన్నారని చెప్పింది. అప్పుడు నేను రియలైజ్ అయ్యాను.

పూరి దగ్గర...

ఏ విభాగంలో చేయాలో తెలియక సతమతమయ్యే వాడిని. నాన్న ఓ రోజు నువ్వు దర్శకత్వం వైపు వెళ్లమని చెప్పారు. పూరి జగన్నాథ్ దగ్గరికి తీసుకెళ్లారు. అప్పుడు 'చిరుత' సినిమా షూటింగ్ జరుగుతోంది. ఆ ఒక్కరోజే అక్కడ ఉన్నాను. మరుసటి రోజు నుంచి వెళ్లలేదు. కొన్ని రోజుల తర్వాత పూరిగారిని కలిసినప్పుడు 'ముందే అనుకున్నా నువ్వు దర్శకత్వానికంటే హీరోగా బాగా పనికొస్తావ'ని అన్నారు. అలా ఒక్కరోజు అసిస్టెంటు డైరెక్టర్‌గా ఉండే అవకాశం వచ్చింది.

మీరు ఎంపిక చేసుకొనే కథలు నాన్న వింటారా?

వింటారు. ఆయనకు బాగుందనిపిస్తే నాకు చెబుతారు. ఇప్పటి వరకూ ఫిదా తప్ప అన్ని కథలు విన్నారు. ఫిదా నేనే ఒకే చేశాను. అప్పటి నుంచి నాన్నకు నా మీద నమ్మకం పెరిగింది కూడా.

సినిమాల్లోకి రావాలని ముందునుంచే ఉండేదా? మీ నాన్న ఏమీ అభ్యంతరం చెప్పలేదా?

చిన్నప్పుడు టెన్నిస్ ఆడేవాడిని. టెన్నిస్ ఆటగాణ్ని అవుదామని అనుకున్నా. తర్వాత మనసు సినిమాల వైపు మళ్లింది. ఏదైనా చేస్తే సినిమాల్లోనే చేయాలని అనుకునేవాడిని. ఎంబీఏ చేద్దామనుకుని ఆపేసి... నటనలో శిక్షణ తీసుకున్నా. నీ కిష్టమైన రంగంలోనే నువ్వు ఎదగగలవు ప్రొసీడ్ అని నాన్న భుజం తట్టారు.

చిరంజీవి నుంచి మీరు స్ఫూర్తి పొందిన ఘటన?

చిన్నప్పటి నుంచి నాకు రామ్‌చరణ్ కంటే పెదనాన్నతోనే చనువు ఎక్కువ. ఎందుకంటే చెన్నై నుంచి ముందు మా కుటుంబమే హైదరాబాద్ వచ్చింది. అప్పుడు పెద్దనాన్న ఇక్కడ షూటింగ్ ఉన్నన్ని రోజులు మా ఇంట్లోనే ఉండేవారు. నేను, చెల్లి ఆయనతో ఎక్కువ సరదాగా గడిపే వాళ్లం. ఇంద్ర 75 రోజుల ఫంక్షన్లో నేను ఆయనను చూసి స్ఫూర్తి పొందాను. ఆ వేడుకకు కనుచూపు మేరలో అభిమానులు వచ్చారు. చివర్లో ఉన్న జనాన్ని చూసి నాకు అనిపించింది.... వారికి ఎందుకు అంత అభిమానమని... అప్పుడే నిర్ణయించుకున్నాను. ఆయనంత కాకపోయినా కొంతైనా నేను సాధించాలని.

నచ్చేవి

- చిరంజీవి రుద్రవీణ... చరణ్ మగధీర, ధృవ, అల్లు అర్జున్ ఆర్య, వేదం,
- రామ్‌చరణ్ డ్యాన్స్, అల్లూఅర్జున్ అకుంఠిత శ్రమ, స్టైల్, సాయిధరమ్ తేజ్ కామెడీ
- అమ్మ చేసే బిర్యానీ
- ఫిక్షన్ పుస్తకాలు
- పర్యాటకంగా లండన్(అక్కడి చల్లని వాతావరణం, ఆర్కిటెక్చర్)
- సౌందర్య, రమ్యకృష్ణల అభినయం

మీ నాన్నకు, పెదనాన్నకు తేడా ఏంటి?

పెదనాన్నలో విపరీతమైన తపన ఉంటుంది. పని పట్ల చాలా అంకితభావం ఉంటుంది. మానాన్న చాలా సింపుల్. వీరిద్దరి మధ్య పెరిగిన నాకు ఈ రెండు అలవడ్డాయి. కష్టపడేతత్వం, నిరాడంబరంగా ఉండటం.

బాబాయ్(పవన్‌కల్యాణ్)తో అనుబంధం?

బాబాయ్ సాధారణంగా తక్కువ మాట్లాడతారు. ఇంట్లోనే ఆయనను ఎక్కువగా కలుస్తాను. మాతో సినిమాల గురించి పెద్దగా మాట్లాడరు. ఒకసారి నేను, సాయిధరమ్ తేజ్ నైట్ టైం బయటికి వెళ్లి ఆలస్యంగా వచ్చాం. అప్పుడే బాబాయ్ పిలిచి బాధ్యత గుర్తు చేశారు. మీరు చిరంజీవి అనే పెద్ద చెట్టు నుంచి వచ్చారు. అది మిమ్మల్ని ఎల్లప్పుడూ కాపాడదు. జీవితం అంటే సీరియస్‌గా తీసుకోండి. మీ గుర్తింపు మీదే. చిరంజీవి తమ్ముడి కొడుకువని నీ సినిమాకు రారు. మీ ప్రయాణం మీదే. జాగ్రత్త అని కొంచెం గట్టిగా చెప్పారు. అప్పటి నుంచి నాలో, తేజ్‌లో మంచి మార్పు వచ్చింది.

రామ్‌చరణ్, అల్లు అర్జున్‌తో ఎలా ఉంటారు?

చరణ్ అన్నంటే చిన్నప్పుడు బాగా భయం ఉండేది. ప్రస్తుతం ఇద్దరం బాగా కలిసిపోతాం. అన్ని పంచుకుంటాం. అన్నయ్య ఎక్కువగా కుటుంబంతో గడపడానికి ప్రాధాన్యం ఇస్తారు. కుటుంబం గురించి ఎక్కువగా ఆలోచిస్తారు. అంతా పెద్దనాన్న లాగే. ఇక బన్నీ నన్ను బాగా ప్రోత్సహిస్తారు. అభినందిస్తారు.



చిరంజీవితో ఎప్పుడో సినిమా చేశాను

'మగధీర'లో రామ్‌చరణ్‌తో కలిసి పెద్దనాన్న నటించారు. చరణ్ అన్న చాలా సంతోషపడ్డాడు. 'అన్న ఇప్పుడు చేశాడు... నేను ఎప్పుడో చేసేశాను అని గర్వంగా చెప్పేవాణ్ని. 'హ్యాండ్సప్' సినిమాలో పెదనాన్నతో కలిసి అతిథి పాత్ర చేశాను. దీని చిత్రీకరణ నిఫ్ట్‌లో జరిగింది. నేను అక్కడి బాగా రెడీ అయ్యి వెళ్లాను. దర్శకుడు అడిగారు. అనుకోకుండా నటించేశాను. అది నా అదృష్టం.

చిరంజీవి సినిమాల్లో ఏమైనా రీమేక్ చేయాలని ఎప్పుడైనా అన్పించిందా?

ఎప్పటికీ ఆ సాహసం చేయను. ఆయన సినిమాలు రీమేక్ చేయను.

పెద్దనాన్న నుంచి వచ్చిన మంచి ప్రశంస?

కంచె సినిమా సమయంలో మెచ్చుకున్నారు. అయితే నా నటనలో చిన్న లోపాలున్నాయని వాటిని సరిదిద్దుకోమని చెప్పారు. తొలిప్రేమ సినిమా చూసి బాగా నటించావని, చాలా పరిణితితో చేశావని అభినందించారు. ఇంతకంటే ఒక నటుడిగా నాకేం కావాలి.

ఓటములు ఎదురైనప్పుడు బాధ నుంచి ఎలా బయటపడతారు?

నాకు ఇప్పటి వరకూ కెరీర్ పరంగా 'మిస్టర్' పెద్ద ఫెయిల్యూర్. రెండు రోజులే బాధపడ్డాను. అందులో నేను చేసిన తప్పులు సవరించుకున్నాను. తర్వాత మళ్లీ 'ఫిదా' పనిలో పడిపోయాను. ఓటములు మనల్ని ఆపకూడదండి. ముందుకు వెళితే మళ్లీ విజయాలు వస్తాయి.

కొత్త సినిమా కబుర్లు?

సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో ఒక సినిమా చేయాలనుకుంటున్నాను. అది స్పేస్‌కు సంబంధించిన కథ. ఇంత వరకూ తెలుగులో ఇలాంటి నేపథ్యంలో సినిమా రాలేదు.

'తొలిప్రేమ' టైటిల్ పెట్టేటప్పుడు మీ ఫీలింగ్?

ఈ సినిమాకు మొదట విత్ లవ్ ఆదిత్య, ఎంతెంత దూరం? అనే టైటిల్స్ అనుకున్నాం. మళ్లీ ఆలోచనలు ఆగలేదు. కథకు ఇంకా మంచి పేరు కావాలని వెదికాం. అప్పుడు తోచింది తొలిప్రేమ. కొందరు వద్దని చెప్పారు. అంతకంటే ఎక్కువ మంది బాగుందన్నారు. మేం కథ నమ్మాం. ప్రస్తుతం హ్యాపీ.

– కోగటం వీరాంజనేయులు

'నీ పేర్లో స్టైల్ ఉందే, మత్తు ఉంది, వైబ్రేషన్స్ ఉన్నాయి...' అని అమీతుమీలో ఇషారెబ్బా పలికే సంభాషణల్లోలానే ఆమె నటనలోనూ అవన్నీ కనిపిస్తాయి. అందుకే ఆమె ఏ పాత్ర చేసినా అది చక్కగా పండుతుంది. 'అంతకుముందు ఆ తరువాత'తో తెలుగు తెరకు పరిచయమైన పదహారణాల తెలుగమ్మాయి ఈమె. ఇటీవల విడుదలైన 'అ!'లో రాధగా యువతను ఆకట్టుకుంటుంది. సినిమాల్లో తెలుగమ్మాయిల ప్రవేశం, భాష, ప్రేమ గురించి ఇషా చెప్పిన సంగతులు....



ప్రేమిస్తున్నా అంటే థ్యాంక్స్ అంటా

ఫలితం మాటెలా ఉన్నా, చేసే ప్రతి సినిమాతోనూ నటిగా పేరు తెచ్చుకొంటుంటారు. ఏమిటా రహస్యం?

రహస్యమంటూ ఏమీ లేదండీ. నా దగ్గరికొస్తున్న అవకాశాలు... నేను ఎంపిక చేసుకొంటున్న విధానం... చేతిలో ఉన్న పాత్రకి వంద శాతం న్యాయం చేయాలనే తపన... ఇవే నన్ను నటిగా నిలబెట్టాయని నమ్ముతుంటా. తెలుగమ్మాయిలకి చాలా తక్కువగా అవకాశాలు వస్తుంటాయి. వచ్చినా ఆలస్యంగా వస్తుంటాయి. మనదాకా వచ్చిన అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా చేసుకోకూడదనేది నేను నమ్మే సిద్ధాంతం.

నటిగా నిరూపించుకున్నా కానీ... సరైన అవకాశాలు రావడం లేదే అని ఎప్పుడైనా అనిపించిందా?

అలాంటి అసంతృప్తి ఎప్పుడూ లేదు. ఇప్పుడేం చేస్తున్నానో అది నాకు సంతృప్తినిస్తోంది. నా దృష్టిలో బాగున్న ప్రతి సినిమా వాణిజ్య ప్రధానమైనదే కానీ... చాలామంది 'మీరు వాణిజ్య ప్రధానమైన చిత్రాల్లో అవకాశాలు ఎందుకు రావడం లేదు?' అని అడుగుతుంటారు. దానికి సమాధానం నా దగ్గర లేదు.

అసలు తెలుగమ్మాయిలు చిత్ర పరిశ్రమలోకి రావాల్సిన అవసరం ఎంతవరకు ఉందంటారు?

చాలా అవసరం ఉంది. తెలుగు సినిమాలో తెలుగమ్మాయి నటిస్తే ఆ ప్రభావమే వేరుగా ఉంటుంది. ఎక్కువ అవకాశాలు వస్తున్నాయా లేదా అని ఆలోచించకుండా... ఎవరికైతే ఆసక్తి ఉంటుందో వాళ్లంతా రావాలి. వచ్చి మంచి సినిమాలు చేయాలి. ఎక్కువమంది తెలుగమ్మాయిలు పరిశ్రమలో కనిపిస్తూ, నాణ్యమైన పనితీరుని కనబరుస్తూ ఉంటే తప్పకుండా ఫలితం ఉంటుంది. ఎప్పుడైనా మనం చేసే పనే మాట్లాడుతుందని నా అభిప్రాయం.

చిత్ర పరిశ్రమ గురించి రకరకాల ప్రచారం సాగుతుంటుంది. ఎప్పుడైనా మీకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి?

ప్రతి చోటా మంచి, చెడు ఉన్నట్టే ఇక్కడా ఉన్నాయి. ప్రతిదీ ఓ అనుభవమే. మనం మంచి వైపు అడుగులు వేయాలంటే చెడు గురించి తెలుసుకోవాలి. ఇక్కడ రకరకాల మనుషులు ఉంటారు. చిత్ర పరిశ్రమ చాలా విషయాల్ని నేర్పింది. వ్యక్తిగా మరింత దృఢంగా మారడానికి కారణమైంది.

కొందరు ప్రపోజ్ చేసేవాళ్లు

స్కూల్ రోజులు నాకు ఇప్పటికీ గుర్తే. నేను బాగా సిగ్గరిని. అందరూ నన్ను సరదాగా ఆట పట్టించేవాళ్లు. నేను కథానాయికని అయ్యానని తెలిశాక వాళ్లంతా ఆశ్చర్యపోయుంటారు (నవ్వుతూ). స్కూల్ డేస్‌లో చాలా శ్రద్ధగా చదివేదాన్ని. ఇంటర్‌లోకి వచ్చాక కొంచెం స్వేచ్ఛ దొరికినట్టైంది. కాలేజీకి బంక్ కొట్టి స్నేహితులతో కలిసి సినిమాలు చూసేదాన్ని. ఇక డిగ్రీ, పీజీ చేస్తున్నప్పుడు కాలేజీకి వెళ్లడమే తక్కువైంది. అలాగని చదువులో అశ్రద్ధగా ఉండేదాన్ని కాదు. నాకు బ్యాక్‌లాగ్స్ ఉండేవే కాదు. పరీక్షలు దగ్గరికొచ్చేసరికి బాగా చదివేసి పరీక్షలు గట్టెక్కేదాన్ని. అప్పట్లో ప్రేమకథలంటూ ఏమీ లేవు కానీ... కొద్దిమంది అబ్బాయిలు ప్రేమిస్తున్నట్టు చెప్పేవాళ్లు. థ్యాంక్స్ అని సమాధానమిచ్చి వెళ్లిపోయేదాన్ని (నవ్వుతూ).



ముక్కుపుడుకంటే ఇష్టం

ఇటీవల విడుదలైన 'అ!' చిత్రంలో చేసిన రాధ పాత్ర ఎంతో సంతృప్తినిచ్చింది. అందులో నా అభినయం, అందం నచ్చిందని మెచ్చుకొన్నారు చాలామంది. రాధలాగా అందంగా కనిపించడమంటే ఇష్టం. ముక్కు పుడకతో ఎలా ఉంటానో అని చాలాసార్లు అనిపించేది. ఆ కోరిక రాధ పాత్ర తీర్చింది.

రెండు యాసలు వచ్చు

మా నాన్నది వరంగల్. అమ్మదేమో రాజమండ్రి. నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే అయినా నాకు రెండు యాసలూ బాగా వచ్చు. నా తొలి సినిమా రోజులూ నాకు ఎప్పటికీ గుర్తుంటాయి. దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి 'అంతకుముందు ఆ తరువాత' చిత్రం కోసం నన్ను ఎంపిక చేసుకొన్నాక ఆ సమయంలో సంభాషణలు మొదలుకొని, సన్నివేశం వరకు ప్రతిదీ ప్రాక్టీస్ చేసేదాన్ని. కానీ సెట్‌కి వెళ్లేసరికి సంభాషణలు మరిచిపోయేదాన్ని.

– నర్సిమ్ ఎర్రకోట, ఫొటోలు : మధు

ఈనాడు సినిమా

పట్టుకో.. పట్టుకో.. హిట్టు పట్టుకో!



రకుల్‌ప్రీత్ సింగ్



తమన్నా

ఓ మ్యాచ్‌లో సెంచరీ కొడితే... మరో నాలుగైదు మ్యాచ్‌ల వరకూ చూసుకోవాల్సిన అవసరం లేదు. ఓ సిరీస్ ఆడకపోయినా.. మరో సిరీస్‌లో నిరూపించుకోవచ్చు. బ్యాటింగ్‌లో కాకపోయినా బౌలింగ్‌లో మెరవచ్చు.

ఇలా క్రికెట్‌లో ఉన్న సౌలభ్యాలు.. సినిమాల్లో ఉండవు. వరుసగా ఎన్ని హిట్లిచ్చినా సరే, ఓ ఫ్లాపు పడిందంటే అనుమానంగా చూస్తారు. రెండో మూడో పరాజయాలు వరుస కడితే... కెరీర్ పీకల్లోతు కష్టాల్లో పడిపోతుంది. అందుకే చిత్రసీమలో ప్రతీ అడుగూ కీలకమే. ప్రతీ సినిమా ముఖ్యమే!

కొంతమంది కథానాయికల అడుగులు కాస్త తడబడుతున్నాయిప్పుడు. వాళ్ల కెరీర్‌లో చాలా కీలకమైన మలుపులో ఉన్నారు కొంతమంది. తదుపరి సినిమా గనుక హిట్టు కొట్టకపోతే, నిరూపించుకోకపోతే - సినిమా ప్రయాణం సందిగ్ధంలో పడే ప్రమాదం ఉంది. అలాంటి కథానాయికలెవరున్నారో ఓ లుక్కేస్తే...!



అను ఇమ్మాన్యుయేల్

కథానాయికల కెరీర్ దిన దిన గండం - నూరేళ్ల ఆయుష్షులానే ఉంటుంది. ఎప్పుడు ఎలాంటి పరిస్థితులు వస్తాయో చెప్పలేం. కొన్నిసార్లు పరాజయాలు వెక్కిరిస్తున్నా, చేతిలో కావల్సినన్ని సినిమాలుంటాయి. ఇంకొన్ని సార్లు.. ఒక్క ఫ్లాపుకే తలుపులన్నీ మూసుకుపోతాయి. ఇప్పుడు అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. కథానాయికల మధ్య పోటీ ఎక్కువవ్వడం, కొత్తమ్మాయిలు విరివిగా రావడం వల్ల గెలుపు గుర్రాల వైపే మొగ్గుతున్నారు దర్శక నిర్మాతలు.



లావణ్య త్రిపాఠీ

నిరూపించుకోవాల్సిందే!

నిన్నా మొన్నటి వరకూ తమన్నా అగ్ర కథానాయికల జాబితాలోనే ఉండేది. అయితే ఇప్పుడు ఆ స్థానం ప్రమాదంలో పడింది. 'బాహుబలి 2' తరవాత ఆమె పెద్దగా కనిపించలేదు. అగ్ర కథానాయకుల చిత్రాల్లోనూ ఆమెకు ఇప్పుడు అవకాశాలు తగ్గిపోయాయి. ప్రస్తుతం కల్యాణ్‌రామ్‌తో కలసి నటిస్తోంది. ఈ చిత్రం విజయవంతమైతే తప్ప... ఆమె మళ్లీ రేసులోకి రావడం కష్టం. 2017లో నాలుగు చిత్రాల్లో మెరిసింది రకుల్‌ప్రీత్‌సింగ్. అందులో ఒక్కటీ క్లీన్ 'హిట్' అనిపించుకోలేదు. 'స్పైడర్' అయితే బాగా నిరాశ పరిచింది. యేడాదికి నాలుగైదు చిత్రాలతో మెరిసే రకుల్ ప్రస్తుతం తెలుగులో ఖాళీ. ఆమె దృష్టి ఇప్పుడు మిగిలిన భాషలపై పడింది. తెలుగులో మునుపటి వేగం అందుకోవాలంటే... ఓ సూపర్ హిట్ పడి తీరాల్సిందే. అందుకే ప్రస్తుతం విజయాల వేటలో పడింది రకుల్. 'నేను శైలజ'తో ఆకట్టుకుంది కీర్తి సురేష్. ఒక్క సినిమాతోనే అగ్ర కథానాయకుల దృష్టిలో పడిపోయింది. ఏకంగా 'మహానటి'లో సావిత్రిగా నటించే అవకాశం అందుకుంది. అయితే... 'అజ్ఞాతవాసి' పరాజయం ఆమెను కాస్త ఇబ్బంది పెడుతోంది. 'నేను శైలజ' విజయం గాలివాటం కాదని నిరూపించుకోవాలంటే ఇప్పుడామెకు ఓ మంచి విజయం అవసరం. 'మహానటి'తో అలాంటి విజయం దక్కబోతోందన్న ధీమా వ్యక్తం చేస్తోంది కీర్తి. 'మహానటి'తో నిరూపించుకొంటే... కీర్తి చేతికి మరిన్ని అవకాశాలు రావడం ఖాయం. 'ఆక్సిజన్', 'అజ్ఞాతవాసి' పరాజయాలు అను ఇమ్మాన్యుయేల్ కెరీర్‌ని ప్రమాదంలో పడేశాయి. ప్రతిభావంతురాలైన కథానాయికగా పేరు తెచ్చుకుంటున్న దశలో వరుసగా రెండు సినిమాలు పల్టీ కొట్టడంతో అను జాగ్రత్త పడాల్సిన పరిస్థితులొచ్చాయి. ఇక మీదట కథల ఎంపికలో ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటానంటోంది అను. ప్రస్తుతం 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా', 'శైలజా రెడ్డి అల్లుడు' చిత్రాల్లో నటిస్తోంది. ఇవే ఆమె కెరీర్‌ని నిర్దేశించబోతున్నాయి. కెరీర్‌లో పట్టుజారిపోకుండా ఉండాలంటే... ఈ రెండు చిత్రాలూ విజయాల్ని అందుకోవాల్సిందే.



కీర్తి సురేష్

ఇదీ మంచికే...

లావణ్య త్రిపాఠీని వరుస పరాజయాలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇటీవల విడుదలైన 'ఇంటిలిజెంట్' కూడా ఆమెకు నిరాశాజనకమైన ఫలితాన్నే అందించింది. అంతకు ముందు 'యుద్ధం శరణం', 'మిస్టర్' కూడా ఫ్లాపుల బాట పట్టాయి. ఇప్పుడామెకు అవకాశాలు రావడమే గగనంలా అనిపిస్తోంది. లావణ్య తన పాత ఫామ్‌ని అందిపుచ్చుకోవాలంటే ఒక ట్రెండు మంచి విజయాల్ని తన ఖాతాలో వేసుకోవాల్సిందే. 'రాజా ది గ్రేట్', 'జవాన్', 'కేరాఫ్ సూర్య' చిత్రాల్లో మెరిసింది మెహరీన్. 'రాజా..' ఓకే అనిపిస్తే.. 'జవాన్', 'సూర్య'లు మాత్రం నిరాశ పరిచాయి. ఆయా చిత్రాల్లో మెహరీన్ అందంగా కనిపించినా, ఫలితం లేకుండా పోయింది. మెహరీన్ కథ ముగియకుండా ఉండాలంటే మళ్లీ ఓ విజయంతో మెరవాల్సిందే. సమంత, అనుష్క, కాజల్... వీళ్ల చేతిలో ఇప్పుడు విజయాలు ఉండొచ్చు. నెంబర్‌వన్ స్థానం కోసం వీళ్ల మధ్య పోటీ ఏర్పడవచ్చుగాక. అయితే.. ఇందులో ఏ ఒక్కరి స్థానం శాశ్వతం కాదు. అందుకే... ప్రతీ అవకాశాన్నీ అపురూపంగానే చూసుకుంటున్నారు. పోటీకి తగ్గట్టుగా తమని తాము నిరూపించుకునే పనిలో పడ్డారు. పరిశ్రమకు ఇలాంటి పోటీ అవసరం కూడా! పడిపోతాం అనుకున్నప్పుడే కదా, జాగ్రత్తగా అడుగు లేస్తాం, పోటీ ఉన్నప్పుడే కదా సిసలైన సత్తాని బయటకు తీసుకొస్తాం. భవిష్యత్తులో ఈ కథానాయికల నుంచి అత్యున్నత ప్రతిభ చూసే అవకాశాలైతే పుష్కలంగా ఉన్నాయి.



మెహరీన్

నిర్మాణంలో ఉండగానే...



రవితేజ

సినిమా వ్యాపారం కొత్త పుంతలు తొక్కుతోంది. టీవీ, అంతర్జాలం రాకతో వ్యాపార ముఖచిత్రం మారిపోయింది. శాటిలైట్, డిజిటల్ మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయి. డిజిటల్ మాధ్యమాల్లో అనువాదాలుగా తెలుగు చిత్రాలు మంచి ఆదరణ దక్కించుకుంటున్నాయి. దీంతో డిజిటల్ డబ్బింగ్ మార్కెట్‌లో తెలుగు చిత్రాలకి డిమాండ్ ఏర్పడింది. రవితేజ కథానాయకుడిగా కల్యాణ్‌కృష్ణ కురసాల తెరకెక్కిస్తున్న కొత్త చిత్రం శాటిలైట్, డిజిటల్ మార్కెట్, హిందీ డబ్బింగ్ హక్కులు కలిపి రూ.25 కోట్లకి అమ్ముడైనట్టు సమాచారం. రవితేజ చిత్రాలు హిందీ అనువాదాలుగా టీవీల్లోనూ, అంతర్జాలంలోనూ చక్కటి ఆదరణని దక్కించుకుంటున్నాయి. అందుకే నిర్మాణంలో ఉండగానే రవితేజ సినిమాల హిందీ డబ్బింగ్ హక్కుల కోసం పోటీపడుతుంటారు. ఇప్పుడూ అదే జరిగింది. ఇప్పటికే రూ.25 కోట్లు వ్యాపారం చేసుకొన్న రవితేజ చిత్రం బాక్సాఫీసు వ్యాపారం ఏ స్థాయిలో చేస్తుందో చూడాలి. 'సోగ్గాడే చిన్నినాయనా', 'రారండోయ్ వేడుక చూద్దాం'తో విజయాల్ని అందుకొన్న కల్యాణ్‌కృష్ణ ఈ చిత్రాన్ని మాస్ కథతో తెరకెక్కిస్తున్నారు. రామ్ తాళ్లూరి నిర్మాత. రామోజీ ఫిల్మ్‌సిటీలో చిత్రీకరణ జరుగుతోంది. 'నేల టికెట్' అనే పేరు ప్రచారంలో ఉంది.

ఆశాభోస్లేకి యశ్‌చోప్రా పురస్కార ప్రదానం

ప్రఖ్యాత గాయని ఆశాభోస్లే యశ్‌చోప్రా స్మారక జాతీయ పురస్కారం అందుకున్నారు. ముంబయిలో జరిగిన కార్యక్రమంలో టి.సుబ్బిరామిరెడ్డి ఫౌండేషన్ సంస్థ ఆశాభోస్లేని సత్కరించింది. మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు ఆశాభోస్లేకి ట్రోఫీతో పాటు రూ.10 లక్షల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో నటీనటులు రేఖ, జాకీ ష్రాఫ్, పరిణితి చోప్రా, పూనమ్ ధిల్లాన్, జయప్రద తదితరులు పాల్గొన్నారు.




ఆశాభోస్లే, విద్యాసాగర్‌రావు

అప్పటి ముచ్చట!

ముందు పులి... వెనక సింహం!


హాస్య నటుడు పద్మనాభం తమ సొంత బ్యానర్ రేఖా అండ్ మురళీ ఆర్ట్స్ పతాకంపై మొదటి చిత్రంగా 1965లో 'దేవత' నిర్మిస్తున్న రోజులు. అందులో ఓ పాట అవుట్‌డోర్ షూటింగ్ కోసం సాత నూర్ డ్యాంకి వెళ్తున్నారు. హీరో ఎన్టీఆర్‌ని ప్రత్యేకంగా ఓ కారులో తీసుకెళ్తున్నారు. రాత్రి ప్రయాణం. ఎన్టీఆర్ వెనక సీట్లో హాయిగా నిద్రపోతున్నారు. కారుని పద్మనాభం తమ్ముడు పురుషోత్తం నడుపుతున్నారు. తోవలో చిట్టడవి... మెలికలు తిరిగిన రోడ్డు... రోడ్డుకి అడ్డంగా ఓ చిరుత పులి... పద్మనాభంకి, ఆయన తమ్ముడికి ముచ్చెమటలు. హారన్ కొట్టకుండా, కారు హెడ్‌లైట్ మాత్రం ఆన్ చేసి ఉంచారు. కాసేపటికి చిరుత పులి మౌనంగా అడవిలోకి వెళ్లిపోయింది. కారు బయల్దేరింది. తెల్లవారిన తర్వాత ఎన్టీఆర్‌తో పులి గురించి చెప్పగా... అప్పుడు ఎన్టీఆర్- "అరె... నన్ను లేపకపోయారా నేను కూడా చూసి ఉండేవాణ్ని కదా?" అన్నారట! అప్పుడు పద్మనాభం "అన్నగారూ కారు ముందు పులి ఎలాగూ ఉంది. కారు వెనుక సీట్లోని సింహాన్ని లేపితే ఇంకేమైనా ఉందా!" అన్నారట. దానికి ఎన్టీఆర్ సింహం లెవల్లో నవ్వారట! ఇది జరిగిన చాలా కాలం తర్వాత ఆయన సొంత బ్యానర్ మీద "సింహం నవ్వింది" (03-03-1983)అని ఓ సినిమా తీయడం అది వేరే కథ!



ఎన్టీఆర్

బ్రహ్మ ఎలా మాట్లాడాలి?

అది 1962... 'శ్రీకృష్ణార్జున యుద్ధం'లో బ్రహ్మ, సరస్వతి మాట్లాడుకునే సన్నివేశాన్ని దర్శకుడు కె.వి రెడ్డి చిత్రీకరిస్తున్నారు. షాట్ ఓకే అయింది. అంతలో ఏ మూల నుంచో గుసగుసలు. కె.వి రెడ్డి షూటింగ్‌లో ఉన్నప్పుడు చీమ చిటుక్కుమనడానికి వీల్లేదు. ఆయన చిరాగ్గా తలతిప్పి చూశారు. ఒక లైట్ బాయ్.. పక్కనున్న వ్యక్తితో తగ్గించిన స్వరంతో మాట్లాడుతున్నాడు. "ఏమిటది?" అంటూ కె.వి రెడ్డి లైట్ బాయ్‌ని ప్రశ్నించారు. అప్పుడతను తడబడకుండా "సార్ బ్రహ్మదేవుడికి నాలుగు ముఖాలున్నాయి కదా? పక్కనే ఉన్న సరస్వతీ దేవితో అటువైపున్న ముఖంతో మాట్లాడకుండా అన్ని తలలూ తిప్పి మాట్లాడటం దేనికి?" అనడిగాడు. మామూలుగా అయితే మండిపడే కె.వి రెడ్డి క్షణకాలం పాటు ఆలోచించారు. లైట్ బాయ్ అడిగిన ప్రశ్న అర్థవంతమైందని గ్రహించారు. "నీతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. కానీ నువ్వన్నట్లుగా సరస్వతీ దేవి వైపున్న తలతో బ్రహ్మను మాట్లాడించే సాంకేతిక సౌలభ్యం మనకు అందుబాటులో లేదు... అది గనక ఉంటే తప్పకుండా బ్రహ్మదేవుడి పాత్రను తల తిప్పకుండా మాట్లాడించాల్సిందే!" అంటూ లైట్ బాయ్ సందేహాన్ని మెచ్చుకుంటూ నివృత్తి చేశారాయన.



కె.వి. రెడ్డి

\- శ్రీవత్స

ముప్ఫై కథలున్నాయి



"అ' ఓ ప్రయోగం అని నాకు ముందే తెలుసు. అందుకే ఈ చిత్రాన్ని తక్కువ నిర్మాణ వ్యయంతో నేనే నిర్మిద్దామనుకున్నా. కానీ నాని ముందుకొచ్చి ఆ బాధ్య తను తాను తీసుకున్నార" న్నారు ప్రశాంత్ వర్మ. ఆయన దర్శకుడిగా పరిచయమైన చిత్రం 'అ'. నాని నిర్మాత. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా శనివారం ప్రశాంత్ వర్మ హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ "ఇది వరకు లఘు చిత్రాలు తెరకెక్కించిన అనుభవం ఉంది. నా తొలి చిత్రం సరికొత్త ప్రయత్నంగా ఉండాలనుకున్నా. అందుకే ఇలాంటి కథ రాసుకున్నా. మామూలు కమర్షియల్ చిత్రాలతో పోలిస్తే 'అ' ఓ విభిన్నమైన చిత్రం. అందుకే తొలిసారి చూసినప్పుడు ప్రేక్షకులు ఆశ్చర్యానికి లోనయ్యారు. కొంతమందికి అర్థం కాకపోవొచ్చు. మరోసారి చూస్తే ఎలాంటి గందరగోళం ఉండదు. 'అ' కథకు ప్రత్యేకంగా స్ఫూర్తి అంటూ ఏదీ లేదు. చిత్ర నిర్మాణ బాధ్యతల్ని నాని మోయడానికి ముందుకు వచ్చినప్పుడు 'అ' ఆయన పేరుని పాడుచేయకుండా ఉంటే చాలనుకున్నా. అవార్డుల కోసమో, డబ్బుల కోసమే ఈ ప్రయత్నం చేయలేదు. కాకపోతే ఇప్పుడు మాత్రం మా టీమ్‌లో కొంతమందికైనా పురస్కారాలు వస్తాయనిపిస్తోంది. నా తదుపరి కథ కూడా ఇలానే సరికొత్త జోనర్‌లో ఉంటుంది. ప్రస్తుతం నా దగ్గర ముప్ఫై కథల వరకూ ఉన్నాయి. తదుపరి సినిమా ఎవరితో అనేది ఇంకా నిర్ణయించుకోలేద"న్నారు.



జరా షా

సైబర్ నేరాల కథ

అభిషేక్, నీరజ్, మృణాల్, కర్తవ్య శర్మ, ఇంద్రనెల్లి సేన్‌గుప్తా, జరా షా ప్రధాన పాత్రధారులుగా రాజ్ మదిరాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఐతే. 2.ఓ'. లాగవుట్ యు ఆర్ హ్యాక్డ్... అనేది ఉపశీర్షిక. కె.విజయరామ రాజు, డా.హేమంత్ వల్లపురెడ్డి నిర్మాతలు. ఈ చిత్రం మోషన్ పోస్టర్ విడుదల వేడుక శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ముఖ్య అతిథులు దర్శకురాలు నందిని రెడ్డి, నిర్మాత రాజ్ కందుకూరి మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నిర్మాతలు మాట్లాడుతూ "హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ విద్యార్థుల జీవితాలు ఈ చిత్రంలో కనిపిస్తాయి. కథలోని తాజాదనానికి తగ్గట్లుగానే కొత్తవాళ్లతో సినిమాను తీశాం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఆకలి, ఆశ, ఆక్రోశం... ఈ మూడూ మనిషిని క్రూరుణ్ని చేస్తాయి. ఇంజినీరింగ్ అయ్యాక మూడేళ్ల పాటు నిరుద్యోగంతో ఖాళీగా తిరిగిన కుర్రాళ్లు, చివరికి ఆక్రోశానికి బలై నేరస్థులుగా ఎలా మారారనేది కథ. సైబర్ నేరాల నేపథ్యంలో సినిమా సాగుతుంది. ప్రేక్షకులకు చిన్న హెచ్చరికతో కూడిన సందేశాన్ని చెప్పబోతున్నాం. చిత్రం మార్చి 16న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుంది" అన్నారు. కార్యక్రమంలో శ్రీధర్ నల్లమోతు, కార్తీక్ పల్లె, కౌశిక్ అభిమన్యు, చంద్రశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అమ్మా భయమేస్తోంది...



అన్నం తినకపోతే... దెయ్యానికి పట్టించేస్తా!

లతా టీచర్‌కి చెప్పమంటావా...!

అల్లరి చేస్తున్నావు కదూ... కిందింటి తాతగారిని పిలవనా.. వచ్చి చీకటిగదిలో పెట్టేస్తారు!...

ఇలా పిల్లలు మాట విననప్పుడల్లా రకరకాలుగా భయాలు పెట్టడం మనకు మామూలే కదూ...

కానీ ఆ భయాలు పెద్దయ్యాక వాళ్లపై ప్రభావం చూపిస్తాయి...

కొన్నిసార్లు జీవితాంతం కొనసాగుతాయి..

మరెలా... అసలు భయపెట్టకూడదా! ఏం చేసినా వదిలేయాలా అంటారా...

ఆగండి.. దానికీ ఓ పద్ధతుంది.. అదే తెలుసుకుందాం...

భయం... రోజుల పాపాయి నుంచీ, ఏళ్లూ, కొన్నిసార్లు జీవితాంతం వెంటాడుతుంది. ముందడుగు వేయలేని అసమర్థతగా మారిపోతుంది. అంతర్లీనంగా వారి మనసుపై ఆధిపత్యం చెలాయించి, ఆ భయానికి బానిసలుగా చేస్తుంది. సరైన సమయంలో ఆ భయాన్ని పోగొట్టకపోతే కొన్నిసార్లు ప్రమాదస్థాయికీ చేరుకోవచ్చు. అసలు భయం ఎందుకు మొదలవుతుందీ, అది లేకుండానే చిన్నారుల్ని క్రమశిక్షణగా ఎలా పెంచాలనేదీ ఈ రోజుల్లో మనలో చాలామంది నేర్చుకోవాలి. ఆట మధ్యలో ఐదేళ్ల కావ్యని ఓ చీకటిగదిలో ఉంచి తలుపేసి వచ్చేశాడు ఏడేళ్ల రమేష్. అల్లరి చేస్తున్నావంటూ అమ్మ అప్పుడప్పుడూ తనను చీకటి గదిలో ఉంచినప్పుడల్లా తానెంతో భయపడేవాడు.

ఇప్పుడు కావ్య కూడా భయపడి, రేపటి నుంచీ తను చెప్పిన మాట వింటుంది అనేది రమేష్ భావన. ఈత నేర్చుకోవాలి. కానీ పదేళ్ల అజయ్‌కి ఈతకొలను చూస్తే చచ్చిపోతానేమో అనే భయం. తల్లిదండ్రులు ఎన్నిసార్లు ప్రయత్నం చేసినా నేర్పించలేకపోయారు. వీళ్లనే కాదు.. చాలామంది పిల్లల్లో ఇలాంటివి కనిపిస్తుంటాయి. దానికి కారణం ఒక విధంగా అమ్మానాన్నలే తెలుసా...!

అభద్రతకు దారితీస్తుంది...

రోజుల పాపాయికి నిద్రలో ఉన్నప్పుడు గట్టిగా వినిపించే శబ్దాలూ, వేడినీళ్లూ, కాస్త గట్టిగా ఊయల ఊపడం... ఇలాంటివన్నీ భయాన్ని పెంచితే, కాస్త పెద్దపిల్లలకు మనం రకరకాల సందర్భాల్లో చెప్పే విషయాలు కొన్ని. కాస్త పెద్దయ్యే కొద్దీ టీవీలో వచ్చే దృశ్యాలూ, వికృతంగా ఉండే బొమ్మలూ, తెలియని వ్యక్తుల అరుపులూ, ఇంట్లో అమ్మ గట్టిగా అరిచినా కూడా భయపడతారు. 'జాగ్రత్త కిందపడతావు', 'చీకట్లో బయటకు వెళ్లకు', 'అక్కడ బల్లి ఉంది', 'దెయ్యం ఉంది తెలుసా...' ఇలా చాలా రకాలుగా భయపెడుతుంటాం. వీటన్నింటి కారణంతో వాళ్లు సైకిలు తొక్కడానికీ వెనకాడతారు. కొన్నిసార్లు ఎలా మాట్లాడాలో, ఏం చేయాలో తెలియక మౌనంగా ఉండిపోతారు. ఇక, చెప్పిన మాట వినకపోతే పెట్టే భయాలు మనకు తెలిసినవే. వాస్తవానికి పిల్లలకు ఎలాంటి భయాలు ఉండవు. అసలు చిన్నారులు చీకటి, వేడీ, బూచీ.. ఇలాంటివాటికి అసలు భయపడరని ఓ సర్వే తేల్చింది. అవన్నీ పెద్దవాళ్లు చెప్పేవేనట. అదే వారిని అభద్రతకు దారితీస్తుందట. అలాంటి చిన్నారుల్లో కొందరు అవకాశం దొరికినప్పుడు తోటివారిపై అదే భయాన్ని ప్రయోగిస్తారు. 'నేను భయపడ్డా కదా, వాడూ నా మాట వినాలంటే భయపెట్టడమే పరిష్కారం అనుకుంటారు. ఇక, పిల్లలు కాస్త పెద్దయ్యేకొద్దీ నలుగురిలోకి వెళ్లడానికి భయపడతారు. టీచరు దగ్గరకు వెళ్లి ధైర్యంగా మాట్లాడలేని స్థితికీ చేరుకుంటారు. ఏ పని చేయాలన్నా కంగారు పడతారు. సంకోచిస్తారు. మానసిక స్థైర్యాన్ని కోల్పోతారు. ఇక, కొన్నిసార్లు అనుకోకుండా ఓ రోడ్డు ప్రమాదాన్ని చూడటం, ఇంట్లో తల్లిదండ్రులు దెబ్బలాడుకొని ఒకరిపై మరొకరు దాడి చేసుకోవడం, లేదా తెలిసినవారి మృతి... వంటివన్నీ చిన్నారుల మనసును గాయం చేస్తాయి. స్నేహితులను లేదా తెలిసిన వారిని కుక్క కరవడం చూస్తే, ఇంక కుక్క వద్దకు వెళ్లరు. తోటి విద్యార్థిని ఉపాధ్యాయుడు కొడితే చాలు, పాఠశాలకు వెళ్లాలంటే భయం. ఈ తరహా సంఘటనలు పునరావృతం అయ్యేకొద్దీ భయం పెరుగుతుంది. ఇలాంటివారు ఎవరైనా దెబ్బలాడుకుంటున్నా వణికిపోతారు. ఏది చేయాలన్నా ముందు ప్రతికూలంగా ఆలోచిస్తారు. ఏదయినా జరుగుతుందేమోనని సంకోచిస్తారు. ఇవనే కాదు.. మార్కులు రావేమో, సరిగ్గా ఆడలేనేమో, ఓడిపోతానేమో, చేయగలనా లేనా.. ఇలాంటి సందేహాలన్నీ కొన్నిసార్లు భయం నుంచే మొదలవుతాయి.



పోగొట్టేద్దాం...

సరే... ఏ కారణం చేతో చిన్నారుల్ని భయపెట్టే ఉంటాం. మనమే దాన్ని పోగొట్టే ప్రయత్నం చేద్దాం.

మాట్లాడాలి: పిల్లలతో వీలైనంత ఎక్కువ సేపు మాట్లాడటం తల్లిదండ్రులు చేయాల్సిన మొదటి పని. వాళ్ల అలవాట్లూ, ఆసక్తులూ, అభిరుచుల నుంచి మొదలుపెడితే.. వాళ్ల భయాలు తెలుస్తాయి. అది చెప్పే స్వేచ్ఛను మనమే ఇంట్లో కల్పించాలి. మీరెలా అధిగమించారనేదీ వాళ్లకు తెలియజేయాలి. మీకు ఏది చెప్పినా సాయం చేస్తారనే నమ్మకాన్ని కలిగించాలి. ధైర్యాన్ని నూరిపోయాలి.

గుర్తించండి: చిన్నతనంలో పిల్లల్లో ఊహాశక్తి కాస్త ఎక్కువగానే ఉంటుంది. అదే సమయంలో చిన్నచిన్న భయాలూ ఉంటాయి. వాటిని గుర్తించే బాధ్యత మనదే. మనమే భయపెట్టినా.. కొన్నాళ్లకు పట్టించుకోం. అలాగని నిర్లక్ష్యం చేయకూడదు. దాన్ని గుర్తించాలి. ఉదాహరణకు చీకటంటే భయపడుతోంటే పిల్లలు వెలుతురు లేని చోటకు వెళ్లేందుకు సంకోచిస్తారు. కనీసం బాత్రూంకి వెళ్లాలన్నా మీరో, తోబుట్టువో పక్కన ఉండాలనుకుంటారు. ఆ సంకేతాలు కనిపిస్తోంటే వాళ్లు భయపడుతోన్నట్లే అర్థం. దాన్ని గుర్తిస్తే గనుక బయటపడేలా చేయడమే ఉత్తమం. నెమ్మదిగా వాళ్లంతట వాళ్లు అధిగమించేలా చేయాలి. నీ అంతట నువ్వువెళ్లు.. నేను ఇక్కడే ఉంటా... ఏ మాత్రం భయపడినా వెంటనే వస్తా అనే ధైర్యాన్ని ఇవ్వగలగాలి. అది ఒక్కరోజులో సాధ్యం కాదు కానీ.. నెమ్మదిగా అధిగమించే ప్రయత్నం చేయడం కష్టమేమీ కాదు. మరో పనీ చేయొచ్చు. ఆటల రూపంలోనూ వాళ్ల భయాలు పోగొట్టవచ్చు. గదిని చీకటిమయం చేసి చిన్న టార్చిలైటు వెలుగులో కథల పుస్తకాలు చదివి వినిపించండి. చీకట్లో వెలిగే బొమ్మల్ని కూడా కానుకగా ఇవ్వొచ్చు.

విశ్రాంతి పొందేలా: పిల్లలకు నాలుగైదేళ్లు వచ్చాయనుకోండి.. దీర్ఘంగా శ్వాస తీసుకునే వ్యాయామాలు చేయించండి. అంటే.. నిటారుగా ఉండి, దీర్ఘంగా శ్వాస తీసుకుని వదలడం అలవాటు చేయాలి. ఇలా రోజులో కొన్ని నిమిషాలు చేయనివ్వాలి. అందులో పట్టు వచ్చాక 'నీకు భయం వేసినప్పుడల్లా ఇలా చేసి చూడు' అని చెప్పండి. అలవాటు చేసుకుంటారు. దయ్యం అంటే భయమని చెబుతున్నారా... 'అలాంటి సినిమాలు చూడొద్దు అన్నా వాళ్లు చూస్తారు.. అందుకే టీవీలో ఏదయినా సన్నివేశం చూడాల్సి వచ్చినప్పుడు కళ్లు మూసుకో లేదా ఆ నిమిషానికి టీవీ కట్టేయి.. అని చెప్పండి. అది భయంకరం కాబట్టి నేను చూడను అని వాళ్లంతట వాళ్లే అనుకునేలా చేయండి. ప్రత్యామ్నాయంగా వాళ్లకు ఉపయోగపడేవీ, నవ్వు తెప్పించేవి చూసేలా అలవాటు చేయడం మంచిది.

పుస్తకాలు చదవాలి: పిల్లల్లో భయం పోగొట్టేందుకు కథలు బాగా ఉపయోగపడతాయి. 'ఫలానా వాళ్లు ఇలా చేశారు...' అని వివరంగా చెబుతోంటే వాళ్లూ నెమ్మదిగా అర్థంచేసుకుంటారు. మేమూ అలాగే చేయొచ్చు అని కనీసం ఆలోచిస్తారు. దీన్ని బిబ్లియోథెరపీ (పుస్తకాల ద్వారా సాంత్వన) అంటారు. కథల్లోలా పిల్లలు తమను తాము పోల్చుకుని అధిగమించేందుకు ప్రయత్నిస్తారు.

దగ్గరకు తీసుకోవాలి: ఏ మాత్రం భయంగా ఉన్నారని మీకు అనిపించినా... వాళ్ల ముఖంలో ఆ సంకేతం కనిపించినా వెంటనే దగ్గరకు తీసుకోండి. గట్టిగా హత్తుకోండి. అలాగే వెన్ను నిమిరినా, కౌగిలించుకున్నా.. వాళ్లలో భయం సంకేతాలు చాలామటుకూ తగ్గుతాయని యూనివర్సిటీ ఆఫ్ మియామీకి చెందిన అధ్యయనకర్తలు చెబుతున్నారు. ఓ పని చేయొచ్చు.. పిల్లలు ఏ మాత్రం భయపడుతున్నా 'అమ్మా నన్ను దగ్గరకు తీసుకోవా' అని వాళ్లంతట వాళ్లే అడిగేలా కూడా చేయండి.



చిట్టి విష్ణుప్రియ
మానసిక నిపుణురాలు

అలసిన కళ్లకు... గ్రీన్ టీ!



బరువు తగ్గడానికీ, ఆరోగ్యంగా ఉండటానికి రోజూ గ్రీన్‌టీ తాగాలని చెబుతారు. అలానే మనం వాడి పడేసే గ్రీన్‌టీ బ్యాగులను కూడా చర్మ సౌందర్యం పెంచడానికి వాడొచ్చు. అదెలాగంటే..

- ముఖం కాస్త అలిసిపోయినట్లు కనిపిస్తే గ్రీన్‌టీని ప్రయత్నించొచ్చు. చల్లబడ్డ గ్రీన్‌టీని స్ప్రే బాటిల్‌లో పోసి, దానిలో కొన్ని చుక్కలు ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్ కలపాలి. దీన్ని ఫ్రిజ్‌లో పెట్టి అవసరమైనప్పుడల్లా ముఖానికి రాసుకుంటే చేసుకుంటే ఉత్సాహంగా అనిపిస్తుంది.
- చర్మం ఎర్రగా కమిలి, దురద పెడుతుంటే అప్పుడే వాడేసిన గ్రీన్‌టీకి కాస్త వంటసోడా, తేనె కలిపి సమస్య ఉన్న చోట పూతలా వేసుకోవాలి. పది నిమిషాలయ్యాక కడిగేసుకుంటే ఉపశమనం కలుగుతుంది.
- గ్రీన్‌టీ చల్లబడ్డాక అందులో కాస్త పంచదార, తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికీ, కాళ్లకు రాసుకుంటే స్క్రబ్‌లా ఉపయోగపడుతుంది. మృతకణాలను తొలగిస్తుంది.
- గోరువెచ్చని నీళ్లలో గ్రీన్‌టీ బ్యాగులను కాసేపు ఉంచాక... బయటకు తీసి దాంట్లో ఉన్న నీళ్లను పిండేయాలి. ఇప్పుడు ఆ బ్యాగులను ఒక అరగంట ఫ్రిజ్‌లో పెట్టి, కాసేపు కళ్లమీద పెట్టుకోవాలి. దీనివల్ల అలిసిపోయిన కళ్లకు సాంత్వన లభిస్తుంది. కళ్లు కాస్త ఉబ్బినట్లు కనిపించినా ఇలా ప్రయత్నించి చూడొచ్చు.
- కొంతమందికి విధినిర్వహణలో భాగంగా రోజూ మేకప్ వేసుకోవడం తప్పనిసరి. అలాంటప్పుడు ప్రతి రోజూ ఉదయాన్నే మేకప్ వేసుకునే ముందు గ్రీన్‌టీతో ఆవిరి పడితే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. దీనివల్ల చర్మానికి కావల్సిన తేమ కూడా అందుతుంది.

కాళ్ల ఆకృతికీ డంబెల్స్!


కాళ్లూ, చేతులు దృఢంగా ఉంచడంలో డంబెల్స్ భలే ఉపయోగపడతాయి. వాటితో అప్పుడప్పుడూ వ్యాయామాలు చేయడం వల్ల ఎన్నో లాభాలుంటాయి. శరీరం కూడా తీరైన ఆకృతిని సంతరించుకుంటుంది. కాబట్టి ఇంట్లో రెండు డంబెల్స్ పెట్టుకోవడం మంచిది. వీటిని అయిదారు సార్లు గాలిపీలుస్తూ, వదులుతూ చేయాలి. తరువాత నెమ్మదిగా కాళ్లూ, చేతులూ మారుస్తూ పది నుంచి పన్నెండుసార్లు కూడా చేయొచ్చు. ప్రయత్నించి చూడండి మరి.



ముందుగా వెన్నూ, కాళ్లను వంచకుండా నిటారుగా నిల్చోవాలి. రెండు చేతులతో డంబెల్స్ పట్టుకోవాలి.



చిత్రంలో చూపిన విధంగా మెల్లిగా ఎడమకాలిని వెనక్కి పెట్టి పైకి లేపాలి. రెండు కాళ్లు ఒకదానికొకటి లంబకోణం(తొంభై డిగ్రీలు) లో ఉండేలా చూసుకోవాలి. ఎడమచేతిని ముందుకు వంచి, కుడి చేతిని కుడి తొడ దగ్గర ఉంచాలి. నెమ్మదిగా ముందుకు వంగాలి. ఈ స్థితిలో కొన్ని సెకన్లు ఉండాలి. ఇలా చేయడం వల్ల కాలి కండరాలు బలపడతాయి.



డా॥ మణిపవిత్ర
ఫిట్‌నెస్ నిపుణురాలు



పై స్థితిలోనే ఉంటూ ఎడమకాలిని నెమ్మదిగా కిందకు పెట్టాలి. ఎడమ చేయిని చిత్రంలో చూపిన విధంగా మోచేయి వరకు మడవాలి. కుడిచేతిని కాలికి సమాంతరంగా చాపాలి.



పై స్థితిలోనే ఉంటూ ఎడమకాలిని ఇంకొంచెం పైకి ఎత్తాలి.

ఉద్యోగంలో చేరుతున్నా... ఏవి బాగుంటాయి?

నేనో అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగంలో చేరబోతున్నా. ప్రముఖ స్థానంలో ఉన్న ఓ వ్యక్తికి సెక్రటరీ పోస్టు నాది. హుందాగా, ఆకట్టుకునేలా కనిపించాలంటే ఎలాంటి దుస్తులు ఎంచుకోవాలో చెప్పండి.

- కీర్తన, హైదరాబాద్.

ముదురు రంగు సిల్క్ పాంటుపై లేత రంగు చొక్కాలు వేసుకుని, వీలైతే మ్యాచింగ్ బ్లేజర్ వేసి చూడండి. స్కర్టులు లేదా మిడీలు కూడా ఈ ఉద్యోగానికి బాగుంటాయి. అయితే స్కర్టులు మోకాళ్ల కిందకు వచ్చేలా చూసుకోవాలి. వీటిపై రఫుల్స్ టాప్ ఎంచుకుంటే ఆకట్టుకునేలా కనిపిస్తారు. లేత వర్ణం స్కిన్‌టైట్ సాక్సులు జతగా వేసుకుంటే చాలు. కావాలనుకుంటే వీటిని స్కర్టులకు మ్యాచింగ్‌గా ధరిస్తే చూడటానికి బావుంటుంది. వీటికి ఎత్తు చెప్పులు లేదా బూట్లు నప్పుతాయి. అలాగే ఇప్పుడు అన్ని రంగుల్లో పలాజోలు దొరుకుతున్నాయి. ముదురు రంగుల్లో ఎంచుకుని, పొడవాటి కుర్తాలు ప్రయత్నించొచ్చు. కుర్తాలపై సన్నని పూల డిజైను ఉంటే ఇంకా ఆకట్టుకునేలా కనిపిస్తారు. హుందాగానూ ఉంటారు. అలాగే పొడుగ్గా కాకుండా మోకాళ్ల కిందవరకూ వచ్చే గౌన్లు కూడా మీకు నప్పుతాయి. ఇవి ఒకే రంగులు కాకుండా, రకరకాల డిజైన్లలో లేత వర్ణాల్లో ఉండేలా ఎంచుకోవాలి. వీటిపై హీల్స్ వేసుకోవడం మర్చిపోకూడదు. చేతులకు కూడా సింపుల్‌గా ఉండేలా బ్రేస్‌లెట్ లేదా ఓ వాచీ పెట్టుకుంటే చాలు. అప్పుడప్పుడూ జీన్స్‌ను కూడా ఎంచుకోవచ్చు. వీటిపై పొడవు చేతులుండేలా, లేత వర్ణం చొక్కాలు హుందాగా ఉంటాయి. జుట్టు వదులుగా ఉండేలా చూసుకోవడం మరవకూడదు.

డియర్ వసుంధర



ధన్యా గుప్తా
డిజైనర్

మనసు బాలేదా... మల్లెనూనె ఉందిగా!

మల్లె, గులాబీ లాంటి పూలూ, నిమ్మ, నారింజ లాంటి ఫలాలూ, దాల్చినచెక్కా, లవంగం లాంటి సుగంధ ద్రవ్యాల నుంచి వచ్చే సువాసనలతో ఒక్క క్షణం మనల్ని మనం మరిచిపోతాం. ఈ పరిమళాలు మన మనసుకు ప్రశాంతతను కలగజేస్తాయనడంలో ఆశ్చర్యమేమీ లేదు. వాటి నూనెలతోనూ ఎన్నో లాభాలున్నాయంటున్నారు పరిశోధకులు.



మల్లె: వీటి నుంచి తీసిన నూనె మనలోని ఆందోళనలను తగ్గిస్తుంది. నిద్రలేమీ, ఆందోళనా, ఒత్తిళ్లను తగ్గించడానికి పూర్వకాలం నుంచి ఈ నూనెను వినియోగిస్తున్నారు. మనసును ఆహ్లాదకరంగా మార్చే గుణం ఈ నూనెకు ఉంది.



గులాబీ: ఇది పూలలో మహారాణి. దీని సువాసన మాటల్లో వర్ణించలేం. చాలా సుగంధ పరిమళ ద్రవ్యాల తయారీలో ఈ నూనె వాడతారు. ఈ నూనె మనసును ప్రశాంతంగా ఉంచడమే కాదు, నిస్పృహలను కూడా తరిమేస్తుంది.



లావెండర్: ఇది మూడ్‌ను చిటికెలో మార్చేస్తుంది. ఈ పూల పరిమళం మీకు సాంత్వన కలిగిస్తుంది. నిద్రలేమీ, శ్వాసలో ఇబ్బందులను కూడా తగ్గిస్తుంది.



దాల్చిన చెక్క: ఈ నూనెలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎక్కువ. ఇవి అలసిన నాడులకు ఉపశమనాన్ని అందించడంతోపాటు కొత్త శక్తిని అందిస్తాయి. ఈ నూనె సువాసనను నేరుగా పీల్చుకోవచ్చు. లేదా కొబ్బరి, ఆలివ్ నూనెలతో కలిపి శరీరానికి మర్దనా చేసుకున్నా హాయిగా ఉంటుంది.



నిమ్మ: తాజా, పుల్లటి రుచి కలిగిన ఈ పండు పరిమళం మనలో నూతనోత్తేజాన్ని పెంపొందిస్తుంది. అలసట, బాధ, ఒత్తిడిగా ఉన్నప్పుడు ఈ నూనెను వాడి చూడండి. వాసన చూసిన కొన్ని క్షణాల్లోనే మీ మూడ్ ఉల్లాసంగా, ఉత్సాహంగా మారుతుంది. అంతేకాదు మీరు చేసే పనులపై ఏకాగ్రత కూడా కుదురుతుంది.

నజరానా

దుస్తులపై, ఇతర వస్తువులపై కరిగిన కొవ్వొత్తి పడితే... ఆ భాగంలో కాస్త వెనిగర్ వేసి చూడండి. కాసేపటికి మైనం ఊడి వచ్చేస్తుంది.

బంగారం వెండి

17 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,780	31,810	31,400	31,500
ఆర్నమెంట్	29,680	29,710	29,150	29,150
వెండి (కిలో)	39,750	39,922	40,000	40,000
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	30,138	30,140	31,530	31,440
ఆర్నమెంట్	29,070	29,070	29,490	29,400
వెండి (కిలో)	39,900	39,800	39,000	39,300
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	31,670	31,450	-------	-------
ఆర్నమెంట్	29,450	29,250	2,949	2,940
వెండి (కిలో)	39,900	39,900	41.70	41.90

లొబోలా తరువాతే పెళ్లి!

దక్షిణాఫ్రికా మహిళలు ముఖ్యంగా జింబాబ్వే వారిని నల్లని ముత్యం అంటారు. జింబాబ్వే దేశంలో వలసరాజ్యం సంస్కృతి ఎక్కువగా కనిపిస్తుంది. వారి ఆహారం, ఆహార్యంలో ఆ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. అక్కడ అమ్మాయిల్ని పెళ్లి చేసుకోవాలనుకునే అబ్బాయిలు వాళ్లకు లొబోలా చెల్లించాలట. అంటే కన్యాశుల్కం లాంటిదన్నమాట. తరతరాలుగా వస్తున్న ఈ సంస్కృతి ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అబ్బాయి పెళ్లి చేసుకోవాలనుకున్న తరువాత ముందు వధువును ఎంపిక చేసుకోవాలి. ఆ తరువాత వారి పెద్దలను ఒప్పించాలి. అంతటితోనే పెళ్లయిపోదు. లొబోలా చెల్లించాకే పెళ్లి బాజాలు మోగుతాయి. కుటుంబ ఆర్థిక స్థాయి మేరకు ఆ డబ్బు వేల నుంచి లక్షల డాలర్ల వరకు కూడా ఉండొచ్చు. అంతేకాదండోయ్. ఆ దంపతులు నిండు నూరేళ్లు కలిసి జీవిస్తే ఫరవాలేదు. కానీ ఇరువురికి మధ్య ఏదయినా గొడవలు వచ్చి విడిపోతే అమ్మాయి పరిస్థితిని బట్టీ అయితే ఆ డబ్బు తిరిగి ఇచ్చేయొచ్చు. ఆ నిర్ణయం మాత్రం అమ్మాయిదే అవుతుంది. ఇక, అక్కడి అమ్మాయిలు సౌందర్య పోషణకు ఏం వాడతారో తెలుసా.. బెండకాయ. అవును ఇది నిజం. చర్మం నిగనిగలాడేందుకు ఉడికించిన బెండకాయ గుజ్జును ముఖానికి రాసుకుంటారు. పావుగంట తరువాత శుభ్రం చేసుకుంటారు. ఇది ఫేస్ ప్యాక్‌లా ఉపయోగపడుతుంది. ఆ గుజ్జు ముఖానికి రాసుకుని బాగా మర్దన చేయడం వల్ల రక్తప్రసరణ బాగా జరిగి ముఖం నిగనిగలాడుతుంది. వీళ్లు పాటించే మరో చిట్కా ఏంటో తెలుసా... ఉదయం పూట వీరు తాగే నిమ్మకాయ, తేనె కలుపుకోవడం. ఈ రెండింటినీ కచ్చితంగా పాటిస్తారట.




ప్రణాళికతోనే పనులు సులువు!

ఇల్లాలిగా ఇంటి బాధ్యతలమీద మీకు పట్టు ఉండొచ్చు. అయితే మితిమీరిన భారం ఎవరినైనా ఒత్తిడికి గురిచేస్తుంది. ఇది తీవ్ర స్థాయికి చేరుకున్నప్పుడు కంగారు పడకండి. ప్రత్యామ్నాయాలు ఆలోచించండి.

- మిసెస్ పర్‌ఫెక్ట్ అనిపించుకోవడం బాగానే ఉంటుంది. కానీ వాటిని ఒత్తిడిలేకుండా నిర్వహించుకోగలిగినప్పుడే మీకా బిరుదు సార్థకమవుతుంది. అందుకే ముందు మీ ఇంట్లో ఎంత మంది ఉంటారు. ఎవరికోసం ఏం చేయాలో ఓ కాగితంపై రాసుకోండి. వాటిల్లో నిజంగా మీ అవసరం ఎంతో ఆలోచించండి. ఎవరి సాయం లేకుండా చేసుకునే పనులేవో పక్కన రాయండి. వాటిని మీ శ్రీవారు, పిల్లలతో సహా వాటిని అమలు చేసేలా చూసుకోండి.
- మల్టీ టాస్కింగ్ వినడానికి బాగానే ఉంటుంది. వాస్తవికత మాత్రం అందుకు దూరమేనంటున్నాయి చాలా అధ్యయనాలు. అన్ని పనులూ ఒకేసారి చేద్దాంలే అని అస్సలు అనుకోవద్దు. ఇది తీవ్ర ఒత్తిడిని కలుగచేస్తుందని మరవకండి.
- ప్రణాళికాబద్ధంగా ఏ పని చేసినా సులువుగా పూర్తవుతుంది అందుకే వారానికి ప్రణాళిక తయారు చేసుకోండి. వంట మొదలుకుని దుస్తుల వరకూ అన్నింటా ఇది అమలయ్యేలా చూసుకోండి. ఒక్కరోజు తప్పినా ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయాన్నీ ఏర్పాటు చేసుకోండి. ఇది మీకు ఒత్తిడిని తగ్గిస్తుంది.

**మట్టిపాత్రల్లో తింటే మంచిదని అంటారు నిజమేనా?
రాగిపాత్రల్లో మంచినీళ్లు తాగడం.... ఇనుప మూకిట్లో వండుకోవడం వల్ల ప్రయోజనాలు వాస్తవమేనా..
అల్యూమినియం ఆహారంలో కలిస్తే అనారోగ్యకారకమా?
మరి నూనె పీల్చుకోని నాన్‌స్టిక్ పాత్రల మాటేంటి?...**



మట్టి మేలు.. తల పెట్టవోయ్!

పెరుగుతున్న ఆరోగ్యస్పృహలో భాగంగా... ఏం తింటున్నాం అనేదాంతోపాటు ఎందులో తింటున్నాం అనే ఆలోచన కూడా అందరిలో పెరుగుతోంది. మట్టిపాత్రల జమాన పోయి వంటని వేగవంతం చేసే కుక్కర్ల వాడకంలోకి ఎప్పుడో వచ్చాం. అడుగంటని నాన్‌స్టిక్ పాత్రలు... సర్జికల్ మెటల్స్‌తో చేసిన వంట పాత్రల ట్రెండ్ మనకు తెలిసిందే. మరోపక్క సామాజిక మాధ్యమాల్లో మట్టిపాత్రల్లో వండి తింటే మంచివనే ప్రచారం ఊపందుకుంది.

గట్టి శరీరానికి మట్టి...

మట్టిపాత్రల్లో చేసిన వంటకం ఆరోగ్యానికి మంచిదే. అందులో సందేహం లేదు. ఆయుర్వేదం ప్రకారం... మట్టిపాత్రలో వంటకం పోషకాలని కోల్పోకుండా చేస్తుంది. అలాగే పదార్థాల సహజసిద్ధ సువాసనలని కోల్పోకుండా చేయడంలోను, నాణ్యత తగ్గకుండా చేయడంలోను ముందుంటుంది. ముఖ్యంగా మట్టిపాత్రలకుండే సన్నని రంధ్రాలు(పోరస్).. వంటకంలోని ప్రతి అణువుకి వేడిని, తేమని, మట్టి పరిమళాన్ని అందిస్తాయి. పాత్ర, పదార్థాలు నెమ్మదిగా వేడెక్కి మాడిపోకుండా ఉంటాయి. దాంతో ఒక రకమైన ప్రత్యేకమైన రుచి వస్తుంది. శాకాహారం, మాంసాహారం రెండింటికి ఈ మట్టిపాత్రలు మంచివే. మాంసాహారం వండినప్పుడు ప్రొటీన్లు పూర్తిగా విచ్ఛిన్నమై కూరల రుచి మరింత పెరుగుతుంది. సాధారణంగా మట్టికి క్షార స్వభావం ఉంటుంది కాబట్టి... పుల్లని పదార్థాలు వండినప్పుడు వాటితో చర్యపొంది పీహెచ్ స్థాయిలు సమంగా ఉండేటట్టు చేస్తుంది. ఈ క్రమంలో శరీరానికి క్యాల్షియం, పాస్ఫరస్, మెగ్నీషియం, ఇనుము, సల్ఫర్ వంటి పోషకాల లోపం రాకుండా ఉంటుంది. వంటకాలకి తగినంత తేమ అందడం వల్ల అధికంగా నూనె, కొవ్వులని వాడాల్సిన అవసరం ఉండదు. మట్టిముంతల్లో తోడుపెట్టిన పెరుగు రుచి చాలా బాగుంటుంది. చేపలు వంటి ఘాటైన వాసన ఉండే పదార్థాలు మట్టిపాత్రల్లో వండితే రుచి, సువాసన రెండూ ఉంటాయి. అయితే పెద్దమొత్తంలో వంటలు వండేటప్పుడు మట్టిపాత్రలని ఉపయోగించలేం. ఉపయోగించినా శుభ్రత పెద్ద సమస్య.

జాగ్రత్తలు: రంగు పూయని మెరుపులేని మట్టి పాత్రలు వంటకానికి మంచివి. ఒకవేళ రంగు పూసినట్టుగా అనుమానం ఉంటే అరగంట ముందుగా నీళ్లలో నానబెట్టి రంగుపోయిన తర్వాత అప్పుడు వాడుకుంటే మంచిది.

టమాటా సాస్ వేసి చేసే వంటకాలని అల్యూమినియం పాత్రల్లో వండితే ఆ లోహం శరీరంలోకి చేరే ప్రమాదం ఉంది.



ఇనుములాంటి శరీరానికి...



ఇవి జీవితకాలం మన్నుతాయి. వాడకానికి మంచివి. కానీ వీటితో వచ్చిన ఇబ్బందల్లా ... బరువు. శుభ్రం చేయడం కష్టం. త్వరగా తుప్పుపడతాయి. ఈ ఇబ్బందులు తప్పించి.. ఇనుము బాండీల్లో వంట మంచిదే. ఇనుముతో చేసిన పాత్రల్లో వండినప్పుడు ఇనుము వంటకాల్లో చేరి ఐరన్ లోపం రాకుండా ఉంటుందని క్లెమ్‌సన్ విశ్వవిద్యాలయం అధ్యయనాలు చెబుతున్నాయి. అధిక బరువు, తుప్పు వంటి సమస్యలు రాకుండా ఆధునిక పద్ధతుల్లో ఎనామిల్, సెరామిక్ పూతలు పూసి ఈ పాత్రలని డిజైన్ చేస్తున్నారు. వీలైతే మన వంటింట్లోకి వీటికి స్థానం కల్పించుకోవడం మంచిది. ఇనుము పాత్రల్లో వంటకం పిల్లల్లో హిమోగ్లోబిన్ స్థాయిలని కూడా పెంచుతుంది.

జాగ్రత్తలు: ప్రతిరోజూ వాడకం కంటే.. వారంలో మూడుసార్లు వండితే చాలు. పుల్లని రుచి ఉండే కూరలు వండేటప్పుడు అవి ఇనుముతో చర్యపొంది వాటి రుచి మారడానికి ఆస్కారం ఉంటుంది. వాడిన తర్వాత గాఢత లేని సబ్బునీటితో కడిగి ఎండబెట్టి... కొద్దిగా వంటనూనె రాసి ఉంచితే తుప్పు పట్టకుండా ఉంటాయి. రాగి పాత్రల్లో నిల్వ చేసినట్టుగా ఇనుము పాత్రల్లో నీటిని నిల్వ ఉంచకూడదు. రుచిని, స్వభావాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. వండిన తర్వాత కూడా స్టీల్, గ్లాసు పాత్రల్లోకి వంటకాలని మార్చుకోవాలి.

స్టీల్ మంచిదే....



తళతళా మెరిసే స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు వంటకానికి సౌకర్యంగా ఉండటంతోపాటూ... శుభ్రం చేసుకోవడం తేలిక. వీటితో హాని కూడా తక్కువే. స్టీల్.. విభిన్న లోహాల సమ్మేళనం. ఇందులో పదిశాతం నికెల్ ఉంటే.. 18శాతం క్రోమియం ఉంటుంది. నికెల్ పాత్రలని మెరిసేటట్టు చేస్తే, క్రోమియం పాత్రలకు తుప్పు పట్టకుండా చేస్తుంది. సాధారణంగా అల్యుమినియం లేదా రాగి పాత్రలపై ఈ పూత పూస్తారు. ఇలా చేయడం వల్ల పాత్రలని వేడిచేయడం తేలిక. స్టీల్ పాత్రల్లో వండిన పదార్థాలకు ఎటువంటి హాని ఉండదు. ఏరకం వంటకాలైనా ఈ పాత్రల్లో వండుకోవచ్చు. ఈ పాత్రలు పదార్థాల రంగు, రుచిని పెద్దగా ప్రభావితం చేయవు.

జాగ్రత్తలు: చాలా అరుదుగా మాత్రమే నికెల్ వంట పదార్థాల్లో కలవడానికి ఆస్కారం ఉంది. అలా జరిగితే నికెల్ అలెర్జీ రావొచ్చు. కానీ ఈ పరిస్థితి అరుదే.

నూనె తక్కువ పడుతుంది...



టైటానియం గురించి మనం ఎక్కువగా విని ఉండం. ఈ లోహాన్ని శస్త్రచికిత్సల్లో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. వైద్య పరికరాల తయారీలో, దంతాలకు వేసే క్లిప్పుల తయారీలో ఎక్కువగా వాడుతుంటారు. పెద్దగా బరువు ఉండదు... దృఢంగా ఉంటుంది. ఈ సుగుణాల వల్లే ఈ లోహాన్ని వంటింటి పాత్రల తయారీలో ఉపయోగిస్తున్నారు. టైటానియంకు పదార్థాలు అంటుకోవు. దాంతో నూనె వాడకం తగ్గుతుంది. పోషకాలు, వంటకాల సహజసిద్ధ పరిమళం కోల్పోకుండా వండుకోవచ్చు. అల్యూమినియం పాత్రలపై టైటానియంని పైపూతగా వేసి ఈ పరికరాలని తయారుచేస్తుంటారు. అల్యూమినియం పదార్థాల్లోకి పోకుండా ఈ టైటానియం అడ్డుకుంటుంది. వీటిని శుభ్రం చేయడం తేలిక.

వంటకి.. నీళ్ల నిల్వకి



మన శరీరానికి కావాల్సిన అత్యవసర పోషకాల్లో రాగి(కాపర్) కూడా ఒకటి. కానీ తక్కిన లోహాలతో పోలిస్తే రాగి పాత్రల్లో వంటకం క్లిష్టమైన అంశమే అంటున్నాయి పరిశోధనలు. కారణం... మనకి రోజుకి 900మిల్లీగ్రాముల రాగి అవసరం అవుతుంది. దానికి పదిరెట్ల ఎక్కువగా అందినా మన శరీరం తట్టుకోగలుగుతుంది. నేరుగా వంటల కోసం వాడటం కన్నా... నీళ్లు నిల్వ చేసుకోవడం ఉత్తమం. వంటలు చేసినా శుభ్రత చాలా ముఖ్యం.

అల్యూమినియం తగ్గించాల్సిందే..

వంటల్లో అల్యూమినియం పాత్రలని మనం ఎక్కువగా ఉపయోగిస్తాం. కానీ గడిచిన ఐదేళ్లలో వెలువడిన అధ్యయనాల అల్యూమినియం పాత్రల వాడకాన్ని తగ్గించమని చెబుతున్నాయి. కారణం.. శరీరంలోకి చేరిన అల్యూమినియం తెచ్చే ఇబ్బందులు అన్నిఇన్నీ కావు. మన శరీరానికి హాని చేసే లోహాల జాబితా చేస్తే అందులో అల్యూమినియం ముందు ఉంటుంది.

- డాక్టర్ జానకీశ్రీనాథ్, పోషకాహార నిపుణులు

పక్కాలోకల్

కడప మమకారం దోసె!



దోసె అంటే పక్కన ఏదో ఒక చట్నీ ఉండాల్సిందే. కానీ కడప కారందోసెకి ఆ అవసరం లేదు. అందుకే తింటే కడప కారం దోసెనే తినాలని అంటారు భోజన ప్రియులు. కారం చట్నీ, బొంబాయి చట్నీ, పప్పుల పొడి దోసెతో కలిసి చేసే రుచుల అద్భుతమే కడప కారందోసె..

మినపప్పు, బియ్యప్పిండి కలిపి వేసే సాధారణ దోసెలు మనకు తెలిసినవే. ఈ కారం దోసె ఇందుకు పూర్తిగా భిన్నం. కడప వన్‌టౌన్ ఈ దోసెలను ప్రాచుర్యంలోకి తెచ్చింది. బియ్యం, మినపపప్పుతో పాటు కొద్దిగా జీలకర్ర, సెనగపప్పు, మెంతులు, అన్నం కూడా వేసి ఎనిమిది గంటల పాటు నానబెట్టి ఈ పిండిని రుబ్బుతారు. ఇక తక్కిన వాటి కోసం ముందుగా... పుట్నాల పప్పు(వేయించిన సెనగపప్పుని) పొడి కొట్టి పక్కన పెట్టుకోవాలి. సెనగపిండి చట్నీ దీన్నే బొంబాయి చట్నీ అంటారు. దీన్ని చేయడానికి పోపుదినుసులు.. జీలకర్ర, ఆవాలు, అల్లం తురుము, ఉప్పు, పసుపు, కారం, కరివేపాకు, పచ్చిమిర్చి కావాలి. నూనెలో వీటిని వేయించుకుని ఇందులో నీళ్లు పోసి మరగనివ్వాలి. ఆపై సెనగపిండి కలిపిన చిక్కని నీళ్లను ఇందులో వేస్తే క్షణాల్లో బొంబాయి చట్నీ సిద్ధం. ఇక.. కారం చట్నీ. ఇందుకు.. ఉల్లిపాయలు, కారం, ఉప్పు వేసి వీటిని రోట్లో దంచుకోవడమే. పెనంపై దోసె వేసుకుని దీనిని రెండో వైపు కూడా కాల్చుకోవాలి. ఆపై కారం చట్నీ, బొంబాయి చట్నీలని పూయాలి. ఆపై పుట్నాల పప్పు పొడిని వేసి వేడివేడిగా కడప కారందోసె తినేయడమే. కడపలో వీధివీధికి ఈ కారెం దోసె దుకాణాలున్నా... వన్‌టౌన్‌లో వేసే దోసెలు చాలా ఫేమస్సు. కొన్ని దుకాణాలు అయితే.. నలభై, యాభై ఏళ్ల నుంచి ఇదే పనిలో ఉన్నాయి. హైదరాబాద్, వైజాగ్‌వంటి నగరాల్లో కూడా ఈ కారెందోసెలు దొరుకుతున్నాయి.



అస్త్రం

అప్పడాలకర్రే కానీ..



ఒక పరికరం నాలుగు రకాలుగా ఉపయోగపడితే మంచిదేగా! స్థలం ఆదా అవుతుంది. ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న పరికరం కూడా అలాంటిదే. చూస్తుంటే చపాతీలు వత్తుకునే అప్పడాల కర్రలా ఉన్నా.. విడదీస్తే నూనె నిల్వ చేసుకునే డబ్బా అవుతుంది. మరో వైపు మసాలాలు దంచుకునేందుకు ఉపయోగపడుతుంది.

ఫటాఫట్

బ్రెడ్ దహీవడా...



కావల్సినవి:
బ్రెడ్స్: ఆరు (అంచులు తీసిపెట్టుకోవాలి), చిక్కని పెరుగు- అరకప్పు, మజ్జిగ-కప్పు, జీరాపొడి- అరచెంచా, కారం- కొద్దిగా, దానిమ్మగింజలు- రెండు చెంచాలు, చాట్‌మసాలా- అరచెంచా, నల్లఉప్పు, పంచదార- కొద్దిగా, జీలకర్ర పొడి- కొద్దిగా కొత్తమీర- కొద్దిగా

తయారీ: ఒక పాత్రలో మజ్జిగా, పెరుగు కలిపి పెట్టుకోవాలి. ఇందులో నల్లఉప్పు, పంచదార, జీరాపొడి కలుపుకోవాలి. ఇందులో రెండు రెండు బ్రెడ్డులని కలిపి పెరుగు మిశ్రమంలో ఉంచాలి. కొద్దిగా పెరుగుని పీల్చుకున్న తర్వాత తిరగేసి దానిపై చాట్‌మసాలా, దానిమ్మ గింజలూ, కారం, కొత్తిమీర, క్యారెట్ తురుము చల్లుకుంటే సరిపోతుంది.

ప్ర & జ

బటర్ చికెన్‌కి ఆ రుచి ఎలా..

మావారి ఉద్యోగరీత్యా కొన్నాళ్లు దిల్లీలో ఉన్నాం. అక్కడ బటర్ చికెన్ భలే ఉండేది. అలాంటి రుచి ఇంట్లో ఎంత ప్రయత్నించినా రావట్లేదు. బటర్ చికెన్‌కి ఆ రుచి ఎలా వస్తుంది?

– యామిని, హైదరాబాద్



బటర్ చికెన్ అన్ని నగరాల్లో ప్రాచుర్యంలో ఉన్న వంటకమే. దీన్నే ముర్గ్ మఖని అని కూడా అంటారు. దిల్లీ మోతిమహల్‌లో చేసే బటర్‌చికెన్‌కి బోలెడు గిరాకి. ఇంతకీ దీనికి ఈ రుచి ఎలా వస్తుందని అడిగారు కదా! బటర్ చికెన్ తయారీలో... డబుల్ మారినేషన్ చేసుకోవాలి. బటర్ చికెన్ కోసం బోన్‌లెస్ చికెన్ అయితే బాగుంటుంది. ఇలా తీసుకున్న తీసుకున్న చికెన్‌కి మొదట మారినేషన్ కోసం చెంచా నిమ్మరసం, ఉప్పు, కారం కలిపి అరగంట పాటు పక్కన పెట్టేసుకోవాలి. రెండో మారినేషన్ కొచ్చేసరికి కొద్దిగా కసూరిమేతి, పసుపు, గరంమసాలా, చెంచా నూనె, తగినంత అల్లంవెల్లుల్లి పేస్ట్, పెరుగు వేసి మారినేషన్ చేసుకోవాలి. దీన్ని తక్కువలో తక్కువగా ఆరుగంటలు ఉంచితేనే బటర్‌చికెన్‌కి ఆ రుచి వస్తుంది. రాత్రి మారినేట్ చేసి ఫ్రిజ్‌లో ఉంచి తెల్లారాక వండుకుంటే ఆ రుచి చాలా బాగుంటుంది. ఇంట్లో వండేటప్పుడు చాలామంది నూనె వాడేస్తారు కానీ... బట్టర్ అంటే వెన్నని తప్పనిసరిగా వాడాలి. నెయ్యితో చేస్తే వెగటుగా ఉంటుంది. దీనికోసం చేసే గ్రేవీని మకనీ గ్రేవి అని అంటారు. దాన్ని ఎలా చేసుకోవాలంటే... నాలుగు టమాటాలు, వేణ్నీళ్లలో వేసి తీసిన పది బాదంపప్పులు కానీ జీడిపప్పులు కానీ ఉండాలి. పండిన ఎర్రని టమాటాలు తీసుకుని వాటిపై చాకుతో ప్లస్ మార్క్ పెట్టాలి. వీటిని వేడినీళ్లలో వేసి తీయాలి. ఇలా చేస్తే దానిపై ఉండే చర్మం సులభంగా వచ్చేస్తుంది. లోపల విత్తనాలు కూడా తీసేసి వాటిని గుజ్జు చేయాలి. పచ్చ యాలకులు, లవంగాలు, చిటికెడు మెంతిపొడి, పంచదార కూడా వాడతారు. అవెన్‌లో రాత్రంతా మారినేట్ చేసి ఉంచిన చికెన్‌ని కొద్దిగా గ్రిల్ చేసుకోవాలి. అవెన్‌లో లేకపోతే పెనంమీద బటర్ వేసుకుని ఎక్కువ మంట మీద చుట్టూ తిప్పుతూ చికెన్ ముక్కలని కాల్చుకోవాలి. ఇలా చేయడం వల్ల చికెన్ బయట కరకరలాడుతూ లోపల జ్యూసీగా ఉంటుంది. ఇప్పుడు ఇంకో పాన్ పెట్టుకుని అందులో బట్టర్ వేసుకుని దాల్చినచెక్క, లవంగాలు, పచ్చ ఇలాచీలు వేసుకుని కొద్దిగా అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసుకుని కమ్మని వాసన వచ్చేంత వరకూ వేయించుకోవాలి. ఇందులో టమాటా గుజ్జు వేసుకోవాలి. దానిలో ఉప్పు, కారం, అరచెంచా పంచదార కూడా వేసుకోవాలి. ఆపై కొద్దిగా మెంతిపొడి, జీడిపప్పు పేస్ట్ వేసుకోవాలి. ఇందులో కసూరిమేతి, గరంమసాలా వేసుకున్నాక ముందుగా గ్రిల్ చేసుకున్న చికెన్ ముక్కలు వేసి ఉడికించుకోవాలి.



శ్రీదేవి
హోటల్ మేనేజ్‌మెంట్ నిపుణురాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/29/18 dt. 15-02-2018

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం సరిన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

[illegible]

జిల్లా: ప.గో. మండలం: జీలుగుమిల్లి గ్రామం: [illegible]

[illegible]

భారత భవితను తీర్చిదిద్దండి

విద్యాసంస్థలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు

దిల్లీ, కోజికోడ్: భారత భవితను తీర్చిదిద్దే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని విద్యాసంస్థలకు ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. దేశ జనాభాలో 65%కుపైగా యువతే ఉన్నారని.. మానవ వనరుల అభివృద్ధిపై మనం దృష్టిసారించాలని అభిప్రాయపడ్డారు. కేరళలోని కోజికోడ్‌లో ఉన్న ఫరూఖ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. సొంతకాళ్లపై నిలబడేలా చేసి.. మనుషుల ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవాలను పెంచేది విద్యేనని అన్నారు. చదువు, జ్ఞానానికి అన్ని మతాల ఆచారాల్లోనూ ప్రాధాన్యత ఉందని చెప్పారు. ఖురాన్‌లోని మొదటి పదం 'ఇఖ్రా' అంటే అర్థం చదవడమని.. జ్ఞానం కన్నా స్వచ్ఛమైనది ప్రపంచంలో మరేదీ లేదని భగవద్గీత కూడా బోధించిందని వెంకయ్యనాయుడు అన్నారు. చిన్నారులకు సరైన నైపుణ్యాలు, విద్యను అందించగలిగితే.. దేశం వేగంగా పురోగతి సాధించేందుకు అవకాశముంటుందని వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థలో సమానత్వం, నాణ్యత ఉండేలా.. విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, పరిశోధకులు పాటుపడాలని ఆయన కోరారు.

విద్వేషాన్ని ఏ మతమూ బోధించదు: ఏ మతమూ విద్వేషాన్ని బోధించదనీ, కొందరు నూరిపోస్తున్న ఉగ్రవాద ఉచ్చులో పడొద్దని వెంకయ్యనాయుడు ప్రజలను కోరారు. శనివారం ఎర్రకోట వద్ద ఎనిమిదో థియేటర్ ఒలింపిక్స్‌ను ఆరంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజల ఆలోచన విధానాన్ని మార్చడంలో కళ, సృజనలు కీలక పాత్ర పోషిస్తాయని ఉప రాష్ట్రపతి అన్నారు.

విమానాశ్రయానికి రక్షణ గోడ నిర్మాణం

కేంద్ర మంత్రి అశోక్‌గజపతి రాజు

విమానాశ్రయం (గన్నవరం), న్యూస్‌టుడే: విజయవాడ విమానాశ్రయం చుట్టూ ప్రహరీని నిర్మించి రక్షణ కల్పించడంతోపాటు అన్ని రకాల మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు తెలిపారు. శనివారం వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, జిల్లా యంత్రాంగంతో విమానాశ్రయ అభివృద్ధిపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రన్‌వే విస్తరణ, విమానాశ్రయం చుట్టూ కొత్తగా సేకరించిన భూమితో కలిపి మొత్తం 1230 ఎకరాల పరిధిలో చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. విస్తరణలో కనుమరుగవుతున్న ఆర్అండ్‌బీ రహదారుల పునర్నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం, విద్యుత్తు లైన్ల మార్పిడి వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. విస్తరణ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పర్యవేక్షణ అధికారిని నియమించి పనులను సత్వరమే పూర్తిచేసేలా చూడాలని జిల్లా కలెక్టరు లక్ష్మీకాంతాన్ని ఆదేశించారు.

ప్రయాణికుల మన్నన పొందాలి.. విమానాశ్రయ పరిపాలనా విభాగంలో ఇమిగ్రేషన్ సదస్సు ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు ముఖ్య అధికారులను పిలిపించి వారితో మాట్లాడారు. విమానాశ్రయంలో అంతర్జాతీయ ప్రయాణికులు మొదటగా కలిసేది ఇమిగ్రేషన్ అధికారులనేనని, వారి పట్ల మర్యాద పాటించి, మన్ననలు పొందాలని సూచించారు. మంత్రి వెంట విమానాశ్రయ డైరెక్టరు మధుసూదనరావు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

నరేగా పనులపై జీఐఎస్ మ్యాపింగ్

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) కింద 1,521 పంచాయతీల్లో చేపట్టే పనుల భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) మ్యాపింగ్ కోసం ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఏపీఎస్ఏసీ)తో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఒప్పందం చేసుకోనున్నది. రూ.1.59 కోట్లతో ప్రయోగాత్మకంగా చేపట్టే ఈ ప్రాజెక్టు కోసం అనుమతులిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పనుల్లో పారదర్శకత, నాణ్యత పరిశీలన కోసం ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

చింతలపూడి భూసేకరణకు అదనం!

- సమస్య పరిష్కారం దిశగా చర్యలు
- ఎకరానికి రూ.3 లక్షలు ఇచ్చేలా ప్రణాళిక

ఈనాడు, అమరావతి: చింతలపూడి ఎత్తిపోతల పథకం భూసేకరణలో కొన్ని చోట్ల ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించే దిశగా జలవనరుల శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. అదనపు మొత్తాలను చెల్లించి సేకరించాలని భావిస్తోంది. గోదావరి జలాలను వరద సమయంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టు ప్రాంతానికి తీసుకువెళ్లేందుకు ఈ ఎత్తిపోతల ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందే. గతంలోనే చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రారంభం కాగా... గత ఏడాది ఈ పథకం స్వరూపం మొత్తం మార్పుచేసి తిరిగి టెండర్లు పిలిచారు. ఇందులో భాగంగా ఇంకా దాదాపు 5వేల ఎకరాల భూమి వరకు రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. దీంతో పాటు 9560 ఎకరాల అటవీభూమి అవసరమవుతుంది.

4 ప్యాకేజీలుగా పనులు: తొలి ప్యాకేజీలో 13.22 కిలోమీటర్ల లీడింగ్ ఛానల్ తవ్వకం పనులు, మరో 36 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువ పనులు ఉన్నాయి. జల్లేరు జలాశయం నిర్మించాలి. ఇక్కడ అటవీభూమి అవసరమవుతుంది. పంపుహౌస్‌లు నిర్మిస్తున్నారు. ★ రెండు, మూడు ప్యాకేజీ పనుల్లో భాగంగా 32 కిలోమీటర్ల మేర కాలువ తవ్వకం పనులు చేపట్టారు. పంపుహౌస్‌లు ఉన్నాయి. ★ నాలుగో ప్యాకేజీలో పంపుహౌస్‌తో పాటు 38.3 కిలోమీటర్ల మేర కాలువ తవ్వకం పనులు ఉన్నాయి. ఈ అన్ని పనులకు సంబంధించి భూ సేకరణ జరుగుతోంది.

2013 చట్టానికి అదనంగా... పశ్చిమగోదావరి జిల్లాలోని చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, పోలవరం టి.నరసాపురం మండలాల్లో దాదాపు 4,300 ఎకరాల భూసేకరణకు సంబంధించి రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. వీరికి 2013 భూసేకరణ చట్టంతో పాటు వివిధ అంశాల ప్రకారం ఎకరానికి రూ.14 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు అందుతోంది. అయితే ఆ ధరకు భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించడం లేదు. తమవి విలువైన భూములని, వాణిజ్య పంటలు పండిస్తుంటామని, ఆ ధరకు ఇవ్వలేమని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అదనంగా ఎకరానికి రూ.3 లక్షల వరకు ప్రత్యేకంగా ఏకమొత్తంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు రూ.138 కోట్ల వరకు అదనంగా ఖర్చవుతుందని అధికారులు లెక్కించారు. ఈ అంశాన్ని వచ్చే మంత్రిమండలి సమావేశం ముందుంచి..ఆమోదం పొందాక ముందుకెళ్లాలని నిర్ణయించారు.

[illegible]

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. No. C1/27/2018 dt. 15-02-2018

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం సరిన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

[illegible]

జిల్లా: ప.గో. మండలం: జీలుగుమిల్లి గ్రామం: [illegible]

[illegible]

వినియోగదారుకు దక్కని ప్రయోజనం

- తీరు మార్చుకోని వ్యాపారులు
- జీఎస్టీపై తనిఖీల్లో వెల్లడి

ఈనాడు అమరావతి: జీఎస్టీ (వస్తు సేవల పన్ను) అమల్లోకి వచ్చి ఆరునెలలు దాటినా వ్యాపారుల్లో మాత్రం మార్పు రావడంలేదు. వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెంచిన పన్నులను కేంద్రం దశల వారీగా తగ్గించినా ఆ ప్రయోజనాలు వినియోగదారులకు లభించడం లేదు. బిల్లులు ఇవ్వడంలేదు, ఇచ్చినా అందులో పన్నుల వివరాలు స్పష్టంగా ఉండడంలేదు. దీని వల్ల వినియోగదారుల ప్రయోజనాలకు తగిన ప్రాధాన్యమిస్తూ తీసుకొచ్చిన చట్టం వ్యాపారులకే లబ్ధిచేకూర్చేలా తయారవుతోంది. మరోవైపు వినియోగదారులు బిల్లులు అడగడకపోవడం వ్యాపారులకు అనుకూలంగా మారింది.

వస్తువులవారీగా జీఎస్టీ ఎంత వసూలు చేశారో బిల్లులో స్పష్టంగా పేర్కొనాలి. కానీ అధిక శాతం వ్యాపారులు జీఎస్టీని బిల్లులో ప్రత్యేకంగా ప్రస్తావించడంలేదు. స్పష్టత కూడా ఉండడంలేదు. బిల్లులు ఇవ్వకుండా విక్రయించే వ్యాపారులకు కొదవలేదు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారుల మాదిరిగా కొనుగోలు చేసినప్పుడు ఈ విషయాలు వెల్లడయ్యాయి. జీఎస్టీ నిబంధనలు అనుసరించి రూ.200పైన కొనుగోలుకు తప్పకుండా బిల్లు ఇవ్వాలి.

గత జులై ఒకటో తేదీ నుంచి సోమవారం వరకు అడపాదడపా వాణిజ్య శాఖ అధికారులు 4836 కేసుల్ని నమోదుచేసి, జరిమానా కింద వ్యాపారుల నుంచి రూ7.6 కోట్ల రూపాయల వరకు వసూలు చేయడం గమనార్హం. ప్రముఖ దుకాణాల్లో విజయవాడ వాణిజ్య పన్నుల శాఖ-2 అధికారులు ఇటీవల ఆకస్మికంగా పెద్దపెద్ద స్వీట్ షాపులు, హోటళ్లు, ఎలక్ట్రికల్, ఫ్యాన్సీ, ఇతర దుకాణాలవద్దకు వెళ్లి బిల్లుల ఇస్తున్న తీరును పరిశీలించారు. కేవలం ఒక రోజులోనే 58 కేసులను నమోదుచేసి, రూ.11.60 లక్షలను జరిమానా విధిస్తూ నోటీసులను జారీచేశారు. విజయవాడ ఎంజీరోడ్డులో ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఉన్న స్వీట్‌షాపుపై రూ.4లక్షలు జరిమానా విధించారు. విజయవాడ డివిజన్-1లో గుడివాడ, జగ్గయ్యపేట, భవానిపురం, గొల్లపూడి, ఇతర ప్రాంతాల్లో ఒకేరోజు తనిఖీలను జరిపి రూ.2.40 లక్షలను జరిమానా కింద విధించారు. చిత్తూరు జిల్లాలో బిల్లులను పరిశీలించి అవి నిబంధనలకు తగ్గట్టుగా లేకపోవడం, అసలు ఇవ్వకపోవడం వంటి సంఘటనల్లో 661 కేసులను నమోదుచేశారు. నెల్లూరు జిల్లాలో 492, విజయవాడ-1లో 336, విజయవాడ-2లో 440, విజయనగరంలో 360 కేసుల వంతున నమోదయ్యాయి.

బోర్డులపై కనిపించని జీఎస్టీ గుర్తింపు సంఖ్య: నిబంధనల ప్రకారం జీఎస్టీఐఎన్ (జీఎస్టీ గుర్తింపు సంఖ్య) ఉన్న వారు విధిగా గుర్తింపు సంఖ్యను బోర్డుపై ప్రముఖంగా ప్రదర్శించాలి. ఆచరణలో చాలాచోట్ల ఇది అమలుకావడంలేదు. కాంపోజిట్ విధానంలో రిజిస్టర్ చేసుకున్న వ్యాపారులు పన్ను వసూలు చేయకూడదు. గతంలో ఈ విధానం కింద నమోదుచేసుకునేందుకు వార్షిక గరిష్ఠ లావాదేవీలు రూ.75 లక్షలు కాగా.. ఈ మొత్తాన్ని పెంచారు. ఈ విధానంలో పేర్లను నమోదు చేసుకున్న వారు పన్ను వసూలు చేయకూడదు. ఈ విషయాన్ని బోర్డు రూపంలో ప్రదర్శించాలి. అప్పుడే అక్కడ జీఎస్టీ కింద ఎలాంటి పన్ను చెలించాల్సిన అవసరం లేదని అర్థం అవుతుంది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక కొన్ని వస్తువుల ధరలు తగ్గాల్సి ఉండగా.. ఇప్పటికీ తగ్గలేదు. ఇందుకు కారణాలపై లోతుగా పరిశీలించేందుకు నిబంధనలు సహకరించడంలేదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

200 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

రాష్ట్ర సరిహద్దులో ఆంధ్ర, తెలంగాణ అధికారుల తనిఖీలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేట గ్రామపంచాయతీ పరిధిలోని రావికంపాడు వద్ద పొలాల్లో 200 కింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. జగ్గయ్యపేట సమీపంలోని దేచుపాలెం రోడ్డులో బియ్యం అక్రమ రవాణాపై సమాచారంతో స్థానిక రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ, తెలంగాణ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం విస్తృతంగా తనిఖీలు చేశారు. వాహనం జాడ తెలుసుకోలేకపోయినా, పొలంలో పట్టా కప్పి ఉంచిన బియ్యం సంచులను కనుగొన్నారు. పాలిథిన్ సంచులపై తెలంగాణ ప్రాంతాల పేర్లు ముద్రితమై ఉన్నాయి. ఈ బియ్యం తమ ప్రాంతానివేనని తెలంగాణ టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలియజేయగా, ఆంధ్ర రాష్ట్ర సరిహద్దుల్లో లభ్యం కావడంతో ఇక్కడి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్థానిక అధికారులు తెలిపారు. అనంతరం సంచులను జగ్గయ్యపేట గోదాముకు తరలించారు. ఈ బియ్యం ఎవరికి చెందినవి? ఎక్కడి నుంచి వచ్చాయి? ఎక్కడికి తరలిస్తున్నారనే వివరాలు విచారణలో తెలుసుకుంటామని తహసీల్దారు సీహెచ్ నరసింహారావు తెలిపారు.

'సీజనల్' దోపిడీ!

- గాడితప్పుతున్న వసతి గృహాల నిర్వహణ

ఈనాడు, అమరావతి: తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం వలసలు వెళ్తే.. విద్యార్థులకు చదువులమ్మ నీడను కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న సీజనల్ వసతి గృహాల నిర్వహణ గాడితప్పుతోంది. కొందరు అధికారులు, సంస్థలకు ఇవి కామధేనువుల్లా మారుతున్నాయి. వీటిల్లో ఉండే పిల్లలకు ఉదయం అల్పాహారం, రాత్రికి భోజనం అందించడంతోపాటు ప్రత్యేకంగా బోధించాల్సి ఉండగా ఇది చాలాచోట్ల మొక్కుబడి తంతుగా మారుతోంది. అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలంలోని గోనబావి, పూలకుంట గ్రామాల్లో మూడు సీజనల్ వసతి గృహాలు ఏర్పాటు చేశారు. మూడింటిలో 150మంది విద్యార్థులుండాల్సి ఉండగా.. కనీసం 80మంది సక్రమంగా ఉండడం లేదు. రాగి ముద్ద, వంకాయ చెట్నీతోనే నడుస్తున్నాయి. విశాఖపట్నం జిల్లా రోలుగుంట మండలంలో కుసర్లపూడి, జానకిరాంపురం, బలిజిపాలెం గ్రామాలకు కేటాయించారు. కుసర్లపూడిలో వసతిగృహం ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం మానేశారు. జానకిరాంపురంలో ఏర్పాటుచేసే కేంద్రం కోసం గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని తీసుకోవడం విశేషం. కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలంలోని అల్వాల్‌లో వసతిగృహాన్ని ఇటీవల అధికారుల తనిఖీ చేయగా.. రిజిస్టర్‌లో 50మందికి హాజరు వేయగా.. 30మంది మాత్రమే ఉన్నారు. దీనిపై అధికారులు నిర్వాహకులను హెచ్చరించి వదిలేశారు.

అనంతపురం, కర్నూలు, కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో తల్లిదండ్రులు వలసలు వెళ్లిన పిల్లలు 13,5,77మంది ఉన్నట్లు సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) అధికారులు గుర్తించారు. 50మంది పిల్లలకు ఒక్క కేంద్రం చొప్పున 271 సీజనల్ వసతి గృహాలను ప్రారంభించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు వీటిల్లో కేవలం 170మాత్రమే నడుస్తున్నాయి. 101 కేంద్రాలు ప్రారంభమేకాలేదు. ఒక్కో కేంద్రం నిర్వహణకు ఎస్ఎస్ఏ నుంచి నెలకు రూ.69వేలు వరకు వ్యయం చేస్తున్నారు. ఆరు నెలల పాటు వీటిని నిర్వహించనున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న వాటికే నెలకు రూ.1.17 కోట్లు ఖర్చుచేస్తున్నా.. క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ ఉండడం లేదు. ఈ వసతిగృహాలకు ప్రాథమిక ఏర్పాట్ల కింద ఏటా రూ.14 వేలు చెల్లిస్తున్నారు. ఏటా సంస్థలను మార్పు చేయడం, ఒకవేళ అదే సంస్థ రెండో ఏడాది వసతిగృహాన్ని తీసుకున్నా ఇతరుల పేర్లపై ఈ మొత్తాన్ని చెల్లించేస్తున్నారు.

చదువులమ్మ చెట్టు నీడ ఎక్కడ?

- బడి బయట 1.03 లక్షల మంది పిల్లలు
- విద్యాశాఖ తాజా సర్వేలో వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విద్యార్థుల లెక్కలు గందరగోళంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాసాధికారిక సర్వేకు, పాఠశాల విద్యాశాఖ చేస్తున్న సర్వేకు పొంతన కుదరడం లేదు. ప్రజాసాధికారిక సర్వేలో వచ్చిన విద్యార్థుల వివరాలతో పాఠశాల విద్యాశాఖ వద్దనున్న గణాంకాలను పోల్చి చూడగా 8,89,500మంది విద్యార్థుల వివరాలు లభించ లేదు. ఈ నేపథ్యంలో ప్రజాసాధికారిక సర్వేలో వచ్చిన ఆ విద్యార్థుల వివరాలను తెల్చాలని ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖను ఆదేశించింది. దీంతో విద్యాశాఖ సర్వే చేపట్టింది. విద్యాశాఖ సర్వేలో 5,56,879 విద్యార్థులు పాఠశాలల్లో చదువుతున్నట్టు ప్రధానోపాధ్యాయుళ్లు సమాచారం ఇచ్చారు. మిగిలిన 3,32,621 మంది విద్యార్థుల గురించి ఆరా తీయగా ఇప్పటి వరకూ 1.03 మంది పిల్లలు బడిబయట ఉన్నట్టు తేలింది. మరో 49,600మంది వివరాలు దొరకడం లేదు. ఏటికేడు తగ్గాల్సిన బడిబయట పిల్లల సంఖ్య ఈ సర్వే ప్రకారం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది ఈ సంఖ్య 56,054మందిగా ఉంది.

తాజాగా విద్యాశాఖ నిర్వహించిన సర్వే ప్రకారం: బడిబయట పిల్లల సంఖ్య 1.03 లక్షలకు చేరింది. ★ వీరిని పాఠశాలల్లో చేర్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. ★ ప్రజాసాధికారిక సర్వేలో గుర్తించిన వారిలో సుమారు 49,600మంది విద్యార్థులు వివరాలు లభించడం లేదు. ★ మరో 1.29లక్షల మంది విద్యార్థులు బడిలో ఉన్నట్లు సర్వే అధికారులు పేర్కొనగా.. ఈ సమాచారాన్ని అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్ధరించాల్సి ఉంది. ★ నాలుగైదు నెలలుగా ఈ సర్వే కొనసాగుతోంది.

పిల్లలు బడిమానేయడానికి కారణాలు	బడిమానేసిన పిల్లల సంఖ్య
పేదరికం	8,668
బడి దూరం	4,630
సదుపాయాలులేక	2,192
బాల్యవివాహాలు	932
అనారోగ్యం	2,650

పాక్‌కు రూ.3200 కోట్ల చైనా రుణం

ఇస్లామాబాద్: అడుగంటుతున్న విదేశీ మారకపు నిల్వలను నింపేందుకు రూ.3219.5 కోట్లు (500 మిలియన్ల డాలర్లు)ను పాకిస్థాన్.. చైనా నుంచి రుణంగా తీసుకుంది. చైనా పారిశ్రామిక, వాణిజ్య బ్యాంకు (ఐసీబీసీ) ఈ మొత్తాన్ని మంజూరు చేసింది. జనవరి 15న దీన్ని తీసుకున్నారని, వడ్డీ రేటు 4.5 శాతమని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. దీంతో గత జనవరిలో తీసుకున్న కొత్త రుణాల మొత్తం రూ.4533.05 కోట్లుకు పెరిగింది. ప్రస్తుతం విదేశీ రుణాల మొత్తం విలువ వార్షిక బడ్జెట్ అంచనాలో 86 శాతానికి సమానం. గత ఏడు నెలల్లో తీసుకున్న రుణాల్లో 25 శాతం (రూ.10,302.19 కోట్లు -1.6 బిలియన్ల డాలర్లు) చైనా నుంచి పొందినవే.

దిల్లీలో కేసీఆర్ జన్మదినోత్సవం

ఈనాడు, దిల్లీ: ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా శనివారం దిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. చిన్నారి గనిష్క కేక్ కట్ చేయగా సీఎం అదనపు వ్యక్తిగత కార్యదర్శి అమరేందర్‌రావు, ఎంపీల సహాయకులు, తెరాస కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు పాల్గొన్నారు.


శరవేగంగా ఎదుగుతోంది తెలంగాణ: కేటీఆర్

ఈనాడు డిజిటల్, చెన్నై: అన్ని రంగాల్లో అభివృద్ధి ద్వారా దేశంలోనే శరవేగంగా ఎదుగుతున్న ఆర్థికశక్తిగా తమ రాష్ట్రం ఖ్యాతి పొందినట్లు తెలంగాణ ఐటీశాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. మద్రాసు మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా శనివారం చెన్నైలో 'ఎదుగుదల- దాన్నుంచి నేర్చుకోవడం'పై సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ... ఈ సదస్సులో పెద్దల ఉపన్యాసాల నుంచి కొత్త విషయాలు నేర్చుకున్నానని చెప్పారు.

ఘరానా దొంగ

నీరవ్ మోదీ పెట్టిన రూ.11,400 కోట్ల కుచ్చుటోపీకి భారత బ్యాంకింగ్ రంగమే కాదు.. ఎల్ఐసీ వంటి ఇతర ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల చేతులు కూడా బానే కాలాయని వార్తలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఈ కుంభకోణంలో పీకల్లోతు కూరుకుపోయిన పంజాబ్ నేషనల్ బ్యాంకు, గీతాంజలి జెమ్స్ వంటివాటిలో పెట్టుబడులు పెట్టిన వారి నెత్తిన కూడా ఇప్పుడు నష్టాల మూటలు వచ్చిపడుతున్నాయి. అయితే దేశవిదేశాల్లో ఇంతటి భారీ ప్రకంపనలు సృష్టిస్తున్న నీరవ్ మోదీ కిరికిరి వ్యవహారంలో ఇప్పుడు ఒకటి కాదు.. రెండు కాదు.. అడుగడుగునా సమాధానాల్లేని ప్రశ్నలే వినిపిస్తున్నాయి.

దోచిందెలా



నిన్న మొన్న కాదు... 2011 లోనే మొదలైంది. ఒకటి కాదు... రెండు కాదు... 293 ఎల్ఓయూలు (లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్). ఎల్ఓయూలు జారీ చేసిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) మాత్రమే నష్టపోలేదు. అలహాబాద్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా... ఇలా పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు ఈ వ్యవహారంలో పీకల దాకా కూరుకుపోయాయి. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ విదేశీ వర్తకం పేరుతో పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి ఎల్ఓయూలు తీసుకొని రూ.11,400 కోట్లకు టోకరా వేయటం ఎలా సాధ్యమైంది? ఇది అంత సులువా? కిందిస్థాయిలోని ఒక డిప్యూటీ మేనేజర్, మరొక అధికారి సహకారంతోనే ఇంత పెద్ద ఆర్థిక నేరం చేయటం వీలైందా? బ్యాంకుల్లోని విజిలెన్స్ వ్యవస్థ, బ్యాంకులపై నిఘా ఉంటే భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) దీన్ని ఎందుకు పట్టుకోలేకపోయాయి. చేతులు కాలిన తర్వాత... మోసం జరిగింది, మేం నష్టపోయాం, దర్యాప్తు చేసి దోషులను శిక్షించండి... అని పంజాబ్ నేషనల్ బ్యాంకు సీబీఐకి ఫిర్యాదు చేసే వరకూ ఎందుకు దీన్ని నివారించలేకపోయారు? ఇవన్నీ సాధారణ ప్రజలందరి మదిలో మెదులుతున్న సందేహాలు. కుంభకోణం పరిమాణం, తీవ్రతను చూసే ఏదో కింది స్థాయిలో ఇద్దరు ముగ్గురు సిబ్బంది సహకారంతో జరిగిందిలాగా కనిపించటం లేదని బ్యాంకింగ్ వర్గాలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ వర్గాల అంచనా ప్రకారం దీన్లో నిస్సందేహంగా పెద్ద తలకాయల ప్రమేయం ఉండి ఉంటుంది. జరిగిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించి, అది సాధ్యం కాకపోవటంతో బయటపెట్టక తప్పని సరి పరిస్థితి ఎదురైనట్లు వివరిస్తున్నారు.

ఎలా బయటకు వచ్చింది?

- ముంబాయిలోని తమ శాఖలో మోసం జరిగినట్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు, సీబీఐకి ఫిర్యాదు చేయటంతో నీరవ్ మోదీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు స్టాక్‌ఎక్స్ఛేంజీల్లో నమోదైన కంపెనీ. అందుకే ఇదే విషయాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీలకు కూడా తెలియజేసింది. అలా బయటి ప్రపంచానికి ఈ మోసపూరిత వ్యవహారం తెలిసింది.

ఇలా మొదలైంది?

- విదేశాల్లో ముడి వజ్రాలు కొనుగోలు చేసి వాటిని ఇక్కడకు దిగుమతి చేసుకొని ఆభరణాలు తయారు చేసి విక్రయించటం నీరవ్ మోదీ కంపెనీలు చేసే వ్యాపారం. ముడి వజ్రాలు తనకు విక్రయించిన విదేశీ కంపెనీలకు నీరవ్ మోదీ డబ్బు చెల్లించాలి. ఇందుకోసం బ్యాంకుల నుంచి 'ఎక్స్‌పోర్ట్ ఫైనాన్స్' తీసుకోవచ్చు. కానీ దానిపై వడ్డీ రేటు అధికం. ఎటూ విదేశీ వర్తకంలో చెల్లింపులన్నీ డాలర్లలో జరుగుతాయి. డాలర్ రుణాలపై వడ్డీ రేటు ఎంతో తక్కువగా ఉంటుంది. కానీ నీరవ్ మోదీకి డాలర్ రుణం విదేశాల్లో ఏ బ్యాంకు ఇస్తుంది? అక్కడి బ్యాంకులకు నీరవ్ తెలియదు కదా...అందుకే అతను ముంబాయిలో పీఎన్‌బీని ఆశ్రయించాడు.

> నీరవ్ మోదీ దోపిడీ యావత్తూ పంజాబ్ నేషనల్ బ్యాంకు ఇచ్చిన 'ఎల్ఓయూ' పత్రాల చుట్టూతానే తిరుగుతోంది. మొదట్లో ఈ పత్రాలను బ్యాంకులోని ఇద్దరు సిబ్బంది ఇచ్చేశారని చెప్పారుగానీ ఇది ఇద్దరితో పూర్తయ్యే వ్యవహారం కాదన్న వాదన బలం పుంజుకుంటోంది. మరి 7 ఏళ్ల పాటు ఈ వ్యవహారం ఎలా సాగింది? ఉన్నతాధికారులు అన్నీ తెలిసే నిద్ర నటిస్తూ... వివిధ స్థాయుల్లోని ఉద్యోగులను నోరెత్తనీయకుండా చేశారా? ఇది దర్యాప్తు సంస్థల ముందున్న అతిపెద్ద ప్రశ్న!

బ్యాంకులు ఎల్ఓయూ ఎలా ఇస్తాయి?

- ఎల్ఓయూ అనేది బ్యాంకు ఇచ్చే హామీ పత్రం. ఒక సంస్థ చెల్లించాల్సిన మొత్తానికి హామీ ఇస్తున్నట్లు, ఒక వేళ సంబంధిత వ్యక్తి చెల్లించని పక్షంలో తాను చెల్లిస్తానని స్పష్టం చేయటం. బ్యాంకులు ఏదో ఒక హామీ లేదా ఆస్తి తనఖా (కొలేటరల్) లేకుండా ఎల్ఓయూ ఇవ్వవు. ఉదాహరణకు రూ.5 కోట్లకు ఎల్ఓయూ కావాలంటే, రూ.7 కోట్ల విలువైన తనఖా అడగవచ్చు. ఏదైనా ఇబ్బంది ఎదురయితే ఆ ఆస్తిని విక్రయించి సొమ్ము రాబట్టుకోవచ్చు. కానీ ఆశ్చర్యకరంగా పీఎన్‌బీ ఎటువంటి తనఖా లేకుండానే ఎల్ఓయూలు జారీ చేసింది.

తర్వాత ఏం జరిగింది?

- నీరవ్ మోదీకి చెందిన కంపెనీ విదేశాల్లో కొనుగోలు చేసినందుకు చేయాల్సిన చెల్లింపులకు గానూ పీఎన్‌బీ ఇచ్చిన ఎల్ఓయూను తీసుకువెళ్లి హాంగ్‌కాంగ్‌లోని బ్యాంకు శాఖలో జమ చేసింది. ఆ శాఖకు నీరవ్ మోదీ కానీ, అతని కంపెనీ గానీ తెలియదు. కానీ పీఎన్‌బీ ఇచ్చిన ఎల్ఓయూను మాత్రం విశ్వసిస్తుంది. పీఎన్‌బీకి చెందిన విదేశీ మొత్తాలు జమ అయ్యే 'నోస్ట్రో' ఖాతాకు ఎల్ఓయూ లో పేర్కొన్న సొమ్ముకు క్రెడిట్ ఇస్తుంది. నీరవ్ మోదీకి వజ్రాలు విక్రయించిన విదేశీ కంపెనీకి ఆ ఖాతా నుంచి చెల్లింపు జరిగిపోతుంది. విదేశాల్లో ఇటువంటి లావాదేవీలన్నీ విదేశీ బ్యాంకులకు బదులు, భారతీయ బ్యాంకులకు విదేశాల్లో ఉన్న శాఖల ద్వారా జరుగుతున్నాయి. అందుకే అలహాబాద్ బ్యాంకు, మరికొన్ని ఇతర బ్యాంకులకు సైతం ఇప్పుడు ఇబ్బంది ఎదురైంది. ఇప్పుడు పీఎన్‌బీ, ఆ సొమ్మును నీరవ్ మోదీ నుంచి వసూలు చేసి విదేశీ బ్యాంకు శాఖకు అందించాలి. నీరవ్ మోదీ, పీఎన్‌బీకి సొమ్ము చెల్లించటానికి 90 రోజుల గడువు ఉంటుంది. ఏడాది గడువు కూడా ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఆకాలానికి గానూ పీఎన్‌బీ అసలుతో పాటు వడ్డీ వసూలు చేస్తుంది.

> అసలు 'ఎల్ఓయూ'ల విధానంలో చెల్లింపులు చేయటమనేది వజ్రాలు, ఆభరణాల రంగంలో చాలాచాలా అరుదు. మరి నీరవ్ మోదీ కోసం పంజాబ్ నేషనల్ బ్యాంకు ఇలాంటి సంప్రదాయాన్ని ఎందుకు చేపట్టింది? పోనీ వాస్తవికంగా చెల్లింపులు చేసిన అలహాబాద్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకులైనా ఈ రంగంలో ఇలాంటి పత్రాలకు చెల్లింపులు చేసే సంప్రదాయం లేదన్న అభ్యంతరాన్ని ఎందుకు లేవదీయలేదు, ఆ బ్యాంకు సిబ్బంది కూడా వీరితో కుమ్మక్కయ్యారా? అన్నది మరో కీలక ప్రశ్న!

వడ్డీ కాదు గదా, అసలే రాలేదు...

- ఇక్కడే పీఎన్‌బీ ఇరుక్కుపోయింది. నీరవ్ మోదీ నుంచీ ఎల్ఓయూ ప్రకారం సొమ్ము రాలేదు. దానిపై వడ్డీ కూడా పేరుకుపోయింది. ఉదాహరణకు అసలు రూ.100 కోట్లు అనుకుంటే, దానిపై వడ్డీ మరో రూ.5 కోట్లు కలిసి మొత్తం రూ.105 కోట్లు వసూలు కావాలి. కానీ ఆ సొమ్ము రాలేదు. దీంతో పాత అప్పు, వడ్డీకి మరికొంత సొమ్ము జోడించి 155 కోట్లకు మరొక ఎల్ఓయూ జారీ చేసింది. దాని ద్వారా వచ్చిన సొమ్ముతో పాత ఖాతాలో రూ.105 కోట్లు జమ చేసుకుంది. ఇటు నీరవ్ మోదీ చేతికి కొత్తగా మరో రూ.50 కోట్లు వచ్చాయి. ఇలా ఒక అప్పు వసూలు చేసుకోవాటానికి పీఎన్‌బీ కొత్త అప్పు ఇస్తూ వచ్చింది. ఇలా ఏళ్ల తరబడి సాగింది. బకాయి పేరుకుపోయింది.

ఎన్నో కంపెనీల సృష్టి...

- కేవలం ఒకటి రెండు కంపెనీల పేరు మీదే ఎల్ఓయూ తీసుకుంటూ వస్తే అనుమానం వస్తుంది. అందుకే నీరవ్ మోదీ కొత్త ఆలోచన చేసి ఉంటాడు. ఎన్నో బినామీ కంపెనీలు సృష్టించాడు. కంపెనీలను మార్చి మార్చి ఎల్ఓయూ తీసుకుంటూ వచ్చాడు. తద్వారా తన మోసాన్ని కప్పిపుచ్చుకున్నాడు. ఇలా సృష్టించిన కంపెనీల సంఖ్య నూటికి పైగా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. వీటి వ్యవహారం సీబీఐ దర్యాప్తులో బయటపడే అవకాశం ఉంది.

ఉన్నతాధికార్లకు తెలియదా?

- తెలియకుండా ఉండే అవకాశమే లేదు. కానీ చూసీచూడనట్లుగానో లేక పట్టించుకోకుండానే ఉండిపోయారను కోవాలి. లేదా కప్పిపుచ్చి ఉండాలి. పీఎన్‌బీ అధికార వర్గాలు చెబుతున్న ప్రకారం-
- ఎల్ఓయూ జారీ చేసిన విషయం 'స్విఫ్ట్' ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేసి, కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ (సీబీఎస్) లో కనిపించకుండా చేశారు.
- నాలుగైదేళ్ల నుంచి ఇలా ఒక దాని తర్వాత మరొక ఎల్ఓయూ ఇస్తూ, పాత అప్పులను తీసేసి కొత్త అప్పులను బ్యాంకు పుస్తకాల్లో నమోదు చేస్తూ వచ్చారు.
- దాని వల్ల బకాయి మొత్తం పెద్దదై పోయింది.
- దీనికి కొందరు బ్యాంకు అధికార్లు సహకరించారు.
- ఎవరైతే ఈ విషయంలో నీరవ్ మోదీకి సహకరిస్తూ వచ్చారో... ఆ అధికారి గత ఏడాది రిటైర్ అయ్యారు. ఆ తర్వాత వచ్చిన కొత్త అధికారి .ఎల్ఓయూ జారీ చేయటానికి నిరాకరించారు. అంటే పాత అప్పు, ఇన్నాళ్లూ అప్పును దాచిపెడుతూ వచ్చిన విషయం బయట పడిపోయినట్లే. తప్పనిసరి పరిస్థితుల్లో పీఎన్‌బీ ఉన్నతాధికార్లు ఈ అంశాన్ని బయటపెట్టి, సీబీఐకి ఫిర్యాదు చేశారు.

> సాధారణంగా బ్యాంకుల్లోని లావాదేవీలన్నింటినీ రెండు దశల్లో ఆడిటింగ్ చేస్తారు. అంతర్గత బృందమే కాదు, బయటి నుంచి వచ్చే బృందాలు కూడా ఆడిటింగ్ చేస్తాయి. రెండు బృందాలూ దీన్ని.. వరసగా ఏడేళ్లపాటు పట్టుకోలేకపోవటం.. మన బ్యాంకుల్లో జరిగే ఆడిటింగ్ ప్రమాణాలే ప్రశ్నార్థకంగా లేవా? అన్నది ఇప్పుడు అందర్నీ భయపెడుతున్న ప్రశ్న.

నిజంగానే కనిపెట్టలేరా?

- చిన్నా, చితకా మొత్తం కాదు. రూ.11,400 కోట్లు. సీబీఎస్‌లో కనిపించకుండా చేసినా, 'స్విఫ్ట్' ప్లాట్‌ఫామ్‌లో అయినా కనిపిస్తుంది. 'నోస్ట్రో' లో జమ తెలుస్తుంది కదా. అంతర్గత ఆడిట్‌లో, చట్టప్రకారం నిర్వహించే వార్షిక ఆడిట్ లోనో... లేక ఆర్‌బీఐ నిర్వహించే తనిఖీలోనో వెల్లడి కావాలి కదా! అయినా ఎందుకు బయటపడలేదు. కనీసం నీరవ్ మోదీపై ఒత్తిడి చేసి, ఆ సొమ్ము వసూలు చేయవచ్చు కదా. కానీ చేయలేదు. ఎందుకంటే... ఇది బ్యాంకు లోని ఉన్నత స్థానాల్లోని అధికార్లకు తెలిసే ఉండాలి. అంతే గాక నీరవ్ మోదీ ఈ సొమ్ము ఎగవేయటానికి సిద్ధపడి ఉన్నందున అతని నుంచి సొమ్ము వసూలు చేయటం సాధ్యం కాలేదు. దాచగలిగినంత కాలం దాచిపెట్టారు. ఇంకా ఎక్కువ కాలం దాచలేని పరిస్థితుల్లో బయటపడింది.

> గతంలో అలహాబాద్ బ్యాంకుకు మాజీ డైరెక్టర్‌గా వ్యవహరించిన దినేష్ దూబే- తాను ఈ రుణాల లుకలుకల గురించి ఎన్నడో 2013లోనే ఆర్‌బీఐతో సహా ఉన్నత సంస్థలన్నింటినీ హెచ్చరించానని, కానీ ఎవ్వరూ పట్టించుకోలేదని వాపోతున్నారు. మరి ఆర్‌బీఐ వంటి ఉన్నతస్థాయి సంస్థలేం చేస్తున్నాయి? అన్నది ఎన్నో అనుమానాలకు తావిస్తున్న అసలైన ప్రశ్న.

తనఖా ఎందుకు తీసుకోలేదు...?

- అదే కదా కుంభకోణం. నీరవ్ మోదీతో కుమ్మక్కు అయినందునే తీసుకోలేదు. తనఖా (కొలేటరల్) తీసుకున్నా, ఎల్ఓయూ రూపంలో బ్యాంకు హామీ ఇచ్చిన సొమ్మును నీరవ్ మోదీ తిరిగి చెల్లించలేకపోతే, ఆ బాకీకి సరిపోదు. ఇటీవల కాలంలో బ్యాంకుల మధ్య పోటీ పెరిగి విదేశీ వర్తకం సాగించే సంస్థలకు తనఖా కింద తీసుకున్న ఆస్తి విలువకు కనీసం ఆయిదారు రెట్లు అధిక మొత్తానికి ఎల్ఓయూ ఇవ్వటానికి ముందుకు వస్తున్నాయి. అందువల్ల లబ్ధిదారుడు 'డిఫాల్ట్' అయితే, ఎంతో కొంత మొత్తాన్ని బ్యాంకులు కోల్పోక తప్పదు. దాన్ని 'బిజినెస్ రిస్క్' కింద బ్యాంకులు పరిగణిస్తున్నాయి. కానీ ఒకే సంస్థ విషయంలో దీర్ఘకాలం పాటు అసలు ఎటువంటి తనఖా లేకుండా ఎల్ఓయూ లు ఇస్తూ పోయినందుకు నీరవ్ మోదీ వ్యవహారం పెద్ద కుంభకోణం అయింది.

> కొన్నేళ్ల క్రితం విన్సమ్ డైమండ్ గ్రూప్ కూడా ఇదే తరహాలో 'ఎల్ఓయూ'లను ఆసరాగా చేసుకుని రూ.6,800 కోట్ల వరకూ రుణం తీసుకుని, చివరికి ఎగవేసింది. అందులో పీఎన్‌బీ వాటానే రూ.1800 కోట్లు. గతంలో అంత పెద్ద దెబ్బ తిని ఉండి కూడా.. ఎల్ఓయూల వ్యవహారాన్ని ఎందుకు కట్టుదిట్టం చెయ్యలేదన్నది అన్నింటినీ మించిన, ఎవరికీ అర్థం కాని ప్రశ్న!!

పీఎన్‌బీ కుంభకోణంపై మాట్లాడరేం?

- **బ్యాంకింగ్‌పై విశ్వాసాన్ని పెంచడానికి ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పండి: రాహుల్**



దిల్లీ: బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజా విశ్వాసాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం ఏం చేస్తోందో ప్రధానమంత్రి వెల్లడించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. శనివారం ఆయన దిల్లీలో విలేకరులతో మాట్లాడారు. 'పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.12,000 కోట్ల మేర మోసగించిన కేసును చూస్తే ఉన్నత స్థాయి వారి ప్రమేయం లేకుండా ఇలాంటిది జరగదని స్పష్టమవుతోంది. ప్రధానమంత్రి మన దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్నారు. అసలు ఈ కుంభకోణం ఎలా జరిగిందో, దానిపై తదుపరి చర్యలేమిటో ప్రధాని వివరించాలి' అని చెప్పారు. నీరవ్‌తో తనకు వ్యక్తిగతంగా పరిచయం ఉందన్న భాజపా ఆరోపణను ఖండించారు. విషయాన్ని పక్కదారి పట్టించేందుకే ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పెద్దనోట్లను రద్దు చేసి, బ్యాంకుల్లో జమయ్యేలా చేశాకే ఇలాంటి కుంభకోణాలు మొదలయ్యాయని చెప్పారు. పరీక్షలు ఎలా రాయాలో విద్యార్థులకు చెప్పడానికి గంటన్నర సమయాన్ని కేటాయించిన ప్రధాని... పీఎన్‌బీ కుంభకోణానికి బాధ్యులెవరో మాత్రం చెప్పడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఆర్థిక మంత్రి కూడా నోరు మెదపడం లేదన్నారు. మొత్తం కుంభకోణంలో 90% లావాదేవీలు ఎన్డీఏ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని స్పష్టం చేశారు. బాధ్యత తీసుకునేందుకు ప్రభుత్వం ఎప్పుడూ ముందుకు రావడం లేదన్నారు.

ఇతర శాఖల మంత్రులే ఎందుకు మాట్లాడుతున్నారు?: సిబల్

ప్రధాని మోదీ ఆశ్రిత పెట్టుబడిదారీతనాన్ని వ్యవస్థీకృతం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్ ఆరోపించారు. ఇలాంటి చర్యల వల్ల దేశప్రతిష్ఠ అంతర్జాతీయంగా మసకబారుతుందని చెప్పారు. దేశానికి కాపలాదారునిగా ఉంటానని చెప్పిన మోదీ ఇప్పుడు నిద్రపోతుండడంతో దొంగలు దోచుకుంటున్నారన్నారు. అన్ని ఎల్‌వోయూలపైనా 2017లోనే సంతకాలు జరిగాయని చెప్పారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలాతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జరుగుతున్న కుంభకోణం గురించి ప్రధానికి, ఆర్థిక మంత్రికి పూర్తిగా తెలుసునని చెప్పారు. ఆర్థిక శాఖ గానీ, ఆర్‌బీఐ గానీ కాకుండా ఇతర శాఖల మంత్రుల చేత ప్రభుత్వం ఎందుకు మాట్లాడిస్తోందని ప్రశ్నించారు. సరైన సమాధానాలు లభించేటంత వరకు ప్రభుత్వ నిర్వాకాలను పార్లమెంటులోనూ ఉమ్మడిగా నిలదీసే వ్యూహం రూపొందిస్తున్నట్లు సూర్జేవాలా చెప్పారు. ఈ మేరకు అన్ని పార్టీలతో చర్చించబోతున్నామన్నారు. తనపై అభాండాలు వేసిన రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ క్షమాపణలు కోరకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం

- **రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్**

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో కుంభకోణమంతా యూపీఏ పాలనలోనే జరిగిందనీ, అయినా కాంగ్రెస్ మాత్రం ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా ప్రచారం సాగిస్తోందనీ భాజపా ఆరోపించింది. యూపీఏ పాలనలోని కుంభకోణాలను ఎన్డీయే వెలికి తీస్తోందని పార్టీ తరఫున రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అసలైన పాపమంతా కాంగ్రెస్ పాలనలోనే జరిగిందన్నారు. ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీ దేశం నుంచి దాటిపోయినా అతనిపై ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందనీ, తప్పకుండా పట్టుకుని తీరుతుందని స్పష్టం చేశారు. కుంభకోణాల సూత్రధారులకు సహకరించే కుట్రను భాజపా చేయడం లేదనీ, దాని బదులు వారు ఎక్కడున్నా పట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తోందనీ వివరించారు. 'ఇలాంటి కుంభకోణాలకు కాంగ్రెస్సే పాల్పడుతుంది. అధికారాన్ని దుర్వినియోగం చేస్తుంది. వ్యవస్థల్ని మార్చేస్తుంది. నిందితులకు సహకరిస్తుంది. అదేదీ బయటపడకూడదని ప్రయత్నిస్తుంది. ఇలాంటివి బయటపెట్టడానికే మోదీ సర్కారు అధికారంలోకి వచ్చింది. అబద్ధాలు పదేపదే వల్లించడం కాంగ్రెస్‌కి అలవాటే. కానీ వేళ్లన్నీ ఆ పార్టీవైపే చూపిస్తున్నాయి' అని చెప్పారు. నీరవ్ దేశం విడిచి వెళ్లినంతమాత్రాన అతన్ని వదిలిపెట్టేసినట్లు కాదని స్పష్టంచేశారు. నీరవ్ నిర్వహించిన ఒక కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ హాజరయ్యారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వి భార్యకూ పరోక్షంగా నీరవ్ సంస్థలతో సంబంధం ఉందన్నారు. గీతాంజలి జెమ్స్ విషయంలో 2013లో అభ్యంతరం లేవనెత్తిన అలహాబాద్ బ్యాంకు డైరెక్టర్‌ని రాజీనామా చేయాల్సిందిగా ఒత్తిడి తెచ్చారని చెప్పారు. నీరవ్ కంపెనీలతో కాంగ్రెస్‌కి ఉన్న సంబంధాలేమిటో బయటపడుతున్నాయనీ, రోజుకో కొత్తపేరు వెలుగుచూస్తోందనీ భాజపా అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు చెప్పారు. లెక్కల్లో చూపని రూ.4.8 కోట్ల డబ్బుతో నీరవ్‌నుంచి సింఘ్వి భార్య వజ్రాలు కొన్నారని ఆయన తెలిపారు.



శనివారం దిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

ప్రధాన నిందితుడు రిటైరయ్యాకా కొనసాగిన మోసం!

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో వెలుగుచూసిన భారీ మోసం వెనుక ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ డీజీఎం గోకుల్‌నాథ్ శెట్టి... ఉద్యోగ విరమణ తర్వాతా ఆ అవ్యవహారాన్ని నడుపుతూ వచ్చారా? దర్యాప్తు సంస్థలకు బ్యాంకు వర్గాలు అందించిన సమాచారం చూస్తే దీనికి ఔననే సమాధానమే వస్తుంది. శెట్టి 31.5.2017న ఉద్యోగ విరమణ చేశారు. 1.3.2017 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు చెల్లుబాటు అయ్యేలా బ్యాంకు ద్వారా 143 భరోసా పత్రాలు (ఎల్‌వోయూలు) జారీ అయ్యాయి. ముంబయిలోని బ్రాడీ హౌస్ శాఖలో శెట్టి పనిచేసేవారు. అక్కడే ఉన్న మరో అధికారి మనోజ్ హేమంత్ కారాట్‌తో కలిసి గీతాంజలి గ్రూపు కంపెనీలకు రూ.4886.72 కోట్ల మేర ఎల్‌వోయూలు, విదేశీ రుణ పత్రాలు (ఎఫ్ఎల్‌సీలు) జారీ చేయడంలో ఆ అధికారి కీలక పాత్ర వహించినట్లు బ్యాంకు ఫిర్యాదు చెబుతోంది. భరోసా పత్రాలను 90 రోజుల కాలానికే ఇవ్వాల్సి ఉంది. శెట్టి, కారాట్‌లు కలిసి వీటిని 360 రోజులకు జారీ చేసేశారు. ఇవేవీ కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్‌లో నమోదు కాకుండా చూశారు. ఎఫ్ఎల్‌సీల జారీ కోసం తొలుత తక్కువ మొత్తాన్ని నమోదు చేయడం ద్వారా ఒక సూచిక సంఖ్య (రిఫరెన్స్ నెంబర్)ను సృష్టించి, ఆ తర్వాత స్విఫ్ట్ లావాదేవీ ద్వారా దానిని పెంచేవారు. పీఎన్‌బీలోని కంప్యూటర్ వ్యవస్థలో అది నమోదు కాకుండా చూసుకునేవారు. పెంచిన మొత్తం ప్రకారమే విదేశాల్లో చెల్లింపులు జరిగేవి. జారీ చేసిన వాటిలో ఆరు పత్రాలు ఈ ఏడాది జూన్, జులైల్లోనూ చెల్లుబాటయ్యేలా చూపించడం విశేషం. శెట్టి రిటైరయ్యాక వీటిని ఎవరు ఆమోదించారనేది దర్యాప్తు సంస్థలకు బ్యాంకు వర్గాలు వివరించలేకపోయాయి. వేర్వేరు మొత్తాల్లో ఉన్న ఈ ఆరింటి విలువ 65.12 లక్షల డాలర్లు (సుమారు రూ.41.68 కోట్లు). మొత్తం అవ్యవహారాన్ని ఇద్దరే నడిపారా, అంతకంటే ఎక్కువమంది ఉన్నారా అనేది తేలాల్సి ఉంది.

పీఎన్‌బీ కుంభకోణం మొత్తం 2017-18లోనే..

- **సీబీఐ ఎఫ్ఐఆర్‌లో వెల్లడి**

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో జరిగిన రూ.11,300 కోట్ల కుంభకోణంపై సీబీఐ నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌లలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ మోసం మొత్తం 2017-18లోనే జరిగిందని దర్యాప్తు సంస్థ పేర్కొంది. ఒకవేళ 2011లోనే ఈ కుంభకోణం మొదలై ఉంటే.. దాని పరిధి రూ.11,300 కోట్లపైబడే ఉంటుంది. ఇప్పటివరకూ సీబీఐ.. నలుగురు పీఎన్‌బీ అధికారులను ప్రశ్నించింది. వారు 2014-17 మధ్యలో పనిచేశారు. సీబీఐ ప్రశ్నించినవారిలో బెచు తివారీ.. 2015 ఫిబ్రవరి నుంచి అక్టోబర్ 2017 వరకూ నారిమన్ పాయింట్ శాఖలో చీఫ్ మేనేజర్‌గా చేశారు. సంజయ్ ప్రసాద్..2016 మే నుంచి 2017 అక్టోబర్ మధ్యకాలంలో బ్రాడీ హౌస్ శాఖలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా వ్యవహరించారు. మోహిందర్ కుమర్ శర్మ.. 2015 నవంబర్ నుంచి 2017 జులై వరకూ కంకరెంట్ ఆడిటర్‌గా పనిచేశారు. మనోజ్ కారాట్.. 2014 నవంబర్ నుంచి 2017 డిసెంబర్ మధ్యకాలంలో సింగిల్ విండో ఆపరేటర్‌గా వ్యవహరించారు. మనోజ్ కారాట్, గోకుల్ నాథ్ షెట్టిలను నిందితులుగా పేర్కొన్నారు.

నీరవ్ మోదీకి ద్వంద్వ పౌరసత్వం?

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకును భారీగా మోసగించిన నీరవ్ మోదీకి ద్వంద్వ పౌరసత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సూచనల మేరకు- నీరవ్, అతని బంధువు మెహుల్ ఛోక్సీల పాస్‌పోర్టులను విదేశీ వ్యవహారాలశాఖ నాలుగు వారాల పాటు రద్దు చేసింది. అయితే, నీరవ్ అతని సోదరుడు నిషాల్ బెల్జియంలో పెరిగారనీ, వారికి ఆ దేశ పౌరసత్వం కూడా ఉండొచ్చని ది ట్రిబ్యూన్ పత్రిక పేర్కొంది. 'నీరవ్‌కు ద్వంద్వ పౌరసత్వం ఉన్నట్లు పలానీపురీ జైన్ సామాజికవర్గానికి తెలుస'ని కథనంలో ఊటంకించింది. నిషాల్ భారత పాస్‌పోర్టును స్వాధీనపరచి, బెల్జియం పౌరసత్వం పొందాడనీ.. నీరవ్ మాత్రం తాను భారతీయ పౌరుడినని ప్రకటించినట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి.

దేశానికి రప్పిస్తాం: శివ్ ప్రతాప్ శుక్ల

ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన భారీ మోసంలో నిందితుడు నీరవ్ మోదీని దేశానికి తీసుకొచ్చి, చట్టం ముందు నిలబెడతామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్ల తెలిపారు.

17,600 కోట్ల మోసం



శనివారం ముంబయిలో నీరవ్ మోదీ కుంభకోణం కేసులో అనుమానితుడిని న్యాయస్థానానికి తీసుకొస్తున్న పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

సమన్లు జారీ చేసింది. బ్యాంకు ఎండీ సునీల్ మెహతా, బ్యాంకులో ముఖ్య నిఘా అధికారితో కలిసి సోమవారం సీవీసీ ఎదుట హాజరుకానున్నారని సమాచారం.

గోకుల్‌నాథ్ శెట్టి అరెస్ట్.. రిమాండుకు తరలింపు

పీఎన్‌బీని మోసగించిన కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) శనివారం ముగ్గురిని అరెస్టు చేసింది. బ్యాంకు మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి, ఏకగవాక్ష అధికారి (సింగిల్‌విండో ఆఫీసర్- ఎస్‌డబ్ల్యూవో) మనోజ్ కారాట్, నీరవ్ మోదీ గ్రూపు సంస్థల అధీకృత ప్రతినిధి హేమంత్ భట్‌లను అరెస్టు చేశాక వారిని ముంబయిలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. వీరిని 14 రోజుల పాటు సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ న్యాయమూర్తి ఎస్.ఆర్.తంబోలి ఆదేశాలిచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థపైనే ప్రభావం చూపే తీవ్రత ఈ కేసులో ఉందని వ్యాఖ్యానించారు. అధికారాన్ని దుర్వినియోగం చేసి, అనుమతులు లేకుండా, కుట్రపూరితంగా శెట్టి వ్యవహరించారని సీబీఐ ఆరోపించింది. వారు జారీ చేసిన భరోసా పత్రాలకు సంబంధించి ఎలాంటి పత్రాలు, దరఖాస్తులు బ్యాంకులో లేనేలేవని తెలిపింది. ఇలాంటివి చాలా సార్లు జరిగాయని కారాట్ చెబుతున్నా పేర్లు మాత్రం వెల్లడించడం లేదని వివరించింది. నీరవ్‌కు చెందిన 15-16 కంపెనీల్లో భట్ డైరెక్టర్‌గా ఉన్నారనీ, మొత్తం అవ్యవహారం అతనికి తెలుసుననీ చెప్పింది. వారి నుంచి ముఖ్యమైన పత్రాలు రాబట్టడానికి వీలుగా కస్టడీకి అప్పగించాలని కోరింది. ముంబయిలోని బ్రాడీ రోడ్ శాఖలోనూ సీబీఐ సోదాలు నిర్వహించింది. పలు కీలకపత్రాలు స్వాధీనం చేసుకొంది. అంతర్జాతీయంగా నిధుల బదలాయింపు జరిగే విధానం గురించి అధికారుల్ని ప్రశ్నించింది. ఆరుగురు అధికారులను వివిధ కోణాల్లో విచారించింది.

ఖాతాలు, లాకర్ల వివరాలపై ఆరా

పశ్చిమ ముంబయిలోని మలాద్‌లో ఉన్న శెట్టి ఫ్లాటుకు సీబీఐ బలగాలు చేరుకుని రెండ్రోజులుగా ఆయన కుటుంబీకుల్ని, బంధువుల్ని ప్రశ్నించాయి. ఆ ఫ్లాటును ఎప్పుడు కొనుగోలు చేశారు? చెల్లింపులు ఎలా జరిపారు? ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? వంటి వివరాలు ఆరా తీశాయి. బ్యాంకు ఖాతాలు, ఇతర ఆస్తులు, లాకర్ల వివరాలనూ రాబట్టే ప్రయత్నం చేస్తున్నాయి. శెట్టి, కారాట్‌లు నీరవ్ మోదీ కంపెనీతో కుమ్మక్కై రూ.4886.70 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. అనధీకృత, తప్పుడు 'భరోసా పత్రాలు' (లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్- ఎల్‌వోయూలు) విదేశాల్లోని వివిధ భారతీయ బ్యాంకు శాఖలకు జారీ చేయడంలో వీరిద్దరిదీ కీలక పాత్ర అని ఆరోపించింది. ఈ ఎల్‌వోయూలు ఎక్కడా దొరక్కుండా చూడడానికి వాటిని కోర్ బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి తప్పించినట్లు వెల్లడించింది. రూ.280 కోట్ల మోసంపై మొదట ఒక కేసు నమోదు కాగా దానిని ఇప్పుడు రూ. 6498 కోట్లు మోసంగా సవరించింది.

ఆ చిరునామాల్లో ఆ కంపెనీలు లేవు

పంజాబ్ నేషనల్ బ్యాంకుకు నీరవ్‌మోదీ సమర్పించిన మూడు చిరునామాల్లో అసలు ఎలాంటి వజ్రాభరణాల కంపెనీలూ లేవని తేలింది. రుణాలు తీసుకునేటప్పుడు కంపెనీల తాజా చిరునామాలను పేర్కొనలేదని బయటపడింది. కేసు నమోదయ్యాక సీబీఐ వర్గాలు తొలుత ఈ చిరునామాల్లోనే గాలించాయి. కోల్‌కతాలోని గీతాంజలి జెమ్స్ దుకాణం కూడా మూతబడి ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

ఇంటర్‌పోల్ లుక్‌అవుట్ నోటీసులు జారీ

నీరవ్ మోదీ ఆచూకీ తెలుసుకోవడానికి సీబీఐ అభ్యర్థన మేరకు ఇంటర్‌పోల్ నుంచి లుక్‌అవుట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈడీ సూచన మేరకు నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీల పాస్‌పోర్టులను నాలుగు వారాల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. వాటిని ఎందుకు రద్దు చేయకూడదో వారం రోజుల్లో వివరణ ఇచ్చుకునే అవకాశాన్ని నిందితులకు ఇచ్చింది. దావోస్‌కు వెళ్లిన ప్రతినిధి బృందంలో నీరవ్ లేరనీ, అతనితో ప్రధాని ఎలాంటి భేటీ నిర్వహించలేదనీ ఈ శాఖ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా నీరవ్, ఛోక్సీలకు ఈడీ రెండో సారి సమన్లు జారీ చేసింది. వచ్చేవారం ముంబయి కార్యాలయంలో హాజరుకావాల్సిందిగా ఆదేశించింది.

నగల దుకాణాల్లో ఈడీ సోదాలు

చెన్నై, న్యూస్‌టుడే: వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీతో సంబంధమున్న చెన్నైలోని మూడు నగల దుకాణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు శనివారం మెరుపు సోదాలు నిర్వహించారు. ఆళ్వార్‌పేట, వేళచ్చేరి, తేనాంపేటలోని దుకాణాల్లో ఈ తనిఖీలు జరిగాయి. నీరవ్ మోదీ ఆస్తులను ఈడీ జప్తు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. జమ్ము సహా 21 ప్రదేశాల్లో జరిగిన తాజా సోదాల్లో మరో రూ.25 కోట్ల వజ్రాలు, ఆభరణాలను సీజ్ చేశామనీ, మొత్తం విలువ రూ.5674 కోట్లకు చేరిందనీ ఈడీ వర్గాలు దిల్లీలో వెల్లడించాయి.

రూ.11,000 కోట్లు కాదు.. రూ.13,000 కోట్లు రావాలి





నీరవ్ మోదీ మోసం చేసి అప్పుగా తీసుకున్న రూ.11,400 కోట్ల వసూలు బాధ్యత తమేదనని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) సీఎండీ సునీల్ మెహతా చెప్పారు. మదుపర్లు, విశ్లేషకులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నీరవ్‌కు రూ.11,400 కోట్లే కాకుండే ఆయన కంపెనీలకు మరో రూ.1700 కోట్లు ఇచ్చామని చెప్పారు. ఇది కూడా కలిపితే మొత్తం రావాల్సిన బకాయిల విలువ రూ.13,000 కోట్లకు చేరుతుందని అన్నారు. ఒకవేళ ఇవి వసూలుకాని పక్షంలో ఆ మేరకు బ్యాంకు మొండి బకాయిలు కూడా పెరుగుతాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం డిసెంబరు చివరినాటికి పీఎన్‌బీ ఎన్‌పీఏలు రూ.57,519 కోట్లుగా ఉన్నాయి. ఇప్పుడు పై రూ.13,000 కోట్లు కూడా చేరితే ఈ విలువ రూ.70,519 కోట్లకు పెరుగుతుంది. దీంతో ఎన్‌పీఏల నిష్పత్తి కూడా పెరిగి 12.11% నుంచి 14.05 శాతానికి చేరుతుంది. అయితే టైర్-1 మూలధన నిష్పత్తి అవసరానికి మించి ఉన్నందున నిధుల కేటాయింపులకు ఇబ్బంది ఉండదని మెహతా వెల్లడించారు.

పబ్లిక్ ఇష్యూకు తలుపులు మూసుకుపోయినట్లే

నీరవ్ మోదీ తన ఫైర్‌స్టార్ డైమండ్స్ కంపెనీని ఈ ఏడాది పబ్లిక్ ఇష్యూకు తేవాలని అనుకున్నాడు. మరోపక్క గీతాంజలి జెమ్స్ అనుబంధ సంస్థ అయిన 'నక్షత్ర వరల్డ్' ఇష్యూ ద్వారా నిధులు సమీకరించాలని మెహుల్ చోక్సీ యోచించారు. నక్షత్ర వరల్డ్ ఐపీఓకు గత నవంబరులో సెబీ ఆమోదం కూడా తెలపడం గమనార్హం. అయితే ఇప్పుడు ఈ ఇద్దరి ప్రణాళికలకు మార్గం మూసుకుపోయినట్లే. వీళ్ల కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు వెళ్లేందుకు అవకాశాలు పూర్తిగా లేనట్లే. రూ.11,400 కోట్ల మోసానికి పాల్పడి నీరవ్, చోక్సీలు ఇద్దరు కనిపించకుండా పారిపోవడం ఇందుకు ఓ కారణం కాగా.. పై బకాయిలను చెల్లించేంత నిధుల స్తోమత ఈ రెండు కంపెనీలకు లేకపోవడం మరో కారణం. 2013-14లో రూ.595 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిన గీతాంజలి జెమ్స్.. 2016-17కు వచ్చేసరికి నికర లాభం రూ.166 కోట్లకు పడిపోయింది. అటు అప్పులు కూడా రూ.5,239 కోట్ల నుంచి రూ.8,254 కోట్లకు పెరిగాయి.

ఈనాడు బిజినెస్ వారాంతం

✦ ఆస్తుల విక్రయంలో పీఎన్‌బీ

కొన్ని స్థిరాస్తులను విక్రయించాలని పీఎన్‌బీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉపయోగించకుండా ఉన్న కొన్ని కార్యాలయాల భవనాలు సైతం అందులో ఉన్నాయని.. మార్చిలోగా విక్రయించే ఈ ఆస్తుల విలువ రూ.5,000 కోట్ల వరకు ఉండొచ్చని సమాచారం. సరైన ధర లభిస్తే మార్చిలోగా మొత్తం పూర్తి కావొచ్చని అంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్‌లో 5.9% వాటా విక్రయించడం ద్వారా రూ.1321 కోట్లను పొందింది. అదే సమయంలో ఆస్తుల నిర్వహణ వ్యాపారం నుంచి వైదొలగడం ద్వారా బ్యాంకుకు మరో రూ.125 కోట్లు లభించాయి.

✦ రూ.2600 కోట్లు ఇచ్చాం: యూకో బ్యాంకు

పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించిన ఎల్‌ఓయూల ద్వారా నీరవ్ మోదీకి చెందిన కంపెనీలకు 411.82 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.2636 కోట్లు) వరకు రుణాన్ని ఇచ్చినట్లు యూకో బ్యాంకు తెలిపింది.

బడా సంస్థలు.. బకాయిలు

ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ	రూ.2359 కోట్లు
ఇందూటెక్ జోన్	రూ.9.90 కోట్లు
ఐవీఆర్‌సీఎల్	రూ.604 కోట్లు
ట్రాన్స్‌ట్రాయ్	రూ.489.78కోట్లు
కామినేని స్టీల్స్	రూ.1500 కోట్లు
ఆన్‌రాక్	రూ.5000 కోట్లు
కోస్టల్ ప్రాజెక్ట్	రూ.692 కోట్లు

రుణాపాతీలు

- చెల్లింపులో చేతులెత్తేస్తున్న కంపెనీలు
- నష్టపోతున్న బ్యాంకులు
- రూ.80,000 కోట్ల దాకా రాని బకాయిలు
- ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తున్న ఆర్థిక సంస్థలు
- జాబితాలో ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ, ఐవీఆర్‌సీఎల్, ఇందూటెక్, ట్రాన్స్‌ట్రాయ్, కామినేని స్టీల్స్

ఈనాడు - హైదరాబాద్

ఓవైపు కొందరు మోసాలు చేసి కొల్లగొడుతుంటే మరోవైపు బడా కంపెనీలు రుణాలు తీసుకుని చేతులెత్తేస్తూండటంతో జాతీయ బ్యాంకులతోపాటు ప్రైవేటు బ్యాంకులూ నష్టపోతున్నాయి. తీసుకున్న రుణాలను కంపెనీలు తిరిగి చెల్లించడంలో విఫలమవుతూండటంతో ఆర్థిక సంస్థలు రుణాల వసూలు కోసం జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తున్నాయి. ఇలా ట్రైబ్యునల్‌లో దాఖలైన దరఖాస్తుల్లోని మొత్తాన్ని పరిశీలిస్తే సుమారు రూ.70,000-80,000 కోట్ల దాకా బకాయిలు వసూలు కావలసి ఉంటుందని అంచనా.

పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం చేయూతను ఇస్తూండటంతో, బ్యాంకులూ తమవంతు ప్రోత్సాహాన్నిస్తూ.. భారీగా రుణాలు మంజూరు చేస్తున్నాయి. బడా కంపెనీలు వ్యాపార విస్తరణలో భాగంగా బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చి పెట్టుబడులు పెడుతున్నాయి. కార్పొరేట్ బ్రాండ్ విలువను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు వాటికి రుణాలిస్తున్నాయి. తీరా కంపెనీ నిర్వహణా లోపంతో నష్టాల్లోకి చేరినా, ఇతర కారణాలతో కంపెనీ ఏర్పాటును మధ్యలోనే విరమించుకున్నా నష్టపోతున్నది బ్యాంకులే. కంపెనీ పేరుతో తెచ్చిన రుణాలను చెల్లించని పక్షంలో అది హామీగా ఇచ్చిన ఆస్తుల విక్రయానికి బ్యాంకులు ప్రయత్నిస్తూంటాయి. అయితే ఒక్కోసారి కొన్ని కంపెనీలు ఒక ఆస్తినే వివిధ బ్యాంకుల్లో వివిధ రూపాల్లో తాకట్టు పెట్టి రుణాలు తీసుకుంటున్న ఉదంతాలు ఉన్నాయి. మరికొన్ని కంపెనీలు ఆస్తి విలువను ఎక్కువ చూపి రుణాన్ని కూడా అంతే స్థాయిలో తీసుకుంటున్నాయి. బ్యాంకుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని డెక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ (డీసీహెచ్ఎల్) సంస్థ రూ.4 వేల కోట్లు రుణం తీసుకుని చెల్లింపుల్లో విఫలమైంది. ఒకే ఆస్తిని వివిధ బ్యాంకుల్లో హామీగా చూపి రుణం పొందింది. రుణం చెల్లించకపోవడంతో దివాలా ప్రక్రియ ప్రారంభించాలంటూ కెనరా బ్యాంకుతోపాటు ఇతర రుణదాత సంస్థలు హైదరాబాద్‌లోని కంపెనీ లా ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాయి. దివాలా ప్రక్రియ ప్రారంభమైంది. దీంతోపాటు రాష్ట్రంలోని పలు కార్పొరేట్ సంస్థలు తమ బకాయిలను చెల్లించడంలేదని వాటిని దివాలాదారుగా ప్రకటించాలని కోరుతూ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తున్నాయి. ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ ఎస్‌బీఐకి రూ.952 కోట్లు, పవర్ ఫైనాన్స్‌కు రూ.1407 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందూ టెక్ జోన్, ఐవీఆర్‌సీఎల్, ట్రాన్స్‌ట్రాయ్, కామినేని స్టీల్స్, ఆన్‌రాక్ వంటి సంస్థలు గణనీయ స్థాయిలో వివిధ బ్యాంకులకు బకాయిపడ్డాయి. వీటిపై దివాలా ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ సంబంధిత బ్యాంకులు ట్రైబ్యునల్‌లో దరఖాస్తు చేశాయి. మరోపక్క బకాయిలు వసూలు కాకపోవడంతో బ్యాంకు దాఖలు చేసిన దరఖాస్తుపై కోస్టల్ ప్రాజెక్టు దివాలా ప్రక్రియ ప్రారంభించాలంటూ కోల్‌కత జాతీయ లా ట్రైబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది.

ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలతో చెక్

మొండి బకాయిల్ని అడ్డుకోవడానికి వీలుగా రిజర్వు బ్యాంకు రెండు రోజుల క్రితం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. గతంలో రుణాలను సకాలంలో చెల్లించని పక్షంలో ఆర్థిక సంస్థలు చర్చల ద్వారా రుణ పునర్నిర్మాణ విధానాలను అమలు చేసేవి. ఇందులో బ్యాంకులు కొంతమేర నష్టపోవడంతోపాటు దెబ్బతిన్న సంస్థను ఆదుకోవడానికి మరికొంత రుణాన్ని అదనంగా మంజూరు చేసేవి. ప్రస్తుతం ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటికే అమల్లో ఉన్న రుణ పునర్నిర్మాణ విధానాలన్నీ రద్దయిపోవాల్సిందే. రూ.2 వేల కోట్లకు పైబడి రుణాలున్న సంస్థలు పరిష్కార ప్రణాళికను సమర్పించాల్సి ఉంటుంది. 180 రోజుల్లో పరిష్కార ప్రణాళికను సమర్పించని పక్షంలో ఐబీసీ సెక్షన్ 7 కింద దివాలా ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంటుంది. రూ.5 కోట్ల దాకా బకాయిలుంటే వారం వారం నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది. అన్ని బ్యాంకులు ఏప్రిల్ 1వ తేదీ నుంచి సెంట్రల్ రిపాజిటరీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆన్ లార్జ్ క్రెడిట్స్ (సీఆర్ఐఎల్‌సీ)కు వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. దీనివల్ల ఒక బ్యాంకు దగ్గర రుణం తీసుకున్న విషయం మరో బ్యాంకుకు సమాచారం ఉంటుంది. ఉద్దేశపూర్వకంగా రుణాలను ఎగ్గొట్టేవారికి రుణ పరిష్కార ప్రణాళికను వర్తింపజేయకుండా ఐబీసీలో సెక్షన్ 29ఎను కేంద్రం చేర్చింది. దీనివల్ల ఎగవేతదారుకు కష్టమేనని న్యాయవాది ఎస్.కె.సాజిత్ చెబుతున్నారు.

ఆ సొమ్ములు ఎవరికెళ్లాయ్



పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)లో కుంభకోణం జరిగింది సరే. మరి ఆ డబ్బులు ఏ కంపెనీలకు వెళ్లాయన్నది తెలియాలి కదా. ఆ విషయాలను పీఎన్‌బీనే తెలిపింది. కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)కు ఇచ్చిన ఫిర్యాదులో ఆ కంపెనీల పేర్లను వెల్లడించింది. అయితే ఆ డబ్బును ఎలా ఉపయోగించుకున్నారన్న విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు. మన భారత బ్యాంకులకు చెందిన విదేశీ శాఖల ద్వారా విదేశాల్లోని ఆరా జెమ్ కంపెనీ, సినో ట్రేడర్స్ కో, యూనిటీ ట్రేడింగ్, సన్‌షైన్ జెమ్స్, ట్రై కలర్ జెమ్స్, పసిఫిక్ డైమండ్స్ వంటి కంపెనీలు ఆ నగదును అందుకున్నట్లు తెలుస్తోంది. వీటిలో కొన్ని నీరవ్ మోదీ, గీతాంజలి జెమ్స్‌కు చెందిన మెహుల్ చోక్సీలకు చెందినవేనని బ్యాంకర్లు అనుమానిస్తున్నారు. మోసపూరిత పద్ధతుల్లో మొత్తం 150 ఎల్‌ఓయూల ద్వారా పీఎన్‌బీ నుంచి రూ.11,300 కోట్ల కుంభకోణానికి నీరవ్, అతని కంపెనీలు పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే.

ఎల్‌ఓయూలను అందుకున్న బ్యాంకర్లందరూ తమ విదేశీ కార్యాలయాలు, శాఖలను ఆయా కంపెనీలపై దర్యాప్తు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు కూడా. పసిఫిక్ డైమండ్స్ ఎఫ్‌జడ్‌ఈ, యునిటీ ట్రేడింగ్ ఎఫ్‌జడ్‌ఈ, ట్రై కలర్ జెమ్స్ ఎఫ్‌జడ్‌ఈలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)కు చెందినవి కాగా సన్‌షైన్ జెమ్స్, సినో ట్రేడర్స్‌లు హాంకాంగ్‌కు చెందినవని తెలుస్తోంది. మిగతా వివరాలు తెలియడం లేదు. ఈ కంపెనీలకు వేటికీ అధికారిక వెబ్‌సైట్లు లేకపోవడం గమనార్హం. 2010 నుంచి ఆయా కంపెనీలకు జరిగిన లావాదేవీలపై దర్యాప్తు చేస్తున్నట్లు విదేశీ శాఖకు చెందిన ఒక సీనియర్ బ్యాంకరు తెలిపారు.



ఆడిటింగ్ వ్యవస్థ బాధ్యత ఎంత

ఈనాడు, హైదరాబాద్: పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన రూ.11,400 కోట్ల కుంభకోణం బ్యాంకుల్లో జరుగుతున్న ఆడిటింగ్, వ్యవస్థలపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. దాదాపు 2011 నుంచి ఎనిమిదేళ్ల పాటు జరిగిన ఈ వ్యవహారం ఒక్క సారి కూడా ఆడిటింగ్‌లో బయటపడక పోవడానికి కారణాలేమిటన్న విషయాన్ని నిగ్గు తేల్చాల్సి ఉంది. బ్యాంకులు తమ శాఖల్లో ఏడాది, ఏడాదిన్నరకు ఒక సారి అంతర్గత ఆడిటింగ్‌ను నిర్వహిస్తాయి. ఏవైన లోపాలు ఉంటే.. సరిచేసుకోవడానికి సమయం ఇచ్చి తర్వాత కాంప్లియన్స్ ఆడిటింగ్ చేస్తాయి. ఇవి కాక చట్టబద్ధమైన ఆడిటింగ్ జరుగుతుంది. ఇలా ఒకటి, రెండు రకాల ఆడిటింగ్‌లు జరిగినప్పుడు ఇన్ని సంవత్సరాల్లో ఒక్కసారి కూడా బయటపడకపోవడం అంటే ఈ కుంభకోణం వెనుక బ్యాంకుకు చెందిన ఉన్నతాధికారుల హస్తం కూడా ఉండి ఉండొచ్చని సంబంధిత వర్గాల అనుమానం. ఇప్పటి వరకూ ఈ కుంభకోణానికి సంబంధించి దాదాపు 18 మందిని అరెస్ట్ చేసినప్పటికీ.. దీని వెనుక చాలా మందే ఉండొచ్చని భవిష్యత్తులో చాలా మంది అరెస్టు అయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా. ఇంత కాలం ఈ తంతు సాగించడం ఇద్దరి వల్లే సాధ్యం కాదన్నది వాదన. శాఖ అంతర్గత ఆడిటింగ్‌లో ఇటువంటి అవకతవకలు 100 శాతం బయటపడేందుకు అవకాశాలు ఉన్నాయని.. సాధారణంగా ఎక్స్‌టర్నల్ ఆడిటింగ్‌లో ప్రతిదీ పరిశీలించరని.. ర్యాండమ్‌గా పరిశీలనలు జరిగేందుకు అవకాశం ఉందని, ఆడిటింగ్ సమయంలో ఎక్స్‌టర్నల్ ఆడిటర్ దృష్టిని మళ్లించే ప్రయత్నాలు జరగడానికి వీలుందని ఆడిటింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. స్విఫ్ట్ మెసేజింగ్ వ్యవస్థ ద్వారా లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఓయూ) మెసేజ్‌లు వెళ్లాయని.. బ్యాంకుకు చెందిన కోర్ బ్యాంకింగ్ వ్యవస్థలోకి ఈ లావాదేవీలు రానందు వల్ల కుంభకోణం జరిగిందన్నది ప్రాథమిక కారణం. అంతర్గత ఆడిటింగ్‌లో స్విఫ్ట్ మెసేజీలను రావాల్సిన బాకీని ఒక్కసారి సరి చూసుకుంటే.. లోపం వెంటనే తెలిసిపోతుందని.. అంతర్గత ఆడిటింగ్‌లో ఇది ఇంత వరకూ ఎందుకు జరగలేదన్నదానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగ్ తరహాలో బ్యాంకుల ఆడిటింగ్‌కు ఒక ప్రత్యేక స్వతంత్ర ప్రతిపత్తిగల వ్యవస్థను ఏర్పాటు చేయాలని చాలా కాలంగా బ్యాంకింగ్ వ్యవస్థ కోరుతోందని నిపుణులు చెబుతున్నారు. కాగా పంజాబ్ నేషనల్ బ్యాంకులోని కుంభకోణంలో ఆడిటర్ల పాత్ర, లోపాలను తెలుసుకోవడానికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఒక బృందాన్ని నియమించింది. ఇది ఒకటి రెండు రోజుల్లో బ్యాంకు శాఖను ఆడిట్ చేసిన ఆడిటర్లను, బ్యాంకు అధికారులను మొదలైన వారిని విచారించనుంది. పంజాబ్ నేషనల్ బ్యాంకులోని కుంభకోణాన్ని గుణపాఠంగా తీసుకుని ప్రభుత్వ రంగ బ్యాంకులు వ్యవస్థాపరమైన లోపాలను సరిదిద్దుకోవాలని, పటిష్ఠమైన రిస్క్ మేనేజిమెంట్ వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలని చెబుతున్నారు. డిస్ట్రిబ్యూటింగ్ లెడ్జర్ సాంకేతిక పరిజ్ఞానమైన బ్లాక్ చైన్ టెక్నాలజీ ఇటువంటి కుంభకోణాలను కట్టడి చేయగలదని అంటున్నారు.

ఎలా వసూలు చేయాలి

బ్యాంకర్ల సమావేశంలో ఇదే చర్చ



దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో కుంభకోణానికి దారితీసిన పరిణామాలు, నీరవ్ మోదీ దేశాన్ని విడిచి పారిపోవడం లాంటి అంశాలపై చర్చించేందుకు శనివారం ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) సమావేశమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అయితే తొలుత కఫే పెరేడ్‌లోని ఐబీఏ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశాన్ని నిర్వహించాలని అనుకోగా.. ఆఖరి క్షణంలో నారిమన్ పాయింట్ వద్ద ఉన్న ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయానికి సమావేశ వేదికను మార్చారు. మీడియాను తప్పించే ఉద్దేశంతోనే ఇలా చేసి ఉండొచ్చని తెలుస్తోంది. అయితే నీరవ్ మోదీ మోసం చేసి రుణంగా తీసుకున్న రూ.11,400 కోట్ల రుణాన్ని ఎలా వసూలు చేయాలనే విషయంపైనా సమావేశం ప్రధానంగా నడిచిందని ఓ బ్యాంకర్ వెల్లడించారు. ఐబీఏ ఛైర్‌పర్సన్, అలహాబాద్ ఎండీ ఉషా అనంత్ సుబ్రమణియన్, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ దీనబంధు మోహాపాత్రా, ఐసీఐసీఐ బ్యాంక్ సీఎఫ్‌ఓ ఎన్.ఎస్.కన్నన్, ఐబీఐ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బి.రాజ్‌కుమార్ తదితరులు సమావేశంలో పాల్గొన్నవారిలో ఉన్నారు.

ఈ అంశాన్ని ఎలా విస్మరించారు



పీఎన్‌బీకి, విదేశాల్లో ఉన్న ఇతర భారత బ్యాంకు శాఖలకు మధ్య అనుసంధానంగా ఉండే స్విఫ్ట్ మెసేజింగ్ వ్యవస్థను అన్నేళ్ల పాటు ఎవరికీ తెలియకుండా ఎలా ఉపయోగించుకున్నారన్నది కనుబొమ్మలు పైకి లేచేలా చేస్తోంది.

అందులో ఒక ప్రశ్న ఏమిటంటే.. వజ్రాభరణాల రంగంలో లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎల్‌ఓయూ)ల ద్వారా లావాదేవీలు జరగవు. ఎగుమతికి ముందు 90 రోజుల వ్యవధికి రుణం.. ప్యాకింగ్ లేదా ఎగుమతి తర్వాత 120 రోజుల వ్యవధికి రుణం తీసుకుంటుంటారు. ఈ తరహా రుణాల్లో హామీగా వ్యక్తిగత హామీ లేదా కార్యాలయాలు, ఆస్తులు, వజ్రాలను ఉంచుతారు. అయితే పీఎన్‌బీ విషయంలో జరిగింది వేరు. ఎల్‌ఓయూ వచ్చిన వెంటనే విదేశాల్లో భారత బ్యాంకు శాఖలకు అనుమానం వచ్చి ఉండాలని భారత్ డైమండ్ బోర్స్ అధ్యక్షుడు అనూప్ మెహతా అంటున్నారు. చాలా మంది వజ్రాభరణాల వర్తకులు పాటించే పద్ధతి ఆయా బ్యాంకులకు తెలియలేదు. అయినప్పటికీ..వాటిని తనిఖీ చేయడంలో ఎలా విఫలమయ్యాయో అర్థం కావడం లేదని ఆయన అన్నారు. స్విఫ్ట్ ద్వారా జరిగిన సమాచార చేరవేత ఎవరికీ తెలియకుండా ఎలా జరిగిందని సోషియల్ మీడియాలో చాలా మంది నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పీఎన్‌బీ విదేశీ మారక విభాగంలో ఎవరూ ఎందుకు అడగలేదు. కనీసం ఈ లావాదేవీలకు అనుమతులు ఎందుకు కోరలేదు. లేదంటే జూనియర్లు నోటిమాట ద్వారా చెప్పిన 'విషయానికి' అనుగుణంగా వారు 'నిశ్శబ్దం'గా ఉన్నారా? అనీ ప్రశ్నిస్తున్నారు.

సెల్‌కాన్ 'యూని క్యూ' స్మార్ట్ ఫోన్

ఈనాడు, తిరుపతి: సెల్‌కాన్ సంస్థ తమ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని సొంత పరిశ్రమలో తయారుచేసిన 'యూని క్యూ' స్మార్ట్ ఫోన్‌ను శనివారం చిత్తూరు జిల్లా కలెక్టరు పి.ఎస్.ప్రద్యుమ్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సెల్‌కాన్ సంస్థ నెలకు 5 లక్షల ఫోన్లను విక్రయిస్తోందని, దీనిని వచ్చే ఏడాదికి 10 లక్షలకు తీసుకెళ్లాలని సంస్థ ప్రతినిధులు లక్ష్యంగా పెట్టుకున్నారని, నెలకు 20 లక్షల ఫోన్లు తయారు చేసి విక్రయించాలని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు. సెల్‌కాన్ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు వై.గురు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో సెల్‌ఫోన్ల తయారీకి అవసరమైన అన్ని విడిభాగాలను ఇక్కడే తయారు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఇప్పటికే దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఛార్జర్ల తయారీని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సెల్‌కాన్ సంస్థ ఈడీ మురళి మాట్లాడుతూ.. భారతదేశంతోపాటు 10 దేశాల్లో ఫోన్లను విక్రయిస్తున్నామని, త్వరలోనే మరో 20 దేశాలకు విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.




సెల్‌కాన్ యూని క్యూ మొబైల్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టరు ప్రద్యుమ్న, పక్కన సెల్‌కాన్ ఈడీ మురళి, సీఎండీ గురు

బడ్జెట్‌లో 600 పథకాలకు కేటాయింపులు

నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి అనిల్ శ్రీవాత్సవ

రాయదుర్గం, న్యూస్‌టుడే: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 600 పథకాలకు కేటాయింపులు జరిపారని నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి అనిల్ శ్రీవాత్సవ తెలిపారు. బడ్జెట్ రూపకల్పనలో ఆరు నెలలపాటు పనిచేశామన్నారు. శనివారం గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థుల సంఘం, ఐఎస్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో పదవ 'స్టార్టప్ మాస్టర్ క్లాస్..' పేరుతో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభ కార్యక్రమంలో అనిల్ మాట్లాడుతూ.. సామాజిక రంగంలో అంకుర సంస్థలకు అవకాశాలు మెండుగా ఉన్నాయని, అనేక సమస్యలకు పరిష్కారాలు కనుగొనవచ్చన్నారు. దేశంలో పేదరిక నిర్మూలనకు మరిన్ని పరిశోధనలు జరగాలని పేర్కొన్నారు.

నైపుణ్యానికి మెండుగా అవకాశాలు.. బీవీఆర్ మోహన్ రెడ్డి: 'నా కథ.. ఓ విజయవంతమైన, సుస్థిర ప్రపంచ వ్యాపార నిర్మాణం' అనే అంశంపై సైయెంట్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి కీలకోపన్యాసం చేశారు. తన సంస్థ ప్రస్థానం, వ్యాపారంలో ఎదిగే విధానాన్ని ఆయన వివరించారు. భారత్‌లో నైపుణ్య ఉద్యోగుల కొరత ఉందని, నైపుణ్యాలతో వచ్చే యువతకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కష్టపడి ఒక్కో మెట్టు ఎక్కుతూ విలువలతో కూడిన వ్యాపారంతోనే వృద్ధిలోకి వస్తామని చెప్పారు. ఉద్యోగాలివ్వడంతో స్థానికులకే ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. క్వాల్కం ఇండియా అధ్యక్షుడు లారీ పాల్సన్ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లు వేదికగా చేసే వ్యాపారానికి భారత్ అవకాశాల గని అని చెప్పారు. త్వరితగతిన, తీగల రహిత(వైర్‌లెస్) ఛార్జింగ్ సెల్‌ఫోన్ల ఆవిష్కరణలపై అంకురాలు దృష్టి సారించాలని సూచించారు.



కోడి గుడ్లు

17వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	380	వరంగల్	382
చిల్లరగా (ఒక గుడ్డు)	4.40	విశాఖపట్నం	385
బెంగళూరు	405	చెన్నై	415
18వ తేదీకి		చిత్తూరు	408
విజయవాడ/గోదావరి	383	నమక్కల్	395

విజయవాడ
ఆదివారం ఫిబ్రవరి 18, 2018
siri@eenadu.net

సిరి

బీమా రక్ష.. పన్ను ఆదా!

పెట్టుబడులతో సంపదను పెంచుకోవాలనే ఆలోచన వచ్చినప్పుడు చాలామందికి ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లే గుర్తుకు వస్తాయి. అందుకే, ఇటీవల కాలంలో వీటికి ఆదరణ ఎంత పెరిగిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.. అయితే, కొత్త బడ్జెట్‌లో ప్రవేశ పెట్టిన దీర్ఘకాలిక మూలధన రాబడి పన్ను (ఎల్‌టీసీజీ)తో వీటిల్లో మదుపు చేసేవారు కొత్త ఆలోచనలో పడ్డారు. ఆర్థిక సంవత్సరంలో రూ.లక్ష దాటిన మూలధన రాబడిపై 10శాతం పన్ను చెల్లించాలనే ప్రతిపాదనతో ప్రత్యామ్నాయ మార్గాలేమున్నాయి.. అంటూ ఆరా తీస్తున్నారు. పెద్ద మొత్తంలో మదుపు చేయాలనుకునే వారు ఇప్పుడు యూనిట్ ఆధారిత బీమా పాలసీల (యులిప్) వైపు మొగ్గు చూపడం ప్రారంభిస్తున్నారు.





మినహాయింపు ఉందా?

పెట్టుబడికి సురక్షితంగా ఉండాలి.. అవసరమైనప్పుడు డబ్బును వెనక్కి తీసుకోవాలి.. మంచి రాబడి రావాలి.. పన్ను మినహాయింపు ఉండాలి.. సాధారణంగా ఒక పథకాన్ని ఎంచుకునేప్పుడు ఉద్యోగులైనా.. వ్యాపారం చేసే వారైనా ఇలాగే ఆలోచిస్తారు. అన్ని దశల్లోనూ అంటే.. పెట్టుబడి పెట్టినప్పుడు.. రాబడి వచ్చినప్పుడు.. పెట్టుబడినీ, రాబడినీ కలిపి వెనక్కి తీసుకునేప్పుడు పన్ను మినహాయింపు లభిస్తుందా (ఎగ్జెంప్ట్-ఎగ్జెంప్ట్-ఎగ్జెంప్ట్...(ఈఈఈ)) లేదా అనేదే ముఖ్యం. ఇలాంటి వెసులుబాటు విషయానికి వచ్చే సరికి ప్రస్తుతం యులిప్‌లు ముందు వరుసలో ఉంటాయని చెప్పుకోవచ్చు. కొత్త ప్రతిపాదనల నేపథ్యంలో ఇప్పుడు వీటికి ఆదరణ పెరగడానికి ఇదీ ఒక కారణం.

'ఈఈఈ' ఎలా లాభం?

చాలామందికి ఆదాయం పన్ను ఏ దశలో పడుతుందనే విషయంలో స్పష్టత ఉండదు. అందుకే, పన్ను మినహాయింపు కోసం పథకాలను ఎంపిక చేసుకునే విషయంలో గందరగోళం ఉంటుంది. పన్ను ఆదా కోసం పెట్టుబడులు పెట్టే తరుణమిది.. ఇలాంటి సమయంలో తప్పనిసరిగా పన్నుకు సంబంధించి కొన్ని సంగతులు తెలుసుకోవాలి. ప్రతి పెట్టుబడికీ మూడు దశల్లో పన్ను ప్రభావం ఉంటుంది. పెట్టుబడి పెట్టినప్పుడు పన్ను మినహాయింపు రావడం.. ఇవన్నీ ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80సీలో భాగంగా ఉంటాయి. ఇందులో బీమా ప్రీమియాలు, ఈఎల్‌ఎస్‌ఎస్‌లు తదితర పెట్టుబడులు ఉంటాయి. రెండో దశలో.. వచ్చిన రాబడిపై పన్ను.. రెండో దశ. ఇందులో డివిడెండ్లలాంటి వాటిపై ప్రస్తుతం పన్ను లేదు. ఇక మూడో దశ.. ఆ పెట్టుబడులను రాబడినీ వెనక్కి తీసుకోవడం.. ఇలాంటప్పుడే పన్ను పడకుండా చూసుకోవాలి. బీమా పాలసీల ద్వారా వచ్చిన ఆదాయానికి సెక్షన్ 10(10డి) ప్రకారం ఎలాంటి పన్ను ఉండదు.

యులిప్‌ల ద్వారా వచ్చిన రాబడికి పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది. ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత షేర్లలో మదుపు చేసినప్పుడు రాబడి రూ.1లక్ష దాటితే.. వర్తించే ఎల్‌టీసీజీ ప్రస్తావన ఇక్కడ ఉండదు. కాబట్టి, యులిప్ పాలసీదార్లకు ఇదొక అదనపు ప్రయోజనంగా చెప్పుకోవచ్చు.

యులిప్‌లే ఎందుకు?

గతంతో పోలిస్తే.. ఇప్పుడు బీమా రంగం ఎంతో వృద్ధి దశలో ఉంది. భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) తీసుకొచ్చిన పలు నిబంధనల వల్ల బీమా పాలసీల ఖర్చు, ఇతర అంశాల్లో కచ్చితమైన పరిమితులు ఏర్పడ్డాయి. కొత్త తరం యూనిట్ ఆధారిత పాలసీల్లో.. ప్రీమియం కేటాయింపుల రుసుము, పాలసీ నిర్వహణ రుసుములు లేకపోవడం... ఫండ్ మేనేజ్‌మెంట్ ఛార్జీల విషయంలోనూ తక్కువగా ఉండటం వీటికి కలిసొస్తోంది. కొన్ని సందర్భాల్లో ఈ యులిప్‌ల ఖర్చు.. మ్యూచువల్ ఫండ్ సంస్థల కన్నా తక్కువే అవుతుందని అనుకోవచ్చు.

రెండిందాల లాభం: జీవిత బీమా వేరు.. పెట్టుబడి వేరు. ఈ రెండింటినీ విడిగా ఉంచేందుకే ప్రయత్నించాలి. కానీ, ఒక పెట్టుబడి పథకం.. రెండు విధాల ప్రయోజనాన్ని అందించినప్పుడు దానిలో మదుపు చేసే విషయంలో ఎలాంటి ఇబ్బందీ ఉండదనే అనుకోవాలి. ఆర్థిక లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన పెట్టుబడి అవకాశాన్ని ఇవ్వడం తోపాటు.. జీవిత బీమా ద్వారా ధీమాను కూడా అందుకోవచ్చు. దీనికోసం బీమా సంస్థలు నామమాత్రపు రుసుములు విధిస్తున్నాయి. ఏదైనా అనుకోనిది జరిగినప్పుడు కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించడమే బీమా ఉద్దేశం అని మర్చిపోకూడదు.

మార్చుకోవచ్చు...: పాలసీదారుడు నష్టభయం భరించే శక్తిని బట్టి, ఈక్విటీలకు ఎంత కేటాయించాలి.. డెట్ పథకాల్లో ఎంత మదుపు చేయాలన్నది నిర్ణయించుకునే వీలుంది. గతంలో చాలామటుకు డెట్ పథకాలు 8-9శాతం వరకూ రాబడిని ఆర్జించాయి. మార్కెట్లు తగ్గుతున్నప్పుడు ఈక్విటీలకు బదులు డెట్ పథకాలను ఎంచుకోవచ్చు. మార్కెట్ వృద్ధి పథంలో సాగుతున్నప్పుడు డెట్ నుంచి ఈక్విటీలకు మళ్లించుకోవచ్చు. ఇలా ఎన్నిసార్లయినా మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం ఉండటం ద్వారా పెట్టుబడులకు కలిసొచ్చే అవకాశం ఉంది. మూలధనాన్ని వెనక్కి తీసుకోవాల్సిన అవసరం లేకుండా... తక్కువ నష్టభయంతో ఎక్కువ రాబడిని ఆర్జించేందుకు ఇవి తోడ్పడతాయి.

భవిష్యత్తు ఆర్థిక లక్ష్యాల ఆధారంగా.. ఆశించే రాబడిని బట్టి, వివిధ రకాల ఆప్షన్లను ఎంచుకునేందుకు పాలసీదారులకు అవకాశం ఉంది.

> **యులిప్‌ల ద్వారా వచ్చిన రాబడికి పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది. కాబట్టి, యులిప్ పాలసీదార్లకు ఇదొక అదనపు ప్రయోజనంగా చెప్పుకోవచ్చు.**

ఏదైనా ఒక పెట్టుబడి పథకాన్ని తీసుకునేప్పుడు అందులో ఉండే లాభనష్టాలను తప్పనిసరిగా పరిశీలించాలి. పన్ను ఆదా అనేది ఆ తర్వాత ఒక అదనపు ప్రయోజనంగానే చూసుకోవాలి. పెట్టుబడికీ, బీమాకు, పన్ను ఆదాకు కలిపి ఒకే పథకాన్ని ఎంచుకోవాలనుకున్నప్పుడు యులిప్‌ను ఒక చక్కని మార్గంగా పరిగణించవచ్చు.

- సంతోష్ అగర్వాల్, హెడ్ ఆఫ్ లైఫ్ ఇన్సూరెన్స్, *www.policybazaar.com*

రాబడి రూ.లక్ష దాటితేనే..

మార్గదర్శి

>>> ఇప్పటి వరకూ నేను మ్యూచువల్ ఫండ్లలో రూ.4లక్షల మేరకు మదుపు చేశాను. మొత్తం పెట్టుబడుల విలువ ఇప్పుడు దాదాపు రూ.7లక్షలు. కొత్తగా దీర్ఘకాలిక మూలధన రాబడి పన్ను నిబంధన వచ్చింది కదా! ఈ నేపథ్యంలో నేను ఎంత మేరకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది?

- రాజేశ్

బడ్జెట్‌లో చెప్పినదాన్ని గమనిస్తే.. జనవరి 31, 2018 వరకూ ఉన్న పెట్టుబడుల విలువ 'గ్రాండ్‌ఫాదర్డ్' అవుతుందని చెప్పారు. అప్పటివరకూ మీరు ఆర్జించిన లాభాలపై నిబంధనలను అనుసరించి ఎలాంటి దీర్ఘకాలిక పన్ను చెల్లించక్కర్లేదు. అయితే, రానున్న రెండుమూడేళ్లలో మీ పెట్టుబడుల విలువ రూ.9లక్షల వరకూ చేరుకునే అవకాశం ఉంది. ఇలాంటప్పుడు ఒకే ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం వెనక్కి తీసుకున్నారనుకుందాం.. అప్పుడు జనవరి 31, 2018 వరకూ మీ పెట్టుబడుల విలువ రూ.7లక్షలకు మినహాయింపు వర్తిస్తుంది. దీనికి అదనంగా ఆర్జించిన రూ.2లక్షలు దీర్ఘకాలిక మూలధన రాబడి కిందకు వస్తాయి. ఇందులో నుంచి రూ.లక్షకు మినహాయింపు వర్తిస్తుంది. మిగతాది రూ.1లక్ష. దానికి ఎల్‌టీసీజీ నిబంధనల మేరకు 10శాతం పన్ను వర్తిస్తే.. రూ.10వేలు చెల్లించాలి. కాబట్టి, ఆందోళన చెందకండి.

>>> ఆదాయపు పన్ను మినహాయింపు కోసం ఇంకా రూ.50వేల వరకూ పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. దీనికోసం ఏదైనా పన్ను ఆదా పథకాలను ఎంచుకోవాలని చూస్తున్నాను. మ్యూచువల్ ఫండ్లు ఎంచుకోవచ్చా? - లక్ష్మి

పెట్టుబడి పథకాలను కేవలం పన్ను ఆదా కోసం ఎంచుకోవాలనుకోవడం సరికాదు. మన ఆర్థిక లక్ష్యాలకు పెట్టుబడులను అనుసంధానం చేయాలి. అప్పుడే.. పెట్టుబడుల నుంచి గరిష్ఠ ప్రయోజనాలను పొందేందుకు ఆస్కారం ఉంటుంది. ఒకేసారి మొత్తం పెట్టుబడులు పెట్టడం కన్నా.. క్రమానుగత పెట్టుబడి విధానాన్ని అనుసరించడం మేలు. ఈ ఆర్థిక సంవత్సరానికి మీ సెక్షన్ 80సీలో ఇంకా మిగిలిన మొత్తానికి మీరు ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఈఎల్‌ఎస్‌ఎస్) ఎంచుకోండి. ఏప్రిల్ 1, 2018 నుంచి క్రమానుగత పెట్టుబడి విధానాన్ని (సిప్)ను అనుసరించండి. ఐడీఎఫ్‌సీ ట్యాక్స్ అడ్వాంటేజ్ ఫండ్, మిరే అసెట్ ట్యాక్స్ సేవర్ ఫండ్, రిలయన్స్ ట్యాక్స్ సేవర్ ఫండ్లను పరిశీలించండి.

>>> నేను నాలుగు మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేస్తున్నాను. ఇవన్నీ కూడా స్మాల్, మైక్రో క్యాప్ ఫండ్లే. గత రెండు నెలలుగా పరిశీలిస్తే.. నా పెట్టుబడుల విలువ బాగా తగ్గిపోయినట్లు కనిపిస్తోంది.. ఇలాంటప్పుడు నేను ఈ ఫండ్ల నుంచి మారాలా? - కుమార్



స్మాల్, మైక్రో క్యాప్ ఫండ్లలో సహజంగానే కాస్త హెచ్చుతగ్గులు ఉంటాయి. అయితే, మీరు కనీసం 5-6ఏళ్లకు మించి కొనసాగాలనుకున్నప్పుడు ఇలాంటి స్వల్పకాలిక తగ్గుదలలకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఒకే రకమైన ఫండ్లలో మదుపు చేయడం కన్నా.. వైవిధ్యంగా ఉండేలా చూసుకోవడం ఎప్పుడూ మంచిది. ప్రస్తుతం మీరు మదుపు చేస్తున్న ఫండ్లలో మంచి రాబడి వస్తుంటే సరే.. లేకపోతే.. ఓసారి మీ పోర్ట్‌ఫోలియోను సమతౌల్యం చేసుకునేందుకు ప్రయత్నించండి. సాధారణంగా లార్జ్‌క్యాప్‌లో 30శాతం, మల్టీక్యాప్ ఫండ్లలో 50శాతం, మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్లలో 20శాతం చొప్పున పెట్టుబడులు ఉండేలా చూసుకోవాలి. మీ ఫండ్లను సమీక్షించుకున్న తర్వాత.. లార్జ్ క్యాప్‌లో రిలయన్స్ టాప్ 200 ఫండ్, మల్టీ క్యాప్‌లో డీఎస్‌పీ బ్లాక్‌రాక్ అపర్చునిటీస్ ఫండ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ అడ్వాంటేజ్ ఫండ్, ఎస్‌బీఐ మల్టీ క్యాప్ ఫండ్లను ఎంచుకోవచ్చు. మీరిప్పటికే మదుపు చేస్తున్న స్మాల్ క్యాప్ ఫండ్లలో మంచి పనితీరు ఉన్న వాటిలో కొనసాగండి.

- సాయికృష్ణ పత్రి, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

కొత్త పథకం

డాక్టర్ ఫీజులనూ చెల్లించేలా...

ఆరోగ్యం బాగాలేనప్పుడు వైద్యుడిని సంప్రదించడం, కొన్ని పరీక్షలు చేయించుకోవడం సహజమే. ఇలాంటప్పుడు అయ్యే ఖర్చులను కూడా వెనక్కి ఇచ్చే విధంగా వినూత్న ఆరోగ్య బీమా పాలసీని మ్యాక్స్ బూపా హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకొచ్చింది. దీనిపేరు గోయాక్టివ్. పాలసీదారులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన సలహాలు ఇచ్చేందుకు 'హెల్త్ కోచ్' పేరుతో సరికొత్త సేవలను కూడా అందిస్తోంది. క్రమం తప్పకుండా నడిచే వారిని గుర్తించేందుకు ఒక యాప్‌ను రూపొందించి అందిస్తోంది. ఏడాదికి 10వేల పాయింట్లు దాటిన వారికి పాలసీ పునరుద్ధరణ సమయంలో రాయితీని అందిస్తోంది. పెరుగుతున్న వైద్య ఖర్చుల నేపథ్యంలో ఐ-ప్రొటెక్ట్ పేరుతో ఏటా 10శాతం చొప్పున పాలసీ మొత్తాన్ని పెంచుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. కుటుంబం అంతటికీ వర్తించేలా ఫ్లోటర్ పాలసీని, లేదా వ్యక్తిగతంగా తీసుకునే వీలుంది. 35 ఏళ్లలోపు వ్యక్తి తనకూ జీవిత భాగస్వామి, ఇద్దరు పిల్లలకు కలిపి రూ.5 లక్షల ఫ్లోటర్ పాలసీని తీసుకుంటే.. ప్రీమియం దాదాపు రూ.16,240 వరకూ ఉండొచ్చు.

దీర్ఘకాలం కోసం...

మార్కెట్లో అందుబాటులో ఉన్న లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ సంస్థల షేర్లలో వైవిధ్యంగా ఉండే వాటిలో మదుపు చేసే వ్యూహంతో వచ్చిన పథకం.. యాక్సిస్ క్యాపిటల్ బిల్డర్ ఫండ్, సిరీస్ 1. గ్రోత్ విభాగానికి చెందిన ఈ క్లోజ్ ఎండెడ్ పథకంలో పెట్టిన పెట్టుబడిని కనీసం 1540 రోజులు కొనసాగించాలి. నిఫ్టీ 500 ఇండెక్స్ ప్రామాణికంగా పనిచేసే ఈ పథకంలో కనీస పెట్టుబడి రూ.5వేలు. మార్చి 1 వరకూ ఎన్‌ఎఫ్‌ఓ అందుబాటులో ఉంటుంది.

■ దీర్ఘకాలం వైవిధ్యంగా మదుపు చేసే వ్యూహంతో వివిధ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న సంస్థల్లో మదుపు చేసేలా డీఎస్‌పీ బ్లాక్‌రాక్ ఏ.సీ.ఈ. ఫండ్, సిరీస్ 2 అందుబాటులోకి వచ్చింది. ఇన్‌కం విభాగానికి చెందిన ఈ క్లోజ్ ఎండెడ్ ఫండ్‌లో మార్చి 1 వరకూ మదుపు చేసే అవకాశం ఉంది. కనీస పెట్టుబడి రూ.1,000. జూన్ 28, 2021 వరకూ కొనసాగాలి.

■ స్థిరాదాయ పథకాల్లో మదుపు చేయాలనుకునే వారి కోసం, కాస్త తక్కువ నష్టభయం ఉండేలా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్, సిరీస్ 82 మార్కెట్లోకి వచ్చింది. ఇందులో కనీస పెట్టుబడి రూ.5,000. కనీసం 1157 రోజులు కొనసాగాలి. ఎన్‌ఎఫ్‌ఓ ఫిబ్రవరి 28 వరకూ అందుబాటులో ఉంటుంది.

■ తగ్గుతున్న వడ్డీ రేట్ల నేపథ్యంలో, సురక్షితంగా ఉంటూ.. పెట్టుబడి వృద్ధికి దోహదం చేసేలా ఎస్‌బీఐ డెట్ ఫండ్ సిరీస్ సి-10 అందుబాటులోకి వచ్చింది. డెట్ పథకాలు, ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల బాండ్లు, కార్పొరేట్ బాండ్లలో ఇది మదుపు చేస్తుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.5వేలు. 1150 రోజుల పాటు మదుపు చేయాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 20 వరకూ మదుపు చేయవచ్చు.

పెట్టుబడికి సిద్ధం ఇలా...

కొత్తగా ఉద్యోగంలో చేరారా.. ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత పథకాల్లో మదుపు చేయాలని ఆలోచిస్తున్నారా? మరి, పెట్టుబడి పెట్టే ముందు తెలుసుకోవాల్సిన అంశాలేమిటో చూద్దామా!



చేతికి వచ్చిన జీతాన్ని ఏం చేశారు.. ఇన్నాళ్లపాటూ దాచుకున్న కోరికలను తీర్చేందుకు వాడేస్తున్నారా.. సరే. ఒకటి రెండు నెలలు అయ్యాక.. అలాగే ఖర్చు చేస్తూ వెళ్తే బాగుండదు కదా.. భవిష్యత్తు కోసం ఎంతో కొంత దాచుకోవాల్సిందే.. అందుకు అనుగుణంగా ఈక్విటీ పెట్టుబడుల వైపు చూడాల్సిందే. వచ్చిన డబ్బు.. వచ్చినట్లే ఖర్చు చేస్తే చేతిలో చిల్లిగవ్వ కూడా మిగలదు.. అందుకే, ముందు అందులో నుంచి కొంత తీసి భద్రపర్చాలి. మిగిలిన మొత్తమే మనకు వచ్చిన ఆదాయంగా పరిగణించి, దాన్ని ఖర్చు చేసేందుకు ప్రయత్నించాలి. అప్పుడే ముమ్ముందు ఏదైనా కఠిన పరిస్థితులు వచ్చినా నిలదొక్కుకోగలం.

కొంత.. అత్యవసరం కోసం...

వచ్చిన జీతం నుంచి ముందుగా చేయాల్సిందేమిటో తెలుసా.. అత్యవసర పరిస్థితుల్లో వాడుకునేందుకు వీలుగా ఉండేందుకు కనీసం 3-6 నెలల ఖర్చులకు సరిపడే మొత్తాన్ని ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలి. ఆరోగ్య అత్యవసర పరిస్థితులు.. ప్రయాణాలు.. తాత్కాలికంగా ఉద్యోగం మానేయడం.. ఏదైనా అనుకోని ఖర్చు ఎదురవ్వడంలాంటివి వచ్చినప్పుడు మీ దగ్గర ఉన్న ఈ డబ్బే మిమ్మల్ని ఆదుకుంటుంది. ఈక్విటీ పెట్టుబడులు దీర్ఘకాలిక వ్యవధికి ఎంపిక చేసుకోవాలి. కాబట్టి, మీ దగ్గర అధికంగా ఉన్న డబ్బునే వీటిల్లో మదుపు చేయాలి. కనీసం రెండేళ్ల తర్వాతే ఆ డబ్బుతో అవసరం అనుకుంటేనే ఈక్విటీల వైపు చూడాలి. అత్యవసర నిధి కాబట్టి, సులభంగా వెనక్కి తీసుకునేలా ఉంటేనే మంచిది.

సొంత నిర్ణయం...

సొంతంగా పెట్టుబడులు పెట్టాలని అనుకున్నప్పుడు.. మీరు కొనబోయే కంపెనీ షేర్ల గురించి పూర్తి స్థాయిలో పరిశోధన చేయండి. వారి వ్యాపారం ఏమిటి? వారి బలాలు, బలహీనతలు, వృద్ధికి ఉన్న అవకాశం ఏమిటి.. చూసుకోండి. ఆ షేరు సరైన ధరకే దొరుకుతుందా లాంటివీ పరిశీలించండి. ఒక కంపెనీ గురించి మాత్రమే తెలుసుకుంటే సరిపోదు.. ఆ సంస్థ ఉన్న రంగం గురించి కూడా మీరు పూర్తిగా తెలుసుకోవాలి. పోటీ సంస్థలకు భిన్నంగా ఈ సంస్థ ఎంత దూకుడుగా ఉందో చూసుకోవాలి. ఒక కంపెనీ షేర్లలో మదుపు చేస్తున్నారంటే.. ఆ సంస్థలో మీరూ భాగస్వాములైనట్లే లెక్క. కాబట్టి, ఆ సంస్థ యాజమాన్యం గురించి పూర్తిగా తెలుసుకున్నాకే పెట్టుబడి నిర్ణయం తీసుకోండి.

ఎప్పుడూ కొనసాగేలా..

మార్కెట్ల పోకడలను గుర్తించడం కష్టమే. అధిక రాబడులను ఆర్జించాలంటే.. మార్కెట్ సమయాన్ని చూడటం కాకుండా.. నిరంతరం అందులో కొనసాగుతున్నామా లేదా అనేదే ముఖ్యంగా చూసుకోవాల్సిన విషయం.. ఒకేసారి పెద్ద మొత్తంలో మదుపు చేయడం కన్నా.. నెలనెలా కొంత మొత్తాన్ని పెట్టుకుంటూ వెళ్లడమే ఎప్పుడూ ఆచరణీయం. మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసేందుకు ఈ క్రమానుగత పెట్టుబడుల విధానం (సిప్) ఎప్పుడూ మేలే. మార్కెట్లు తగ్గుతున్నప్పుడు సిప్ మొత్తాన్ని పెంచడం మంచిదే. ఎందుకో తెలుసా.. సూచీలు తగ్గితే మీకు మరిన్ని ఫండ్ యూనిట్లు వస్తాయి. దీనివల్ల సగటు ప్రయోజనం చేకూరుతుంది.

పట్టించుకోవద్దు..

ఒక క్రీడాకారుడు తాను ఆడేప్పుడు ఆట మీదే దృష్టి కేంద్రీకరిస్తాడు. బయట వినిపించే శబ్దాలు అతని దృష్టిని మరల్చవు. పెట్టుబడుల విషయం కూడా అంతే.. తెలివైన మదుపరి ఎప్పుడూ, తన పెట్టుబడుల గురించే పట్టించుకోవాలి. బయట వినిపించే రకరకాల వదంతుల గురించి ఆందోళన పడకూడదు. అత్యాశ, భయం.. ఈ రెండూ కూడా పెట్టుబడులకు నిజమైన శత్రువులు అని గుర్తించాలి. క్రమశిక్షణతో పెట్టుబడులను నిర్వహించినప్పుడే మీరు అనుకున్న ఫలితాలను పొందగలరు. తొందరపడి కొనడం.. ఆందోళనతో అమ్మడం.. ఈ రెండూ కూడా మంచివి కావు. మానసిక ఉద్వేగాలు కాకుండా.. ఒక పద్ధతి పెట్టుబడులను నడిపించాలి.

అనుకరణ వద్దు..

పెట్టుబడుల విషయంలో ఒకరిని అనుసరించడం ఎప్పుడూ ప్రమాదమే. వారికి లాభాలు వచ్చాయని, మీకు అర్థం కాని పథకాలను ఎంపిక చేసుకుంటే.. ఆర్థికంగా నష్టపోయే ఆస్కారం ఉంది. గుంపును అనుసరించడం వల్ల మంచి లాభాలు ఆర్జించడం కష్టమే. అమాయకులైన మదుపరులను మోసం చేయడానికి కొంతమంది వేసే వల అది అని గుర్తించాలి. ఉదాహరణకు ఒక ఐపీఓ వచ్చినప్పుడు ఆ రంగంలో ఉన్న ఇతర షేర్లలో కూడా కొంత వృద్ధి కనిపిస్తుంటుంది. తెలివైన మదుపరి ఈ విషయాన్ని గుర్తించి, ఆ రంగంలో ఉన్న మంచి షేర్లలో మదుపు చేసే విధంగా ప్రణాళిక వేసుకోవాలి. ఐపీఓ తర్వాత మంచి లాభాలు వచ్చినప్పుడు వాటిని స్వీకరించి బయటకు వచ్చేందుకు ప్రయత్నించాలి.

వైవిధ్యం..

ఒకే చోట మొత్తం పెట్టుబడులను పెట్టడం ఎప్పుడూ మంచిది కాదు. మీ వద్ద ఉన్న మిగులు మొత్తాన్ని దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా వివిధ రంగాలు, కంపెనీల్లో మదుపు చేయండి. ఒక రంగం పనితీరు అంత బాగా లేకపోయినా.. మిగతా రంగాల నుంచి వచ్చే లాభాలు వాటిని సమతౌల్యం చేస్తాయి. అదే సమయంలో మీ నష్టభయ సామర్థ్యాన్ని కూడా విశ్లేషించుకోండి. నష్టభయం ఎక్కువగా తట్టుకోగలిగితే.. అధిక రాబడినిచ్చే వాటి జోలికి వెళ్లవచ్చు. అయితే, అన్ని సమయాల్లోనూ ఇదే సూత్రం వర్తించదు. కాబట్టి, తక్కువ నష్టభయంతో మంచి రాబడిని అందించే పథకాల్లో దీర్ఘకాలం కొనసాగేందుకు ప్రయత్నించండి.

ఉద్వేగాలను అదుపు...

ముందే అనుకున్నట్లు.. అత్యాశ, భయం ఈ రెండూ మదుపరులకు శత్రువులు. మదుపరులు ఈ రెండు భావోద్వేగాలను అదుపు చేసుకునేందుకు ప్రయత్నించాలి. షేర్ల ధరల్లో హెచ్చుతగ్గులు వాస్తవంగా మీపై ఎలాంటి ప్రభావం చూపిస్తున్నాయన్న సంగతిని మాత్రమే గమనించాలి. దాన్ని బట్టి నిర్ణయం తీసుకోవాలి. తెలివైన మదుపరులు ఎలా ఉండాలో తెలుసా... ఇతరులు భయపడుతూ మార్కెట్ నుంచి దూరంగా వెళ్తున్నప్పుడు అత్యాశతో ఉండాలి.. ఇతరులు మదుపు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటే.. భయపడాలి. మార్కెట్ తగ్గినప్పుడల్లా మదుపు కొనసాగిస్తూ వెళ్లిన వారికి, స్పెక్యులేషన్లు చేసేవారికన్నా మంచి లాభాలే వచ్చినట్లు చరిత్రను చూస్తే అర్థం అవుతుంది.

వేచి చూడాలి..

మనం పెట్టుబడులు పెట్టినప్పుడు కాస్త ఓపికతో ఎదురు చూడాలి. ఇతరులు మనకన్నా అధిక లాభాలు ఆర్జిస్తున్నారనే తొందరలో మనమూ తప్పు నిర్ణయాలు తీసుకోకూడదు. పెట్టుబడులను సమీక్షించుకోవడం మంచిదే కానీ.. ఎప్పుడూ అదే పనిగా మార్పులు చేర్పులు చేస్తుంటే వచ్చేదేమీ ఉండదు. దీనికి భిన్నంగా పోర్ట్‌ఫోలియోను ఒకసారి సమీక్షించుకొని, అందులో ఏదైనా మార్పులు చేర్పులు చేయాలా అన్నది నిర్ణయించుకోండి. మన పెట్టుబడులు ఇప్పటికిప్పుడు అత్యధిక రాబడులే అందించకపోవచ్చు. కానీ, దీర్ఘకాలం వేచి చూసినప్పుడు తప్పకుండా మంచి లాభాలే అందుతాయి. మార్కెట్ పరుగులు పెట్టిస్తూనే ఉంటుంది. మీరు కాస్త ఓపిక పట్టినప్పుడే సంపద సృష్టి జరుగుతుంది.

చివరగా.. వంద మైళ్ల ప్రయాణమైనా.. ఒక్క అడుగుతో మొదలవుతుంది.. ఈ ఒక్క సూత్రాన్ని గుర్తించుకొని, మీకు వీలున్నంత మొత్తాన్ని మార్కెట్లో నిరంతరం కొనసాగేలా మదుపు చేయండి. ఒక నాటికి పెద్ద మొత్తంలో నిధి మీ కళ్లముందు ఉంటుంది.

- అరుణ్ ఠుక్రాల్, ఎండీ, సీఈఓ, యాక్సిస్ సెక్యూరిటీస్

నిపుణుల సలహా తీసుకోండి...

స్వతహాగా ఈక్విటీ మార్కెట్లు అనిశ్చితికి మారుపేరు. ఇలాంటి చోట మదుపు చేయాలంటే.. నిపుణుల సలహాలు స్వీకరించడం అవసరమే. కొత్తగా మదుపు చేసేవారు.. తొలుత సందర్భానుసారంగా నిపుణులను ఆశ్రయించాలి. మార్కెట్ పరిస్థితులు, ఆయా రంగాల పనితీరు, సూక్ష్మ ఆర్థిక వ్యవస్థ గురించి నైపుణ్యం ఉండి, మీకు సరైన సలహాలు ఇవ్వగలిగిన వ్యక్తినే ఎంచుకోండి. మీరు కూడా సొంతంగా కొంత పరిశోధన చేయండి. అవగాహన పెంచుకోండి. ఆ తర్వాతే నేరుగా మీరే పెట్టుబడులను నిర్వహించుకోవచ్చు. అంత శ్రమ నాకు అవసరమా అనుకుంటే.. నిపుణులు సేవలను వినియోగించుకోవడానికి సందేహించకండి.

ఉగ్రవాదరహిత ప్రపంచం మా లక్ష్యం

- సంయుక్త విలేకరుల సమావేశంలో మోదీ, రౌహానీ
- భారత్, ఇరాన్‌ల మధ్య 9 ఒప్పందాలు
- దిల్లీలో ప్రధాని మోదీతో ఇరాన్ అధ్యక్షుడు రౌహానీ భేటీ

దిల్లీ

ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ భారత్ పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య కీలక అంశాలపై 9 ఒప్పందాలు కుదిరాయి. దక్షిణ ఇరాన్‌లో నిర్మాణంలో ఉన్న చాబహార్ నౌకాశ్రయంలోని టెర్మినల్ నిర్వహణను 18 నెలల పాటు భారత్‌కు అప్పగించటం వీటిలో ఒకటి. ఉగ్రవాదం, భద్రత, వాణిజ్యం, ఇంధన అంశాల్లో పరస్పర సహకారంపైనా ఫలవంతమైన చర్చలు జరిగాయి. తమ మధ్య జరిగే ఎగుమతులు, దిగుమతుల చెల్లింపులు రెండు దేశాలకు చెందిన కరెన్సీ (రూపాయి,



శనివారం దిల్లీలో ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీతో ప్రధాని మోదీ

రియాల్)లోనే జరుపుకోవటంలోని సాధ్యాసాధ్యాల అధ్యయనానికి అంగీకారం కుదిరింది. ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాన్ని ఒక నిర్ణీత సమయంలోగా పూర్తిచేసుకోవాలనీ రెండు దేశాలు అభిప్రాయపడ్డాయి.

శనివారం దిల్లీలో రౌహానీ... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. నేతల విస్తృత స్థాయి చర్చల్లో ప్రాంతీయ పరిస్థితులూ ప్రస్తావనకు వచ్చాయి. శాంతియుతమైన, సుస్థిరమైన, సుసంపన్నమైన బహుళత్వ అఫ్గానిస్థాన్‌ను వారు ఆకాంక్షించారు. చాబహార్ నౌకాశ్రయంలోని షాహిద్ బెహెష్తి టెర్మినల్ నిర్వహణ భారత్‌కు చెందిన ఇండియాస్ పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ (ఐపీజీఎల్)కు అప్పగించేలా ఇరాన్స్ పోర్ట్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్‌తో లీజు ఒప్పందం కుదిరింది. ద్వంద పన్నులను తొలగించటం, నేరస్థుల అప్పగింత, దౌత్య పాస్‌పోర్టులు కలిగిన వారికి వీసాల నుంచి మినహాయింపు, సంప్రదాయక ఔషధాలు, ఎగుమతులకు సంబంధించి నిపుణుల బృందం ఏర్పాటు తదితర ఒప్పందాలపై రెండు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. అనంతరం ప్రధాని మోదీ, అధ్యక్షుడు రౌహానీ సంయుక్తంగా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. రెండు దేశాలూ ఉగ్రవాద రహిత ప్రపంచాన్ని కోరుకుంటున్నాయని ప్రధాని మోదీ వెల్లడించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, మాదకద్రవ్యాల రవాణా, సైబర్ నేరాలు, ఇతర అంతర్జాతీయ నేరాలను విస్తరింపజేయటానికి సహకరిస్తున్న శక్తులను సమర్థంగా నిరోధించాల్సిన అవసరం ఉందని రెండు దేశాలు అంగీకరించాయన్నారు. వ్యూహాత్మకమైన చాబహార్ నౌకాశ్రయాన్ని బంగారు ముఖద్వారంగా మోదీ అభివర్ణించారు. భూపర్యవేష్టిత అఫ్గానిస్థాన్‌కు, మధ్య ఆసియాకు సముద్ర మార్గాన్ని అనుసంధానం చేయటంలో ఈ నౌకాశ్రయం బాగా ఉపకరిస్తుందన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదాలపై పోరుకు తాము కట్టుబడి ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు తెలిపారు. సహజవాయువు, పెట్రోకెమికల్స్, బ్యాంకింగ్ రంగాల్లో సహకారాన్ని విస్తరించుకోవాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ప్రాంతీయ ఉద్రిక్తతలను పరస్పరం చర్చలు, దౌత్య సంప్రదింపులు, రాజకీయ చొరవతో పరిష్కరించుకోవాలని అభిప్రాయపడ్డారు. అయితే, ఏ దేశం పేరునూ ఆయన ప్రస్తావించలేదు. దీన్‌దయాళ్ పోర్టు, షాహిద్ బెహెష్తి టెర్మినల్ చిత్రాలతో రూపొందించిన సంయుక్త పోస్టల్ స్టాంప్‌ను ఇద్దరు నేతలు విడుదల చేశారు.

అంతకుముందు రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్న రౌహానీకి సాదర స్వాగతం లభించింది. శనివారం ఉదయం ఇరాన్ అధ్యక్షునితో విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ సమావేశమై వివిధ అంశాలపై చర్చలు జరిపారు.



శనివారం దిల్లీలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడితో సమావేశమైన ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ

అణు ఒప్పందంపై మడమ తిప్పం

ఇరాన్ అధ్యక్షుడు రౌహానీ స్పష్టీకరణ

దిల్లీ: ఆరు పెద్ద దేశాలతో కుదుర్చుకున్న అణు ఒప్పందంలోని నిబంధనలకు తుదిశ్వాస విడిచే వరకూ తమ దేశం కట్టుబడి ఉంటుందని ఇరాన్ అధ్యక్షుడు రౌహానీ స్పష్టం చేశారు. ఈ ఒప్పందం నుంచి బయటకు వచ్చేస్తామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒప్పందంపై పునఃసమీక్ష జరపాలన్న ట్రంప్ డిమాండ్‌ను తోసిపుచ్చారు. శనివారం దిల్లీలో "ఇరాన్ విదేశాంగ విధాన ప్రాధాన్యాలు" అనే అంశంపై మాట్లాడుతూ రౌహానీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి కూడా ఈ ఇరాన్ అణుఒప్పందాన్ని ఆమోదించిందని తెలిపారు. భారత్ మద్దతు తమకు తెలియజేయటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. 130 కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే భారత్‌కు వీటో హక్కు ఎందుకివ్వరని ప్రశ్నించారు.

నికోలస్ అంత పనిచేస్తాడని ఉప్పందింది

స్పందించడంలో విఫలమయ్యాం: ఎఫ్‌బీఐ

పోంపానో బీచ్: ఫ్లోరిడా రాష్ట్రంలోని ఒక పాఠశాలలో ఊచకోతకు పాల్పడ్డ నికోలస్ క్రూజ్.. అలాంటి దారుణాన్ని ఒడిగడతాడని ముందే సమాచారం ఉన్నప్పటికీ.. దానిపై ప్రతిస్పందన చర్యలు తీసుకోవడంలో తమ సిబ్బంది విఫలమయ్యారని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ అంగీకరించింది. గత నెల 5న ఈ సమాచారం అందినట్లు తెలిపింది. నికోలస్‌కు సన్నిహితుడే ఈ ఉప్పందించినట్లు వివరించింది. ఈ సమాచారాన్ని తీవ్రంగా పరిగణించి, మయామీలోని ఎఫ్‌బీఐ కార్యాలయానికి చేరవేయాల్సిందని పేర్కొంది. కానీ ఎలాంటి తదుపరి దర్యాప్తు జరగలేదని తెలిపింది. అందువల్ల బాధితుల కుటుంబాలకు క్షమాపణ చెబుతున్నట్లు వివరించింది. ప్రాణాలు కాపాడిన భారత ఉపాధ్యాయురాలి సాహసం ఫ్లోరిడా కాల్పుల ఘటనలో సమయస్ఫూర్తి, తెగువ చూపి.. తన విద్యార్థుల ప్రాణాలను కాపాడిన భారత్‌కు చెందిన గణిత ఉపాధ్యాయురాలు శాంతి విశ్వనాథన్‌పై ప్రశంసల జల్లు కురుస్తోంది. కాల్పులకు ముందు నికోలస్.. అగ్నిప్రమాద హెచ్చరికను మోగించిన సంగతి తెలిసిందే. తద్వారా విద్యార్థులను తరగతి గదుల నుంచి వెలుపలికి రప్పించి, ఎక్కువ మంది ప్రాణాలను హరించాలన్నది అతడి ఎత్తుగడ. అయితే ఆ రోజున అప్పటికే ఒకసారి అగ్నిప్రమాద సన్నాహక డ్రిల్‌ను నిర్వహించారు. ఈ నేపథ్యంలో రెండోసారి అలారం మోగడంతో శాంతి అప్రమత్తమయ్యారు. ఏదో ప్రమాదం జరగబోతోందని గ్రహించి, తన తరగతి గదిలోని విద్యార్థులందరినీ బయటకు పంపకుండా ఆపేశారు. వారిని ఒక మూలకు పంపి, సురక్షితంగా నేలమీద కూర్చోబెట్టారు. తలుపులు మూసేశారు. కిటికీ అద్దాలను పేపర్‌తో మూసేసి, లోపలివారు బయటకు కనపడకుండా చేశారు.

అధ్యక్ష ఎన్నికలను మలినం చేసింది వీళ్లే..

- అగ్రరాజ్య రాజకీయ వ్యవస్థ విధ్వంసానికి ప్రయత్నించారు
- 13 మంది రష్యన్ జాతీయులు, 3 సంస్థలపై అమెరికా ప్రత్యేక దర్యాప్తు అధికారి నేరారోపణ

వాషింగ్టన్: సామాజిక మాధ్యమంలో దుష్ప్రచారానికి పాల్పడటం ద్వారా... 2016 అధ్యక్ష ఎన్నికలను మలినం చేశారంటూ 13 మంది రష్యన్ జాతీయులు, మూడు సంస్థలపై అమెరికా ప్రత్యేక దర్యాప్తు అధికారి ఆరోపించారు. అధ్యక్ష అభ్యర్థుల పట్ల, అగ్రరాజ్య రాజకీయ వ్యవస్థ పట్ల ప్రజల్లో అవిశ్వాసం కలిగించేలా వారి చర్యలున్నాయంటూ దర్యాప్తు అధికారి రాబర్ట్ ముల్లర్ తన నివేదికను కూర్చారు. పలు నేరారోపణలతో కూడిన నివేదికను ఆయన విడుదల చేశారు.

"కొంతమంది రష్యన్లు అమెరికన్ల ముసుగులో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల్లో వందలాది ఖాతాలను తెరిచారు. ఇవి రష్యన్లకు చెందినవిగా గుర్తించేందుకు వీల్లేకుండా.. అమెరికాలో తమకంటూ ప్రత్యేక నెట్‌వర్క్‌ను సృష్టించుకున్నారు. ఇందుకు అగ్రరాజ్యంలోని కొన్ని సర్వర్లను కొనుగోలు చేశారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు సామాజిక మాధ్యమాల్లో చర్చా వేదికలను, సమూహాలను సృష్టించారు. నిందితులంతా అమెరికా రాజకీయ, సామాజిక విశ్లేషకుల్లా నటించి... కొందరు నేతలను లక్ష్యంగా చేసుకుని వారికి వ్యతిరేకంగా దుష్ప్రచారానికి పాల్పడ్డారు. సోషల్ మీడియాలో రాజకీయ ప్రకటనలను కొనుగోలు చేశారు. అమెరికన్ల వ్యక్తిగత వివరాలను దొంగిలించి... తప్పుడు చిరునామాలు, బ్యాంకు ఖాతాలు సృష్టించారు.

డొల్ల కంపెనీల భాగస్వామ్యం

12 మంది నిందితులకు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఇంటర్నెట్ రీసెర్చ్ ఏజెన్సీ (ఐఆర్‌ఏ)లో పనిచేసిన అనుభవముంది. మరో నిందితుడు.. కాంకర్డ్ మేనేజ్‌మెంట్ అండ్ కన్సల్టెన్సీ; కాంకర్డ్ కేటరింగ్, దాని అనుబంధ సంస్థల పేరున కుట్రకు అవసరమైన సొమ్మును సమకూర్చాడు. రష్యాకు చెందిన డొల్ల కంపెనీలతో ఐఆర్‌ఏకు సంబంధముంది. 2014లో అమెరికన్ల నిమిత్తం 'ట్రాన్స్‌లేటర్ ప్రాజెక్టు'ను ఆరంభించిన ఈ సంస్థ... 2016 జులైలో 80 శాతానికిపైగా సిబ్బందిని ఆ ప్రాజెక్టుకు కేటాయించింది. కొంతమంది అమెరికన్లను కూడా నియమించుకుంది. అయితే వీరెవరికీ తాము రాజకీయ కార్యకలాపాల నిర్వహణ, ర్యాలీలు, ప్రచారాల్లో పాలుపంచుకుంటామని తెలియదు" అని ముల్లర్ తన నివేదికలో ఆరోపణలు చేశారు. ఈ క్రమంలోనే.. "ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను పరిరక్షించుకోవడానికి అమెరికన్లంతా ఏకం కావాలి" అని శ్వేతసౌధం ఓ ప్రకటనలో దేశ ప్రజలకు పిలుపునిచ్చింది.

కుట్రకు పాల్పడలేదు: ట్రంప్

రష్యా దుష్ప్రచారం వల్లే అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ విజయం సాధించారన్న డెమోక్రటిక్ పార్టీ విమర్శను అధ్యక్షుడు ట్రంప్ మరోసారి కొట్టిపారేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలపై రష్యా జోక్యం ప్రభావం ఇసుమంతైనా లేదన్నారు. ఆ దేశస్థులతో తాను లాలూచీ పడలేదన్నారు. ముల్లర్ నివేదికపై స్పందిస్తూ- "నేను అధ్యక్ష అభ్యర్థిగా ప్రకటించుకోవడానికి చాలాకాలం ముందే అమెరికా వ్యతిరేక ప్రచారాన్ని ఆరంభించింది. ఆరోపిత సంస్థలు, వ్యక్తులతో కలిసి కుట్రకు పాల్పడలేదు" అని ట్రంప్ అన్నారు.

మార్చి 16 నుంచి కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలు

దిల్లీ: భవిష్యత్తు వ్యూహాలపై చర్చించేందుకు మార్చి 16 నుంచి కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలను నిర్వహించనుంది. వరుసగా మూడు రోజుల పాటు దిల్లీలో ఇవి జరుగుతాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా తెలిపారు. శనివారం పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అధ్యక్షతన జరిగిన స్టీరింగ్ కమిటీ తొలి సమావేశంలో.. ఈ తేదీలను నిర్ణయించారు. పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో పాటు సీనియర్ నాయకులు ఏకే ఆంటోనీ, అహ్మద్ పటేల్, గులాం నబీ ఆజాద్, మల్లికార్జున్ ఖర్గే కూడా ఇందులో పాల్గొన్నారు.



స్టీరింగ్ కమిటీ సమావేశానికి వస్తున్న రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ

ఒకే రోజు ముగ్గురు అన్నదమ్ముల మృతి!

ఒకరి ఆత్మహత్య.. ఇద్దరికి గుండెపోటు

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు విషాదకర రీతిలో వెంటవెంటనే ప్రాణాలొదిలారు. వారిలో ఒకరు ఆత్మహత్యకు పాల్పడగా.. తట్టుకోలేని అతని అన్న, తమ్ముడు గుండెపోటుతో మృతి చెందారు. పంజాబ్ ప్రావిన్సులోని గుజ్రాన్‌వాలాకు చెందిన జాహిద్ అలీ(35) వ్యక్తిగత కారణాలతో తుపాకీతో కాల్చుకుని శుక్రవారం చనిపోయాడు. ఇది తెలిసిన వెంటనే అతని అన్న అబ్బాస్ అలీ(40) గుండెపోటుతో కుప్పకూలిపోగా.. ఆసుపత్రికి తరలించేటప్పటికే ప్రాణాలొదిలాడు. ఇద్దరి మృతదేహాలను ఇంటికి తీసుకురాగా.. చూసి తల్లడిల్లిపోయిన వారి తమ్ముడు సద్దామ్ అలీ(28) కూడా గుండెపోటుతో మృతిచెందాడు.



పెళ్లి వేడుకలో సిలెండర్ పేలి తొమ్మిది మంది మృతి

జైపుర్: రాజస్థాన్‌లోని అజ్‌మేర్ జిల్లాలో పెళ్లి వేడుకలో సిలెండర్ పేలింది. దీంతో ముగ్గురు చిన్నారులు సహా తొమ్మిది మంది మరణించారు. వివాహం జరుగుతున్న సమయంలో ఓ హోటల్‌లో శుక్రవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. హోటల్ భవనం పూర్తిగా దెబ్బతిందని పోలీసులు తెలిపారు. 18 మందికి గాయాలయ్యాయని వివరించారు. భవనం పరిసరాల్లోని రెండు కార్లు, పక్కనున్న భవనాలూ దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. మరోవైపు శిథిలాల కింద మరికొందరు చిక్కుకునుండే అవకాశముందని జిల్లా కలెక్టర్ చెప్పారు. 150 మంది సిబ్బందితో సహాయక చర్యలు చేపడుతున్నామని వివరించారు.

రాజస్థాన్‌లో గ్యాస్ సిలిండర్ పేలడంతో కుప్పకూలిన భవనం

మెక్సికోను వణికించిన భూకంపం

- మంత్రి హెలికాప్టర్ కూలి.. 13 మంది మృతి

మెక్సికో నగరం: శక్తిమంతమైన భూకంపం మెక్సికోను శుక్రవారం వణికించింది. ఈ విపత్తు కారణంగా ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం ఏమీ లేకున్నా.. భూకంప ప్రాంతానికి మంత్రి, గవర్నర్‌లతో వెళుతున్న హెలికాప్టర్ కూలిపోవడంతో 13 మంది మృతిచెందారు. 7.2 తీవ్రతతో నిముషానికి పైగా భూమి కంపించింది. అనంతరం 225 సార్లు ప్రకంపనలు సంభవించాయి. రాజధాని నగరం(మెక్సికో)తో పాటు, దక్షిణాన ఉన్న ఓక్సాకా రాష్ట్రం తదితర ప్రాంతాల్లో దాదాపు 10లక్షల ఇళ్లు, వాణిజ్య భవనాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోగా.. 50 ఇళ్లు దెబ్బతిన్నాయి.

ఘోర ప్రమాదం..: భూకంప ప్రాంతంలో పర్యటనకుగాను మెక్సికో అంతర్గత శాఖ మంత్రి ఆల్ఫోన్సో నావరెట్, ఓక్సాకా గవర్నర్ అలెజాండ్రో మూరట్‌లతో వెళుతున్న సైనిక హెలికాప్టర్ ఘోర ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో ముగ్గురు పిల్లలు, ఐదుగురు మహిళలు సహా 13 మంది మృతిచెందారు. మంత్రి, గవర్నర్‌లు సురక్షితంగా బయటపడ్డారు. కిందకు దించేటప్పుడు హెలికాప్టర్ అదుపుతప్పి దిగువనున్న కార్లపై పడిపోవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

ఐఈఎస్ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదల

దిల్లీ: గతనెల 7న నిర్వహించిన 'ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్)' ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శనివారం విడుదల చేసింది. యూపీఎస్‌సీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్లో ఫలితాలను ఉంచింది. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి జులై 1న మెయిన్స్ పరీక్షను నిర్వహిస్తారు.

'ఎర్ర' కోటలో కాషాయ హోరు!

- త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో రసవత్తర పోరు
- వామపక్షాలకు పోటీనిస్తోన్న భాజపా
- సర్వశక్తులను ఒడ్డిన సీపీఎం

ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో అసెంబ్లీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఇప్పటి వరకూ ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడూ ఏకపక్షమే. 1978కు ముందు కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగగా, అనంతరం (1988-93 మినహా) సీపీఎం తిరుగులేని శక్తిగా నిలుస్తూ వచ్చింది. మాణిక్ సర్కార్ సారథ్యంలో రాష్ట్రం ఆ పార్టీకి కంచుకోటగా మారింది. ఈసారి పరిస్థితి మారింది. విపక్ష కాంగ్రెస్‌ను వెనక్కునెట్టి భారతీయ జనతా పార్టీ తెరపైకి వచ్చింది. ఈ కాషాయ పార్టీ కమ్యూనిస్టు ప్రభుత్వానికి గట్టి సవాల్ విసురుతోంది. సిద్ధాంతరీత్యా ఉప్పునిప్పుగా వ్యవహరించే ఈ రెండు జాతీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. మూడువైపులా బంగ్లాదేశ్‌తో అంతర్జాతీయంగా సరిహద్దులు పంచుకుంటున్న రాష్ట్రంలో బెంగాలీలదే ఆధిపత్యం. రాష్ట్ర జనాభాలో 30 శాతం మంది గిరిజనులు.

పట్టుబిగించిన కమలదళం

ఈశాన్య రాష్ట్రాల్లో ఉనికే లేని భాజపా 2014లో కేంద్రంలో అధికారాన్ని చేపట్టాక ఈ ప్రాంతంపై దృష్టి పెట్టింది. 2016లో అసోం, 2017లో మణిపూర్‌లో సొంత ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. మూడేళ్లుగా త్రిపురలో క్షేత్రస్థాయిలో చొచ్చుకుపోతోంది. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1.54 ఓట్లశాతంతో సరిపెట్టుకున్న భాజపా... 2014 లోక్‌సభ ఎన్నికల్లో 5.77కు ఓట్లశాతాన్ని పెంచుకుంది. విపక్ష ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకుని కొంతవరకు బలపడింది. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ క్రియారహితంగా ఉండటం పార్టీకి బాగా కలిసివచ్చింది. ఇదే అదనుగా రాష్ట్రంలో సీపీఎంను దెబ్బతీసేందుకు కమలం పార్టీ కేంద్ర నాయకత్వం పావులు కదిపింది. పొరుగునే ఉన్న అసోం ఆర్థికమంత్రి హిమంత్ బిశ్వ శర్మను త్రిపుర ఇన్‌ఛార్జిగా నియమించింది. రాష్ట్రంలో 90శాతంగా ఉన్న మెజారిటీ హిందూ ఓటర్లను ఆకట్టుకోవడంలో శర్మ ఉపయోగపడతారని పార్టీ అంచనా. పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ ఈశాన్య రాష్ట్రాల వ్యవహారాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ప్రధాని మోదీతో పాటు, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్, కేంద్రమంత్రులు అరుణ్ జైట్లీ, రాజనాథ్ సింగ్, నితిన్ గడ్కరీ వంటి హేమాహేమీలు ప్రచారం నిర్వహించారు. బనమలిపూర్ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బిప్లవ్ దేబ్ పోటీ చేస్తున్నారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని అధికారికంగా ప్రకటించనప్పటికీ దేబ్‌కే కేంద్ర పెద్దల ఆశీస్సులు ఉన్నాయి.



మొత్తం స్థానాలు:	60
ఎస్టీలకు కేటాయించినవి :	20
ఎస్సీలకు కేటాయించినవి :	10
జనరల్ స్థానాలు :	30
2013 ఫలితాలు	
సీపీఎం :	49
సీపీఐ :	1
కాంగ్రెస్ :	10
పోలింగ్ శాతం:	93

ఐపీఎఫ్‌టీతో పొత్తు

విధానపరంగా సరిపడనప్పటికీ ఐపీఎఫ్‌టీ (ఇండిజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర)తో భాజపా పొత్తు పెట్టుకుంది. గిరిజనులు, ఎస్టీల్లో ఈ పార్టీకి పట్టుంది. గిరిజనులతో కూడిన ప్రత్యేక త్రిపుర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్నది దీని ప్రధాన డిమాండ్. ఇందుకు భాజపా వ్యతిరేకమైనప్పటికీ ఐపీఎఫ్‌టీతో పొత్తు పెట్టుకోవడం విశేషం. ఐపీటీఎఫ్ అధ్యక్షుడు ఎన్.సి.దెబ్బర్మ టకర్జల ఎస్టీ స్థానం నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మొత్తం 20 ఎస్టీస్థానాల్లో భాజపా 11చోట్ల, ఐపీఎఫ్‌టీ 9 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి.

మాణిక్ వ్యక్తిగత ప్రతిష్ఠే సీపీఎం బలం

రెండున్నర దశబ్దాలుగా ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలన సాగిస్తున్న సీపీఎం పూర్తిగా ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్ పాలన, వ్యక్తిగత ప్రతిష్ఠపైనే ఆధారపడింది. సీతారామ్ ఏచూరి, ప్రకాశ్ కారత్, బృందాకారత్, పశ్చిమబంగాల్ వామపక్ష ఫ్రంట్ కన్వీనర్ బిమన్ బోస్ వంటి అగ్రనేతలు ప్రచారం చేసినప్పటికీ, మాణిక్ సర్కార్ చుట్టూనే ప్రచారం కేంద్రీకృతమైంది. సర్కార్ నీతి, నిజాయతీ, నైతికతను విపక్షం కూడా వేలెత్తి చూపలేనప్పటికీ, కొందరు నాయకులు, కార్యకర్తల వ్యవహారశైలిపై బలమైన ఆరోపణలు, విమర్శలు ఉన్నాయి. అగర్తలకు 65 కిలోమీటర్ల దూరంలో, పశ్చిమ త్రిపురలోని ధన్‌పూర్ నుంచి పోటీ మాణిక్ సర్కార్ చేస్తున్నారు. ఈ నియోజకవర్గం బంగ్లాదేశ్‌కు సమీపంలో ఉంది. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడం తమ ప్రభుత్వ పెద్ద విజయంగా మాణిక్ సర్కార్ చెబుతున్నారు. భాజపా రంగప్రవేశంతో మాణిక్‌సర్కార్ తన వ్యూహాన్ని మార్చుకున్నారు. హిందువుల ఆలయాలకు ఇటీవల కాలంలో ఆయన వెళుతున్నారు. ప్రజల మనోభావాలను గౌరవించడం తప్ప ఇందులో మరో ఉద్దేశం లేదని పైకి చెబుతున్నప్పటికీ అసలు ఉద్దేశం భాజపా విస్తరణను అడ్డుకోవడమే.

త్రిపురలో నేడే పోలింగ్

అగర్తల: త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. మొత్తం 60 శాసనసభా స్థానాలున్న రాష్ట్రంలో ఆదివారం 59 స్థానాల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. చరిలాం స్థానంలో సీపీఎం అభ్యర్థి మృతితో ఆ ఒక్క స్థానం పరిధిలో పోలింగ్ మార్చి 12కు వాయిదాపడింది. ★ పోలింగ్ కేంద్రాలు: 3,214 ★ మొత్తం ఓటర్లు: 25.73 లక్షలు ★ పురుషులు: 13.05 లక్షలు ★ మహిళలు: 12.68 లక్షలు

మరింత దిగువకు కాంగ్రెస్

రాష్ట్రంలో గత ఎన్నికల్లో 9 స్థానాలను గెలుచుకున్న కాంగ్రెస్ కోలుకునే పరిస్థితిలో లేదు. పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి, అసోం, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రులు తరుణ్ గొగోయ్, పృథ్వీరాజ్ చవాన్, హరీశ్ రావత్ వంటి అగ్రనేతలు ప్రచారం చేసినప్పటికీ పార్టీ శ్రేణుల్లో కదలిక లేదు. ఆరేడు స్థానాలకు మించి గెలవడం కష్టమేనని ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న తరుణ గొగోయ్ అంతరంగిక సంభాషణల్లో పేర్కొనడం గమనార్హం.

– ఈనాడు ప్రత్యేక విభాగం



శనివారం దిల్లీలోని పాలం విమానాశ్రయం చేరుకున్న అనంతరం నమస్కారం చేస్తున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడ్, ఆయన సతీమణి, పిల్లలు

17 పెద్దరాష్ట్రాల్లో తగ్గిన ఆడ శిశు జననాలు

దిల్లీ: దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో స్త్రీ పురుషుల నిష్పత్తి సమతౌల్యం మరింత దెబ్బతింటోందని నీతిఆయోగ్ తాజా నివేదిక బయటపెట్టింది. 17 రాష్ట్రాల్లో ఈ నిష్పత్తి కనీసం పది పాయింట్లు (ప్రతీ వెయ్యి మగశిశు జననాలకు నమోదైన ఆడ శిశు జననాల సంఖ్య) పడిపోయిందని పేర్కొంది. అత్యధికంగా గుజరాత్‌లో 53 పాయింట్లు పతనమైనట్లు తెలిపింది. ఈ రాష్ట్రంలో ప్రతీ వెయ్యి మగ శిశు జననాలకు 854 ఆడ శిశు జననాలే నమోదవుతున్నాయి. 2012-14 సమాచారంతో 2013-15లో వెల్లడైన సమాచారాన్ని సరిపోల్చి.. 21 రాష్ట్రాలకు సంబంధించి ఈ ఫలితాలను వెల్లడించారు. ఆడ శిశు జననాల తగ్గుదల నమోదైన జాబితాలో గుజరాత్ తర్వాతి స్థానాల్లో హరియాణా (35 పాయింట్ల పతనం), రాజస్థాన్ (32), ఉత్తరాఖండ్ (27), మహారాష్ట్ర (18), హిమాచల్‌ప్రదేశ్ (14), ఛత్తీస్‌గఢ్ (12), కర్ణాటక (11) వరుసగా ఉన్నాయి. పంజాబ్‌లో మాత్రం ఈ నిష్పత్తి 19 పాయింట్లు పెరిగింది. ఉత్తర్‌ప్రదేశ్ (10 పాయింట్ల వృద్ధి), బిహార్ (9) కూడా పురోగతి సాధించాయి.

సిటీ యూనియన్ బ్యాంక్‌కూ అలాంటి దెబ్బే!

- రూ.12.8 కోట్ల విలువైన మోసపూరిత చెల్లింపులు గుర్తింపు
- సొమ్ము వెనక్కు రప్పించేందుకు విదేశీ బ్యాంకులతో రాయబారం

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంతో... మరిన్ని బ్యాంకుల్లో అలజడి రేగుతోంది. తమ బ్యాంకులో రూ.12.8 కోట్ల మేర మోసపూరిత చెల్లింపులు చోటుచేసుకున్నట్లు సిటీ బ్యాంక్ శనివారం వెల్లడించింది. పీఎన్‌బీ అక్రమాలు మాదిరే రశీదులు, ఎంట్రీలు లేకుండా... 'సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్లింక్ ఫైనాన్షియల్ టెలీకమ్యూనికేషన్స్ (స్విఫ్ట్)' విధానంలో ఈ చెల్లింపులు జరిగాయి. "న్యూయార్క్‌లోని స్టాండర్డ్ ఛార్టెడ్ బ్యాంక్ నుంచి దుబాయ్‌లోని మరో బ్యాంకుకు 5 లక్షల డాలర్లు; ఫ్రాంక్‌ఫర్ట్‌లోని స్టాండర్డ్ ఛార్టెడ్ బ్యాంకుశాఖ నుంచి టర్కీలోని ఓ ఖాతాకు 3.7 లక్షల డాలర్లు; న్యూయార్క్‌కు చెందిన ఓ బ్యాంక్ ఆఫ్ అమెరికా ఖాతా నుంచి చైనా బ్యాంకుకు 10 లక్షల అమెరికా డాలర్లు మళ్లినట్లు ఈనెల 7న గుర్తించాం" అని చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సిటీ బ్యాంకు శాఖ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. తమ ప్రమేయం లేకుండానే ఆయా బ్యాంకులు ఈ వ్యవహారాలను నడిపాయని పేర్కొంది. డబ్బులను వెనక్కు రప్పించేందుకు ఆయా బ్యాంకులతో పాటు విదేశీ వ్యవహారాలశాఖతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

వరుసగా వెలుగుచూస్తున్న అక్రమాల నేపథ్యంలో- 'స్విఫ్ట్' విధానంలో నగదు మళ్లింపుపై సర్వత్రా ఆందోళనలు నెలకొన్నాయి.

2,636 కోట్లు మోసపోయాం: యూకో బ్యాంక్

పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)కు వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ బురిడీ కొట్టిన రూ.11,400 కోట్లలో తమవి రూ.2,636 కోట్లు ఉన్నట్లు యూకో బ్యాంక్ అంగీకరించింది. పీఎన్‌బీ జారీచేసిన అధీకృత స్విఫ్ట్ సందేశం ఆధారంగా హాంకాంగ్ శాఖతో ఈ వ్యవహారం నడిచినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీకి తెలిపింది. పీఎన్‌బీ నుంచి ఈ మొత్తం తమకు వెనక్కు వస్తుందని ధీమా వ్యక్తం చేసింది.

ప్రత్యేక రైళ్లు, బోగీల కోసం.. ఇక ఆన్‌లైన్ విధానం

దిల్లీ: ఇకపై ఎవరైనా పెళ్లిళ్లు, తీర్థయాత్రలు తదితర అవసరాల కోసం ప్రత్యేక రైళ్లు, పెట్టెలు(కోచ్‌లు), ఉన్నతస్థాయి అధికారులు వినియోగించే బోగీ(సెలూన్)లను ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకోవచ్చు. పూర్తిస్థాయి ధర(ఎఫ్‌టీఆర్)పై ఐఆర్‌సీటీలో ఈ సౌకర్యం పొందేలా రైల్వేబోర్డు ఏకగవాక్ష విధానాన్ని ఏర్పాటు చేసింది. ఇదివరకు ఎవరికైనా ప్రత్యేక రైళ్లు, పెట్టెలు కావాలంటే.. ముందుగా రైల్వేస్టేషన్లకు వెళ్లి, అక్కడి అధికారులకు సమగ్ర ప్రయాణ వివరాలతో అర్జీ పెట్టుకోవాల్సి ఉండేది. దీనికిగాను నగదు చెల్లించిన అనంతరం వారు ఓ విశిష్ట ఎఫ్‌టీఆర్ సంఖ్యతో కూడిన రసీదు ఇచ్చేవారు. ఈ ప్రక్రియ అంతా సంక్లిష్టంగా ఉండటంతో.. ఇకపై సులువుగా డిజిటల్ రూపంలోనే సేవలందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కొత్త విధానంలో మొత్తం ధరపై 30 శాతం సేవారుసుం, దానిపై 5 శాతం ఛార్జి వసూలు చేస్తారు. అలాగే సెక్యూరిటీ ధరావత్తు కింద పెట్టెకు రూ. 50 వేల వంతున చెల్లించాల్సి ఉంటుంది. ప్రత్యేక రైలు కావాలంటే కనీసం 18 పెట్టెలకు దీన్ని వసూలు చేస్తారు.

నరరూప రాక్షసుడికి మరణదండన

లాహోర్: పాకిస్థాన్ వ్యాప్తంగా తీవ్ర నిరసనలకు, ఆగ్రహావేశాలకు కారణమైన ఏడేళ్ల బాలిక అపహరణ, అత్యాచారం, హత్య కేసులో ఉగ్రవాద వ్యతిరేక న్యాయస్థానం (ఏటీసీ) దోషికి మరణ దండన విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. కేవలం నాలుగు రోజుల్లోనే విచారణ ముగించి నేరగాడికి శిక్షను ఖరారు చేయటం ఆ దేశ చరిత్రలో ఇదే ప్రథమం. కోట్ లఖ్‌పత్ జైలులో కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించిన విచారణలో ఏటీసీ జడ్జి సజ్జాద్ హుస్సేన్ తీర్పును వెలువరించారు. అపహరణ, అత్యాచారం, హత్య, ప్రకృతి విరుద్ధచర్యలకు పాల్పడటం వంటి నేరాలకు గాను ముద్దాయి ఇమ్రాన్ అలీ(23)కి ఈ శిక్ష విధించారు. మృతదేహాన్ని అవమానించేలా వ్యవహరించినందుకు గాను ఏడేళ్ల కారాగారవాసంతో పాటు రూ.10లక్షల జరిమానానూ విధించారు. బాలికను హత్య చేసిన తర్వాత రెండు వారాలకు జనవరిలో నిందితుడు అరెస్టయ్యాడు. లాహోర్‌కు 50 కిలోమీటర్ల దూరంలోని కసూర్‌లో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. అత్యాచారం, హత్య తర్వాత బాలిక మృతదేహాన్ని నిందితుడు చెత్తకుండీలోకి విసిరాడు. కోర్టు విచారణలో ఇలాంటివే మరో 8 హత్యలకు పాల్పడినట్లు ఇమ్రాన్ అలీ అంగీకరించాడు. హతులందరూ కూడా బాలికలే. వరుస హత్యలకు పాల్పడిన ఈ నరరూప రాక్షసుడికి సాధారణ మరణ దండన సరిపోదని, బహిరంగంగా ఉరితీయాలని కొందరు, రాళ్లతో కొట్టి చంపాలని మరికొందరు పాకిస్థాన్ ప్రజలు అభిప్రాయపడ్డారు. కోర్టు తీర్పును అంగీకరించిన నిందితుడు...ఎగువ కోర్టులకు అప్పీల్ చేసేందుకు సిద్ధంగా లేడని ప్రాసిక్యూటర్ ఖదీర్ వెల్లడించారు.

ఛాంపియన్స్

కొందరికి లాభం.. కొందరికి నష్టం



దిల్లీ: బ్యాడ్మింటన్‌లో ప్రతిపాదిత కొత్త స్కోరింగ్ విధానంపై మాజీల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కొత్త స్కోరింగ్ విధానం వల్ల క్రీడాకారులు నష్టపోవాల్సివస్తుందని భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య.. ఆటను మరింత ఆకర్షణీయంగా మార్చే ప్రయత్నాల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కొత్తగా సర్వీస్ నిబంధనను ఆల్ ఇంగ్లాండ్ టోర్నీలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో పాటు మ్యాచ్‌ను.. 21 పాయింట్ల మూడు గేమ్‌లకు బదులుగా 11 పాయింట్ల ఐదు గేమ్‌లుగా నిర్వహించాలని యోచిస్తోంది. మేలో బ్యాంకాక్‌లో జరిగే వార్షిక సర్వసభ్య సమావేశంలో దీనిపై చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలనుకుంటోంది. దీనిపై గోపీచంద్ స్పందిస్తూ.. "ఇది కొందరికి మేలు.. మరికొందరికి నష్టం కలిగించే అంశం. ప్రస్తుతానికైతే దీనిపై అధికారిక ప్రకటన ఏదీ రాలేదు. మేలో జరిగే సమావేశంలో స్పష్టత వచ్చే వరకు వేచి ఉండక తప్పదు. మా అభ్యంతరాలకు భారత బ్యాడ్మింటన్ సమాఖ్యకు తెలియజేస్తాం" అని చెప్పాడు.



ఫెదరర్ నం.1

★ ఐదేళ్ల తర్వాత అగ్రస్థానానికి

★ నాదల్ కిందకు

రోటర్‌డామ్ (నెదర్లాండ్స్)

నంబర్‌వన్.. టెన్నిస్‌లో అత్యధిక కాలం ఈ హోదా అనుభవించిన ఆటగాడు అతడు.. అగ్రస్థానం కోసం పోరాడిన అత్యధికమందిని ఓడించిన వీరుడు అతడు! నం.1 అతడికి కొత్తేం కాదు! కానీ ఇక పనైపోయిందనుకున్న దశలో, అసాధారణంగా పుంజుకుని ఈ ఘనత సాధించడమే అతడిని ప్రత్యేకంగా నిలుపుతుంది! స్విస్ యోధుడు రోజర్ ఫెదరర్ మళ్లీ ప్రపంచ నం.1గా అవతరించాడు. తన ముందు కెరీర్ ఆరంభించిన కుర్రాళ్లు వరుస టైటిళ్లతో చెలరేగిపోతున్న వేళ.. పదే పదే పరాభవాలు వెక్కిరిస్తున్నా.. ఇక నీ పనైపోయిందంటూ గాయాలు గుర్తుచేస్తున్నా.. ఇన్ని అవమానాలు ఎందుకు ఇక వీడ్కోలు తీసుకోమ్మని సన్నిహితులు సూచిస్తున్నా.. తన ఆటను మాత్రమే నమ్ముకున్న రోజర్ ఫెదరర్.. మళ్లీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. టెన్నిస్ చరిత్రలో ఈ ఘనత సాధించిన పెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

చిరకాల ప్రత్యర్థి రఫెల్ నాదల్‌ను రెండో స్థానానికి నెట్టేసి రోజర్ ఫెదరర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరాడు. ఏబీఎన్ ఆమ్రో ప్రపంచ టోర్నీ సెమీస్ చేరుకోవడం ద్వారా ఈ ఘనత సాధించాడు. క్వార్టర్స్‌లో ఫెదరర్ 4-6, 6-1, 6-1తో నెదర్లాండ్స్‌కు చెందిన రాబిన్ హాస్‌ను ఓడించాడు. దీంతో అగ్రస్థానం సొంతం చేసుకోవడానికి అవసరమైన ర్యాంకింగ్ పాయింట్లు అతడి ఖాతాలో చేరాయి. సోమవారం ఏటీపీ అధికారికంగా ర్యాంకింగ్స్‌ను ప్రకటిస్తుంది.

302 ఫెదరర్ నంబర్‌వన్ ఆటగాడిగా ఉన్న వారాలు. అత్యధిక కాలం అగ్రస్థానంలో ఉన్న ఆటగాడిగా ఫెదరర్ తర్వాత సంప్రాస్ (286) రెండో స్థానంలో ఉన్నాడు. ప్రస్తుత తరం ఆటగాళ్లలో జకోవిచ్ (223).. ఫెదరర్‌కు దగ్గరగా ఉన్నాడు.

● టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం చేరిన అత్యంత పెద్ద వయస్కుడిగా ఫెదరర్ (36 ఏళ్ల 195 రోజులు) రికార్డు సాధించాడు. 2003లో ఆండ్రి అగస్సీ (33 ఏళ్ల 133 రోజులు) నెలకొల్పిన రికార్డును తుడిచిపెట్టాడు.

"నమ్మశక్యంగా లేదు. దాదాపుగా 37 ఏళ్ల వయసులో.. మళ్లీ నంబర్‌వన్ స్థానాన్ని ఆస్వాదిస్తున్నా. కెరీర్ ఆరంభంలో ఈ ఘనత సాధించడం కష్టమేం కాదు. ఇప్పుడు సాధించాలంటే రెండింతలు కష్టపడాలి. అందుకే ఇది ప్రత్యేకమైంది" - ఫెదరర్

● 2012 నవంబరులో నం.1 స్థానంలో ఉన్న ఫెదరర్ మళ్లీ 5 ఏళ్ల 102 రోజుల విరామానంతరం అగ్రస్థానానికి చేరుకున్నాడు. సుదీర్ఘ కాలం తర్వాత మళ్లీ అగ్రపీఠం అధిరోహించిన రికార్డూ అతడే.

విరాట్ 62 సెంచరీలు కొడతాడు



టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి వన్డేల్లో 62 సెంచరీలు కొడతాడని మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ జోస్యం చెప్పాడు. శనివారం వీరూ ట్విటర్ ద్వారా అభిమానులతో ముచ్చటించిన సందర్భంగా ఈ మాట అన్నాడు. కోహ్లి వన్డే కెరీర్ ముగిసేలోపు ఎన్ని సెంచరీలు కొట్టగలడని భావిస్తున్నారంటూ ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు సమాధానంగా వీరూ '62' అని బదులిచ్చాడు.

ఎవరితోనూ పోల్చుకోను

సెంచూరియన్

చూస్తుండగానే వన్డేల్లో 35 సెంచరీల మార్కును అందుకున్నాడు విరాట్ కోహ్లి. దీంతో అందరూ అతడిని సచిన్ తెందుల్కర్‌తో పోల్చి చూస్తున్నారు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో అతనెలా చెలరేగిపోయాడో తెలిసిందే. విరాటే ప్రస్తుత ప్రపంచ అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అని అంటూ విదేశీ మాజీలు సైతం పొగిడేస్తున్నారు. ఐతే విరాట్ మాత్రం తనను తాను ఎవరితో పోల్చుకోనని, అలాగే తన పేరు ముందు ఎలాంటి తోకలూ ఉండాలని కోరుకోవట్లేదని అంటున్నాడు. "ఈ దశలో నన్ను నేను ఎవరితోనూ పోల్చుకోవాలని అనుకోవట్లేదు. ఒక మ్యాచ్‌కు ముందు ఎలా సన్నద్ధమవ్వాలి? మ్యాచ్‌లో ఎలాంటి పని నిబద్ధత చూపించాలి అన్నదానిపైనే ప్రస్తుతం నా దృష్టంతా. మనం ఎవరినో అధిగమించడం గురించి ఆలోచించడం మొదలుపెడితే త్వరలోనే జట్టు ప్రయోజనాల విషయంలో రాజీపడాల్సి వస్తుంది. నా పేరు ముందు ఏ తోకలూ వద్దు. నేను పతాక శీర్షికల్లో ఉండాలని అనుకోవట్లేదు. నన్ను ఇలా పిలవాలి అని నాకెలాంటి ఆశలూ లేవు. నేను నా బాధ్యతను నిర్వర్తిస్తున్నా. నేనేమీ జట్టుకు ప్రత్యేకంగా సాయం చేయట్లేదు. నా గురించి జట్టు యాజమాన్యం, సహచరులు ఏమనుకుంటున్నారు.. సహచరుల గురించి నేనేమనుకుంటున్నాను అన్నదే నాకు ముఖ్యం. జనాలేమనుకున్నారన్నది ప్రధానం కాదు" అని కోహ్లి అన్నాడు. ఇక తనపై, భారత జట్టుపై కురుస్తున్న ప్రశంసల వర్షంపై విరాట్ స్పందిస్తూ.. "వార్తల శీర్షికలు ప్రతి రోజూ మారిపోతుంటాయి. రేపు నేను ఒక చెత్త షాట్ ఆడి డకౌటైతే జనాలు వాళ్లకేమనిపిస్తే అది చేస్తారు. నన్ను నేను ఎప్పుడూ పొగుడుకోను. ఐతే తప్పు చేస్తే మాత్రం అందరి ముందూ అంగీకరిస్తా. నెల కిందట మాది చెత్త జట్టు. కానీ ఇప్పుడేమో అందరూ భారత జట్టు విదేశాల్లో సాధించిన అత్యుత్తమ జట్టు ఇదేనా అంటున్నారు. ఐతే అప్పుడు, ఇప్పుడు మా మానసిక స్థితి ఒకేలా ఉంది. తొలి రెండు టెస్టుల్లో ఓడాక మాకు మరో అవకాశం ఇవ్వడానికి ఎవరూ సిద్ధంగా లేరు. ఇప్పుడు గెలిచాం కాబట్టి పొగిడేస్తున్నారు. వాటికి పొంగిపోను. మేం టెస్టు సిరీస్‌లో వెనుకబడ్డపుడు విమర్శల్ని పట్టించుకోలేదు. ఇప్పుడు సిరీస్ గెలిచినందుకు వస్తున్న ప్రశంసల్నీ పట్టించుకోకూడదు" అని కోహ్లి చెప్పాడు. సిరీస్ గెలిచినప్పటికీ జట్టులో అంతా బాగున్నట్లు కాదని కోహ్లి చెప్పాడు. "సిరీస్ గెలిచినప్పటికీ మేం మెరుగవ్వాల్సిన అంశాలేంటో సమీక్షించుకుంటాం. మేం బలం పుంజుకోవాల్సిన అవసరం ఉన్న విషయాలు లేవని కాదు. జట్టుగా కొన్ని చోట్ల మెరుగవ్వాలి. అవేంటో కూడా గుర్తించాం. దానిపై చర్చించి, మెరుగయ్యేందుకు ఏం చేయాలో చూడాలి" అన్నాడు.



"35వ శతకం.. కోహ్లి వన్డే చరిత్రలోనే అత్యంత గొప్ప ఆటగాడు. ఇది నిజం" –మైకేల్ వాన్



డిక్షనరీ చూడాల్సిందే!

దక్షిణాఫ్రికాపై పరుగుల వరద పారించి భారత్ సిరీస్ సాధించడంలో కీలక పాత్ర పోషించిన కెప్టెన్ విరాట్ కోహ్లిని కోచ్ రవిశాస్త్రి ఆకాశానికెత్తేశాడు. "నేనే విలేకరిని అయితే ప్రస్తుతం కోహ్లి ఆట గురించి వర్ణించడానికి పదాలు వెతుక్కునేవాడిని. కొత్త ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ కొనుక్కుని కోహ్లిని పొగిడేందుకు పదాల కోసం చూసేవాడిని. విరాట్ సగటు సంగతి పక్కన పెట్టేద్దాం. అతను పరుగులు సాధిస్తున్న తీరు, జట్టుకు ఆ పరుగులు ఉపయోగపడుతున్న వైనం అమోఘం. అందుకే విరాటే ప్రస్తుతం ప్రపంచ అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అంటున్నా. భారత జట్టు ఆటలోని తీవ్రత గురించి అందరూ మాట్లాడుతున్నారు. కానీ ఆ తీవ్రత ఎక్కడి నుంచి వస్తోంది? విరాట్ లాంటి నాయకుడుంటే, అతను ముందుండి నడిపిస్తుంటే.. సహచరులూ అతడినే అనుసరిస్తారు. ఈ జట్టును చూసి కోచ్‌గా గర్విస్తున్నా" అని రవిశాస్త్రి అన్నాడు.

సవరణ: శనివారం సంచికలో కోహ్లి టెస్టులు, వన్డేల్లో కలిపి 76 సెంచరీలు చేసినట్లు పొరపాటుగా ప్రచురితమైంది. అతడి సెంచరీల సంఖ్య 56.

దక్షిణాఫ్రికాలో అంతిమ అంకం. పోరాటం ఇంకో ఫార్మాట్లోకి మారింది. ఫటాఫట్ ఆటతో అలరించే పొట్టి క్రికెట్ వేళైంది. నేడే తొలి టీ20. వన్డే సిరీస్‌లో ఆతిథ్య జట్టును చితక్కొట్టేసిన భారత్ రెట్టించిన విశ్వాసంతో సిద్ధమవుతుండగా.. పరాభవాన్ని మరిచి పుంజుకోవాలని దక్షిణాఫ్రికా కోరుకుంటోంది. కొత్త ఆటగాళ్లతో నిండిన ఆతిథ్య జట్టు ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరం.

ఇక దంచుడే

దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టీ20 నేడు

సాయంత్రం 6 గంటల నుంచి సోనీ టెన్-1, 3ల్లో

జొహానెస్‌బర్గ్

జోరు మీదున్న కోహ్లీసేన మరో సమరానికి సిద్ధమైంది. ఆదివారం జరిగే తొలి టీ20 మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికాను ఢీకొంటుంది. వన్డేల్లో దక్షిణాఫ్రికాను 5-1తో కసిదీరా బాదేసిన భారత్.. అదే జోరుతో బరిలోకి దిగుతోంది. స్పిన్ ద్వయం కుల్‌దీప్, చాహల్ మరోసారి ప్రత్యర్థిని కకావికలం చేయడానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో మళ్లీ కోహ్లీసేనే ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. భారత్ తన మొట్టమొదటి టీ20 మ్యాచ్ గెలిచింది, టీ20 ప్రపంచకప్‌ను సాధించింది దక్షిణాఫ్రికాలోనే.

రైనాపైనే కళ్లు..: ఈ మ్యాచ్‌లో దృష్టంతా ఏడాది తర్వాత పునరాగమనం చేస్తున్న సురేశ్ రైనాపైనే. 2015లో చివరి వన్డే ఆడిన అతడు.. టీ20ల్లో ఆడి కూడా ఏడాది దాటిపోయింది. 2017 ఐపీఎల్‌లో గుజరాత్ లయన్స్ తరపున 442 పరుగులు చేసి తిరిగి వన్డే జట్టులో స్థానాన్ని ఆశించిన అతణ్ని సెలక్షన్ కమిటీ విస్మరించింది. 2017-18 సొంతగడ్డపై సీజన్‌లోనూ అతడికి అవకాశం రాలేదు. దీంతో అతడి భవిష్యత్తుపై ప్రశ్నలు తలెత్తాయి. యోయో ఫిట్‌నెస్ పరీక్షలో విఫలమైన నేపథ్యంలో అతడు సెలక్షన్‌కు దూరమయ్యాడని తర్వాత తెలిసింది. 2019 ప్రపంచకప్ సమీపిస్తున్న నేపథ్యంలో ఇంతకాలం తర్వాత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే పట్టుదలతో రైనా ఉన్నాడు. ఐతే అతడికి జట్టులో స్థానం దొరుకుతుందా లేదా అన్నది ఆసక్తికరం. మిడిల్ ఆర్డర్‌లో మనీష్ పాండే నుంచి అతడికి గట్టి పోటీ ఎదురవుతోంది. ఐతే బౌలింగ్ కూడా చేయగలగడం రైనాకు సానుకూలాంశం కానుంది. మరోవైపు ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ ఉన్న నేపథ్యంలో దక్షిణాఫ్రికా చాలా మంది ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చింది. చాలా కొత్త ముఖాలతో బరిలోకి దిగుతోంది. కనీసం ముగ్గురు ఆటగాళ్లు.. వికెట్‌కీపర్ క్లాసన్, జొంకర్, జూనియర్ దలా అరంగేట్రం చేసే అవకాశముంది. డుమిని, డివిలియర్స్ తప్ప ఎక్కువ అనుభవం ఉన్నవాళ్లెవరూ దక్షిణఫ్రికా జట్టులో లేరు. మరి కొత్తగా కనిపిస్తున్న జట్టు.. జోరు మీదున్న కోహ్లీసేనను ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. టీ20 సిరీస్‌లో దక్షిణాఫ్రికాకు డుమిని నాయకత్వం వహిస్తున్నాడు.



పిచ్ ఎలా ఉందంటే..: మ్యాచ్ వేదిక వాండరర్స్‌లో పిచ్ బ్యాట్స్‌మెన్‌కు అనుకూలించనుంది. ఔట్‌ఫీల్డ్ వేగంగా ఉంది. భారీ స్కోర్లు నమోదవుతాయని భావిస్తున్నారు. జల్లులు పడ్డా మ్యాచ్‌కు పెద్దగా ఆటంకం కలగకపోవచ్చు.

తుది జట్లు (అంచనా): భారత్: రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, మనీష్ పాండే/రైనా, ధోని, హార్దిక్ పాండ్య, భువనేశ్వర్, జస్‌ప్రీత్ బుమ్రా, కుల్‌దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్


దక్షిణాఫ్రికా: రీజా హెండ్రిక్స్, జాన్-జాన్ స్మట్స్, డివిలియర్స్, డుమిని, మిల్లర్/బెహర్దీన్, క్లాసన్, క్రిస్ మోరిస్, ఫెలుక్వాయో, జూనియర్ దలా, డేన్ ప్యాటర్సన్, ఫాంగిసో.

6–2 టీ20ల్లో దక్షిణాఫ్రికాపై భారత్ గెలుపు ఓటముల రికార్డు

43 పొట్టి క్రికెట్లో 2000 పరుగుల మైలురాయిని అందుకున్న తొలి భారత బ్యాట్స్‌మన్‌గా నిలిచేందుకు కోహ్లి చేయాల్సిన పరుగులు

మాకొద్దు.. మీ రుచులు!

సెంచూరియన్: దక్షిణాఫ్రికాలో సుదీర్ఘ పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టుకు పెద్ద చిక్కొచ్చి పడింది! మ్యాచ్‌ల సందర్భంగా అందించే స్థానిక వంటలు క్రికెటర్లకు నచ్చడం లేదు. అందుకే ఇక చేసేదేం లేక దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డుకు ఫిర్యాదు చేసింది భారత జట్టు. దీంతో అప్పటికే ఒప్పందం కుదుర్చుకున్న సంస్థని పక్కనబెట్టి సెంచూరియన్‌లో భారతీయ వంటలకు ప్రసిద్ధి గాంచిన స్థానిక రెస్టారెంట్ నుంచి భారత జట్టు కోసం ప్రత్యేకంగా ఆహారాన్ని అందించింది దక్షిణాఫ్రికా బోర్డు. మూడో టీ20 వేదిక జొహానెస్‌బర్గ్‌తో పాటు ఇతర వేదికల్లో భారత వంటకాల తయారీ కోసం ప్రత్యేకంగా భారత చెఫ్‌లను ఏర్పాటు చేసింది.



ప్రధాన తేడా అతనే

సౌరభ్ గంగూలీ

టెస్టు సిరీస్ కోల్పోయినప్పటికీ తిరిగి పుంజుకున్న టీమ్ఇండియా వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికాపై పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. వన్డే సిరీస్‌ను 5-1తో గెలిచేలా తన అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో జట్టును నడిపించిన కోహ్లి ఆట కనువిందే. రెండు జట్ల మధ్య ప్రధాన తేడా అతనే. నామమాత్రమైన చివరి వన్డేలో కూడా అతను శతకం సాధించడం ఆకట్టుకుంది. వన్డేల్లో టీమ్ఇండియాదే ఆధిపత్యమని మనోళ్లు మరోసారి రుజువు చేశారు. టీ20 సిరీస్‌లోనూ భారత్ ఇదే జోరు కొనసాగిస్తుందని నమ్ముతున్నా. కానీ పొట్టి క్రికెట్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. రెండు జట్లకూ విజయావకాశాలు ఉంటాయి. అయితే భారత్‌కు పోటీ ఇవ్వాలంటే ఆతిథ్య జట్టు తీవ్రంగా కృషి చేయాల్సిందే. భారత్‌తో ఆడే జట్టు ఎంపిక విషయంలో దక్షిణాఫ్రికా

తీసుకున్న నిర్ణయాలు ఆశ్చర్యపరచాయి. చివరి వన్డే నుంచి మిల్లర్, టీ20 కెప్టెన్ డుమిని తప్పించడం, రబాడకు టీ20 జట్టులో చోటు కల్పించకపోవడం విస్మయానికి గురిచేసింది. పోర్ట్ ఎలిజబెత్ వన్డేలో మంచి ప్రదర్శన చేసిన షంసి స్థానంలో ఆరో వన్డేలో తాహిర్‌ను తీసుకున్నారు. ఓటమి ఎదురైనప్పుడు జట్టులో మార్పులు చేయడం సహజం. కానీ జట్టు ఎంపిక విషయంలో దక్షిణాఫ్రికా అనుసరించిన వ్యూహం ఏంటో అర్థం కాలేదు. డివిలియర్స్ పరుగులు చేయకపోవడమూ ఆ జట్టుకు సమస్యగా మారింది. అతను గతంలో మాదిరిగా విలువైన ఇన్నింగ్స్‌లు ఆడాలి. ఇక దాదాపు ఏడాది తర్వాత రైనా తిరిగి భారత జట్టుతో కలిశాడు. టీ20 సిరీస్‌లో రాణిస్తే రైనాకు వన్డే జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. పైగా అతనో గొప్ప ఫీల్డర్.

చరిత్రకు చేరువలో..

సిరీస్‌పై కన్నేసిన భారత అమ్మాయిలు ● నేడే దక్షిణాఫ్రికాతో మూడో టీ20

జొహానెస్‌బర్గ్: చరిత్ర సృష్టించడానికి భారత అమ్మాయిల క్రికెట్ జట్టుకు కావాల్సింది ఇంకొక్క విజయమే. దక్షిణాఫ్రికా గడ్డపై ఒకే పర్యటనలో రెండు సిరీస్‌లు సొంతం చేసుకున్న మహిళల తొలి జట్టుగా రికార్డు సాధించేందుకు టీమ్ఇండియా మరో మ్యాచ్‌లో గెలిస్తే చాలు. దక్షిణాఫ్రికాతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో ఉన్న హర్మన్ ప్రీత్ సారథ్యంలోని భారత్.. ఆదివారం జరిగే మూడో మ్యాచ్‌తోనే ఆ ఘనత అందుకోవాలని పట్టుదలగా ఉంది. ఇప్పటికే భారత్ 2-1తో వన్డే సిరీస్ గెలుచుకున్న సంగతి తెలిసిందే. బ్యాటింగ్‌లో మిథాలీ రాజ్, స్మృతి మంధాన.. బౌలింగ్‌లో శిఖ, పూనమ్ యాదవ్‌ల ఫామ్ జట్టుకు కలిసొచ్చే అంశం. ఆదివారం భారత్, దక్షిణాఫ్రికా పురుషుల జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్ వేదిక జొహానెస్‌బర్గ్‌లోనే మహిళల మ్యాచ్ జరగనుండటం విశేషం. ఈ మ్యాచ్‌తో పాటు సిరీస్‌లో మిగతా రెండు టీ20లను సోనీ టెన్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.



మధ్యాహ్నం 1.15 నుంచి సోనీ టెన్-1, 3లో

వన్డేలే వన్డేలు..

దిల్లీ: వచ్చే ఏడాది ప్రపంచకప్ జరగబోతున్న నేపథ్యంలో ఆ లోపు భారత్ పెద్ద ఎత్తున వన్డే మ్యాచ్‌లు ఆడబోతోంది. ఏడాది కాలంలో దాదాపు 30 వన్డే మ్యాచ్‌ల్లో భారత్ తలపడనుందని అంచనా. వచ్చే 12 నెలల్లో భారత్ మొత్తం 63 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుండగా.. అందులో దాదాపు సగం వన్డేలే. దక్షిణాఫ్రికా పర్యటన ముగిసిన అనంతరం భారత్.. వచ్చే నెలలో శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో ముక్కోణపు వన్డే సిరీస్ ఆడుతుంది. ఐపీఎల్ తర్వాత ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్, వెంటనే బెంగళూరులో అఫ్గానిస్థాన్‌తో టెస్టు మ్యాచ్ ఆడతారు. తర్వాత సుదీర్ఘ ఇంగ్లాండ్ పర్యటన ఉంటుంది. ఆ పర్యటనలో 5 టెస్టులు, 3 వన్డేలు, 3 టీ20లు ఆడతారు. అక్టోబర్లో వెస్టిండీస్‌తో భారత్ రెండు టెస్టులు, ఐదు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌కు ఆతిథ్యమిస్తుంది. దానికంటే ముందు ఆసియా కప్ వన్డే టోర్నీ ఉంటుంది. దాని తేదీలు, వేదిక ఇంకా ఖరారవ్వలేదు. నవంబరు-డిసెంబరు నెలల్లో ఆస్ట్రేలియాలో పర్యటించనున్న భారత్.. నాలుగు టెస్టులు, మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడుతుంది. ఆ తర్వాత మొదలయ్యే న్యూజిలాండ్ పర్యటనలో ఐదు వన్డేలు, ఐదు టీ20లు ఉంటాయి. ఆపై ఆస్ట్రేలియా భారత్‌కు వచ్చి ఐదు వన్డేలు, రెండు టీ20లు ఆడుతుంది. సీజన్ చివర్లో సొంతగడ్డపై భారత్.. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌లో తలపడుతుంది.

విరాట్.. రిచర్డ్స కన్నా మిన్న

"రిచర్డ్స కన్నా విరాట్ గొప్ప. గణాంకాలు అదే విషయం చెబుతున్నాయి. వేర్వేరు తరాలకు చెందిన ఆటగాళ్లను పోల్చకూడదు. కానీ గణాంకాలకు ఒక అర్థం ఉంటుంది. కోహ్లి 35 సెంచరీలు చేశాడు. రిచర్డ్స్ 14-15 మధ్య సెంచరీలు చేశాడనుకుంటా. అప్పటికి ఇప్పటికి బౌలింగ్ వేరన్నది వాస్తవమే కానీ అంకెలు అబద్ధం చెప్పవు. అందుకే వివ్ కన్నా విరాటే మిన్న అంటా. కోహ్లి మరోసారి ఛేదనలో సెంచరీ సాధించాడు. అది సులువైన శతకమే అయినా ఒక్కసారీ కూడా బంతి గాల్లోకి లేవలేదు. తప్పుడు షాట్ ఆడలేదు. సంకల్పంతో సెంచరీ చేశాడు. గత 30-35 ఏళ్లలో నేను చూసిన ఆటగాళ్లలో కోహ్లి, సచిన్ అత్యుత్తమం"

– సౌరభ్ గంగూలీ



'పొగ'రుబోతు కార్లకు చెల్లు



● ఎలక్ట్రిక్ వాహనాలతో ఎంతో మేలు ● కాలుష్యం తక్కువ.. ఖర్చూ తక్కువే
● ఇప్పుడు అన్ని దేశాలదీ అదేబాట ● ప్రపంచ ఆర్థిక సంస్థ తాజా నివేదిక

రోజువారీగా పెరుగుతున్న పెట్రో ధరలను చూస్తే కారు తియ్యాలంటే భయపడే పరిస్థితి. దీనికి తోడు కాలుష్యం! వాయు కాలుష్యంలో పరిశ్రమల తర్వాత వాహనాలే ప్రధాన కారణం. పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగిన ప్రతిసారీ.. ఈ బాధను మోయలేం, చౌకైన ప్రత్యామ్నాయం ఉంటే బాగుంటుంది కదా అనిపిస్తుంది ఎవరికైనా! ఎలక్ట్రిక్ వాహనాలే దీనికి పరిష్కారమని ప్రపంచ ఆర్థిక సంఘం (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) విశ్లేషించింది. ఎలక్ట్రిక్ వాహనాలు పట్టణ రవాణా రూపురేఖలను సమూలంగా మార్చివేస్తాయని, దీనివల్ల రవాణా వ్యయాలు 40 శాతం తగ్గుతాయని 'స్మార్ట్ నగరాల కోసం ఎలక్ట్రిక్ వాహనాలు..' అనే పేరుతో రూపొందించిన నివేదికలో స్పష్టం చేసింది. అంతేగాక ఎలక్ట్రిక్ వాహనాలతో మరో మేలు కూడా ఉంది. దీంతో కాలుష్యం సమస్య ఉండదు.

పారిస్ వాతావరణ ఒప్పందం

● 2015లో పారిస్ వాతావరణ ఒప్పందం తర్వాత వివిధ దేశాలు కాలుష్యాన్ని నియంత్రించే దిశగా చర్యలు తీసుకోవటం ప్రారంభించాయి. ఇందులో భాగంగా వాహన కాలుష్యాన్ని కట్టడి చేయటానికి పెట్రోలు- డీజిల్‌తో నడిచే వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాయి.

● నార్వే, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, జర్మనీ, యూకే, చైనా, భారత్ పెట్రోలు- డీజిల్ వాహనాల తయారీ, విక్రయాలను నిషేధించే ఆలోచనలో ఉన్నాయి.

● ఏథెన్స్, మాడ్రిడ్, మెక్సికో సిటీ, పారిస్, స్టట్‌గర్ట్ నగరాల్లో డీజిల్ కార్లను 2030 నాటికి, లేదా ఇంకా ముందే నిషేధించనున్నారు.

● యూఎస్‌లోని లాస్ ఏంజెలిస్ పోలీస్ డిపార్ట్‌మెంట్ (ఎల్ఏపీడీ) తాను వినియోగిస్తున్న 260 కార్లను ఎలక్ట్రిక్ కార్లుగా మార్చాలని నిర్ణయించింది.

● ఈ మార్పునకు తగ్గట్లుగా కార్ల తయారీ కంపెనీలు సైతం ఎలక్ట్రిక్ కార్ల తయారీపై దృష్టి సారించాయి. 2020 నాటికి బీఎండబ్ల్యూ ఎలక్ట్రిక్ కార్ల తయారీని అధికం చేయనుంది. ఫ్రాన్స్ కంపెనీ రేనాల్ట్ 2022 నాటికి 20 ఎలక్ట్రిక్ కార్లను తయారు చేయనున్నట్లు ప్రకటించింది. బ్యాటరీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పరిజ్ఞానంపై వోక్స్‌వ్యాగన్ 84 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనుంది. వోల్వో కార్స్ 2019 నాటికి ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కార్లను విడుదల చేయనుంది.

● దిల్లీలో కాలుష్యానికి వాహనాలే ప్రధాన కారణం. 2020 నుంచి కాలుష్యం తక్కువుండే బీఎస్-6 ప్రమాణాలున్న ఇంధనాన్ని వాడాల్సిందేనని.. వాహన తయారీ పరిశ్రమలు అందుకు తగ్గట్లుగా మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. దిల్లీలో ఈ ఏడాది నుంచే ఈ రకమైన ఇంధనం వాడాలని నిర్ణయించారు.

ప్రోత్సాహకాలు ఇవ్వాలి

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగటానికి ప్రపంచ ఆర్థిక సదస్సు ఈ నివేదికలో పలు సూచనలు చేసింది. ప్రజా, వాణిజ్య వాహనాలన్నింటినీ ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు తగిన ప్రోత్సాహకాలను అమలు చేయాలని, ప్రజా రవాణా వ్యవస్థలోని వాహనాలన్నింటినీ ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ మార్పును వేగవంతం చేసేందుకు అనువైన స్థానిక, ప్రాంతీయ, జాతీయ విధానాలు తీసుకురావాల్సిన అవసరం ఉన్నట్లు అభిప్రాయపడింది. ఛార్జింగ్ స్టేషన్ల వ్యవస్థ సత్వరం విస్తరించటం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగేందుకు వీలుకల్పిస్తుందని స్పష్టం చేసింది.

కాలుష్యానికి చెక్...



■ ఎలక్ట్రిక్ వాహనాలతో కాలుష్యం సమస్య లేకపోవటం మరొక ప్రధాన ఆకర్షణ. పెట్రోలు, డీజిల్ వాహనాల పొగగొట్టాల నుంచి పెద్దమొత్తంలో సీఓ2, నైట్రస్ ఆక్సైడ్, నైట్రస్ డయాక్సైడ్ వెలువడి గాలి కలుషితం అవుతుంది.

■ పెట్రోలు, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించటం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడి 2030 నాటికి కేవలం అమెరికాలోనే 60 బిలియన్ డాలర్ల (1 బిలియన్= రూ.6,500 కోట్లు) మేరకు మిగులు ఏర్పడుతుందని ఈ నివేదిక పేర్కొంది.

■ అమెరికాలో 2016లో వాణిజ్య రవాణా వాహనాలు (లైట్ డ్యూటీ వెహికల్ - ఎల్‌డీవీ) 1,100 ట్రిలియన్ టన్నుల సీఓ2ను ఉత్పత్తి చేసినట్లు యూఎస్ ఇంధన విభాగం గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీనివల్ల ప్రజారోగ్యంపై ప్రభావం పడి వైద్య ఖర్చులు, జీతభత్యాల నష్టం రూపంలో 470 బిలియన్ డాలర్ల మేరకు నష్టం జరిగినట్లు అంచనా.

■ ఐసీఈ (ఇంటర్నల్ కంబస్టన్ ఇంజన్) తో నడిచే వాహనాలతో పోల్చితే ఎలక్ట్రిక్ వాహనాలతో కాలుష్యం 60 శాతం తక్కువగా ఉంటుంది.

సందేహాలెన్నో

ఎలక్ట్రిక్ వాహనాల లభ్యత సమీప భవిష్యత్తులో పెరగనుందనేది నిస్సందేహం. కానీ వినియోగదార్లలో మాత్రం సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. బ్యాటరీ ఛార్జింగ్ సదుపాయాలు తగినంతగా లేవనేది ఇందులో ముఖ్యమైనది. ఒకసారి ఛార్జింగ్‌తో ఎక్కువ దూరం ప్రయాణం చేయలేని పరిస్థితి కూడా ఒక అభ్యంతరంగా ఉంది. గమ్యం చేరకముందే బ్యాటరీ అయిపోతే ఎలా..? అనే సందేహాన్ని ఎక్కువ మంది వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల ఖరీదు ఎంత ఉంటుందనేది తెలియకపోవటం, వాటి సామర్థ్యం, సాంకేతిక నైపుణ్యం, భద్రత, ఎన్నేళ్ల పాటు పనిచేస్తాయి... అనే ప్రశ్నలకు సమాధానాలు లభ్యం కావలసి ఉంది. ఎలక్ట్రిక్ కార్ల సామర్థ్యం నిరూపితమయ్యే వరకూ ఇటువంటి సందేహాలు వస్తూనే ఉంటాయి. అదేవిధంగా ఛార్జింగ్ స్టేషన్లు పెద్దఎత్తున ఏర్పాటైతే బ్యాటరీ అయిపోతే ఎలా? అనే సమస్యకు పరిష్కారం లభించినట్లు అవుతుంది.



-ఈనాడు ప్రత్యేక విభాగం

ఎలక్ట్రిక్ వాహనాలదే భవిష్యత్తు

● ఎస్.ఆర్.పి.సి. సమావేశంలో ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావు

ఈనాడు, హైదరాబాద్: దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు రాన్రాను గిరాకీ పెరుగుతోందని, దీనికి సాయపడే దిశగా విద్యుత్ సంస్థలు సన్నద్ధం కావాలని తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకరరావు పిలుపునిచ్చారు. పుదుచ్చేరిలో జరుగుతున్న రెండురోజుల దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ సంస్థల సంఘ(ఎస్.ఆర్.పి.సి.) సమావేశంలో ఆయన అధ్యక్షోపన్యాసం చేశారు. దేశవ్యాప్తంగా 2030 నాటికి ప్రజా రవాణా వ్యవస్థలో 100 శాతం, వ్యక్తిగతంగా 40 శాతం ఎలక్ట్రిక్ వాహనాలుండే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతమున్న పెట్రోలు పంపుల తరహాలో..ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు విద్యుత్ సంస్థలు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఛార్జింగ్ ఏజెన్సీలను వినియోగదారులుగా గుర్తించడంతోపాటు..వారికి ప్రత్యేక రుసుములు నిర్ణయించేందుకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండళ్ల అనుమతి పొందాలని సూచించారు. విద్యుత్తు సరఫరా(గ్రిడ్) వ్యవస్థలను విఘాతపరిచేలా సైబర్ నేరాలు జరుగుతున్నాయని, దీనిపై అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గ్రిడ్ నిర్వహణలో దక్షిణాది రాష్ట్రాలు క్రమశిక్షణ పాటిస్తున్నాయని ఇటీవల జాతీయ విద్యుత్ కమిటీ ప్రశంసించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా, ఆ దిశగా చేసిన ఏర్పాట్ల గురించి ప్రభాకరరావు సమావేశంలో వివరించగా..పలు రాష్ట్రాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రంలో కొత్తగా 150 పురపాలికలు!

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కొత్తగా 150 మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పురపాలక మంత్రి పి.నారాయణ తెలిపారు. కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో శనివారం ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య, ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్దన్, మాజీ మంత్రి నెట్టెం రఘురాంతో కలసి పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణంలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీలకు కేంద్రప్రభుత్వం పెద్దఎత్తున నిధులు ఇస్తున్నందున మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. మార్చి నెలాఖరుకు నూతన రాజధాని అమరావతి ఆకృతులను ఖరారు చేస్తామని నారాయణ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 32లక్షల ఇళ్లు మంజూరుచేస్తే, ఆంధ్రప్రదేశ్‌కు 6.38లక్షల ఇళ్లు దక్కాయన్నారు. వీటి నిర్మాణానికి రూ.38వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. నూతన రాజధాని అమరావతి చుట్టూ అంతర వలయ రహదారి నిర్మాణానికి ప్రకటన ఇచ్చామని, కొన్ని నెలల్లో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. అమరావతి పరిధిలో 1600 కిలోమీటర్ల మేర కొత్త రహదారి నిర్మాణం జరుగుతోందని చెప్పారు. వచ్చే ఏడాది నాటికి రాజధానిలో పనిచేసే 3500మంది ఉద్యోగులకు ఇళ్లు నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

వీటీయూఈఈఈ ఫలితాల్లో హైదరాబాద్ విద్యార్థికి మొదటి ర్యాంక్

ఈనాడు, అమరావతి: వేల్‌టెక్ రంగరాజన్ డాక్టర్ శగుంతలా ఆర్ అండ్ డీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నిర్వహించిన వీటీయూఈఈఈ-2018 (వేల్‌టెక్ అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) ఫేజ్1 పరీక్ష ఫలితాల్లో హైదరాబాద్ విద్యార్థి మొదటి స్థానాన్ని దక్కించుకున్నాడు. హైదరాబాద్ శ్రీచైతన్య జూనియర్ కళాశాలకు చెందిన ఎ.కార్తికేయన్ మొదటిస్థానంలో నిలవగా, విజయవాడ నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన రొంగలి వెంకటసాయి చరణ్‌కుమార్ ద్వితీయస్థానంలో నిలిచాడు. వీరితోపాటు ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, మణిపూర్ రాష్ట్రాల విద్యార్థులు వరుసగా 3, 4, 5, 6 ర్యాంకులు సాధించారు. వీరందరికీ బీటెక్ ట్యూషన్ రుసుములో 100 శాతం రాయితీ ఇస్తున్నట్లు వేల్‌టెక్ రంగరాజన్ డాక్టర్ శగుంతలా ఆర్ అండ్ డీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యాజమాన్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. వీరితోపాటు మరికొంత మంది విద్యార్థులకు వారు సాధించిన మార్కుల ఆధారంగా వివిధ శాతాల్లో ట్యూషన్ రుసుములో రాయితీ ఇస్తున్నట్లు వివరించింది.

వేలంపాటలో రూ. 7,600 పలికిన నిమ్మకాయ

ఈనాడు డిజిటల్, చెన్నై: తమిళనాడులోని ఈరోడ్ జిల్లాలో ఉన్న ఓ ఆలయంలో నిర్వహించిన వేలం పాటలో నిమ్మకాయ రూ. 7,600 పలికింది. స్థానిక కరుప్పన్నన్ ఆలయంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా ఈ నిమ్మకాయను ఇతర పూజాసామగ్రితోపాటు దేవుని ముందు ఉంచారు. పూజ అనంతరం శనివారం వేలం నిర్వహించగా.. ఓలపాలయం గ్రామానికి చెందిన షన్ముఖం నిమ్మకాయను రూ.7,600లకు సొంతం చేసుకున్నారు. ఏటా తరహా వేలం నిర్వహించడం స్థానికంగా ఆనవాయితీగా వస్తోంది. పండ్లు, కొబ్బరికాయ, వెండి ఉంగరాలు తదితరాల వస్తువులనూ ఈ సందర్భంగా వేలం వేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

స్త్రీ హార్మోన్లతో ఆస్థమాకు లంకె!

లండన్: స్త్రీల హార్మోన్ల సమతౌల్యం దెబ్బతింటే ఆస్థమా లాంటి అలర్జీలు చుట్టుముట్టే ముప్పు పెరుగుతుందని తాజా అధ్యయనంలో తేలింది. బ్రిటన్‌లోని ఎడిన్‌బరో వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. యుక్తవయసు మొదలుకొని 75ఏళ్ల వృద్ధుల వరకూ 5,00,000 మంది మహిళలు పాల్గొన్న పరిశోధనల సమాచారాన్ని వారు విశ్లేషించారు. రజస్వల, మెనోపాజ్ తదితర దశల్లోని పరిణామాలపై దృష్టిసారించారు. 11ఏళ్లకు ముందే రజస్వల కావడం, రుతుక్రమ చక్రం గతితప్పడం లాంటివి ఆస్థమా ముప్పునకు సంకేతాలని తేల్చారు.

నేడు ఆమ్రపాలి వివాహం

న్యూస్‌టుడే, వరంగల్ : వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి వివాహం ఆదివారం జమ్ము కశ్మీర్‌లో జరగనుంది. 2011 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సమీర్‌శర్మతో ఆమె పెళ్లి జరగనుంది. ఈ నెల 23న వరంగల్‌లో, 25న హైదరాబాద్‌లో మిత్రులు, ప్రజాప్రతినిధులకు ఆమ్రపాలి విందు ఇవ్వనున్నారు.



వివాహ వేడుకల్లో భాగంగా చెల్లెలితో ఆమ్రపాలి

ఏవి నిజాలో వారే చెప్పాలి

● భాజపా ఎమ్మెల్సీల విమర్శ



చంద్రబాబు గతంలో చేసిన పత్రికా ప్రకటనను చూపిస్తున్న సోము వీర్రాజు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు ఏం మాట్లాడుతున్నారో వాళ్లకే తెలియడం లేదని భాజపా జాతీయకౌన్సిల్ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండలో శనివారం భాజపా బూత్ నాయకుల సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. కేంద్రం నుంచి రాష్ట్రాభివృద్ధికి అందరికంటే ఎక్కువ నిధులు తానే తెస్తున్నట్లు గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన పత్రికా ప్రకటనను ఆయన చూపించారు. కేంద్రం అన్నీ ఇచ్చిందని, ఇంతకంటే మించి అడగలేమని గతంలో కేంద్ర మంత్రి సుజనా చౌదరి పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడేమో రాష్ట్రానికి అన్యాయం జరిగిపోయిందని తెదేపా నాయకులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఏవి నిజాలో చెప్పాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లో రూ.155 కోట్లతోనే సచివాలయం నిర్మిస్తున్నారని, ఇక్కడ మాత్రం రూ.2,500 కోట్లు ఇచ్చినా చాలడం లేదన్నారు. 13 జిల్లాలు అభివృద్ధి చెందాలన్నది భాజపా సిద్ధాంతమన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ రాష్ట్ర విభజనకు సంబంధించి 13వ షెడ్యూల్‌లో ఉన్న 12 అంశాలను కేంద్రప్రభుత్వం నాలుగేళ్లలో పరిష్కరించిందన్నారు. అమరావతి నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇవ్వకుండానే రూ.2,500 కోట్లు నిధులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తమ పార్టీ గతంలో ఎన్నో ఉద్యమాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.


నేడు భాజపా పదాధికారుల భేటీ

రాజకీయంగా ప్రాధాన్యం!

ఈనాడు, అమరావతి: రాష్ట్ర భాజపా పదాధికారుల సమావేశం విజయవాడలో ఆదివారం జరగనుంది. భాజపా సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి సతీష్ నేతృత్వంలో జరిగే ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు పాల్గొననున్నారు. రాష్ట్రానికి భాజపా అన్యాయం చేసిందంటూ విమర్శలు వస్తోన్న నేపథ్యంలో జరగబోతున్న ఈ సమావేశానికి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీపై వస్తోన్న విమర్శలను దీటుగా ఎదుర్కోవడంపై ఈ సమావేశంలో చర్చ జరగనుంది.

హామీలు మరిచారనే ఆంధ్రుల ఆగ్రహం

● కేంద్రం తీరుపై చంద్రబాబు వ్యాఖ్య



ఈనాడు, బెంగళూరు: విభజన చట్టం ప్రకారం ఇచ్చిన హామీల్ని అమలు చేయనందునే ఆంధ్రులు కేంద్రం పట్ల ఆగ్రహంతో ఉన్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది హిందు' శనివారం బెంగళూరులో ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం 'ది హడల్'లో ఆయన పాల్గొన్నారు. "ఇప్పటి వరకూ 29 సార్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రుల్ని కలుసుకుని విజ్ఞాపనల్ని సమర్పించాను. పార్లమెంటులో హామీలిచ్చారు. రాష్ట్ర విభజన చట్టంలో కొన్ని నియమాలున్నాయి. హామీల్ని సమీక్షించి అమలు చేయాలని కోరుతున్నా. రాష్ట్రానికి న్యాయాన్ని చేయమంటున్నాం. ఇంతకు మించి ఏమీ అడగటం లేదు" అన్నారు. "విభజన గాయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం సాయాన్ని అందించకపోతే ఆ గాయాలను మరింత రేపినట్లవుతుంది. వారిని మరింత ఆవేదనకు గురిచేసినట్లవుతుంది. ఏపీ ప్రజలకు విభజన విషయంలో చేసిన అన్యాయానికి 125 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో తుడిచిపెట్టుకుపోయింది. ప్రజలు ఆ పార్టీ అభ్యర్థులకు కనీసం డిపాజిట్లు కూడా దక్కనీయకుండా చేశారు" అని వివరించారు. ఇరుగు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడులలో ఉన్నట్లు బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలు ఆంధ్రప్రదేశ్‌లో లేవు. సైబరాబాదును రూపొందించిన రీతిలో అమరావతి నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నా. ఇందుకు కేంద్ర సాయం అవసరం" అని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్ పౌరుల తలసరి ఆదాయం ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువ. ఈ పరిస్థితికి కారణం ఎవరు? రాష్ట్రాన్ని మీరే(కేంద్రం) విభజించారు. హైదరాబాదు తెలంగాణకు వెళ్లింది. అందువల్ల దీనికి నష్ట పరిహారాన్ని చెల్లించాల్సిన బాధ్యత కూడా మీదే" అని కేంద్రానికి స్పష్టం చేశారు. కేంద్రం సమాఖ్యతత్వ సూత్రానికి కట్టుబడి ఉందా? లేదా? అని ప్రశ్నించారు. ఈ అంశం గురించి విస్తృతంగా మరోసారి చర్చించాల్సి ఉందన్నారు.

★ కేవలం కేంద్రమే కాదు రాష్ట్ర విభజనకు బాధ్యులైన రాజకీయ పక్షాలూ ఆంధ్రప్రదేశ్‌కు న్యాయాన్ని చేయాలని చంద్రబాబు డిమాండు చేశారు. రాష్ట్ర విభజన గురించి తనను ఎన్నడూ ఎవరూ సంప్రదించలేదని తప్పుబట్టారు. ఎన్డీయేలో భాగస్వామిగా కేంద్రంతో తలెత్తే సమస్యల్ని పరిష్కరించుకునేందుకు తాము ప్రయత్నిస్తుండగా మాధ్యమాలు సమస్యల్ని సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

ఇది సమయం కాదు..

ఈనాడు, అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు రావాలని అనుకుంటున్నా.. ఇది తగిన సమయం కాదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ఫైబర్‌గ్రిడ్, సోలార్ పార్కు ప్రాజెక్టుల ప్రారంభోత్సవం ప్రధాని చేతుల మీదుగా నిర్వహించాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం భావించింది. దీనిపై ప్రధానమంత్రి కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించింది. ఆ కార్యాలయం ఇప్పుడు స్పందించింది. ప్రధాని రాష్ట్ర పర్యటనకు రావాలని భావిస్తున్నారని, రాష్ట్రంలో ప్రధాని ప్రారంభించే స్థాయి ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయా? అని ఆరా తీసింది. ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం ఇప్పటికే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా జరిగింది. ఇప్పటికిప్పుడు ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించే స్థాయి ప్రాజెక్టులేవీ లేకపోవడంతోపాటు, విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, ఇచ్చిన హామీల్ని నెరవేర్చడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ప్రస్తుతం కొంత ఘర్షణాత్మక వాతావరణం నెలకొన్న తరుణంలో ప్రధాని రాష్ట్ర పర్యటనకు రాకపోతేనే మంచిదన్న భావనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు అధికారవర్గాల సమాచారం.

గుర్తుచేయాల్సిన అవసరం లేదు

కాపు రిజర్వేషన్‌పై చినరాజప్ప వ్యాఖ్య



అమలాపురం, న్యూస్‌టుడే: కాపులను బీసీల్లో చేర్చే బాధ్యత గురించి ప్రభుత్వానికి ఎవ్వరూ గుర్తుచేయాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ముద్రగడ పద్మనాభం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖల ద్వారా బాధ్యతను గుర్తుచేయాల్సిన పనిలేదని, ఓపిక ఉంటే ఆయన దిల్లీకి వెళ్లి ప్రయత్నించాలన్నారు. శనివారం అమలాపురంలో మంత్రి సుజయ్ కృష్ణరంగారావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాపులను బీసీల్లో చేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం కమిషన్ వేసిందని, ఛైర్మన్ నివేదిక ఇవ్వకున్నా సభ్యుల ద్వారా తీసుకుని అసెంబ్లీ ఆమోదం ద్వారా కేంద్రానికి పంపించామన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆయా శాఖలకు పంపగా డీవోపీటీ అభ్యంతరం తెలిపిందన్నారు. షెడ్యూల్లో ఉన్న ఇబ్బందుల దృష్ట్యా రిజర్వేషన్లు 50 శాతం దాటితే సాధ్యంకాదని ముందే గ్రహించడం ద్వారా కేంద్రాన్ని తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టమని కోరామన్నారు. ఒక శాఖ అభ్యంతరం తెలిపినంత మాత్రాన ఆగిపోదన్నారు. రాష్ట్రానికి న్యాయం చేయకుంటే కేంద్రంతో సత్సంబంధాలు వదిలిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారన్నారు. కేంద్రం ప్రవేశపెట్టే ప్రతి బడ్జెట్‌లోనూ జగన్ రాజీనామాలంటూ పాతపాటే పాడుతున్నారన్నారు. పవన్‌కల్యాణ్ జేఎఫ్‌సీ పేరుతో మేధావులందరినీ కూడగడుతున్నారని, లెక్కలు కాదుకానీ కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో ముఖ్యపాత్ర పోషించాలని కోరారు.

అశాస్త్రీయమైతే.. మీరే సరిచేయండి

● కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్

ఈనాడు, తిరుపతి: రాష్ట్ర విభజన శాస్త్రీయంగా జరగలేదని, విభజన చట్టం సరిగా లేదని పదేపదే నాటకాలు అడే బదులు... ఆ చట్టంలో తప్పులు ఏమైనా ఉంటే మార్చవచ్చు కదా అని కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ పేర్కొన్నారు. "విభజన చట్టం.. హామీలు.. అమలు' అన్న అంశంపై శనివారం తిరుపతిలో జరిగిన సభలో జైరాం రమేశ్ మాట్లాడారు. "అధికారంలో ఉన్నది మీరే కదా..? మేమేమైనా వద్దంటున్నామా? అశాస్త్రీయంగా మేం జరిపిన దాన్ని మీరు సరిచేయండి. రాష్ట్ర ప్రజలకు మేలు చేయండి. మీకు మేం సహకరించకపోతే అప్పుడు మాపై నిందలు వేయండి. అంతేగాని ప్రతిసారి విభజన సరిగా లేదు.. చట్టం సరిగా లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలు ఆడటం సరికాదు" అని వ్యాఖ్యానించారు. తాము పక్కాగా రూపొందించిన విభజన చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తే ఆంధ్రప్రదేశ్‌లోని కీలకమైన నగరాలు 10 సంవత్సరాల్లో హైదరాబాద్ స్థాయికి వెళ్లేవన్నారు. తెదేపా అంటే తెలుగు డ్రామాల పార్టీ అని జైరాం రమేశ్ విమర్శించారు. రాయలసీమ నాలుగు జిల్లాలు, ఉత్తరాంధ్ర మూడు జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని చట్టంలో చెప్పామని... దాన్ని పూర్తిగా తొక్కిపెట్టారన్నారు. 2019లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక మొదటి ప్రాధాన్యం కింద ఆంధ్రప్రదేశ్ విభజన చట్టాన్ని తీసుకుంటామని జైరాం హామీ ఇనిచ్చారు. సమావేశంలో పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ మాట్లాడుతూ.. చాలామంది అర్థరహితంగా, అవగాహనలేమితో విభజనను పార్లమెంటు తలుపులు వేసి చేశారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజల్ని ఇలా తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్. చిత్రంలో చింతా మోహన్

విభేదాలు పక్కన పెట్టి పనిచేయండి

● విజయనగరం, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ నేతలకు బాబు సూచన

ఈనాడు-అమరావతి: నేతలు విభేదాలు పక్కన పెట్టి పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రతిపక్షాల వల్ల ప్రజాజీవనానికి ఎదురయ్యే ఇబ్బందులను ఎండగట్టాలన్నారు. శనివారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో విజయనగరం, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గాల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన నేతలతో చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ బలోపేతం, ప్రజాసంబంధాల విషయంలో అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ ఛైర్మన్ వీవీవీ చౌదరి, మంత్రులు గంటా శ్రీనివాసరావు, పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ డి.జగదీశ్వరరావు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పార్టీ అధ్యక్షులు చిన్నమనాయుడు, గౌతు శిరీష, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఒక్క హామీ అమలు కాలేదు: మధు

మైలవరం, న్యూస్‌టుడే: విభజన చట్టంలో పొందుపరిచిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు ఆరోపించారు. అభివృద్ధి కోసమే భాజపాతో కలిసి ఉన్నామని చెబుతున్న తెదేపా నాలుగేళ్లుగా విభజన హామీలను విస్మరించి, ప్యాకేజీ కోసం పాకులాడిందని అన్నారు. శనివారం కృష్ణా జిల్లా మైలవరంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా లేక రాష్ట్రానికి ఎటువంటి పరిశ్రమలు రావడం లేదన్నారు. వైకాపా, కాంగ్రెస్‌లు ఆందోళనలకు పిలుపునిచ్చాయని.. కానీ వారికి ఆ అవకాశం ఇవ్వకుండా హోదా కోసం ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతున్నామని వివరించారు. ఆదివారం విజయవాడలో హోదా సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.

పార్టీకి అధ్యక్షుడిగా జగన్ కొనసాగడం అనైతికం: వర్ల రామయ్య

కృష్ణలంక, న్యూస్‌టుడే: బహిరంగంగా అవినీతికి పాల్పడి ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగడం జగన్మోహన్‌రెడ్డి అనైతిక రాజకీయాలకు పరాకాష్ఠ అని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య పేర్కొన్నారు. విజయవాడ ఆయన మాట్లాడుతూ.. వివిధ కేసుల్లో ఈడీతో ఛార్జిషీట్లు వేయించుకున్న జగన్ ఒక రాజకీయ పార్టీకి అధ్యక్షుడిగా ఏవిధంగా కొనసాగుతారన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తమ పార్టీకి, ప్రభుత్వానికి నమ్మకమైన మిత్రుడని రామయ్య పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఒత్తిడి తెద్దాం..

ఈనాడు, గుంటూరు: ఎస్సీ వర్గీకరణకు కేంద్రంపై ఒత్తిడి తేవటానికి రాష్ట్రంలోని అధికార, విపక్షాలు తమతో కలిసి రావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో చొరవ తీసుకోవాలని, వర్గీకరణ చేసి పెద్దమాదిగనవుతానన్న మాటకు ఆయన కట్టుబడి ఉండాలని సూచించారు. శనివారం రాత్రి గుంటూరులో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి ఒక అఖిలపక్ష కమిటీని వేసి తమను ప్రధాని వద్దకు తీసుకెళ్లాలని కోరారు.

ప్రత్యామ్నాయ శక్తిగా ముందుకు సాగుతాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను గమనించి ప్రత్యామ్నాయ శక్తిగా తాము ముందుకు వెళుతున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన సీపీఐ 24వ మహాసభల్లో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. విభజన హామీల అమలు, బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నాయని ఆరోపించారు. మార్చిలో జరిగే బడ్జెట్ సమావేశాల సమయంలో దిల్లీ వెళ్లి యుద్ధభేరి మోగించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రానికి న్యాయం జరిగేందుకు మోదీని ఎదిరించే మొనగాళ్ల అవసరం ఉందన్నారు. ఈ నెల 18న విజయవాడలో ప్రత్యేక హోదా సాధనపై అన్ని పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైకాపా నాటకాన్ని విశ్వసించరు: బుద్ధా వెంకన్న

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రత్యేక హోదా, ఎంపీల రాజీనామా అంటూ కొత్త నాటకానికి తెరలేపిన వైకాపాను ప్రజలు ఏ మాత్రం విశ్వసించరని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఆరోపించారు. విజయవాడలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి చర్చించుకుంటుంటే వైకాపా ప్రతినిధులు మాత్రం వారికి రావాల్సిన నిధులను సమీకరించుకుంటున్నట్లు ఎద్దేవా చేశారు. కనీసం రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకుండానే వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో రూ.300 కోట్ల ఒప్పందం కుదుర్చుకుని రాజ్యసభ అభ్యర్థిగా ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారని ఆరోపించారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ సమావేశంలో కేంద్ర మంత్రి మేనకగాంధీ ఓ అధికారిని మందలించారు. ఈ సందర్భంగా ఆమె తీవ్ర పదజాలం వాడినట్లు వున్న ఓ వీడియో అంతర్జాలంలో చక్కర్లు కొడుతోంది. కొన్ని పదాలపై అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయి.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00